సంపుటము 18
సంచిక 6

భారతి

వృష జ్యేష్ఠము
జూన్ 1941

పంచతంత్రము

= వేంకటనాథ, నారాయణకవుల అనువాదాలు =

పంచతంత్రము సంస్కృతములో చాలా ప్రసిద్ధమైనది. దానిలోని కథలు పురాతనకాలములోనే ప్రపంచమంతటా వ్యాపించినవి. దానిని సంస్కృతములోనే చదువుకొనడానికి కొంద్రు అలవాటుపడడముచేతను, పురాణములమీదను శృంగారగ్రంథములమీదను వారికి ప్రీతి ఎక్కువగా ఉండడముచేతను అది తెనుగులోనికి రావడమున కాలస్యమయినది.

పంచతంత్రకథలు కేవలము లోకనీతిని, రాజనీతిని బోధించడానికి పుట్టినవి. కాకులు, నక్కలు, సింహాలు, ఒంటెలు, పావురాలు, తీతువపిట్టలు, కోతులు, ఎద్లు, జింకలు, ఎలుకలు— ఇట్టి పశుపక్షిజాతులకు చెందిన ప్రాణులను మానవులకు నీతిని బోధించడముకోసము పంచతంత్రకర్త ఉపయోగించుకొన్నాడు. ఆపశువులున్ను, పక్షులున్ను పంచతంత్రములో ముఖ్యములు కావు; వాటి నోటివెంట వచ్చిన నీతులు ముఖ్యములు.

నీతులను కథాచ్ఛలమున ఉపదేశించడము పంచతంత్రోద్దేశము. ఈకథలకు కావ్యరసములు ముఖ్యములు కావు. ఆయారసము లెక్కడనయినా ప్రాసంగికముగా వస్తే రావచ్చును. మనోహరత్వ మీకథల కావశ్యకమే; కాని, ఆ మనోహరత్వము సామాన్యకావ్య మనోహరత్వమువంటిది కాదు. ఆనందసంధానము వానియందప్రధానము; నడవడిని సరిదిద్ది, లోకము వారిని సన్మార్గగాములుగాను, కార్యకుశలులుగాను చేయడమే ప్రధానము.

పంచతంత్రములో కథలు ప్రధానము లయినా, వాటినుంచి స్ఫురించే నీతులవల్ల దానికి ప్రాముఖ్యము వచ్చినది. కథను చెప్పి, నీతిని వివరించకపోయినా, నీతి స్ఫురిస్తూనే ఉంటుంది. కాని, ఆ నీతిని విస్పష్టముగా చెప్పడము పంచతంత్రములోని విశేషము. ఆ నీతుల నన్నిటిని ప్రత్యేకముగా విడదీసి వేరేగ్రంథముగా కూర్చవచ్చును. అప్పు డది భర్తృహరినీతిశతకమువంటి ఒక ఉత్కృష్టగ్రంథము కాగలదు.

పంచతంత్రనీతిశ్లోకములకు భర్తృహరి నీతిశ్లోకములకువలె ప్రత్యేకమైన శిష్ట్య మున్నది. అవి సాధారణముగా చిన్నవి; సూత్రములవలె "అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతోముఖమ్, అస్తోభ్య మనవద్యం చ" అనే లక్షణమును కలిగిఉంటవి. కాని

శ్రీ డా. చిలుకూరి నారాయణరావు

అల్పాక్షరవిషయములో వ్యాకరణాదిశాస్త్రముల వలె కేవల సాంకేతికచిహ్నక్లిష్టములు కావు. దీర్ఘసమాస భూయిష్ఠములున్ను, కఠినశబ్దబాహుళ్యములున్ను కాక, అలతియలతిపదములతో బహ్వర్థసుబోధకములై యుంటవి.

కథలమూలముగాను, తత్ప్రతిపాదితనీతులమూలముగాను పంచతంత్రము ప్రసిద్ధికివచ్చినది. కథలను కావలిస్తే తెలుగున గద్యములో వ్రాయవచ్చును— సంస్కృతములో వలెనే. గద్యములో వ్రాస్తేనే వాటి ప్రయోజనము సిద్ధిస్తుంది. నీతిశ్లోకములను మాత్రము తెనుగు పద్యములలోనే వ్రాయవలెను. అవి ప్రాస్తావికముగా ఉదాహరించడానికి యోగ్యమయిన ఆకారము కలిగియుండవలెను; సర్వజనసుబోధముగా ఉండవలెను; ఎంత చిన్నవిగా ఉంటే అంతమంచిది. వాటిలో నిరర్థకపదము లుండగూడదు. పదము లెంత విడివిడిగా ఉంటే అంత మేలు. పద్యములోని పాదములు కేటికవి విడిగా తెగిపోయి, సంపూర్ణవాక్యములుగా ఉండవలెను. ఇట్టి లక్షణములు గల తెనుగుపద్యములను వ్రాయడానికి చాలా నేర్పు కావలెను. సంస్కృతములో అట్టిశ్లోకములను వ్రాయడము సుకరము. ఆభావప్రతిభ అట్టిది; లేదా, కవు లాభావ కట్టిప్రతిభను సంపాదించినారు.

తెనుగులో పంచతంత్రమును వ్రాసినవారిలో ప్రసిద్ధులు ముగ్గురు: దూబగుంట నారాయణకవి, వైచరాజు వేంకటనాథుడు, శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి. వీరిలో కృష్ణమూర్తిశాస్త్రి వ్రాసిన గ్రంథమును నేను చూడలేను. అచ్చుపడలే దేమో. వ్రాతప్రతులుకూడా సుప్రసిద్ధగ్రంథాలయాలలో లేవు. ఆధునికులలో నోరి గురులింగశాస్త్రిగారున్ను, కొక్కొండ వేంకటరత్నం పంతులుగారున్ను పంచతంత్రకథలను వ్రాసినారు. ఇవిగాక ప్రాచీనులు వచనములో వ్రాసిన ప్రతులు కొన్ని ఉన్నవి. వీటి అన్నిటితోను మన కిప్పుడు పనిలేదు. మొదటినుంచిన్ని వాఙ్మయముగా ప్రసిద్ధికెక్కిన నారాయణకవి, వేంకటనాథుల గ్రంథములనుగురించి ఈ వ్యాసములో విచారింతాము.

ఈకవు లేకాలపువారో నిశ్చయించడానికి తగిన ఆధారములు దొరకలేదు. నారాయణకవి తాను కృతియిచ్చిన బసవరాజు శ్రీరాముని కొడుకయిన కుశుని వంశమువాడట. కుశుని వంశములో బెజవాడ దుర్గను మెప్పించి రాజయిన మాధవవర్మ పుట్టినాడు. అతని వంశములో కొమ్మరాజు, అతనికి [1]అన్నలదేవుడు, అతనికి సింగరాజు, అతనికి పెదమల్లభుడు, పినమల్లభుడు అని యిద్దరు. వారిలో పెదమల్లభునికి అన్నఁదేవివల్ల సింగరాజు, తిమ్మరాజు, తిరుమలరాజు అని ముగ్గురు. వారిలో తిమ్మరాజుకున్ను [2]వేమాజమ్మకున్ను కృతికర్త బసవరాజు పుట్టినాడు. ఇక కవి తాను బ్రహ్మయకున్ను, నాగమాంబకున్ను పుత్రుడననిమాత్రము చెప్పుకొన్నాడు కాని తన వంశమును గురించి ఎక్కువగా చెప్పలేదు. ఇతని గురువు "కొండయమంత్రి యొజ్జయగు గూరిమినందనుఁ"డైన "నాగనార్యుఁడు."

నెల్లూరి మండలములోని ఉదయగిరిలో కుంటమరాజు వల్లభయ్య కుమారుడు తిమ్మరాజు ౧౪౬౦ సం. ములో గోపాలకృష్ణదేవాలయము కట్టించిన శ్లోక శిలాశాసన మున్నదనిన్ని, కృతికర్త తండ్రి యీతిమ్మరాజే అయితే కృతికర్త అతని కొడుకుకాలములో సుమారు ౧౫౦౦ సం.మున ఉండి ఉంటాడనిన్ని వీరేశలింగముగారు రూహించినారు.

ఇక వైచరాజు వేంకటనాథుడు తన కావ్యమును హరిహరనాథుని కంకితము చేసినాడు. ఈ హరిహరనాథుడు నెల్లూరిలో నెలకొన్న దేవతామూర్తియై ఉండవలెను.

"ఏచనవు గలుగు హరిహర
సాధిక్యము నొంద నన్యజనులకు మది నా
లోచింపఁ దిక్కయజ్వకు,
నాచనసోమునకు, మఱియు నాకుందక్కన్"

అనే పద్యమునుబట్టి తిక్కయజ్వ కృతి యిచ్చిన హరిహరనాథుడు నెల్లూరిలోని దేవతామూర్తి కాబట్టి ఆహరిహరనాథునికే వేంకటనాథుడున్ను తన కృతిని సమర్పించినాడని చెప్పుతారుగాని నాచనసోమన, వేంకటనాథులు కృతులను సమర్పించిన హరిహరనాథుడు కూడా నెల్లూరిలోని మూర్తియేనా అనే విషయములో అభిప్రాయభేద మున్నది.

"వేంకటనాథుని కాలమును నిర్ణయించడానికి కూడా ఆధారములు చాలవు. ఇతడు ౧౫౦౦ సం. ప్రాంతమువాడని బ్రౌనుదొర వ్రాసినదానినే యిప్పటికి స్థిరపరుచుకొందు"మని వీరేశలింగముగారు వ్రాసినారు. ఇతడు శ్రీనాథుని స్మరించినాడు కాబట్టి అతనికితరువాతివా డన్నమాట స్పష్టము. కవి తన వంశమును వర్ణించుకొంటూ, "మహోవిరోధిసంహారవిహారిపార్శ్వభిదు

1. 'అబ్బలదేవుడు' అని కవులచరిత్రము. 2. 'దేమాజాంబ' అని కవులచరిత్రము.

దాంకితుఁడైన శైచరాజునకు తిరుమల(తిమ్మ) రాజు పుట్టినా డనిన్ని, ఆతిమ్మరాజునకున్ను తిప్పాంబికకున్ను వీరభద్రుడున్ను, వీరభద్రునికి తుంకుట్ల శ్రీపతిరాజు కూతురైన లింగమక్కవల్ల లింగరాజు, పర్వతరాజు అని ఇద్దరు కొడుకులు పుట్టినారనిన్ని, వీరిలో లింగరాజు "భువనసైంధవకానవానలుం" డనిన్ని, పర్వతరాజు ఫలితిమ్మరాజు కూతురు అన్నమాంబను పెండ్లాడినాడనిన్ని, వారిద్దరికిన్ని తాను పుట్టినాడనిన్ని చెప్పుకొన్నట్లు ముద్రితగ్రంథములో ఉన్నది. అతని వంశాచార్యుడు తిరుమల శ్రీయఃపతి.

వేంకటనాథుని కాలనిర్ణయమునకు కొంత ఆధారము నాకు కనబడుచున్నది.

(౧) వేంకటనాథుని వంశకర్తగా చెప్పబడిన శైచరాజు 'సాళువ' బిరుదాంకితుడు. ఈ 'సాళువ' శబ్దమే రానురాను 'సలక' శబ్దముగా మారినదని నా అభిప్రాయము.

(౨) అచ్చుపడిన వేంకటనాథుని పంచతంత్రములో "పర్వతప్రభుండు, వైరికాంతారదవవారివాహమూర్తి, పోలె ఫలితిమ్మవసుమతీపాలపుత్రిఁ, బుణ్యచారిత్ర వికసితాంభోజనేత్రి, నన్నమాంబికఁ బరిణయం బయి" అనేపాఠ మున్నది. ఈపాఠ మర్థరహితముగా ఉన్నది. "వారివాహమూర్తిపోలె పరిణయంబయ్యె" అంటే అర్థము లేదుగదా. అట్లే "ఫలితిమ్మ వసుమతీపాలపుత్రి" అన్నా అర్థము లేదు.

"వైరికాంతారదవవారివాహమూర్తి
పోలపలె(లి) తిమ్మవసుమతీపాలపుత్రి"

అని పాఠమును సవరించవలెను. వ్రాతప్రతులు కొన్నిటిలో ఈపాఠ మున్నది. చరిత్ర తెలియని వ్రాయసకాండ్రు, ముద్రాపకుల మూలమున తప్పుపాఠ మచ్చుపడినది. పోలపల్లి బుక్కరాజు తిమ్మయ్యదేవమహారాజు కర్నూలుజిల్లా సిర్వేలుతాలూకా చింతకొమ్మదిన్నె గ్రామములో నెలకొన్న తిరువెంగళనాథదేవునికి ఆగ్రామమును అచ్యుతదేవరాయనికాలములో శక ౧౪౫౫ సం.ము (క్రీ. శ. ౧౫౩౩) లో దానముచేసినట్లు ఆయూరి హనుమంతరాయనిగోపురములో ఒకశాసన మున్నది (*Sewell's List of Antiquities*, *No.* 46). ఈతిమ్మరాజే వేంకటనాథుని తల్లి అన్నమాంబకు తండ్రి అని మనము నిర్ధారణచేసుకొనవచ్చును.

(౩) అనంతపురంజిల్లా, తాడిపత్రితాలూకా, నందులపాడు (నందిపాడు) గ్రామములోని చెన్నకేశవస్వామిఆలయమునకు "పలపుల్ల" తిమ్మరాజు శక ౧౪౪౯, సర్వజిత్తు (క్రీ. శ. ౧౫౨౭) సం.ములో గోపాలికొడుకు తిమ్మాజీకి ఒకమంటపము కట్టినందునకుగాను కొంతభూమి ఇచ్చినట్లున్నది (దత్తమండల శాసనములు, పుట ౯౧; నంబరు ౧౩౨). శాసనము చదివినవారు "పలపుల్ల" అని చదవడమునుగురించి సందేహమును సూచించినారు. "పాకపల్లి" అని చదువవలెనేమో అని రంగాచారిగారన్నారు. "పోలపల్లె" అని చదువవలెనని నా అభిప్రాయము.

(౪) కడపజిల్లా, ప్రొద్దుటూరుతాలూకా, దాసరిపల్లిగ్రామములో నెలకొన్న తిరువెంగళనాథదేవునికి కృష్ణదేవరాయని కాలములో శక ౧౪౩౭, యువ (క్రీ. శ. ౧౫౧౫) సం.ములో పర్వతరాజు ఆగ్రామమును దానముచేసినట్లొక శిలాశాసనమున్నది (*Sewell's List of Antiquities No.* 101).

(౫) కడపజిల్లా, సిద్ధవట్టంతాలూకా, మల్లినాయని పట్టణం గ్రామంలోని కుమారస్వామిదేవరకు శక ౧౪౫౭, మన్మథ (క్రీ. శ. ౧౫౩౫) సం.ములో లింగరసయ్య నాలుగుతూములపొలమును దానముచేసినట్లున్నది (దత్తమండలశాసనములు, నంబరు ౧౫, పుట ౪౯౫).

(౬) కడపజిల్లా, పుల్లంపేటతాలూకా, శ్రీనివాసపురం (కోటపల్లి) గ్రామంలోని హనుమంతరాయని విగ్రహముదగ్గర ఉన్న శిలమీది శాసనములో మాధరాజు, నాగరాజు అనేవారు శక ౧౪౮౨, సిద్ధార్థి (క్రీ. శ. ౧౫౬౦) సం.ములో తిరుమలతాతాచార్యులకు ఓబళకొండాపురమును దానముచేసినట్లున్నది (దత్తమండలశాసనములు, పుట ౨౫౮, నంబరు ౫౯).

(౭) బళ్లారిజిల్లా, హాస్పేటతాలూకా, హంపీగ్రామములోని విఠలస్వామిఆలయములోని గర్భగుడి దక్షిణపుక్రిందిభాగముమీది శాసనములో వీరప్రతాపసదాశివరాయమహారాయలు రాజ్యపాలనం చేస్తూ ఉండగా శక ౧౪౬౫, శోభకృత్తు (క్రీ. శ. ౧౫౪౩) సం. ములో విఠలస్వామికి తిరుమల తాతాచార్యులు వట్టూరుగ్రామమును దానముచేసినట్లున్నది (దత్తమండలశాసనములు, పుట ౪౧౦, నంబరు ౨౯).

పైని వివరించినదానినిబట్టి ఈక్రింది అంశములను స్థిరపరుపవచ్చును:

(౧) వేంకటనాథుడు నెల్లూరివాడు కాడు. అతడు కృతియిచ్చిన హరిహరనాథుడు నాచనసోమన

కృతియిచ్చిన హరిహరనాథునివలెనే తిక్కన కృతి యిచ్చిన నెల్లూరిలోని హరిహరనాథస్వామి కాడు.

(౨) పైని (౨), (౩) లలో వివరింపబడ్డ పోలపల్లి తిమ్మరాజే వేంకటనాథుని మాతామహుఁడన డానికి సందేహము లేదు.

(౩) పై (౪) లో తెలుపబడ్డ పర్వతరాజు వేంకటనాథుని తండ్రి అయిఉంటాడు.

(౪) పై (౫)లో తెలుపబడ్డ లింగరసయ్యరయే అతని పెదతండ్రి లింగరాజయిఉంటాడు.

(౫) పై (౬), (౭) లలో ఉదాహరింపబడ్డ తిరుమలతాతాచార్యులే వేంకటనాథుని కులగురువయిన తిరుమల శ్రీయఃపతి అయిఉంటాడు.

(౬) పైసాక్ష్యమునుబట్టి వేంకటనాథుడు క్రీ. శ. ౧౫౫౦-౬౦ సం.ముల మధ్యకాలమున తన పంచతంత్రమును రచించిఉంటాడని మన మూహించవచ్చును.

నారాయణకవిన్ని, వేంకటనాథుడున్ను ఇంచుమించు సమకాలికు లన్నమాట స్పష్టము. వేంకటనాథుని పంచతంత్ర పీఠికాధోరణినిబట్టి యీవిషయమును నిశ్చయించవచ్చును. వారి యిద్దరిలో నారాయణకవి తన గ్రంథమును ముందుగా రచించినాడు. అతని గ్రంథమునకు వ్యాప్తి కలిగినది. అందువల్ల వేంకటనాథునికి చూపోపమి కలిగినది. వేంకటనాథుడు ఈసుచేత ఆ గ్రంథమునే అంతకంటె రసవంతముగా రచిస్తానని ఉపక్రమించినాడు, రచించినాడు. ఆనాటి సమకాలిక పండితులు, కవులు, లాక్షణికులు, వీరూ, వారూ పోటాపోటీగా బయలుదేరిన ఈ రెండు పంచతంత్రములనున్ను ప్రక్కన పెట్టుకొని 'తైఫారు' వేసినారు. వేంకటనాథుని కృతిని చూచి ఒకొక్క రొకొక్క రీతిగా పెదవులు విరిచినారు. ఒక డతని కావ్యములో "రసవిస్ఫూర్తి కొంత" అన్నాడు. ఒకడు "దీని కిది పూర్వచ్ఛాయ"అని నారాయణకవిరచనను చూపించినాడు. ఒకడు "ఇచ్చోట తప్పనదు" అన్నాడు. ఒకడు "ఇప్పట్టున నర్థసృష్టిపసలే"దన్నాడు. ఒకడు "అశ్లీలమద్దెస"న్నాడు. మరొకడు "దుస్సమాస మిది" అన్నాడు. ఇంకా ఒకడు "సందేహాస్పదం బీడ" నన్నాడు. ఇట్లా కాకులలాగు గుయ్యబట్టుకొంటే ఎవడోర్చుకోగలడు? ఈరీతిగా "కుమారీకంబునఁ బాండితు లెన్నరపు నీచున్ రోఁతవాక్రుచ్చఁగన్" అని వారి యెడల తనకు గల అసహ్యత్వమును నోరారా, గంటము కొనతీక్ష్ణతతో తాటాకు చినుగునట్లు నొక్కి వ్రాసినాడు వేంకటనాథుడు. ఒకని కలంకారము కావలెనట; ఒకనికి వార్తాసమృద్ధి ఉండవలెనట; ఒకనికి శబ్దస్ఫూర్తి కలుగవలెనట; ఒకని కర్థసృష్టి అట; ఒకనికి రసాభోగత, ఒకనికి ఉపమానచర్చిక; ఒకనికి పదప్రౌఢిమ, ఒకనికి జాతిశ్లాఘ—ఎవడు మెప్పించగలడయ్యా వీరి నందరినీ? అలంకారమునకు వేడుక వహించేవాడు కామి; వార్త కావలసినవాడు తలవరి; శబ్దము కావలసినవాడు బధిరుడు; అర్థము కావలసినవాడు దరిద్రుడు; రసము కావలసినవాడు వాది (రసవాది); ఉపమానచర్చ కావలసినవాడు కనకకారుడు; పదములు కావలసినవాడు పంగువు; జాతి వెదకేవాడు కుజాతి.—కోపముచేత అంతే అన్నాడుకాని తన కావ్యములో లేవని తాను నమ్మిన దోషములను తానే ఇట్లు దాటించుకొనడముమాత్రము వివేకము కాదుగదా! ఒకప్పుడెక్కడనయినా ఒక తప్పుంటే ఉండేమో. చంద్రునికి కళంకముంటే అతని శోభ కేమిలోపము? ఈపండితులందరున్ను ఈర్ష్యాగ్రస్తులు; అహంకృతిదంశితులు; అల్పకాకవులు. వీరు మెచ్చకపోతే ఏమాయె? తన కవిత విద్వదుపాసిత కాకపోతుందా? కడుపుకక్కూర్తికై కృతులను రాజుల కంకితమిచ్చి, "నరభుక్తశేష కబళాహరణకుమకుక్కురాళి"- ఎంగిలి తిని బ్రతికే యీకుక్కలకు సవాజ్యధార పనికిరాకపోతే అది క్రతుకార్యసమాచరణీయ కాకపోతుందా? మధువ్రతములు పుష్పములమీద వ్రాలుతవి; నక్కలు కుల్లిన శవాలవద్దకు పోతవి. దోషైకదృక్కులతో ఏమిపని?

ఎవరిమీది కీవిసురు? నారాయణకవి పంచతంత్రముమీదికి, ఆకావ్యమును మెచ్చుకొనేవారిమీదికి. తన కావ్యము నెవ్వరున్ను మెచ్చరే అని ఏడ్పు. వెధవలోకము మెచ్చకపోతే తన కావ్యమున కేమిలోపము? తాను నారాయణకవివలె "నసహాయ విరసకవితా రసికుడు" కాడు, "ఆసహాయ సరసకవితా రసికుడు." వీరిదగ్గరకు వారిదగ్గరకు పోయి కవిత్వమును దిద్దించుకొనే రకముకాదు తాను నారాయణకవివలె. అతనివలె ధరావరప్రభులను యాచించి "అతికుటుంబరక్షణాపేక్షఁ బ్రాల్మాలి కృతులు మాధభూమిపతుల కిచ్చి, చచ్చి నిరయమునకుఁ" జనువాడు కాడు. తాను స్వయముగా "ధరావర ప్రభుడు." నారాయణకవివంటివారు కృతులను తారుదార లిఖియించి, తారుదార పఠించి, ప్రతులు జగం బడిగిన నిచ్చి, సకలావసథంబులఁ దారరై, కూలిఁబెట్టి చదివించుకొని ప్రఖ్యాతికి వస్తారు. వేంకటనాథుని కింతటిగతి పట్టలేదు. ఎంత కసి? ఈ పండితయ్యలు, ఈ బాపనయ్య

లతో పని యేముంది? తాను "గుణప్రపన్న ప్రకాండ మదవద్భసలాయిత విద్వ దఖిల బంధువ్రజుండు (సకల బంధుపరివృత్యులుండు)" కాడా? లోకమువారు మెచ్చకుంటే తన విద్వద్బంధువులు మెచ్చుకొంటారు. "ఈ కాపు కయిత్తపుమాటలు బాపన కవివరుని చెవికిఁ బ్రమదం బిడునే" అని ఆనాటివారన్నారు, ఆ తరువాతివారున్నూ అన్నారు. అంటే ఉడుకుకోవడ మెందుకు? ఉడుకుకొన్నకొద్దీ అంతకంతుం దననివారు కూడా ఆరంభిస్తారు ఎగతాళికి. ఆరహస్యము కనుక్కో లేకపోయినాడు వేంకటనాథుడు.

ఆనాటి యీసులతో మన కిప్పుడు పనిలేదు. ధరామరుడైతే మనకేమి, ధరావరుడైతే మనకేమి? కు(లోకపు) గతికోసము రచిస్తే నేమి, సుగతికోసము రచిస్తే నేమి? ఇంతకున్నూ పంచతంత్రరచనమువల్ల పుణ్యమా, ధర్మమా, మోక్షమా? అది అర్థకామముల నుపదేశించడానికి పుట్టినది. మనయెదుట రెండుగ్రంథములున్నూ ఉన్నవి. పక్షపాతము లేకుండా ఆ రెంటినిగురించిన్నీ విచారింతాము.

పంచతంత్రమును పద్యకావ్యముగా రచించడ మిద్దరు కవులదిన్నీ తప్పే. ఈవిషయములో ఇద్దరున్నూ ఔచిత్యమును పాటించలేదు. కథలో కథ, ఆ కథలో పిట్టకథ, ఈ అన్నింటికిన్నీ ఒకొక్కదాని కొక నీతి, కథ గద్యములోను, నీతి పద్యములోను ఉండడము — ఇది పంచతంత్రనిర్మాణస్వరూపము. ఈ స్వరూపమును వీరిద్దరున్నూ మార్చివేసినారు; పద్యకావ్యధోరణిలో పడినారు.

అది వారి తప్పు కాదు; ఆ కాలపు ఆంధ్ర సారస్వతపురీతి అది. ఆరీతిగా వ్రాస్తేనే కాని కవులున్నూ, పండితులున్నూ మెచ్చుకోరు. ఆనాటి సంప్రదాయము ననుసరించి, ఔచిత్యమును పాటించి, తాము చేపట్టిన గ్రంథరచన కనుకూలమైన మార్గము నవలంబించడానికి వారికి ధైర్యము చాలలేదు; అటువంటి మార్గము నవలంబింపవలె ననే బుద్ధికూడా వారికి పుట్టలేదు. ఇద్దరున్నూ చంపూకావ్య మార్గమును పట్టినారు కాబట్టి, ఆమార్గములో వారెంతవరకు కృతకృత్యులైనారనే విషయము మాత్రము మన మాలోచించవలెను.

పంచతంత్రమును కావ్యపద్ధతిలో సంతరింప ప్రయత్నించినవాడు వేంకటనాథుడు. అందుచేతనే అవకాశము చిక్కినప్పు డష్టాదశవర్ణనలలో నేదో ఒకదాని కంకించుకొన్నా డతడు. చూడండి: "పాటలీపుత్ర మనేపురమును సుదర్శను డనేరాజు పాలిస్తుండేవాడు" అనే కథోపక్రమణముకోసము ఎంత పెంచినాడో! పాటలీపుత్రముమీద ఒక సీసపద్యమును, దాని అగడ్తకొక సీసపద్యము, కోటకు మూడుపద్యాలు — ఇట్లే వరుసగా కోటగోడలు, సౌధాలు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, వేశ్యలు, పుష్పలావికలు, మదపుటేనుగులు, గుఱ్ఱములు, రథములు — ఒకొక్కదానికి రెండేసి మూడేసి పద్యాలుగా పెరిగినవి. సంస్కృతపంచకావ్యాలలోని వర్ణనచ్ఛాయలన్నీ ఈపద్యాలలో తాండవించినవి. అందులోని అతిశయోక్తులు తెనుగువారి కల్పనలతో పధ్నాలుగుభువనాలను దాటిపోయినవి. ఆపాటలీపుత్రము నేలే రాజును వర్ణించిన పద్యమును చదువుతేనే భయమవుతుంది.

"తన రూప మనురూప ధరఘూర్ణి గురుసూర్తి
మఘుపూత విభుజాత మర్ది గాఁగఁ
దన దాన మినజాన ఘనగారి దనవారి
ధరవాహ వరదేహ తాపి గాఁగఁ
దన శౌర్య మనివార్య తరకోప పరభూప
ఘనసైన్య జనదైన్య కారి గాఁగఁ
దన నీతి వినయాతి ధవరజ్య వనరేజ్య
శతపత్ర హితపుత్రి సహజ గాఁగఁ
దన మహోసత్య మంతికోద్యత్త్రిశంకు
తనయసత్యతిపచ్చరిత్రంబు గాఁగ
మను శుభస్ఫూర్తి నిత్యధర్మప్రవర్తి
తత్త్వవిద్దర్శనుండు సుదర్శనుండు"

పద్యాని కర్థము విడదీయలేకపోతే ఆరాజు సుదర్శనుడుకాక దుర్దర్శనుడై వాడొక దయ్యమో, భూతమో, ఘోరరాక్షసుడో అని పలాయనము పఠించాలి. ఆరాజవర్ణన మీఒక్కపద్యముతో ముగించి ఉంటే వేంకటనాథుడు మనలను రక్షించిఉండును. కాని, వదలడు — మరి నాలుగు సీసపద్యాలు (పైదాని వంటివే), ఒక శార్దూలము, ఒక మత్తేభము — శార్దూలము నిజముగా కరవవచ్చేటట్టుంది, మత్తేభము పాదాలక్రింద త్రొక్కివేసేటట్లుంది.

ఇంతే భయంకరుడైన రాజేమిచేసినాడు? "చిత్తమునఁ బొగిలి"నాడు. ఎంతటి అనౌచిత్యము! ఎంతటి కావ్యకళాదృష్టిరాహిత్యము! ఈ యనౌచిత్యమునకు పాల్పడకుండా నారాయణకవి చక్కగా ఎట్లు కథాసరళిలోనికి దిగినాడో గమనింపవచ్చును. పాటలీపుత్రివర్ణనమున కొక పద్యము; "ఆ పుర మేలుచుండు" నని ముక్తసరిగా రాజువర్ణనమును

ముగించినాడు. అయినా వేంకటనాథుడు తడవిన వర్ణనాంశములలో చాలభాగ మొక్కొక్క ముక్కలో తడవకుండా ఊరుకోలేదు. నారాయణకవి వర్ణించిన రాజు సుదర్శనుడే అయినాడు; వేంకటనాథుని రాజు దుర్దర్శనుడు, దుర్ధర్షుడు, దురవగాహుడు అయినాడు.

వేంకటనాథుని అనౌచిత్యానికి మరొక్క ఘట్టము మాత్రము స్మరిస్తే చాలును. కోతి మూలములోని చీలను ఊడదీసి అండములు నలిగి చచ్చిన కథ — ఊసుపోని పనులలోనికి పోతే ముప్పు వస్తుందని నీతి. ఊసుపోక మూలములో లేని కథను కల్పించడమువల్ల వేంకటనాథుడు కావ్యకలకు ముప్పు తెచ్చినాడు. అనగా అనగా ఉజ్జయినీపురము. అది "మితరహితారి మండల సమిజ్జయ" — అంటే "అమితులైన శత్రుమండలములను యుద్ధములలో జయించినది." ఎంత బాగున్నది! ఆ పురములో ఒక "వారసుదతీమణి." ఆమె సామాన్య అయినా సామాన్యురాలు కాదు-- ఆమె "వితత విలాస సంభ్రమణ విశ్రుతి విశ్రుత." ఓహో! ఆమె మిటారి, అతనుకటారి, కర్కశకుచాంగజితప్రకటారి, నృత్తనందితశకటారి — అబ్బా! వేంకటనాథుడు "వినుత పరాక్రముడ" నని చెప్పుకొనవసే చెప్పుకొన్నాడుగదా; అతని కామిటారి, కటారి, ప్రకటారి, శకటారి లేకపోతే ఎట్లా? ఆ భోగినిని గురించిన వర్ణన అయిన తరువాత — ఆ ధూర్తురాలు, మిండగాండ్ల గుండెలు ఝల్లుమనేటట్లు, వేసవనే తల్లి లేపించి అలంకరిస్తే, పార్వతిసేవకు పోయేది. ఒకనాడామెకు పాము కరచినది — విషవైద్యపు పద్యము. ఎవ్వరికిన్ని చేతకాకపోయింది. వేశ్యమాత కూతురిని పార్వతిగుడిలోనికి తీసుకొనిపోయి ఈమెను బ్రతికిస్తే నీకు మంటపము కట్టిస్తానని మ్రొక్కుకొన్నది. ఇంకేమి? తనకు మంటపము వస్తుందిగదా అని ఆ పార్వతి ఆమెను బ్రతికించినది. వేశ్యమాత మంటపము కట్టించడానికి కట్టెమూలాలు తెప్పించినది. వాటిని పగను కోసి చీలలు బిగించినారు. ఆ స్తంభపు చీల ఊడదీస్తే కోతిఅండాలు నలిగిపోయినవి — ఓహోహో! ఎంతటి కల్పన! ఏమి స్వారస్యము! ఏమి ఔచిత్యము! నారాయణకవి ఇట్టి పిచ్చిపోకడలకు పోలేదు. మాటిగా కథను సాగించుకొనిపోయినాడు. వేంకటనాథుని పంచతంత్రమును చదివి లోకులు నవ్వినారంటే వారిదా తప్పు?

అయితే వేంకటనాథుని బింకము, బిగువు గ్రంథముతుదివరకున్ను సాగలేదు. మొదటి ఆశ్వాసములోనే ఆ తప్పడు సంస్కృత పాండిత్యము, అనర్థక నిరర్థక సమాసఘటన, ఇంకా ఏవేవి దోషములుగా తానుద్ఘాటించుకొన్నాడో అవన్నీ దొరలినవి. ఆ తరువాత సాఫీగానే పోయింది కావ్యప్రవాహము. అక్కడక్కడ కక్కుర్తిపడి తరువాతి ఆశ్వాసాలలో ఏమయినా ప్రౌఢధోరణిలో పడినా అది క్వాచిత్కము, క్షమార్హము. ఆనాటి — మొన్న మొన్నటి — పాండిత్య లాలస, కళాదృష్టిహీనత వేంకటనాథుని గ్రంథములో కనబడినది. అంతే.

కథానిర్వహణమును గురించి ఆలోచిస్తే మాత్ర మొకరి కొకరు తీసిపోరు. కొన్నిచోట్ల వేంకటనాథునిది పైచేయి అవుతుంది; కొన్నియెడల నారాయణకవిదే అవుతుంది. పంచతంత్రము నీత్యుపదేశానికి పుట్టినదిగనుక, ఆ నీతులను చెప్పడములో సంస్కృత శ్లోకాలకున్న పొంకము, బింకము తెనుగుపద్యాలలోని కెవరు ఎక్కువబాగుగా తెచ్చినారో ఆలోచిస్తే ఇద్దరినిన్నీ మనము మెచ్చుకోవలసినదే. సంస్కృత పంచతంత్ర నీతిశ్లోకాలను కంఠస్థముచేసి ప్రాస్తావికముగా పఠించవచ్చును. అట్లే పొంకముగా, బింకముగా, సత్తముగా ఉన్న తెలుగుపద్యాలను అనేకములను ఇద్దరుకవుల గ్రంథాలలోనుంచిన్ని ఉదాహరించవచ్చును.

ఈ రీతిగా ఇద్దరి గుణములను, లోపములను ఎంతయినా వివరించవచ్చును. కాని, నారాయణకవిగ్రంథమున కీ కాలములోను, ఆ కాలములోను కూడా ఎక్కువ ప్రచార మనేకవిధములుగా కలిగి ఉండడమువల్ల అతని పద్యములు పరిచితములై అవే మేలనిపించుకొంటున్నవి. కాని, నారాయణకవి గ్రంథమునుంచి ఏర్చగలిగినన్ని ఉదాహరణయోగ్యములైన పద్యములను వేంకటనాథుని గ్రంథమునుంచికూడా ఏర్చవచ్చును. ఇద్దరి గ్రంథములున్ను ఆంధ్రవాఙ్మయమున కలంకారములే. వేంకటనాథుడు కొంతవరకు విద్వత్తకోసము కేవులాడినాడు; అదయినా కొంతవరకే. జాన్సన్ గురించి ఇంగ్లీషువాఙ్మయచరిత్రములో చెప్పినట్లు వేంకటనాథుని కొన్ని చేపలు తిమింగిలములవలె మాట్లాడినవి; నారాయణకవి కొన్ని తిమింగిలములు చేపలవలె మాట్లాడినవి. అంతే భేదము.

ప్రేమ చిత్రాలు

— శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు —

కడుపులో వెచ్చగా కాఫీ పోసుకుని, మీదిమీదికి వస్తూన్న చలిని తరిమేసి, ఉదయం ఎనిమిది గంటలికి వాలుకుర్చీలో కూచున్నాను. ఇంకా ఏపనీ మొదలెట్టలేదు. చటాలున నామిత్రుడు రామబ్రహ్మాం వచ్చాడు. "నువ్వు వస్తూన్న సూచన తెలియచెయ్యకుండా వచ్చావు. నిన్ను అరెస్టు చేశాను" అన్నాను అతనితో హాస్యంగా. "నీ అరెస్టుకి నేను బద్ధుణ్ణే గాని మొట్టమొదట ఈ సమస్య తీర్చు" అన్నాడు రామబ్రహ్మాం. "అలాగు కూర్చో, మాట్లాడదాం" అని మరొక వాలుకుర్చీ చూపించి "ఏమిటి చెప్పు, మరేం తొందర అంశం కాదు కదా!" అన్నాను.

"అబ్బే! కొంప మునిగిపోయే దేమీలేదు! ఒక విషయంలో నీ సహాయంకోసం వచ్చాను."

"అలాగా? చెప్పు విందాం" అని వినడానికి సిద్ధపడ్డాను.

"ఒక ప్రేమవిషయం చెబుదామని వచ్చాను. భగవదనుగ్రహం బాగుంటే—"

"ఔనుగాని నీకూతురికి పదిహేనేళ్లు వచ్చాయికదా, ఇంకా పెళ్లిచెయ్యవేం? నీ వాలకం నాకేం అర్థం కావడం లేదు. నువ్వు చూస్తే నిత్యాగ్నిహోత్రిని తలదన్నే నిష్ఠ కలవాడివి, నీ చర్య చూస్తే నవీనసంస్కారుల్ని తలవంచుకో చేస్తూంది. ఏమిటి సంగతి?" అన్నాను ఆశ్చర్యంగా.

రామబ్రహ్మాం సూక్ష్మంగా "మా ఆవిడే కారణం" అన్నాడు.

"ఏం" అని, మరింత ఆశ్చర్యపడ్డాను.

"అది చిన్నపిల్లలప్పుడు తన పిల్లలికి పెళ్లి చెయ్యనియ్యదు. పిల్లల పెళ్లిలో మనకి జోక్యమేమీ ఉండకూడదు. వాళ్లంతట వాళ్లే పెళ్లి చేసుకోవాలి. అ దెంతంటే అంతే కాబట్టి నే నేం చెయ్యలేను" అన్నాడు రామబ్రహ్మాం రవ్వంత విరక్తిగా.

"ఊఁ. నువ్వు ఒప్పుకున్నావన్నమాట!"

"దాని మాటకి తిరుగులేదు."

"ఆవిడ ఇలాగ పట్టుపట్టడానికి కారణ మేమిటో!" అని నాలో నేను అనుకున్నట్టుగా అన్నాను.

"చెబుతాను, వింటావా? ఓపిగ్గా వినాలిసుమా కథంతా!"

నేను కుతూహలంతో చూశాను ... ... రామబ్రహ్మాం కథ చెప్పాడు. అతను తనపక్షం విషయాలే సరిగా చెప్పాడు. కాని ఎదిరిపక్షం విషయాలు సబబుగా ఊహించలేకపోయాడు. అంచేత కథ ఒక పెషమాత్రమే చెప్పినట్టు ఉంది. అతను తిన్నగా ఊహించని అంశాలు నేను ఊహించి కథ పూర్తిగా చెబుతున్నా.

ఉమాకాంతం రాజమహేంద్రవరం వచ్చాక ఇల్లు మారడం ఇది పదోసారి. అతను బొంబాయి ఆర్టు స్కూలులో చదువు ముగించి రాజమహేంద్రవరం వచ్చి రెండేళ్లయింది. ఇల్లుగల ఆసాములు అతన్ని ఒక కొంపనుంచి మరొకకొంపకి తరుముతున్నారు. అతనికి ఇల్లు మారడమంటే చింత లేదు. కాని చిత్రపటాల గతేమిటి? ఇల్లు మారినప్పుడల్లా బొమ్మలు కాస్తో కూస్తో నలిగిపోతున్నాయి. కిందటిసారి ఇల్లు మారేటప్పుడు ఆల్ ఇండియా ఆర్టు ఎగ్జిబిషన్ కోసం రాస్తూన్న 'పార్వతీప్రణయా'న్ని జాగ్రత్తగా కొత్త ఇంటికి రవానా చేసేటప్పటికి తలప్రాణం తోకకొచ్చింది. 'భద్రాచల దృశ్యం' మీద గీతలు పడ్డాయి. 'కృష్ణరాయల స్వారి' చట్రం విరిగిపోయింది. బొమ్మలతో తగని బాధ వచ్చి పడింది! ఇంటి ఆసాములు అతన్ని ఎందుకూ తరమడం? అతను వాళ్ల కొంపల్లో నూతిదగ్గిర గలీజు చేశాడనా, లేక దెబ్బలాడేడనా, లేక తమ ఆడవాళ్లని కామదృష్టితో చూశాడనా? ఎందుకూ తరమడం? "ఇదా ఈ మనుష్యులు కళకి ఇచ్చే ప్రోత్సాహం! మనిషి బతికి ఉన్నన్నాళ్లూ కాల్చుకు తింటారా? చచ్చేక పద్యాలు రాస్తారా, వర్ధంతులు చేస్తారా, బొల్లేడ్పులు ఏడుస్తారా? ఇదా వీళ్లు చేసే పని!" అంటూ ఉమాకాంతం అనేకసార్లు పళ్లుకొరికి, గుప్పిళ్లు బిగించి తనలో అనుకున్నాడు; "ఒక స్త్రీ నా ఇంటికి వస్తే ఏమిటి? ఆమెని నేను వలచి రమ్మన్నానా? ఆమె మొగుడికి తెలియకుండా నా ఇంటికి వస్తూందా? నేను నెలకి నాలుగురూపాయిలు ఇస్తున్నా, ఆ కాపు అమ్మాయి వచ్చి కూచోడానికి. నాబొమ్మలు నేను గీసుకుంటాను. గుడ్డలేకుండా ఆమె కూర్చుంటూన్న మాట నిజమే. ఆమెకీ, ఆమెమొగుడికీ ఇష్టం లేకపోవాలిగాని మధ్య మీకా దద్దమ్మలికి ఇష్టం లేకపోడం! మీరు ఇళ్లలోంచి పొమ్మంటే నేను నా చిత్రకళ మానుకుంటా ననుకున్నారా? తెలివితక్కువ పీనుగులు!" అని అనేకసార్లు తనలో తాను ఉపన్యాసాలు ఇచ్చుకున్నాడు. ఇటువంటి ఉపన్యాసాలు పైమనుష్యులికి ఇవ్వడంవల్ల తాను మరింత రవ్వపడిపోతానని ఎరిగి తనలో యుక్తివాదాలు చెప్పుకుంటూ, ఉపన్యాసా లిచ్చుకుంటూ శాంతి పొందేవాడు.

మొట్టమొదటిసారి అతను అద్దెకి ఉన్న ఇంటికి ఎదురుగుండా ఒక కట్టెలుకొట్టేవాడు ఉండేవాడు. కొన్నాళ్లకి అతనితో పరిచయమయింది. ఉమాకాంతం స్కెచ్ బుక్కు పట్టుకుని, తనతో మాట్లాడుతూన్న ఆ కట్టెలుకొట్టే అబ్బి బొమ్మ క్షణంలో గీసి "ఇదిగో నువ్వు" అని చూపించాడు. ఆ అబ్బి ఆ బొమ్మ చూసి నివ్వెరపోయి "నేనే అండీ. ఎంతబాగున్నానండీ! అచ్చం నేనేనండీ!" అని ఆ పుస్తకం ఇంట్లోకి తీసికెళ్లి పెళ్లానికి చూపి చంకలు కొట్టుకుని, ఇంటిచుట్టూ ఉన్న స్నేహితులికి చూపించి గంతులు వేసి, పుస్తకం మూసి పట్టుకొచ్చి ఉమాకాంతానికి ఇచ్చి, తన కా బొమ్మ ఇమ్మనీ, పటం కట్టుకుంటా ననీ కోరాడు. ఉమాకాంతం ఒప్పుకున్నాడు. ఆ అబ్బి ఆబొమ్మని పటం కట్టించి తీసుకువచ్చి ఉమాకాంతంతో "తమరు ఇచ్చారు కామట్టి తమ కేదేనా చెప్పండి చేస్తాను." అన్నాడు మొహం బిగించి, బుర్ర అడ్డంగా ఊపుతూ. అందుకు ఉమాకాంతం "నేను బొమ్మలు గీసుకోడానికి ఇరవై యేళ్ల అమ్మాయి కావాలి. ఆఅమ్మాయి నిలుచున్నప్పుడు, కూచున్నప్పుడు, వంగున్నప్పుడు, ఇంకా అనేక మోస్తర్లుగా ఉంచి నేను బొమ్మలు గీసుకుంటాను. ఈ చిత్రకళ వృద్ధి చేసుకోవడానికి అది అవసరం. నాకు ఊరికే రానక్కర్లేదు. నెలకు నాలుగు రూపాయి లిస్తాను. పగలు ఏదోసమయాన్ని వచ్చి కూచుని పోవాలి" అన్నాడు.

కట్టెలు కొట్టే అబ్బి రెప్పపాటుకాలం విస్తుపోయి ఇంట్లోకి ఒక్కగంతులో వెళ్లి, మళ్లీ ఇవతలికి వచ్చి "మా ఆడోళ్లొస్తారండి, తమరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు" అన్నాడు. "రేపటినుంచి రమ్మను" అని ఉమాకాంతం వెళ్లిపోయాడు.

నూకమ్మ, అంటే కట్టెలు కొట్టే అబ్బి పెళ్లాం, ఆమన్నాడు ఉమాకాంతంయింటికి వచ్చింది. ఆమెను కూచోబెట్టి ఉమాకాంతం కొంచెంసేపు బొమ్మలు గీసుకుని వెళ్లిపొమ్మన్నాడు. ఆ అమ్మి రోజూ వస్తూండేది. అతిత్వరితంగా చుట్టుపట్లవాళ్లు

రంకు కట్టేశారు. ఇంటాయన ఉమాకాంతాన్ని లేచి పొమ్మన్నాడు. ఉమాకాంతం వాదన పెట్టుకోక మరో ఇల్లు చూచుకున్నాడు. కొన్నాళ్లకి అక్కడా ఇదే తంతు. ఈమోస్తరుగా ఇప్పటికి పదో ఇల్లు మారడం. ఎంతమంది ప్రయత్నించినా కట్టెలు కొట్టే అబ్బి మట్టుకు తన పెళ్లాన్ని ఉమాకాంతంఇంటికి పంపడం మానలేదు.

ఈపదకొండో అద్దెయింటికి ముందు ఉమాకాంతం 'లలితకళానికేతనం' అనే బోర్డు కొత్తమోస్తరుగా రాసి తగిలించాడు. కేటాయింపుగా ఉన్న తన ఇంటి భాగంలో ముందుగదిలో కొన్ని బొమ్మలు అలంకరించి, అంతగా వెలుతురురాని వెనకగదిలో మరికొన్ని బొమ్మలు చక్కగా అమర్చాడు. పెరట్లో కొన్ని పూలకుండ్లు ఉన్నాయి.

ఆ వీథిలో ఉన్న యువక విద్యార్థులు ఉమాకాంతంఇంటికి నాకమ్మ వచ్చిపోవడం చూస్తున్నారు. హఠాత్తుగా ఒకరోజున వాళ్లు ఉమాకాంతం ఇంటికి ఎదురుగా నడివీథిలో సభ తీర్చారు. అవసరం మాలిన మాటలు అతన్నిగురించి మాట్లాడుతున్నారు. ఉమాకాంతం మనకెందుకని ఊరుకున్నాడు. మన్నాడు కూడా ఆ విద్యార్థులు అదేవేళకి సభ తీర్చారు. ఉమాకాంతం మనస్సులో విచారించి "తెలుగువాళ్లు ఇంత మర్యాదలేనివాళ్లా! అయ్యో! ఇటువంటివాళ్లనా నేను ప్రేమిస్తున్నది" అని అనుకున్నాడు. మూడో రోజున యువకులు సభ చేస్తూ, ఇంట్లోంచి వస్తున్న నాకమ్మని మట్టుకోబోయారు. ఉమాకాంతం ఇవతలికి వచ్చి "మీరు మర్యాదగా ప్రవర్తించండి. అమర్యాద మనుష్యు లనిపించుకోడం గొప్పతనం కాదు." అన్నాడు, కోపాన్ని తొక్కిపెట్టి. విద్యార్థులలో ఒకడు లేచి "ఈయనట, మనకిట, మర్యాద నేర్పుతాడుట." అన్నాడు చేతు లాడించుకుంటూ. విద్యార్థులంతా ఫక్కున నవ్వారు. "మీరు ఇక్కడ ఎందుకు చేరుతున్నారు రోజూ?" అని అడిగాడు ఉమాకాంతం. "తమ రుంచుకొన్న అమ్మాయిని బాగుచేద్దామని" అన్నాడు ఒక పోకిరీ. "ఆవిషయం నన్నడగవద్దు. ఆ మనిషిభర్తని అడగండి. అతను చెప్పినట్టు ఆమె ప్రవర్తిస్తుంది" అన్నాడు ఉమాకాంతం నిదానంగా. సభ్యు లంతా గొల్లుమంటూ లేచారు; ముందు వెళుతూన్న నాకమ్మని పకపకనవ్వుతూ, కేకలేసుకుంటూ వెంబడించారు; ఆమెఇంటికి వెళ్లి ఆమె భర్తని పిలిచి అతనితో నానామాటలూ అన్నారు. అందుకు ఆ అబ్బి చెప్పవలసిన సంగతులన్నీ చెప్పి "నేను ఇష్టపడే పంపుతున్నాను" అన్నాడు. ఒక్క విద్యార్థినోరూ పెగలలేదు. "ఇది లాలోచీవ్యవహారంరా, ఎవడి ఇష్టం వాడిదిరా, ఎవడికొంప వాడు ముట్టించుకుంటే మనకేంరా" అనుకుంటూ చల్లగా పప్పులా జారారు. ఆ నాటినుంచీ సభలు జరగలేదు.

విద్యార్థులు సభ తీర్చేటప్పుడు ఎదుటి వరసలో మూడోఇంటి గుమ్మంలో నిలుచుని సావిత్రి చూస్తూండేది. సభలు ముగింపరేయి. ఒకరోజున నాకమ్మ వస్తూండగా సావిత్రి తన ఇంటిగుమ్మంలో నిలుచుని సిగ్గుతో చిరునవ్వు నవ్వుతూ, నాకమ్మని పిలిచి, ఆమెని గురించీ, ఉమాకాంతాన్నిగురించీ ప్రశ్నలు వేసింది. నాకమ్మ తను చేసే పని చెప్పి, ఉమాకాంతాన్ని గురించి "ఉమాకాంతంగారికి తల్లీ తండ్రీ లేరు. ఆయన చంటిపిల్లడై ఉన్నప్పుడే వాళ్లు చచ్చిపోయారు. మేనత్త పెంచి పెద్దచేసి, చదువు చెప్పించింది. ఆవిడా నాలుగేళ్లకిందట చచ్చిపోయింది. ఆయన ఒక్కరే ఉన్నారు. హోటేలునుంచి తిండి తెప్పించుకు తింటారు. ఇంకా పెళ్లికాలేదు. బొమ్మలు చాలా బాగా గీస్తారు" అంది. "అలాగా" అంది సావిత్రి ఆశ్చర్యంతో. పరువుమర్యాదలులేని నాకమ్మతో అంతకంటే ఎక్కువసేపు మాట్లాడకూడదని తలచి ఇంట్లోకి వెళ్లిపోయింది.

ఆ మన్నాడు సాయంత్రం నాకమ్మ ఉమాకాంతంఇంట్లోంచి కోడిపుంజుని చంకనిపెట్టుకు ఇవతలికి వచ్చింది. తన ఇంటి గుమ్మంలో నిలుచున్న సావిత్రి ఆమెని చూసి, ఆపి "కోడిపుంజు నెందుకు తెస్తున్నావు? ఆయన తింటా రేమిటి?" అంది. అందుకు నాకమ్మ నవ్వి "వారు బ్రాహ్మలు. వారు కోళ్లని తింటారా? బొమ్మవేస్తూ కోడిపుంజుని తెమ్మన్నారు. పట్టుకెళ్లాను" అంది.

"ఏంబొమ్మ వేస్తున్నారు?" అంది సావిత్రి బిడియంతో.

"గౌతముడు, కోడిపుంజు బొమ్మ వేస్తున్నారు. గౌతముడి పక్కనే మెరిసిపోతూ అహల్య నిల్చుంది. చీకట్లో కూడా ఆ యమ్మ తళతళ మెరిసిపోతూంది" అంది నూకమ్మ, ఖాళీగా ఉన్న ఎడంచెయ్యి తిప్పుకుంటూ.

"అహల్యా, గౌతముడూ నిజంగానే ఉన్నారా ఏమిటి ఆ గదిలో ?" అంది సావిత్రి అమాయికంగా.

"వాళ్లు కాదమ్మా! వాళ్ల బొమ్మలు. అంచక్కా ఉంటాయి. మనుష్యులనుకోవలసిందే" అంది నూకమ్మ ఆనందంతో.

"ఎంతబాగుంటాయో?" అంది సావిత్రి ఆశ్చర్యపడి.

"చాలాబాగుంటాయి. అచ్చం మనుష్యులే! ఆ అహల్యమ్మని చూసితీరాలి. ఎంత చక్కగా ఉంటుం దమ్మా! మెరుపులాగ!" అంది నూకమ్మ కళ్లు తిప్పుకుంటూ. సావిత్రి ఆలోచనలో ఉండి పోయింది. నూకమ్మ ఇంటికి వెళిపోయింది. ఉమాకాంతం సాయంత్రం షికారు బయలుదేరాడు. కలకత్తాఅంచు పంచ కుచ్చిళ్లుపోసి కట్టాడు. పట్టు మీద కాఫీరంగుకండువా వల్లెవాటువేసుకుని, కళ్లకి నల్ల సెల్‌ఫ్రేమ్ తగిలించి, కాళ్లకి కలకత్తా స్లిప్పర్లు తొడిగి బయలుదేరాడు. సావిత్రి అతన్ని చూసి సిగ్గుపడి ఇంట్లోకి వెళిపోయింది.

మర్నాడు ఉమాకాంతం నూకమ్మని "ఆ యింటిదగ్గిర ఎవరితో మాట్లాడుతున్నావు ?" అని పూరికే అడిగాడు. "సావిత్రితో మాట్లాడుతున్నాను" అంది నూకమ్మ. ఉమాకాంతం ఆ అమ్మాయినిగురించి కొన్ని ప్రశ్నలు అడిగాడు. నూకమ్మ ఊరుకోక "మీరు బొమ్మల్లో వేసే మోస్తరుగా ఉంటుంది ఆ అమ్మాయిగారు" అంది. అతను ఆశ్చర్యపడ్డాడు. "ఆ పిల్లని చూడాలి నూకమ్మా!" అన్నాడు. మరి కొంతసేపటికి నూకమ్మ ఇంటికి వెళిపోతూండగా తన ఇంటి మెట్లమీద నిలుచున్న సావిత్రి ఆమెని ఆపి "మీ అయ్యగారు పిచికని చెయ్యగలరా? అంచక్కా చెయ్యాలి మరి" అంది. నూకమ్మ చిరునవ్వు నవ్వి "రేపు పట్టుకొస్తా, చూడండి" అంది. మర్నాడు నూకమ్మ గూట్లో పిల్లలికి పిచికలు తిండి పెడుతూన్న బొమ్మని పట్టుకొచ్చింది. సావిత్రి ఆ బొమ్మని చూసి ఆశ్చర్యపడిపోయింది. "మీ అయ్యగారు పిచికల్ని పుట్టిస్తా రమ్మోయి!" అంది. అని ఆ యింట్లో బొమ్మ లన్నిటినీ చూడాలమ్మా!" అంది కోరికతో. ఇంతలో ఇంట్లో సవతితల్లి పిలవగా పిచికలబొమ్మని ముద్దెట్టుకుంటూ లోపలికి వెళిపోయి, బొమ్మని పెట్లో దాచేసి, సవతితల్లిదగ్గరికి వెళ్లింది.

మర్నాడు నూకమ్మ రాగా ఉమాకాంతం ఆమెతో "నువ్వు పిచికలబొమ్మ తీసుకు వెళ్లి ఇచ్చిన పిల్ల ఎవరు ?" అని అడిగాడు.

"ఎదుటివరసలో మూడో ఇంట్లో అమ్మాయి ; మిమ్మల్ని గురించి ప్రశ్నలు వేస్తూంటుంది"

"నన్ను గురించా?" అని ఆశ్చర్యపడ్డాడు.

"మరే! మిమ్మల్ని గురించే".

"ఎన్నేళ్ల పిల్ల?"

"పదకొండేళ్ల పిల్ల"

"కళ్లు చక్కగా ఉంటాయి, నేను బొమ్మలు గీసినట్టే ఉంటుంది అన్నావు ఆఅమ్మాయేనా ఏమిటి?"

"ఔను! ఆ అమ్మాయే. సావిత్రి"

"ఇంకా పెళ్లి కాలేదూ ?" అని ఉత్తేజం పొందిన మొహంతో అడిగాడు ఉమాకాంతం.

"లేదు" అంది నూకమ్మ.

ఉమాకాంతానికి చిరునవ్వు వచ్చింది. "నిన్న పిచికల బొమ్మ చూసి ఏమంది ఆ అమ్మాయి ?" అన్నాడు చిట్లింపు మొహంతో.

"మీ అయ్యగారు నిజమైన పిచికలే వేస్తారే అంది."

ఉమాకాంతానికి సావిత్రిమీద కుతూహలం కలిగి "ఆ పిల్ల తల్లిదండ్రు లిక్కడే ఉన్నారా ?" అని ప్రశ్న వేశాడు.

"తండ్రి ఉన్నాడు. తల్లి సవతితల్లి. సవతి తల్లి బాధ లుండనే ఉంటాయి. పిల్లమట్టుకు మంచిది. అందాల భరిణ. ఎవళ్ల ఇంట్లో పడుతుందో ఏమిటో!" అంది నూకమ్మ ఉద్రేకరహితంగా.

ఉమాకాంతానికి చిరునవ్వు వచ్చింది. అతను దాచలేకపోయాడు; "అలాగా?" అనుకున్నాడు. ఇంక సంభాషణ ఆపి, నూకమ్మని స్టూలు బల్లమీద కూచోమని, బొమ్మలు గీసుకొని, మరి కొంతసేపటికి వెళిపొమ్మని తాను సావిత్రిని గురించి గాలిమేడలు కడుతూ కూచున్నాడు. నూకమ్మ ఇంటికి పోతూ స్నేహితురాలైన సావిత్రిని కేకవేసింది. సావిత్రి ఇవతలికి వచ్చి రావడంతోనే నూకమ్మతో "మీ అయ్యగారు వేసిన బొమ్మలు చూడనిస్తారా?" అంది, ఆ ప్రశ్న వేద్దామని అంతకి ముందే ఆలోచించుకొని. "మా అయ్యగారి నడిగి చెప్తా" అంది నూకమ్మ. ఇంట్లోంచి సవతితల్లి ఇవతలికి వచ్చింది. నూకమ్మ వెళ్లిపోయింది. "ఆ రంకుముండతో మాట్లాడుతున్నావా? మీ నాన్నతో చెప్పి ఓరించేస్తాను ఉండు" అంది ఆవిడ. సావిత్రి మొహం ముడుచుకుని మాట్లాడకుండా పిల్లిలాగ గదిలోకి వెళిపోయింది.

మన్నాడు నూకమ్మ తిరిగి ఇంటికి వెళిపోయేటప్పుడు సావిత్రి ఇంటిగుమ్మందగ్గిర ఆగింది. సావిత్రి ఇవతలికి వచ్చి "మా అమ్మకి కనపడకుండా మాట్లాడేం. లేకపోతే మా అమ్మ కోంబడుతుంది" అంది.

"ఏం?" అంది నూకమ్మ.

"అదంతా ఎందుకూ? మనం మాట్లాడుకోడం మా అమ్మకి తెలియనివొద్దు ...... మీ అయ్యగారి బొమ్మలు ఎప్పుడూ చూడడం?" అని అడిగింది.

"రేపు నాతో రండి చూపిస్తా" అంది నూకమ్మ. సావిత్రి సంతోషించింది. నూకమ్మ వెళిపోయింది.

నూకమ్మ ఆ మన్నాడు పెందరాడే వచ్చింది. ఆమెకోసం అనుక్షణం ఎదురు చూస్తూన్న సావిత్రి నూకమ్మని చూసి బ్రహ్మానందపడి ఆమెతో కలిసి ఉమాకాంతంఇంటికి వెళ్లింది.

ఉమాకాంతంఇంట్లో ముందుగదిమధ్యని ఒక నల్లబల్లమీద చిన్న పువ్వులగుడ్డ పరిచి దానిమీద ఒక చలువరాతిసింహం పెట్టిఉంది. ఆ సింహం పక్కని చిన్న కంచు కూజాలో పువ్వు లున్నాయి. నేలమీద జంఖానాలు ఉన్నాయి. గోడలమీద అందంగా పెద్ద పటాల పక్కని చిన్నపటాలు అమర్చబడ్డాయి పౌరాణికచిత్రపటాలు కొన్ని, చారిత్రక చిత్రపటాలు కొన్ని, సాంసారికపటాలు కొన్ని, రంగులపటాలు కొన్ని, రేఖాచిత్రాలు కొన్ని, నలుపు తెలుపు కొన్ని-రకరకాలుగా అమర్చి ఉన్నాయి. కుడివైపున గోడ మీద ఉన్న 'శకుంతల విహారం' బొమ్మ చూస్తూ సావిత్రి తన్మయత్వం పొంది నిలుచుంది. పెరట్లోంచి వస్తూన్న ఉమాకాంతం ఆమెని చూసి ఒక విగ్రహం లాగ నిలబడ్డాడు. నూకమ్మ ఎంత వర్ణించినా తను సావిత్రిని అలాగ ఊహించుకోలేకపోయానుకదా అని అతను ఆశ్చర్యంతో నిలుచున్నాడు. కొంతసేపటికి సావిత్రిదృష్టి పక్కకి మళ్లగా ఉమాకాంతం కనబడ్డాడు, సిగ్గుతో పరిగెత్తిపోయింది. ఉమాకాంతం పెరట్లోకి వెళిపోయాడు. నూకమ్మ సావిత్రితో "అయ్యగారు పెరట్లోకి వెళిపోయారు మీరు చూడొచ్చు చాలాసేపు" అంది. సావిత్రి మరికొంతసేపు చూసి "నువ్వు నాతో చెప్పిన అహల్యబొమ్మ ఏదీ?" అని అడిగింది. నూకమ్మ ఆపటాన్ని చూపించింది. సావిత్రి ఆశ్చర్యపడిపోయి నిలుచుని కొంతసేపు చూసి ఆనందించి తటాలున "మా అమ్మ కోంబడుతుంది, వెళిపోవాలి" అని వెళిపోయింది. ఉమాకాంతం పెరట్లో పళ్లచెట్ల నీడలలో సంచరిస్తూ సావిత్రిఅందం తలపోసి ఆనందిస్తున్నాడు.

ఒకరోజాన నూకమ్మ తన పని ముగిసినపిమ్మట ఇంటికి పోతూండగా సావిత్రి ఆమెని ఆపి "ఈ గ్రాఫుకాగితంమీద మీ అయ్యగారిని లేడిని సింహం తరుముతూన్నట్టు బొమ్మవేసి ఇమ్మను. నేను ఈ కన్నాల అట్టమీద ఊలుతో కుట్టుకుంటాను" అంది. మరి రెండు రోజులికి నూకమ్మ ఆ గ్రాఫుకాగితం తీసుకొచ్చి సావిత్రికి ఇచ్చింది. సావిత్రి ఆ కాగితం మీద ఉన్న రంగులు గల ఊలుతో కన్నాల అట్టమీద బొమ్మ కుట్టి నూకమ్మకి ఇచ్చి "మీ అయ్యగారికి చూపించి రా" అంది. ఉమాకాంతం ఆ బొమ్మని చూసి అపరిమితానందం పొంది, ఆమెలలితకళాభిరుచిని మెచ్చుకొని, దానికి చట్రం కట్టించి తిరిగి పంపించాడు. సావిత్రి ఆ చట్రం చూసి సంతోషించి పటాన్ని ఇంట్లో వేళ్లాడగట్టింది. ఆరాత్రల్లా ఉమా

కాంతాన్ని గురించే చక్కని కలలు కంటూ నిద్ర పోయింది.

మరొకరోజున నాకమ్మ ఇంటికి పోతూండగా సావిత్రి పిలిచి "మీ అయ్యగారికి కరివేపాకుపచ్చడి ఇస్తాను. నువ్వు ముట్టుకోకుండా తీసికెళతావా?" అంది.

"నేను ముట్టుకోకుండా ఎలాగ తీసికెళతానమ్మా!" అంది నాకమ్మ నవ్వుతూ.

"మరిచిపోయాను. ఆయనికి ఎలాగా ఇయ్యడం?" అని సావిత్రి మథనపడింది.

అందుకు నాకమ్మ "బ్రాహ్మల హోటేళ్లలో కాపమనుష్యులే పచ్చళ్లు చేస్తూంటారు. మా అయ్యగారు భోంచేసే హోటేలులోనూ అంతే. అంచేత నేను తీసుకెళ్లి ఇస్తాను. ఫర్వాలేదులెండి" అంది.

ఎలాగో ఒహలాగ పచ్చడి అందాలని సావిత్రి నాకమ్మచేతికి ఇచ్చింది.

ఉమాకాంతం ఆ పచ్చడి తిని అపరిమితానందం పొందాడు.

తన పని పూర్తిచేసుకొని ఒకనాటి సాయంత్రం నాకమ్మ ఇంటికి పోతూ సావిత్రిఇంటిదగ్గిర ఆగింది. నాకమ్మకోసం ఎదురుచూస్తూన్న సావిత్రి నాకమ్మ రాగానే ఒక్కగంతులో ఆమెదగ్గిరికి వెళ్లి "మీ అయ్యగారు ఇంట్లో ఉన్నారా?" అంది. "ఉన్నారు. మీ బొమ్మ రాసి ఇమ్మన్నారా?" అంది నాకమ్మ. "నన్ను తిన్నగా చూడలేదు కదా, ఎలాగ రాసిస్తారు?" అంది సావిత్రి ఆశ్చర్యంతో, సిగ్గుతో.

"రేపు మాగదిదగ్గిరికి రండి, మీ బొమ్మ చూద్దురుగాని" అంది నాకమ్మ. అని, వెళిపోయింది.

సావిత్రి ఆశ్చర్యపడుతూ, ఉవ్విళ్లూరుతూ ఆ రాత్రి గడిపింది. మన్నాడు మధ్యాహ్నం నాకమ్మ పెందరాడే వచ్చింది. సావిత్రి మంచి పరికిణీ కట్టుకొని, నాకమ్మతో కూడా ఉమాకాంతంఇంటికి వెళ్లింది. నాకమ్మ సావిత్రితో మాట్లాడుతూండగా పక్కని కిటికీలోంచి చూస్తూన్న ఉమాకాంతం సావిత్రిని రేఖాచిత్రంగా గీశాడు. నాకమ్మ ఆ బొమ్మ తీసుకువచ్చి సావిత్రికి చూపించింది. సావిత్రి ఆ బొమ్మలో ముక్కుపుడక వెయ్యడం కూడా చూసి ఆశ్చర్యపడి ఆనందించింది. ఆమె అలాగ ఆనందిస్తూన్నట్టుగా మరొక బొమ్మ వేశాడు. నాకమ్మ సావిత్రికి ఆ బొమ్మ చూపించింది. సావిత్రి ఆ బొమ్మని చూసి దిగ్భ్రమచెంది "ఆయన ఇక్కడే ఉన్నారమ్మా!" అంటూ సిగ్గుపడి పారిపోయింది. ఉమాకాంతంనాకమ్మని వెళిపొమ్మని చెప్పి సావిత్రిని గురించి ధ్యానిస్తూ, సంతోషపడుతూ, పెరట్లో చెట్లనీడల్లో తిరిగాడు.

సావిత్రి కాగితపుసంచీలో పువ్వులు పోసింది. ఆ మధ్యాహ్నం నాకమ్మ వచ్చేటప్పుడు ఆమెని ఆపి "ఈ పువ్వులు మీ అయ్యగారికి ఇయ్యి" అని ఇచ్చింది. నాకమ్మ ఉమాకాంతానికి ఆ సంచీ ఇచ్చింది. అతను ఆ సంచీ అందుకొని పువ్వులు వెలుపు తూండగా ఒక కాగితం ఇవతల పడింది. నాకమ్మకి కనపడకుండా ఆ కాగితం తీసి దాచి పెరట్లోకి వెళ్లి సావిత్రి రాసిన ప్రేమలేఖని ఇరవైసార్లు చదువుకొని గుండెలకీ, కళ్లకీ అద్దుకొని, ఆమెని పెళ్లిచేసుకునే విధానమేమిటీ అని ఆలోచిస్తూ కూచున్నాడు.

ఒక పండగ రోజున నాకమ్మతో సావిత్రి ఉమాకాంతంఇంటికి వచ్చింది. నాకమ్మ ఏదో పని మీద పెరట్లోకి వెళ్లగా రెండోగదిలో ఉన్న ఉమాకాంతం ఇవతలకి వచ్చి సావిత్రిని కౌగిలించి ముద్దు పెట్టుకొని "మన వివాహం ఎప్పుడూ" అని అడిగాడు. సావిత్రి అతని కౌగిలిలోంచి విడిపించుకో పోగా ఉమాకాంతం ముద్దుపెట్టుకొని గులాబీపువ్వులు జడలో పెట్టి కౌగిలి విడిచిపెట్టాడు. సావిత్రి ఇంటికి పోయి జడ, బొట్టు సర్దుకుని గులాబీపువ్వులు చూసి ఆనందపడి, జడలో పెట్టుకుంది. రాత్రి నిద్రలో ఉమాకాంతాన్ని వివాహమాడినట్టు కలలు కంది.

ఉమాకాంతం సావిత్రియొక్క జీవితపు సైజు తైలవర్ణపటం వేస్తున్నాడు. మధ్య మధ్య సావిత్రి రాగా ఆమెని మరింత పరీక్షచేసి పటం పూర్తి చేస్తున్నాడు. పటం ముద్దులు మూటకడుతూంది. సావిత్రి ఎదుట నిలుచున్నట్టుగానే ఉంది ఆబొమ్మ. ఆబొమ్మ పూర్తి అయాక గదిలో కిందని వేళ్లాడగట్టాడు.

ఒకనాడు సావిత్రి ఒంటరిగానే ఉమాకాంతం గదికి వచ్చింది. ఉమాకాంతం ఆమెని కౌగిలించుకొని రెండో గదిలోకి తీసుకువెళ్లి అక్కడ వేలాడిఉన్న బొమ్మని చూపించాడు. సావిత్రి కొంచెంసేపు చూసి,

"మా ఇంట్లోనూ ఉంది నిలువుటద్దం, మామామ కొనిచ్చాడు" అంది.

"ఇంతేసి నిలువుటద్దాలు మీ ఇంట్లో ఉన్నాయా?" అన్నాడు ఆశ్చర్యం అభినయించి.

"ఇంతకంటే పెద్దవి ఉన్నాయి"

"ఈ నిలువుటద్దంలో నువ్వేకాని నేను కనపడ నేమి!"

సావిత్రి తడిమి చూసింది. అది అద్దం కాదు. బొమ్మ! తనబొమ్మ! సావిత్రి సిగ్గుతో ఉమాకాంతం చేతుల్లో వాలిపోయింది. అతను ఆమెశరీరంమీద ముద్దులుకురిపించాడు. సావిత్రి మేలుకొని ఉమాకాంతం చేతుల్లోంచి విడిపించుకొని కాళ్లు తడబడుతూండగా, తల సర్దుకొని ఇంటికి వెళిపోయింది.

మరికొన్ని రోజులకి ఆమె మరొకసారి ఉమాకాంతంఇంటికి రాగా, ఉమాకాంతం ఆమెని కౌగిలించుకొని రెండోగదిలోకి తీసుకువెళ్లాడు. గోడమీద ఉన్న బొమ్మని చూసి ఆశ్చర్యపడి, సిగ్గుపడింది సావిత్రి; తన్ను ఉమాకాంతం కౌగిలించుకున్నట్టుగా ఆబొమ్మలో ఉంది.

"ఈ బొమ్మ బాగుందా?" అన్నాడు.

సావిత్రి సిగ్గుపడుతూ "అప్పటిదానికంటే బాగుంది ఎంతో" అంది.

ఉమాకాంతం కౌగిలి విడిచిపెట్టేశాడు. బొమ్మలోకూడా ఇద్దరూ వేరయారు. "ఇప్పు డెలాగ ఉంది" అన్నాడు అతను.

ఇది అద్దంకాని బొమ్మ కాదని గ్రహించి ఆ అమ్మాయి సిగ్గులో మునిగిపోయి, ఉమాకాంతం చేతుల్లో వాలింది. ఉమాకాంతం ఆమెని ముద్దుపెట్టుకొని తివాసీమీద తన పక్కనే కూచోబెట్టుకుని, ఆమె నిలుచున్నట్టు, కూర్చున్నట్టు, పువ్వులు పెట్టుకున్నట్టు, నిద్రపోతూన్నట్టు మొదలైన భంగిమాలలో అనేక రేఖాచిత్రాలు గల పుస్తకం చూపించాడు. సావిత్రి తన్మయత్వంతో చూసి "మన పెళ్లెప్పుడూ?" అంది. ఉమాకాంతం చెప్పబోతూండగా "మాఅమ్మ పిలుస్తుంది" అని భయపడుతూ పారిపోయింది.

ఉమాకాంతం షికారు వెళ్లాడు. అతను పొలాలలో తిరుగుతున్నాడు. కోత లయిపోయి చేలు తిరగడానికి ఎంతో బాగున్నాయి. కాని అతని మనస్సు అక్కడ లేదు. అతను ఏవేవో ఊహాహార్మ్యాలు కడుతున్నాడు. దృష్టి నడకమీద లేక సన్నని చేనిగట్టుమీద స్లిప్పర్లు జారగా కిందికి రెండుసార్లు పడ్డాడు. కాని చేతులు, బట్టలు దులిపేసుకుని ఎప్పటిలాగే ఆలోచిస్తూ నడుస్తున్నాడు. మరికొంచెంసేపు నడిచి ఇంటికి వెళిపోయాడు.

సావిత్రి ఉమాకాంతంఇంటికి వెళుతూన్నట్టుగా సావిత్రితండ్రికి సవతితల్లి చెప్పింది. తండ్రి సావిత్రి నడిగాడు "నిజమేనా?" అని. సావిత్రి మాట్లాడలేదు. "ఈ బొమ్మకి చట్రం ఎవరు కట్టించారు?" అన్నాడు తండ్రి. సావిత్రి మాట్లాడలేదు. తండ్రి ఆ పటం తీసి చట్రం అద్దం బద్దలుకొట్టి పారేశాడు. "ఈ మారు ఇంట్లోంచి కదిలేవంటే చూడు, పక్క ఎముకలు విరగకొడతా" అంటూ చూపుడు వేలు కదిలించాడు. సవతితల్లి సావిత్రి ఇంట్లో పనులు తిన్నగా చెయ్యడంలేదనీ, ఏ పనిచేసినా పొరపాట్లే అనీ కొన్ని నేరాలు చెప్పింది. తండ్రి సావిత్రిని తిట్టి "ఈ మారు ఇంట్లోంచి కదిలేవంటే జాగ్రత్త!" అన్నాడు. సావిత్రి గదిలోకి వెళ్లిపోయి చాపమీద బోర్లా పడుకుని కుమిలికుమిలి ఏడ్చింది. మన్నాడు ఉమాకాంతానికి ఈ విషయం నూకమ్మ చెప్పింది. అతను గదిలో దొర్లిదొర్లి రాగాలు పెట్టాడు.

ఎవరికీ కనపడకుండా సావిత్రి ఒకసారి ఉమాకాంతంఇంటికి వెళ్లింది. "నన్ను ఎక్కడికేనా తీసుకుపొండి" అని అతనితో కన్నీళ్లతో చెప్పింది. ఉమాకాంతం ఆమెకన్నీళ్లు తుడిచి "అలాగే వెళిపోదాం. ఇంకా నువ్వు ఈడువచ్చినదానివి కాలేదు కాదూ. ఈడు వచ్చినవెంటనే పోదాం" అన్నాడు. సావిత్రి తలఊపింది. "ఈమారు నిన్ను కనక మీనాన్న కొడితే వాణ్ణి ముక్కలుచేసేస్తా" అన్నాడు ఉమాకాంతం. సావిత్రి ఉమాకాంతంనోరు నొక్కింది. ఉమాకాంతం ఆమెని కౌగిలించుకున్నాడు. సావిత్రి మరికొంచెంసేపు ఉండి ఇంటికి వెళిపోతా నని చెప్పి వెళిపోయింది.

సావిత్రి ఉమాకాంతంఇంటికి వెళ్లినట్టుగా సవతితల్లివల్ల తండ్రికి తెలిసింది. తండ్రి వాలుగు

తన్నాడు. "ఇంక దీన్ని ఈ ఊళ్లో ఉంచితే నా మర్యాద దక్కదు. విజయనగరంలో మా బావమరిది ఇంట్లో దిగబెట్టేస్తాను" అని నిశ్చయంతో అన్నాడు.

సావిత్రి ఆ విషయం ఉమాకాంతానికి తెలియపరిచింది. ఉమాకాంతం ఆమెతో "రేపు ఎవరికీ చెప్పకుండా బెజవాడ వెళిపోదాం" అన్నాడు. సావిత్రి ఒప్పుకుంది. ఉమాకాంతం అవసరమైన ఏర్పాటు లన్నీ చేసి సావిత్రికోసం ఎదురు చూశాడు. ఇద్దరూ బెజవాడ చేరుకున్నారు. కన్యకా అమ్మవారి సత్తరవులో మకాంచేశారు.

సావిత్రిఇంట్లో నానాగోలగానూ ఉంది. తండ్రీ, అతని మిత్రులూ కలిసి ఊరల్లా వెతికారు. ఉమాకాంతంకూడా ఇంట్లో లేకపోవడంవల్ల ఇద్దరూ కలిసి పారిపోయా రని ఊహించి నలుగురూ నాలుగు మూలలా రైళ్లమీద, బస్సులమీద, బళ్లమీద బయలుదేరారు. ఎలాగో ఆరాతీసి సావిత్రితండ్రి బెజవాడ చేరి సత్తరవులో ఉన్న సావిత్రిని పట్టుకున్నాడు. ఆ సమయాన్ని ఉమాకాంతం ఇంట్లో లేడు, బజారు పనిమీద ఊళ్లోకి వెళ్లాడు. సావిత్రితండ్రి సావిత్రిని బలవంతంగా బండిమీద కూచోబెట్టి తిరిగి రాజమహేంద్రవరం రాకుండా తిన్నగా విజయనగరం తీసుకుపోయాడు; బావమరిదిఇంట్లో దిగబెట్టేశాడు.

ఉమాకాంతం సత్తరవుకి వచ్చి ఉట్టిగది చూసి, సంగతులు తెలుసుకొని, దుఃఖించి రాజమహేంద్రవరం వచ్చేశాడు. సావిత్రి ఊళ్లో లేదు. క్రమేపీ ఆమె విజయనగరంలో ఉంచబడ్డట్టు విషయం తెలిసింది. విజయనగరం వెళదామని తొందరపడ్డాడు. తన దగ్గిర దమ్మిడీ లేదు. ఎలాగ దేవుడా అంటూ అతను చింతలో మునిగిపోయాడు. తనవిషయం తలచుకుని తలచుకుని గది అంతా దొర్లి దొర్లి ఏడ్చాడు. సావిత్రి తండ్రిని చంపేద్దామనుకున్నాడు. మొదట సావిత్రిని కలుసుకోవాలని తొందరపడ్డాడు. తన దగ్గిర డబ్బు లేదుకదా, ఈ గండం తప్పడ మెలాగ?

ఒకనాటి సాయంత్రం విచారంగా ఇల్లు కదిలి షికారువెళ్లి ఆలకట్టుతోటల అవతల గోదావరిఒడ్డున కూచున్నాడు. దూరాన్ని ఎవరో ఒకాయన కూచున్నాడు. ఉమాకాంతం తన మనస్సులో ఎర్రటి సూర్యుడు తన్ను వెక్కిరిస్తున్నా డనుకున్నాడు. అరుస్తూ వెళుతూన్న కొంగ తన్ను వేళాకోళం చేస్తూన్నట్టుగా కనబడింది. చలిగాలి తననే ప్రత్యేకంగా గుచ్చుతూన్నట్టు అతనికి అనిపించింది. అతను దిగులుతో మరికొంచెంసేపు కూచుని అక్కడ ఉండడానికి ఇష్టపడక, లేచి, ముందుకి నడక సాగించి దూరాన్ని కూచున్న మనిషిదగ్గరికి వెళ్లాడు. అక్కడ పాతికేళ్ల యువకు డున్నాడు. అతని మొహం అమాయికంగా కనబడింది. తన మొహానికీ అతని మొహానికీ ఉండే వార చూసి ఉమాకాంతం నివ్వెరపోయాడు. ఉమాకాంతానికి అతని దగ్గిర కూచోడమే కొంతభారం తగ్గేటట్లు కనబడగా ఆ కొత్తమనిషిఅనుజ్ఞ లేకుండా అతనిపక్కని కూచున్నాడు; తాను ఎరగని కొత్తమనిషిదగ్గిర కూర్చున్నందుకు ఆశ్చర్యపడ్డాడు. ఇంతట్లో కొత్తాయన "తమ దేవూరు?" అన్నాడు. "నాది ఈఊరేనండి" అని జవాబుచెప్పి "తమదో?" అని అడిగాడు. "నాదీ ఈఊరే" అన్నాడు ఆయన. ఉమాకాంతం మొహంలోని దీనత్వంలోంచి చిరునవ్వు తొంగిచూసి మాయమయింది. మరోక్షణం ఊరుకుని ఉమాకాంతం "నా స్నేహితు డొకడున్నాడు. అతని దీనదశవల్ల నాకడుపులో తీరని బాధగా ఉంది. ఆ కథ చెప్తాను వింటారా?" అని అడిగాడు. కొత్తాయన ఊఁకొట్టాడు. ఉమాకాంతం ఇలాగ చెప్పాడు: "నేనతని కథ రెండు ముక్కల్లో చెప్తాను. అంతకంటె చెప్పడానికి నాకు చాలా బాధగా ఉంటుంది. ఈ రెండు ముక్కలయినా నే నెంతో ఓర్చుకుని చెప్తున్నా" అన్నాడు.

కొత్తాయన ఉత్కంఠతో చూశాడు.

ఉమాకాంతం "నా స్నేహితుడు చిత్రకారుడు. అతను ఈడురాని ఒక పిల్లని వలచాడు. ఆ పిల్ల అతన్ని వలచింది. ఇద్దరూ ఈ ఊళ్లోనే ఉన్నారు. ఆ పిల్లతండ్రికి ఆ విషయం తెలిసి ఆ అమ్మాయిని విజయనగరం పంపించేశాడు. నా స్నేహితుడి ఏడ్పు చూడలేక నేను ఇలాగ వచ్చేశాను. అతను విజయనగరం వెళతా నంటున్నాడు" అన్నాడు.

"అయ్యో! ఎంతపని! తండ్రివల్ల జరిగిన అపకారమా ఇది! మీరు చెప్తేనే నా మనస్సులో ఎంతో విచారంగా ఉంది. మీ స్నేహితుణ్ణి కంటితో

చూస్తున్న మీకు ఎంత బాధగా ఉంటుందో చెప్పాలా!" అన్నాడు విచారంగా.

"నా స్నేహితుడు విజయనగరం వెళతానంటున్నాడు. వాదగ్గిర కానీ లేదు. డబ్బు ఇప్పట్లో వచ్చే సూచనలు లేవు" అన్నాడు ఉమాకాంతం దుఃఖంతో.

"నేనూ భాగ్యవంతుణ్ణి కానుగాని, నాకు చేతనయినంత సహాయం చేస్తాను. క్రమేపీ నా సొమ్ము నాకు ఇద్దురుగాని" అన్నాడు కాత్యాయన.

"భగవంతుడే మిమ్మల్ని నాకు చూపించాడు. అంతకంటే ఏమీ చెప్పను" అన్నాడు ఉమాకాంతం విచారమేఘాన్ని చీల్చుకువస్తున్న ఆనందంతో.

"ఒక పదిరూపాయిలు సరిపోతాయా?"

"పని జరగడానికి చాలు"

"నాతో మాఇంటికి రండి, సొమ్ము ఇస్తాను." అన్నాడు కాత్యాయన; అంటూ లేవబోయాడు. అతన్ని చెయ్యిపట్టుకుని ఉమాకాంతం ఆపి "నేను ఆడిన చిన్న అబద్ధానికి నన్ను క్షమించండి. నా దీన స్థితి నేను మీతో తిన్నగా చెప్పుకోలేక ఒక స్నేహితుడి పేరు పెట్టి చెప్పాను. ఆ స్నేహితుడు నేనే. దీనికి నన్ను క్షమించాలి" అన్నాడు దీనంగా.

ఆకల్పనకి ఆయన అత్యాశ్చర్యపడ్డాడు. "ఔను నిజమే. మొదట్లో చెప్పుకోడానికి సిగ్గువేస్తుంది. మీరేనా! నాకు మరీ జాలివేస్తూంది. నాతో ఇంటికి రండి. పైకం ఇస్తాను" అని చెప్పాడు సానుభూతితో.

ఉమాకాంతం ఆయనతో "మిమ్మల్ని చూసినప్పుడే ఎంచేతో మీకు నాకథ చెప్పాలనిపించింది. భగవంతుడలా దోవ చూపించాడు" అన్నాడు ఆనందాశ్రువులతో.

కాత్యాయన "ప్రేయసుల యొక్క ఊహాసౌధాలే ఇటువంటి కొన్నిటికి కారణం. వాళ్లు ప్రతీదాన్నీ అనుమానించి ప్రయత్నం మానుకోరు. వారి ఊహే కొన్ని విషయాల్లో రక్షిస్తుంది" అన్నాడు ఉత్సాహంతో.

దారిలో ఉమాకాంతం కాత్యాయనపేరు కనుక్కున్నాడు. ఆయనపేరు చంద్రశేఖరరావు.

కొత్తమిత్రుడిచ్చిన డబ్బు పుచ్చుకుని ఉమాకాంతం ఆ రాత్రి పాసెంజరు అందుకుని విజయనగరం వెళ్లాడు. కౌమకుత్రివారి సత్రవులో దిగాడు. సావిత్రి మేనమామ ఇల్లు కనుక్కొని వెళ్లాడు. మేనమామ ఇంట్లో ఉన్నాడు. అతను ఉండగా తాను వెళ్లడం వ్యర్థమని తలచి తిరిగి బసకి వచ్చేశాడు.

సావిత్రి మేనమామ ఆ ఊళ్లో సంస్థానంఇలాఖాలో ఓవర్‌సీరుగా పనిచేస్తున్నాడు. ఆ నెలలో అతను ఇంకా ఊళ్లవెంబడి వెళ్లలేదు. మరినాలుగు రోజులికి సర్క్యూటు వెళిపోయాడు. ఇంట్లో అతని భార్య, చిన్నకొడుకు, సావిత్రి ఉన్నారు. ఉమాకాంతం వాళ్ల ఇంటికి వెళ్లాడు. ఉమాకాంతాన్ని చూసి సావిత్రి తన ప్రాణం తిరిగివచ్చినట్టుగా ఆనందించింది. చుట్టుపట్ల ఎవరూ లేకపోగా అతన్ని కౌగిలించుకుని ఏడ్చింది. ఉమాకాంతం ఆమెయోగక్షేమాలు తెలుసుకొని ఆనందించాడు. ఇంతట్లో ఇంటిలోంచి ఆమెఅత్త వచ్చింది. సావిత్రి ఆమెతో "మా ఇంటి ఎదుట ఉన్న మానాన్న స్నేహితులు. మా ఇంట్లో మనిషిలాగే మెసులుతూ ఉంటారు" అని చెప్పింది. అత్త సంతోషించింది. అత్త యొక్క బలవంతంమీద ఉమాకాంతం ఆ ఇంట్లో రెండురోజులున్నాడు. సావిత్రి స్వర్గసుఖం పొందింది. ఉమాకాంతం తన దుఃఖాలన్నీ మరిచిపోయాడు. అతను ఆ ఊళ్లో బసలో మరినాలుగురోజులుండి అప్పుడప్పుడు వచ్చి సావిత్రిని చూస్తూండేవాడు. సావిత్రి వివాహం సంగతి అడిగింది. త్వరలోనే చేసుకుందా మని చెప్పాడు అతను. సావిత్రి విజయనగరంలో సుఖంగా ఉంటూన్నందుకు సంతోషించి రాజమహేంద్రవరం వచ్చేశాడు.

ఉమాకాంతం చంద్రశేఖరరావుతో సావిత్రిని గురించి చెప్పి ఆనందించాడు. మిత్రుడి ప్రయత్నం కొంత సఫలమయినందుకు చంద్రశేఖరరావు సంతోషించాడు. ఉమాకాంతం సావిత్రిబొమ్మని చూసి, ఆమె వెనక రాసిన ప్రేమలేఖ చూసి ఆమెని చూసినట్టుగానే ఆనందిస్తూ కాలం గడుపుతున్నాడు.

ఒకనాడు ఉమాకాంతానికి సావిత్రి దగ్గిరనుంచి జాబొకటి వచ్చింది. ఆ జాబు చదివి అతను దుఃఖం పట్టలేకపోయాడు. ఉమాకాంతం విజయనగరం వచ్చినట్టు అక్కడివాళ్లకీ, ఇక్కడివాళ్లకీకూడా తెలిసి తనకి మరింత ఖాయిదా జరుగుతూందనీ, అంచేత ఈ మాటు విజయనగరం వచ్చినప్పుడు అందరికీ కనపడవద్దనీ, తనకి

తన తండ్రి ఒక సంబంధం కుదిర్చాడనీ, అంచేత తనని వేగిరమే అక్కడినుంచి తీసుకుపోవలసిందనీ, కార్డు దొరక్క ఈ ఉత్తరం రాయడమే ఎంతో కష్ట మయిపోయిందనీ సావిత్రి ఆ ఉత్తరంలో రాసింది. ఉమాకాంతం దుఃఖించి ఆజాబు తీసుకువెళ్లి చంద్రశేఖరరావుకి చూపించాడు. సంగతులు తెలుసుకొని అతను కూడా దుఃఖించాడు. ఉండే పరిస్థితుల్లో ఏమి చెయ్యడానికీ తనకి తోచడం లేదనీ, చెయ్యవలసిందేమిటో చెప్పమనీ ఉమాకాంతం కోరాడు. మిత్రుడు ఇలాగ చెప్పాడు: "నువ్వు ఆ అమ్మాయిని విజయనగరంనుంచి ఇక్కడికి తీసుకురా. పిల్ల ఉత్తారుగా ఉంటుంది కాబట్టి పదహారేళ్లుంటాయని చెప్పి వీరేశలింగంగారి తోటలో రహస్యంగా పెళ్లి జరిపిద్దాం." ఈ ఆలోచన ఎంతో చక్కగా కనబడింది ఉమాకాంతానికి. అతను అప్పటికి ఇంటికి వెళిపోయి సాయంత్రం ఒక తైలవర్ణ పటంతోటి చంద్రశేఖరరావుదగ్గరికి వచ్చాడు. "ఈ మధ్య నేను చేసిన పని ఇది. నువ్వు నాకు చేసిన సహాయానికి నేను చెయ్యగలిగిన పని ఇది" అని ఆపటం చంద్రశేఖరరావుకి నేమానిగా ఇచ్చాడు. అది చంద్రశేఖరరావు బొమ్మ. నడుంవరకూ ఉన్నది. చంద్రశేఖరరావు తన ప్రతిరూపం చూసి మిత్రునియొక్క చిత్రకళా నైపుణ్యానికి ఆశ్చర్యపడి "మొదట మనం చూడవలసింది సావిత్రిని ఇక్కడికి తీసుకురావడం. ఆ విషయమై నీకు ఇప్పుడు ఎంత కావాలో చెప్పు, ఇస్తాను" అన్నాడు. ఉమాకాంతం పదిహేనురూపాయిలు కోరాడు. చంద్రశేఖరరావు వెంటనే ఇచ్చాడు. ఉమాకాంతం అప్పుడే రైలుకి బయలుదేరాడు.

ఉమాకాంతం విజయనగరం కూడా వెళ్లి సావిత్రిని కలుసుకున్నాడని సావిత్రితండ్రికి తెలియగానే అతను అత్యాశ్చర్యపడి, సావిత్రికి పెళ్లిసంబంధం కోసం మరింత త్వరపడ్డాడు. తండ్రి వైదికవృత్తిలో ఉండి, స్కూల్ ఫైనల్ పాసయిన ఒక యువకుడికి — అతని పేరు రామబ్రహ్మం, అంటే మామిత్రుడు — ఆమె నిచ్చి పెళ్లి చెయ్యదలచుకున్నాడు. సావిత్రికి పెళ్లిమాట చెప్పకుండా, ఆమెకి వరుణ్ణి చూపించకుండా సంబంధం సిద్ధంచేసి, ఆమెని విజయనగరంనుంచి రాజమహేంద్రవరం తీసుకువచ్చాడు. మొగపెళ్లివారంతా రాజమహేంద్రవరం వచ్చారు. ఈ స్థితి అంతా ఉమాకాంతానికి తెలిసిందో లేదో అని సావిత్రి దుఃఖించింది. ఆమె కేవలం బందీగా ఉంది. ఎటు పోవడానికి, ఏమి మాట్లాడడానికి, ఏమి చెయ్యడానికీ ఆమెకి స్వేచ్ఛ లేదు.

ఉమాకాంతం విజయనగరం వెళ్లాడు. అక్కడ సావిత్రిసంగతిగాని, వాళ్లు ఎక్కడికి వెళ్లిన విషయంగాని చెప్పినవాళ్లు లేరు. అతను ఈ మోస్తరుగా నాలుగైదురోజులు ఆ ఊళ్లో గడిపి రాజమహేంద్రవరం వచ్చాడు సంగతులు తెలుసుకుందామని.

రామబ్రహ్మంతో సావిత్రికి ఏకరాత్రి వివాహం జరిగింది. ఈ విషయం తెలిసిన ఉమాకాంతం దుఃఖసముద్రంలో మునిగిపోయాడు. అతను చంద్రశేఖరరావుదగ్గరకి వెళ్లడం మానేశాడు.

వివాహ మయినవెంటనే సావిత్రిని తండ్రి మళ్లా విజయనగరం పంపేశాడు. ఉమాకాంతం ఉన్మత్తుడిలాగ తిరుగుతూ రాజమహేంద్రవరంలోనే ఉండిపోయాడు.

మరి మూడునెల్లకి సావిత్రి పెద్ద మనిషయింది. అయిన వెంటనే రామబ్రహ్మం కార్యంచేసుకుని తన ఊరు తీసుకుపోయాడు.

దసరాపండగకి సావిత్రి రాజమహేంద్రవరం వచ్చింది. ఉమాకాంతం ఎంతో ప్రయత్నం చేసి ఆమెని కలుసుకుని "మరి, మనం ఏమిటిచేద్దాం ఇప్పుడు? నీఅభిప్రాయం చెప్పు" అని అడిగాడు. కాని సావిత్రి "అమాయికంగా నన్ను వివాహమాడిన అయన్ని నేను మోసం చెయ్యను. నానుదుటిరాత ఇంతే" అని ఇంట్లోకి చరున వెళిపోయింది. ఉమాకాంతం స్మృతి లేక కొంతసేపు నిలుచుని, తెలివి తెచ్చుకుని, విచారంతో వెళిపోయాడు.

నాటికీ నేటికీ ఉమాకాంతం వివాహం చేసుకోలేదు. తన దగ్గర ఉన్న సావిత్రిబొమ్మనీ, సావిత్రి ప్రేమలేఖనీ రహస్యంగా ఆరాధిస్తూ కాలం గడుపుతున్నాడు.

కావ్యాల పేర్లు

== శ్రీ జమ్ములమడక మాధవరామశర్మ ==

ప్రకృతకాలంలో కవితాప్రవాహవిహారము చేస్తూ ఉన్న కొందరు ఉత్తరంగ భావకులు తమ రచనకు పేరుపెట్టటంలో క్రొత్తదనంచూపించాలని ప్రయాసపడుతున్నారు. పూర్వం ప్రసిద్ధంగా ఉన్న పేర్లు మనోహరంగా ఉన్నా వానిలో ప్రాతదనం ఉన్నదని ఏవగించుకొనే రింఛోళిత హృదయులు లేకపోలేదు. ఒక్కొక్క కవి కవితలు ముం చెత్తుతాడు. పేరు కుదరదు. అందువలన చుక్కలుపెట్టి చూపిస్తాడు. ఘుణాక్షర న్యాయంగా కొందరకు పేరు కుదురుతుంది. అక్కడ కవితలో సౌరభం ఉండటం లేదు. కాలగతినిబట్టి కవిత దుముకుదుముకుగతులతో పోతున్నది. ఆ కవితాకన్యకు రెండే కళ్లు ఉంటే ఒకటి కాణమయింది. కాబట్టి సరిగా చూచుకోవటం ఎట్లాగో తెలిసికో లేకపోతున్నది. ముందు దూకటంలో వెనకగతిని అందరూ సామాన్యంగా మరచిపోవటం వలన కలిగేది అనర్థమే అని కొంద రనుకోక తప్పటం లేదు. ముందుకు దూకటానికి వెనుకకు నాలుగడుగులు వెయ్యటము అవసరమని ఆ వేగంలో తెలుసుకోకపోయినా వేరొక పర్యాయము గుర్తుపెట్టుకోవటము అస్వాభావికము కాదు. సాహితీసాగరాన్ని మథించి అనేక రత్నకాంతుల్ని అందజేసిన మహనీయుల్ని ప్రాచీను లని వెగటు పొంద కుండా భావించితే అలౌకిక రూపంతో దర్శనం ఇచ్చి వారు అపేక్షితమును నెరవేర్చుతా రని నమ్మక మున్నది. నాలుక మెత్తనిదైతే ఏదైనా సుకుమారమైన పేరు పెట్టుకొం టాము. అది ఏరకానికి చెందిన కావ్యమో తెలుసుకోలేక మిటకరించి ఏదో అను కోవటంకంటె కొంత సింహావలోకనము చేయటమువలన సహృదయత్వానికి లోటు రాదు. మన హృదయాలలో సాహితీసుధాకణాలను ముద్రించిన ప్రాచ్యమేధావులు కావ్యకుంజ ములో ఎన్నిరకాల సుమాలను ఎత్తిచూపించారో భావించి తద్వాసనావాసితాంతఃకరణ మృదులత్వమును సంపాదించుట సముచితంగా ఉంటుంది.

అలంకారశాస్త్రగ్రంథాలు సామాన్యంగా అన్నికావ్యాల పేర్లనూ నిరూపించు తూనే ఉన్నవి. ధ్వన్యాలోకము, కావ్యానుశాసనము, ప్రతాపరుద్రీయము, మందార మరందచంపువు, అగ్నిపురాణము, సాహిత్యదర్పణము మొదలయిన ప్రత్నగ్రంథరత్నాలు ఇప్పటి నవవిధానానికి మంచి మార్గాలను బాగా చూపించినవి. వానినీ, అట్లాంటివానినీ ఆధారంగా చేసుకొని నవ్యులు కావలసినవానివిషయమై భిక్షుకవృత్తిని అవలంబించటము మంచిది. కొన్ని ప్రసిద్ధకావ్యాల స్వగతభేదస్వరూపవిజ్ఞానము అపరిచితం కాదు. అయినా ప్రణాడీసరసతకు పతంగప్రసారము చేయవచ్చు. దీనివలన ఏకవాక్యతాఫలము కలగటా నికి కూడా అవకాశముంటుంది.

౧. ధ్వని

శబ్దార్థములు అప్రధానాలు కావాలి. వ్యంగ్యార్థము సర్వాతిశయితంగా ఉండాలి. కవి వ్యంగ్యప్రధానమతి అయినప్పుడే కావ్యానికి ఈ పరసనామ సిద్ధి కలుగుతుంది. ఏమాత్రమైనా వ్యంగ్యార్థ తత్పరత్వ విషయంలో మైమరచి శబ్దవిన్యాసంమీదగాని, అర్థనిబంధనంమీద గాని తన బుద్ధిని ప్రసరింపజేశాడో అప్పటి కావ్యము ధ్వనికావ్యము అనే పేరు పొందలేదు. తా నా పేరు పెట్టుకొంటే నవ్వు వస్తుంది.

౨. గుణీభూతము

ఇందులో వ్యంగ్యార్థానికి సర్వప్రాధాన్యం ఉండదు. వాచ్యార్థముకూడా తన ప్రాధాన్యాన్ని పోగొట్టుకోదు. ఒక్కొక్కప్పుడు వ్యంగ్యమును కూడా వాచ్యము అసుందరముగా చేస్తుంది. తనకు అంగము చేసుకుంటుంది. తనతో సమానం చేయటం కూడా కద్దు. వ్యంగ్యార్థము వివక్షితము కావచ్చు కాని ప్రధానము కాకపోవటం మూలాన ఈ పేరు వస్తుంది.

3. చిత్రము

చిత్రము చిత్రమే. గోడమీద బొమ్మలను మనము చిత్రమంటాము. ఈకావ్యముకూడా అటువంటిదే. ప్రాణం లేకపోయినా ప్రాణం ఉన్నదాని మాదిరిగా కనపడటంమూలాన ఆశ్చర్యం కలుగుతుంది. ఈ విస్మయావేశంవలన "అరే! చిత్రంగా ఉన్నదే" అంటాము. అందువలన గోడమీద బొమ్మ చిత్రమయింది. చిత్రకావ్యం కూడా అంతే. కావ్యానికి వ్యంగ్యము జీవితము. చిత్రంలో జీవితం ఉండదు; చిత్రకావ్యంలో వ్యంగ్యం ఉండదు. అసలుండదని కాదు; వివక్షితంగా ఉండదు. ఇందులో వ్యంగ్యార్థాన్ని నిబంధించాలి అని కవి అనుకోడు. అతడనుకోకుండానే ఏదో నిస్సారవ్యంగ్యము వస్తే రావచ్చు. అందువలననే అది అక్కడ వివక్షితం కావటం లేదన్నమాట. దూరంగా వెళ్లితే రసవ్యంగ్యం ఉండవచ్చు కాని అదికూడా అవివక్షితమే. కాగా శబ్దమూ, అర్థమూ ఇందులో ప్రధానము లవుతవి. వీటిమీదనే కవికి ఆస్థ అధికంగా ఉంటుంది. శబ్దాడంబరమును బాగా చూపిస్తాడు. అర్థాలలోని చిత్రవిచిత్రగతులను చూపి నగిషీ చెక్కుతాడు. కాబట్టి శబ్దచిత్రం ఒకరకంగానూ, అర్థచిత్రం ఒకరకంగానూ ఇందులోనుంచి బయలుదేరుతవి. వీటిలో అవాంతర ప్రభేదాలు చాలా ఉండవచ్చు. విదగ్ధ ముఖమండనము, కవీంద్ర కంఠాభరణము ఈవిషయంలో చూడతగినవి.

ఈ చెప్పినవిధంగా కొందరు కావ్యవిభాగము చూపించారు. జగన్నాథపండితరాజు ఈ చెప్పుడుగాళ్లను కొంత కోప్పడుతాడు. ఆయన వీటినే నాల్గు రకాలుగా విభాగించుతాడు. ధ్వనికావ్యానికి ఉత్తమ కావ్యమనీ, గుణీభూతానికి మధ్యమ కావ్యమనీ, చిత్రానికి అధమకావ్యమనీ పైవారు పేర్లు పెట్టారు. జగన్నాథుడు చిత్రకావ్యాన్ని రెండుగా విభాగించుతాడు. విభాగించటమే మంచిదంటాడు. సహృదయులు ఇట్లాగే చేయాలంటాడు. మొత్తానికి ఉత్తమోత్తమము, ఉత్తమము, మధ్యమము, అధమము అని పేర్లుంచాడు. అర్థచిత్రత ఉంటే మధ్యమకావ్యము, శబ్దచిత్రత ఉన్నప్పుడు అధమకావ్యము అని జగన్నాథభావము. అధమాధమ మనే భేదము ఉండదట. అటువంటి దసలు కావ్యమే కాదంటాడు. మొత్తానికి ఈవిచ్ఛేదమే. కావ్యాలను విభాగించి చెప్పటంలో ఇది ఒక పద్ధతి. వేరొక విధంగాగూడా విభాగపరిశీలన చెయ్యవచ్చు.

i. పద్యకావ్యము

ఇందులో అన్నీ పద్యాలే. గద్య ఉండదు- 'ఇతిశ్రీ' చెప్పేచోట తప్ప. ఈకావ్యాన్ని సర్గలుగా విభాగిస్తారు. కావ్యము కన్య గాబట్టి ఆపిల్లకు మధ్య మధ్య ఆశ్వాసం ఇవ్వటం ఉచితమని కొందరు దయామతులు ఆశ్వాసవిభాగం చేస్తారు. సర్గలు కాని, ఆశ్వాసాలుకాని ఎన్నిఅయినా ఉండవచ్చు. ఒక్కొక విభాగములో ఇన్నే పద్యా లుండా లన్న నియమం లేదు. ఆ కవీశ్వరులవారు ఎంత సుక్కు పట్టగలిగితే అంతే. ఆయాసం వచ్చినప్పుడు ఆశ్వాసం తగ్గటం కూడా ఉంటుంది.

ii. గద్యకావ్యము

ఇందులో పద్యా లుండవు. అంతా గద్య ఉంటుంది. అక్కడక్కడ ఏదైనా చిన్న పద్యము కావ్యం వంజుకోవటానికి ఉన్నట్లుంటే ఉండవచ్చు. అంతమాత్రాన గద్యకావ్యానికి హానిలేదు. ఇందులో కావ్యకామిని అప్పుడప్పుడు అక్కడక్కడ ఉచ్ఛ్వాసాలు విడుస్తూఉంటుంది. ఆశ్వాసం ఉంటే ఉండవచ్చు. ఇవి ఏవీ లేకుండా ఒకటేపద్ధతిగా తీగ సాగవచ్చు.

iii. చంపూకావ్యము

ఇందులో గద్యతో పద్యమూ ఉంటుంది; పద్యంతోపాటు గద్యకూడా ఉంటుంది. "గద్యానుబంధ రసమిశ్రిత పద్యసూక్తిః హృద్యా" ట. మనము దీన్ని ప్రబంధమనవచ్చు. ఇందులో విభాగాలు యథేష్టంగా ఉంటవి. కాండవిభాగం, గుచ్ఛవిభాగం, స్తబకం, ఆశ్వాసం-ఇంకా ఔచిత్యానుసారంగా ఏవైనా సరే!

ఈ చెప్పినవి శ్రవ్యకావ్యవిభాగాలు. కావ్యము రెండురకాలు—శ్రవ్యకావ్యమనీ, దృశ్యకావ్యమనీ. ఈ విభాగపద్ధతి బాగా చిరప్రహత మైనదే. శ్రవ్యంకన్న దృశ్యం బాగుంటుంది. నిజమే మరి. మొత్తంమీద కావ్యము కామిని కదా! అందులోనూ శ్రవ్యము కన్య. బాగా యౌవనము పొంగలే దన్నమాట. సహృదయ హృదయాలకు కలుగవలసినంతగా శ్రవ్యకావ్య కన్యవలన కలుగదు కాబోలు. దృశ్యకావ్యం కూడా కామినే అయినా కన్యమాత్రం కాదు. ప్రౌఢ. పొంగుపొంగులతో ఉన్న తారుణ్యభరము ఆ కామినిలో ఉంటుంది. సహృదయ సరస పురుషాదరభర మే దృశ్యకావ్యకామినీ కమనీయత్వమును స్పష్టము చేస్తున్నదని భావించవచ్చు. ఈ శ్రవ్యదృశ్యకావ్యాలకే అనభినేయ కావ్యమనీ, అభినేయకావ్యమనీ కొందరు పేర్లుపెట్టారు. ఈ పేర్లు మనలను దాదాపు నాట్యం దగ్గరకు లాగుకొనిపోతున్నవి. సిద్ధహేమచంద్రుడు తన కావ్యానుశాసనంలో వేరొకవిధంగా కావ్యభేద పరిగణనం చేస్తున్నాడు. కావ్యము రెండువిధాలు—ప్రేక్ష్యమనీ, శ్రవ్యమనీ. ప్రేక్ష్యకావ్యం కూడా పాఠ్యమనీ, గేయమనీ రెండు విధాలుగా ఉన్నది.

౧. పాఠ్యము

ఇందు నాటక ప్రకరణాది రూపక ప్రభేదాలు అంతర్భావము పొందుచున్నవి. ప్రధాన రూపకాల పరస్పర సాంకర్యమువలన సిద్ధము లైన అవాంతర ప్రభేదాలుకూడా పాఠ్యముగానే పరిగణింప బడుతున్నవి. పాఠ్యకోటిలో చేరదగినవానిని హేమచంద్రుడు కొన్నిటిని చెప్పిచెప్పి 'ఆది' పదమును ప్రయోగించాడు. "ఆదిశబ్దాత్ కోలాహలాది లక్షితా స్తోటకాదయో గ్రాహ్యాః" అని ఇంకా అందించుతున్నాడు. పాఠ్యములో అంగగీతములు ప్రతిష్ఠితము లై ఉండవు. గేయములో ఈ రెండూ సుప్రతిష్ఠితములు కావటానికి అవకాశం ఉన్నది. పాఠ్యములో రసానుగుణత్వ మనే అడ్డంకి ఉండటంవలన అంగగీతములు విపర్యాసమును పొందవలసివస్తుంది. వర్ణాంగములు, వాద్యములు, గేయపదాలు, నృత్యము అన్నీకూడా గేయపదాలలో ఉండవచ్చును. కొన్ని రాగకావ్యాలను మొత్తానికి మొత్తం గానంచేయవచ్చు. ధ్రువాగీతాలకు సరిగా పాఠ్యాలలో అవకాశం ఉండనే ఉండదు. గీతముతో ప్రధానంగా రంజనమును సంపాదించుట, తదుపయుక్తమైన అంగవ్యాపారమును ప్రదర్శించుట, నృత్యములో చిత్తగ్రహణము చేస్తూ నృత్యమునే ప్రధానంగా చేస్తూ గీతమును అప్రధానముగా చేయుట, ప్రధాన రసానుసారంగా, లయతాలానుగుణంగా సాత్త్వికాద్యభినయాన్ని సంపాదించే విధానాలు మొదలయినవన్నీ గేయములోనే ఉంటవికాని పాఠ్యములో ఉండవు. కాని పాఠ్యములో వృత్త్యనుసంధానము ఉంటుంది. భరతాదు లందరూ వృత్త్యనుసంధానమును నిబంధనముగా చేసికొని ప్రవృత్తిని ప్రసరింపజేశారు. గేయములో నృత్య నృత్తవాద్య ధ్రువాంగ గీతాదిభేదా లున్నప్పటికీ వృత్త్యనుసంధానము లోపించుచున్నది.

౨. గేయము

పదార్థములను అభినయించే స్వభావము గేయములలో ఉంటుంది. గేయకావ్యాలలో ప్రయోగము సామాన్యంగా మూడువిధాలు—మసృణము, ఉద్ధతము, మిశ్రమము అని. ఉపరూపకము లనబడేవి సామాన్యంగా గేయకోటిలో చేరుతవి. గేయములుగా చెప

దగినవి చాలా ఉన్నట్లు ఊహించాలి. హేమ చంద్రుడు డోంబిక మొదలుగాగల ౧౩ భేదాలను సూచించాడు. తృప్తిపడలేక 'ఆది' అన్నాడు. శమ్యా, ఛలిత, ద్విపద్యాదులు 'ఆది' పదానికి అర్థమట. అక్కడకూడా ఇంకా 'ఆది' ఉన్నది. వీటి స్వరూపము బాగా తెలియాలంటే "ప్రపంచస్తు బ్రహ్మభరత కోలాహలాది శాస్త్రేభ్యోఽవగంతవ్యః" అంటాడు. గేయరచనలను గురించిన కలకలము మన నిూ కాలంలో కొంత వింటున్నాము. మనము గేయములని అనుకునేవానికీ, అలంకారికులు చెప్పిన గేయాలకూ పరస్పర సంబంధ బాంధవ్యాలను పరిశీలించట మవసరం. ఆ పరిశీలనలో సిద్ధభావాలను వెదుకుకొన్న తరువాత ఆయా పేర్లతో వ్యవహరించటము సముచితంగా ఉంటుంది.

౩. మహాకావ్యము

ఇది శ్రవ్యకావ్యాలలో ఒకటి. దీని స్వరూపము మనకు సుప్రసిద్ధముగా ఉన్నది. అయినా హేమ చంద్రుని ఉపపాదన చూస్తే ప్రత్యేకంగా ఒక విశిష్ట రచన అపేక్షిత మనిపించుతుంది. నాటకాదులలో మాదిరిగా ముఖాదిసంధులు మహాకావ్యంలోకూడా ఉండాలి. అప్పుడే కథాగమనిక జిగితో ఉంటుంది. ఇందులో అవాంతర విభాగాలను అనేకవిధాల చెయ్య వచ్చు—సర్గ, ఆశ్వాసము, సంధి, అవస్కంధక, బంధము అని. ప్రతి బంధాంతంలో భిన్నవృత్తము ఉండటము మామూలు. అష్టాదశవర్ణనలు మహాకావ్యంలో ఉండాలనుట సామాన్యలక్షణము. వాటిలో కొన్ని తగ్గినా మహాకావ్యత్వానికి లోటు రాదు. మహాకావ్యము యొక్క విశిష్టలక్షణాలు సవిశేషంగా తెలియ దగినవి.

౪. ఆఖ్యాయిక

నాయకుడు తన వృత్తాంతమును ప్రతిపాదించుకోవాలి. వక్త్రము, అపరవక్త్రము అనే ఆర్యావృత్తాలు ఇందులో నిరూపింపబడుతవి. ఆ వృత్తాలు భావ్యర్థాన్ని సూచించేవిగా ఉండాలి. అవాంతర ప్రకరణాల పరిసమాప్తి వచ్చినప్పుడు ఉచ్ఛ్వాస నిబంధనము చేయాలి. గద్యమయంగా ఉండాలి. అక్కడక్కడ పలచపలచగా పద్యాలున్నా దోషంలేదు.

౫. కథ

ఇది గద్యమయము. అంతా పద్యమయంగా గూడా ఉండవచ్చునట. గద్యమయమైన కథకు కాదంబరి ఉదాహరణం. పద్యమయ కథకు లీలావతి ఉదాహరణమట. అది మనకు ఎప్పుడు దృష్టిగోచర మవుతుందో? నాయకుడు ధీరశాంతుడు. ఇతని కథను కవిగాని, యితరులుగాని చెప్పాలి. కథలలో అవాంతర భేదాలు చాలా ఉన్నట్లు ఊహించాలి.

౬. ఆఖ్యానము

ప్రబంధమధ్యములో ఇతరుల ప్రబోధం కొఱకు కొన్ని ఉపాఖ్యానములు చెప్పబడుతూ ఉంటవి. నలాదుల ఉపాఖ్యానాలు అటువంటివే. ఈ చెప్పబడే ఉపాఖ్యానమును ఒక గ్రథికుడు అభినయించుతూ, పఠించుతూ, గానం చేస్తూ చెప్పటము ఆఖ్యానమనబడుతున్నది.

౭. నిదర్శనము

చేతనాచేతనముల చేష్టలను అనుసరించి కార్యము అకార్యములు నిశ్చయింపబడాలి. కర్తవ్యాకర్తవ్య ప్రబోధమునే ప్రధానంగా చేసుకొని నిదర్శన నిబంధకుడు నిదర్శనరూపంగా తిర్యగతిర్యక్కుల చేష్టలను నిబంధించుతాడే గాని వానిచేష్టలలో అభినివేశమును ఉంచడన్నమాట. పంచతంత్ర మిటువంటిదే.

౮. ప్రవహ్లిక

ఒక మహాసభానిబంధనము — అందులో ఇద్దరి వివాదము. ఆ పోట్లాటగూడా ప్రధానాంశమును సంబంధించి ఉండాలి. నిరూపింపబడే భావకంటే ఇతర భాషాసంబంధంకూడా ఉండాలి. అప్పటి సంకీర్ణత్వములో ఒకరి భావ ఒకరికి తెలియకుండాకూడా ఉంటుంది. కాబట్టి వివాద బాగా జ్వలించుతుంది.

౯. మతల్లిక

ఇదే మంథల్లి, మంథల్లిక అనికూడా వ్యవహరింపబడుతున్నది. సంకీర్ణ నీచభాషానిబంధనము, క్షుద్రమైన కథ. పురోహితామాత్య తాపసాదులు ప్రారం

ఖించిన కార్యమును నిర్వహించలేకపోవటము, తన్ని మిత్తోపహాసము ఉండాలి.

౧౦. మణికుల్య

రచన బిగువుగానే ఉంటుంది. కాని మొదట్లో వస్తు వేమీ గోచరంకాదు. కథ ఎక్కడ ప్రారంభింప బడిందో, ఎక్కడికి పాఠకుణ్ణి తీసికొని పోతున్నదో ఏమీ తెలియదు. అంతా మొదట్లో అయోమయంగా ఉంటుంది. తరువాతతరువాత కథ బయటపడుతుంది. మణికుల్య(కాలవ)లో జలం కనపడకుండా. పరిణామంలో స్వభావం తెలుస్తుంది. కథామూర్తిము మధ్యలో స్వీకరించటము ఉంటుం దన్నమాట. కథలో బిగువున్న దని చేకు మనము తలచే నవలలు మణికుల్యలు కావచ్చునేమో.

౧౧. పర్యాయబంధము

వసంత వర్ణనము మొదలైనవి ఉండాలి. అవాంతరంగా అనేకక్రియల సంబంధం ఉన్నా ఏక వర్ణనో ద్దేశము ఉండాలి. ఏ ఋతువుల వర్ణన ఉన్నా ముఖ్యాంశ సంబంధము మాత్రం విడిపోరాదు. వర్ణిత విషయము ప్రధానాంశము నందించాలి.

౧౨. పరికథ

ధర్మాది పురుషార్థాలు ఉద్దేశింప బడాలి. ఉపసాధనలో విచిత్రత ఉండవచ్చు. నానావృత్తాంత వర్ణనములు ప్రధానత్వం పొందాలి. అంతగా రసబంధాభినివేశము అక్కరలేదు. ఇతివృత్తవ్యాహరణమే ముఖ్యం. అందుకనే దీర్ఘసమాసంకూడా ఉండవచ్చు.

౧౩. ఖండకథ

గ్రంథాంతరములో ప్రసిద్ధమైన ఇతివృత్తాన్ని తీసుకొని వర్ణించాలి. ఆ కథను మధ్యలోనుండిగాని, ఉపాంతమందుండిగాని గ్రహించవచ్చు. ఖండాత్మకంగా గ్రహించిన వర్ణనాచాతుర్యంతో పూర్ణంగా చెయ్యాలి.

౧౪. సకలకథ

సర్వఫలాల స్వభావసుందరత్వము కలిగిన ఇతివృత్తమును వర్ణించాలి. ఖండకథా సకలకథలు సామాన్యంగా సంస్కృత భాషాత్మకంగా ఉండవట.

౧౫. ఉపకథ

ఏదో ఇతరకథ నాశ్రయించినా చమత్కారాతిశయానుసారంగా ప్రసిద్ధమైన వేరొక కథా నిబంధనము చెయ్యాలి. రెండు కథలకూ అంగాంగిభావం కుదురుతుంది. రెండూ సమన్వయము పొందాలి.

౧౬. బృహత్కథ

అద్భుతాద్భుత కథల నిబంధనం ఉండాలి. ఏకకథను ప్రధానం చేసుకొనిన అనేకకథల కూర్పు శోభించాలి. అవాంతర కథలుకూడా పరిపూర్ణత్వము కలవి కావాలి. ఈ చెప్పినవి సామాన్యంగా అన్నీ కథల ప్రభేదాలే.

ఈ చెప్పబడిన కావ్యాల పేర్లకు లక్ష్యముగా గ్రంథాల పేర్లు మాత్రం కనబడుతున్నవి. లక్షణ స్వరూప నిర్వచనంకూడా తగినంత సమర్థంగా లేదు. ఆ గ్రంథాలు ఎప్పుడైనా దొరికితే స్వరూపవిచారణము చేయటానికి అవకాశం ఉంటుందేమో. వీటి తత్వమును చక్కగా పరిశీలనం చేస్తే ఈనాడు క్రొత్తక్రొత్త కావ్యప్రభేదాలని కొందరనుకొనేవి అన్నీ వీని కౌగిలింతలో ఇమిడి కలిసిపోతవనుకొంటాను. ఇప్పుడిప్పుడు వినపడే ఖండిక, గల్పిక అనేవి ఎక్కడి పేర్లో ఆలోచన చేయాలి. ఆ పేర్లు పెట్టవలసిన అవసరం ఉందో లేదోకూడా విచారణ చేయటం సముచితము. ఇప్పటిలో కొంతమంది పెట్టే పేర్లు తప్పులే అయితే ప్రచారంలోకి వచ్చినతరువాత వాటిని తొలగించటం ఇబ్బంది అవుతుంది. ఇప్పుడే జాగ్రత్తపడి నిర్దుష్ట నామకరణం చేయటమే బాగుంటుంది. ప్రకృతం ఎన్నిరకాల కావ్యాలు బయలుదేరినా, బయలుదేరబోతూన్నప్పటికీ వాటికి పేరులు పెట్టడంకోసం పేరుకల్పించవలసిన దుర్గతిగాని, ఇతర స్థలాలనుండి అప్పు తెచ్చుకోవలసిన దుర్భాగధేయం కాని మనకు లేదు. ఎన్నైనా రచించండి. పేరు పెట్టడానికి ఏమీ అభ్యంతరం లేదు. కాని ఆయా స్వల్పనియమాలనైనా చూడాలి. అన్నిటినీ కలిపి

కూటుచేయటం బాగుండదేమో అనుకుంటాము. ఇంకా కొన్ని క్షుద్రకాయ ప్రబంధాలను కొందరు నిరూపించారు. ఇవన్నీకూడా రచనా రమ్యతను, విన్యాస విచ్ఛిత్తిని మాత్రమే చూపించుతూఉన్నవి. కాని, వివక్షితార్థ విచిత్రతను గాని, భావరసబంధురత్వమును గాని ప్రదర్శించటం లేదు. కొన్ని కొన్ని అట్లా ప్రదర్శించేవే. అయినా వాటిలో ఇంకా నియతిశోభ బాగాలేదు. ఇకముందు సర్వాంగీణంగా ఉంటుందన్న ఆశ ఉన్నది. అల్పకాయంతో ఉన్నా లేని చుక్కలని చెప్పదగిన రచన లిప్పుడు లేకపోలేదు. వాటిని ఏ కావ్యకోటికి తగిలించాలో మనం సులభముగా గ్రహించవచ్చు. పరిశీలించటము మటుకు ఆవశ్యకము. సర్గబంధ నిబంధనము లేకపోతే ఉపకావ్యం అనాలిట. శతకాలు ఈవిభాగములలో చేరుతవి. ఖండకావ్య మనే పేరు కర్ణతాడితమవుతోంది. దీని స్వరూపాన్ని ప్రామాణికులు నిశ్చయించారు. ఏ కాంశమును ఉద్దేశించిన రచన ఉన్నపుడు సామాన్యంగా ఈ పేరు పెట్టుతున్నాము.

౧౭. ఉదాహరణము

గద్యపద్య సమన్వితం కావాలి. చంచత్పుటము మొదలైన తాళాల అనుగుణ్యం ఉండాలి. కలిక, ఉత్కలిక అనే పేర్లు కల గద్య లుంటవి. మొదట 'జయతి' అని ఉపక్రమం ఉంటుంది. మాలిన్యాది రమ్య పద్య నిబంధనము ఉండాలి. అనంతరము 'ఇతి' అని ఉపక్రమించి ఎనిమిదివాక్యములు ఉంచాలి. వీటిలో ప్రాసల పసందు భాసించాలి. తాళానుగుణ్యం తప్పదు. ఎనిమిది విభక్తులతో కూడుకొన్న అష్టవాక్యలకు నిబంధనం ఉండాలి. విభక్తులు అని అనిపించే విభక్త్యాభాసాలకు స్థానం ఇవ్వాలి. వీటిలో వర్ణింపబడే నాయకుని నామాంకనము అవసరము. సర్వ విభక్తులతో ఒక పద్యముండాలి.

౧౮. చక్రవాళకము

పద్యా లుంటవి. సంబోధనవిభక్తి ప్రచురంగా ఉంటుంది. కళిక లనబడే గద్య లుండవచ్చు. విముక్త పునరాకృష్ట శబ్దవిన్యాసశోభను ప్రదర్శించాలి. ఆద్యంతపదాలు శృంఖలితములు కావాలన్నమాట. రచన ఓజస్విగా ఉండాలి. మొదటా, చివరా ఆశీర్వాదాలు.

౧౯. భోగావళి

మొదటా, చివరా పద్యాలు; మధ్యలో గద్యలు. భావ భిన్న భిన్నముగా ఉండాలి. గద్యలో నాలుగు వాక్యాలనుగాని, ఎనిమిది వాక్యాలనుగాని గుంపులు గుంపులుగా విభాగించాలి. ఇదే స్కంధవిభాగము. ప్రతి స్కంధమునకును విషయము వేరువేరుగా ఉండాలి. "దేవా — నృపా" అని మధ్యమధ్యలో సంబోధనలు. ఈ కాలములో యివ్వబడే స్వాగత పత్రాలకు యీ పేరు బాగా వుంటుంది. వర్ణ్యమానహాయక గుణాది వర్ణన ఉంటుందిగా! ఇంకా భోగోపకరణములుగా తలచబడేవానిని గూడా వర్ణనలో ఉట్టంకించవచ్చు. కావలసినవానిని సూచించటముగూడా భోగావళీ మర్యాద.

౨౦. బిరుదావళి

సామాన్యంగా ఇది భోగావళి మాదిరే. నాయకుని పరాక్రమం, కులక్రమాగత బిరుదాలు వర్ణింపబడాలి. వాక్యాల ఆడంబరము అవసరము.

ఇంకా తారావళి, చతురుత్తరము, చతుర్భద్రము, కరంభకము, విత్యావళి, రత్నావళి, పంచానవావళి, అకారాది హకారాంతాక్షరఘటన గల ప్రబంధసంపుటితో ఉండే సంఘాతము, నానాకవిక ర్తృకపద్యాలను ఒకచోట చేర్చటమే స్వరూపంగా ఉన్న సుభాషిత రత్నాగారమువంటి సంఘాతము మొదలైన కావ్య భేదాలు యింకా చాలా ఉన్నట్లు అగ్నిపురాణంవల్ల తెలుస్తున్నది. ఇప్పుడు ఈ నిరూపించిన స్వరూపము నిష్కృష్టం కాకపోవచ్చు. ఇందులో యింకా కతక భేదం కలపాలి. ముక్తకములు అనబడే అనిబద్ధ కావ్య భేదా లింకా వున్నవి. ఏ పద్యానికి ఆ పద్యము విడివిడిగా ఉంటుంది. ఇతర పద్యసంబంధం అక్కడ అక్కర లేదు. ఇటువంటివి ఒకచోట నిబంధింపబడకుండా ఉన్నప్పుడే ముక్తకము లని పేరు. ఒక గ్రంథంలో ఉన్నపద్యాలు కొన్ని ఇటువంటి లక్షణంతో ఉన్నా ముక్తకములు కావు. ఈ అనిబద్ధాలలో సందానితక, విశేషక, కలాపక, కులక, కోశాదిభేదాలు అనంతంగా ఉన్నవట. ఎప్పుడు తెలుసుకోగలుగుతామో?

జాతకము

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

అందఁగారాని పండ్లకు నఱ్ఱుచాఁచు
వెఱ్ఱితన మేల కొందువు; గొఱ్ఱెతోఁక
యేండ్లు పూండ్లు గతించిన నెంత పెరుగు
నంతె నీ జాతకం బది, వింత లేదు.

ఒకటి చేసియు రెండు కోరికలు సిద్ధి
యపొందవలె నన్న నది యెట్లు పొసఁగునయ్య?
పిండికొలఁదియె రొట్టెగా, పృథివి నీకు
దక్కవలసిన దేదియో దక్కుచుండు.

కడవ నేటను నూతను విడువ నంతె
నీటిఁ గైకొను, నెవ్వఁడు నియతితప్పి
దొడ్డఫల మందవలెనని గడ్డికఱచు
వానికన్నను మూఢుఁ డెవ్వాఁడు లేఁడు.

కానలో నొండెఁ గొండల కోనలందు
నొండె నుండిన నెవ్వని కున్న దేదో
వచ్చి ముంగాళ్లఁ బడి వాని ప్రాపు కోరు,
సిరి సమీపించు నెవ్వరు సెప్పఁగలరు?

లేదులేదని లేమిని లేకితనము
చూపఁగారాదు, సంతృప్తి చూపవలయు;
ఉన్న దొక్కింతయైన సమున్నతముగఁ
జూడనేర్చినవాఁడె పో సుగుణమూర్తి.

రాజమోహన హేరాయిలు



శ్రేష్ఠమయిన సువాసన గల తలనూనె. మెదడుకు చల్లదనమును కలిగించి వెంట్రుకలను అభివృద్ధి చేయుటలో అత్యుత్తమ మయినది.

తలపోటు, కూడు పోటు, శిరోవేడిమి, చుండు మొదలగువాటిని పోగొట్టి కన్నులకు చలవ నొసంగి వెంట్రుకలను మృదువుపరచి, నల్లగా పెంచుటలో అత్యుత్తమ మయినది.

స్త్రీలకు ఆనందమును కలుగజేయును.

సీసా 1-కి రు. 0-12-0 6 సీసాలు రు. 4-4-0

పోస్టేజి ప్రత్యేకము.

పి. శి. ఏ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం,

పెరిదేపి, నెల్లూరుజిల్లా.

వేటూరి–
సుందరశాస్త్రి గారి
వర్ణ సుందరరసము

సరసువా మేహములకు సంజీవి

గుణముప్రత్యక్షము
అనుభవసిద్ధము. ఇంజెక్షన్లు
అవసరంలేదు. ఎటువంటిసవా
మేహాలనైనా కుదుర్చును
చంమారుచ–

ఆంధ్రరసాయనశాల, ముక్త్యాల

ముఖమునకు వన్నె దెచ్చు
పరిమళద్రవ్యముతో కూడిన సబ్బు!



డిల్ బహార్ సబ్బు

(రిజిస్టర్డు)

కేవలము సాధారణమైన సబ్బుకాదు. చర్మమును ఎక్కువ పరిశుభ్రపరచుట తోపాటు మృదుత్వమును, సౌందర్యమును చేకూర్చును. చర్మమునకు కోమలత్వమును కలుగజేయు విలువగల పదార్థము లిందుచేర్చబడుటచే ఈ పనిసాధ్యమగుచున్నది. డిల్ బహార్ సబ్బువాడిన ఎక్కువ నరుగువచ్చును. అందుచే చాలదినములు వినియోగపడును. అనుకూలమైన సువాసన. 3 బిళ్లలుండు పెట్టెఖరీదు 14 అణాలు. వి. పి. చార్జి అదనము. ఇదేమాదిరి గుణమున్న సబ్బులు:—కామినియా సాండల్ సబ్బు, కామినియా హీన, ఇండియన్ బ్యూటీ, 3 బిళ్లలుండు పెట్టెఖరీదు 14 అ. వి. పి. చార్జి అదనము.

రెండుఅణాబిళ్లలు పంపుచు ఉచితముగా పంపబడు సాంపుల్సుకు వ్రాయుడు.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీ, బొంబాయి, 2.



రామాయణము లోని వీణ

శ్రీ వంగోలు వెంకటరంగయ్య

పుల్లలతో తంబుర వాయించుచున్న ఒక చెన్నయ దాసరి

రామాయణములో యుద్ధకాండమునందు సర్గ ౫౯-శ్లో. ౮౬ లో వాల్మీకిమహర్షి యుద్ధమునకు వీణవాయించుటతోటి రూపకకల్పన చేసియున్నాడు:


"మమ చాపమయీం వీణాం
శరకోణైః ప్రవాదితాం" ఇత్యాది.
(ఇది రావణవాక్యము)

సాధారణముగ వీణవాయించువా రందరును కుడిచేతి చూపుడువ్రేలియొక్కయు, నడిమివ్రేలియొక్కయు కొనగోళ్లతో వీణాదండముమీద నుండు తంతువులను మీటుచు, ఈ తంతువులకు కొంచెము క్రింది భాగమున నుండు శ్రుతితంతువులను చిటికెనవ్రేలి గోటితో మీటుచు ఎడమచేతి తర్జనీ మధ్యమములచే వీణాదండముపై నమర్చియుండు స్వరస్థానములగు సరకట్లు అనే మెట్లమీద స్వరసాహిత్యములను బలికించుచుందురు. ఉదాహృత శ్లోకమునందలి రూపకమున వ్రేళ్లస్థానమున 'కోణములు' చెప్పబడినవి. ఆయుద్ధవీణ శరకోణములచే వాయింపబడునట. వీణాది తంత్రీ వాద్యములను వ్రేళ్లతోనే కాక పుల్లలతో వాయించుటయు అనాదిప్రసిద్ధముగ నుంటబట్టియే అమరుడును "కోణో వీణాదివాదనః" అని యుపదేశించియున్నాడు.

అరవజిల్లాలలో గోటువాద్యము అని వీణవంటి వాద్య మొకటి యున్నది. దీనినే కొందరు స్థలవీణ యనియు, మహావీణ యనియు అందురు. ఇది ఆకారమునను, తంతులు మొదలగువాని అమరికయందును సాధారణమను వీణవలెనే యుండును. తంతులను మీటుటయు కుడిచేతివ్రేళ్లతోనే జరుపబడును. స్వరస్థానములందు మాత్రము ఎడమచేతివ్రేళ్లుపయోగపరుపబడక చిన్న అప్పడాలకొడుపువంటి ఒక కొయ్యతునకతో సాధకుడు గీతమును పలికించుచుండును. అయితే ఇందు 'కోణ' ప్రయోగము లేదు. ఈ కొడుపును 'కోణము' క్రింద గణించుట యుక్తముగ లేదు.

ఉత్తర హిందూస్థానమున 'గత్' అను వీణవంటి చిన్నవాద్య మొకటి వాడుకలో నున్నదనియు, దానిని పుల్లలతో వాయింతురనియు ఒకరు చెప్పిరి గాని అది దక్షిణయిండియాలో నెచటను కనుపడదు. తెలుగు జిల్లాలలో కొందరు మాలదాసరులు (తాము చెన్నయదాసులమని వారు చెప్పుకొందురు) నాలుగైదు తంతు లమర్పబడిన పెద్ద తంబుర నొకదానిని శ్రుతిజేసికొని కొన్ని పాటలు, సుద్దులు పాడుచు ఆ పాటపైఖరి కనుగుణముగ పలుకునట్లు తంతులపై సన్న పుల్లలతో వాయించుచుందురు. అయితే వారు అట్లు వాయించుటలో ఒక స్థాయికి వాయింపగలుగుదురే

గాని ఉచ్చలు, నీచలు పలికింపజాలరు. మొత్తమునకు వ్రేళ్లతో వాయించుటమాత్రము కలదు. ఇట్టి తంబురను వ్రేళ్లతో వాయించుచుండు నొక చెన్నాయదాపరి ప్రతిబింబ నిూవ్యాసపు శీర్షిక చెంత జూడనగును. అతడు వాయించుచుండు వ్రేళ్ల లంత స్ఫుటముగ నందు కన పడుటలేదుగాని అతడు కూర్చుండిన విన్యాసమువలన వాయించుచుండుటయు గమ్యముకా గలదు.



జూడనగును. ఆ గ్రంథమున ౯-వ పుటయందు ఉదాహృత వాల్మీకి వాక్య ప్రశంస గలదు గాని అంతకు మించి యేమియు చెప్పఁబడలేదు. ౧౦-వ పుటలో ప్రాతకాలపు ఇండియాలో తంత్రీవాద్యము లనేకము లకు 'వీణ' యను పేరు సామాన్యముగ నుండినదని యొక సూచన చేసియున్నారు. అందుచేత శరకోత్సైం ప్రవాదితమగు వీణకూడ ఈ నాడు వాడుకలో నుండు

'హెరిటేజ్ ఆఫ్ ఇండియా' (**Heritage of India**) అను గ్రంథప్రణాళికలో సంగీత మహా విద్వాంసులు రెవరెండు ఎచ్. ఏ. పోప్లేగారు (౧౯౨౧ ప్రాంతములు) 'ఇండియాలోని సంగీతము' (**Music of India**) అను నొక గొప్పగ్రంథమును వ్రాసియున్నారు. దీనిలో ఇండియాలో నుండు నానావిధములగు వాద్యములయొక్క రూపములను, ప్రయోగములను, సాధనలను తెలుపుచు తంత్రీవాద్యములనుగూడ విపుల ముగ విమర్శించి యున్నారు. వీణలయొక్క భేదము లను, వీణలవంటి వాద్యములయొక్క భేదములను తెలుప గల రూపపటములనుగూడ వారు అందు ప్రకటించి యున్నారు. వాని ప్రతిరూపములను గొన్నిటి నిక్కడ

నట్టియు, శ్రీసరస్వత్యాది దేవతారూపముల జూప బడునట్టియు వీణగనే యుండునా, లేక వీణాగణములో చేరిన యొక వాద్యవిశేషముగ నుండునా అని ఆలో చింపవలసి యున్నది. రావణాసురుడు తన యుద్ధ ప్రసంగలో భక్తిప్రసక్తముగ చెప్పిన వీణ యెట్టిదైనను మహర్షి ప్రాచేతసుడు శ్రీరామాయణ మహాకావ్య ప్రవాహమున సంగీతమున ప్రాచీనాభ్యాసము నొక దాని నెట్టకేలకు నూర్జితపరచియున్నాడు.

ఇటులనే యనేక ప్రాచీనాచార వ్యవహారము లను తెలిసికొనుట కీయాదికావ్య మమూల్యమైన మహానిధిగ నున్నది.

శృంగభంగము

[కథానిక]

= శ్రీ రుక్మిణీనాథశాస్త్రి =

తాంబూలం వేసుకోడానికి కూచ్చునేదాకా నాకు బోధపడ్లేదు, అన్నపూర్ణ ఆనందాన్ని ప్రేమించిందని. పొద్దున కాఫీ తాగేవేళ, ఇందాక భోజనాలదగ్గరా అనుమానపడటానికి వీలుంది గాని, ఈ హైక్లాసు సొసైటీలో ప్రతిదీ చెట్టు చిటారు కొమ్మన ఉంటుంది గనుక నేనేమీ అనుకోలేదు. పైగా వొచ్చిన ఊహను బలవంతాన గెంటేశానుకూడా.

"పాపం, ఎంత దయతో తిరుగుతోందో చూశారా, ఫాన్ !" అన్నాడు ఆనందం.

"దయతో తిరగటమేమిటి, మనం స్విచాన్ చేస్తే ..." అన్నాను. ఆ ఫాను, మనది, మనకై దయతో, జాలిగా, పాపం అని తిరుగుతోందా? హుం! ఈ కాలంకుర్రాళ్లు అంతా యింతే —

అన్నపూర్ణ తమలపాకులపళ్లెం తెచ్చి ముందు పెట్టి తానూ కూచ్చుంది. ఆనందం కళ్లతో ఆమెను తాగేట్టు చూస్తున్నాడు, కాలిదగ్గర జరీఅంచుకుచ్చెళ్ల దగ్గర్నుంచి తల్లోని ఈవినింగ్-ఇన్-పారిస్ సువాసనదాకా.

"ఫాన్ట జాలిగా తిరుగుతోందంటే, సదాశివన్ ఒప్పుకోలేదు" అన్నాడు ఆనందం.

"మీరు చెప్పండి, మనం స్విచాన్ చేశాం; ఇంక దానికి జాలేమిటి" అన్నాను.

"మనం ఒకర్లవల్ల పడే యిబ్బంది అది గమనించకపోతే, గమనించినా సింపతీ కక్కపోతే, అది కిక్కురుమనకుండా ఊరుకుంటే, మనం ఏం చెయ్యగలం, చెడిపోయిందని దణ్ణంపెట్టడం తప్ప?" అన్నాడు ఆనందం లీలగా, ఖేలగా.

వీడి కేమన్నా పిచ్చా, లేక అన్నపూర్ణదగ్గర కోస్తున్నాడా?

అన్నపూర్ణ నవ్వింది నవురు ధళధళమంది.

తమలపాకులు వేసుకోటం ప్రారంభించామే గాని నేను ఆలోచిస్తూనే ఉన్నాను. నెమరు కొస్తోంది. మొదట్లో అన్నపూర్ణదగ్గర వీడి పరిచయం, ఇతను తనురాసిన పద్యాలను పాడటం, అన్నపూర్ణలో కించిత్తుకదలికా, అన్నపూర్ణ టీకి పిలవడం అన్నీ. మర్నాడు పొద్దున కాఫీతాగేప్పుడు టేబుల్‌దగ్గర— ఆనందం వీలైనంతవరకూ రసాన్ని ప్రజలకు అందివ్వాలనడం, నేను అడ్డుకోటం, వాడు అదేపట్టు కూర్చోడం అన్నీ.

"చూడండి, మీకేగనుక ఈ ప్రజలమీద దాక్షిణ్యంవుంటే మీసంగీతాన్ని వీలైనంత వరకూ వాళ్లకు అందిస్తారు!"

"అసాధ్యం!"

"ఏం, సభల్లో, పబ్లిక్ కచేరీలూ మీరుచేస్తే జనానికి వీలుబాటు కాదూ?"

"మీ కవిత్వం ఏం దగ్గిరికి తెచ్చారు?"

"లేకేం? మాపద్యాలు—Beg your pardon, నా పద్యాలు—అణాపెడితే లభ్యమయ్యే పత్రికల్లో అచ్చేయిస్తాను. నాకవిత్వం చదివేవాళ్లందరూ, లేదా కవిత్వంమీద రుచిగలవాళ్లందరూ, పోనీ కవిత్వం చేసే ఆపరేషన్ చేయించుకోవలసినవాళ్లందరూ బీదవాళ్లనీ, డబ్బున్నవాళ్లు కారనీ నాకు తెలుసు. అంచేతే వేరే పుస్తకంగా వెయ్యను."

నాకు నవ్వొచ్చింది. కళలను ప్రజలకు ఊరికే యిమ్మనీ, వీలైనంత చౌకగా యిమ్మనీ అనేవాళ్లు ఉత్తదొంగలు. గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు కాలుస్తూ, సోషలిజం అని అరిచే కుర్రాళ్లు వీళ్లంతా.

ఆనందం మళ్లీ అందుకుని, "మీరు పెద్ద కచేరీలు తప్ప యింకోటి చెయ్యనంటే మీ సభలకు ఎంతమందిరాగల్రు? పోనీండి, రేడియోలో పాడరాదూ, నలుగురికీ తెలుస్తుంది?"

రేడియోలో పాట్టమా? అంత అదృష్టమే? వీడికి రేడియోలో పాట్టానికి ఎంత ఆశ్రయించాలో తెలుసా?

నాటకం, టిక్కెట్లతో, యిప్పటిలాలె ఉండకూడదనీ, వీధినాటకాలు బెస్టు అనీ, యిప్పుడుకూడా వీధినాటకాలవలె ప్రతికళా తయారుకావాలనీ ఆరోజున వీడు అన్నాడు. అప్పుడే అనుమానం వేసింది— వీడి కేమన్నా రష్యాజబ్బుందా అని. యిప్పుడు తేలింది. ఆహా! వీడు సోషలిస్టే!

అన్నపూర్ణ తాంబూలం అని సుత్తుకు తెచ్చింది. ఉలిక్కిపడటాన్ని అణుచుకుని "ఆనందంగారు వేసుకోరేం?" అన్నాను. ఆనందం వొక్క ఆకు అన్నా చీల్చలేదు, సున్నమూ రాయలేదు.

"వేసుకుంటాను లెండి, కానివ్వండి!"

"ఏమిటోయ్! వేసుకోవేం?" అన్నపూర్ణ.

"వీరాకు కాలేండి!" అన్నాడు లోగొంతుకతో. అన్నపూర్ణ పల్చని పెదిమలు ఎర్రగా ఉన్నై. ఆనందం సిగరెట్టు అంటించాడు.

"అబ్బ! ఈ పాడు సిగరెట్లు మానవోయ్!" అంది అన్నపూర్ణ.

నవ్వాడు ఆనందం. ఇదే వీలని చేమ గబగబా తమలపాకుల్ని నములుతున్నాను. చెమట ఆరుతూన్న ముఖం, గాలికి ఊగే క్రాఫు, ఆ నుదురు, మెచ్చుకోవాలి తప్ప, నాకేం బాగుల్లేదు.

"తాంబూలం వెయ్యవా?"

ఊరుకున్నాడు.

"ఇష్టంలేదా?"

"లేకేం —" పెద్దగా ఊపిరితీసి, "వీరాకు తాంబూలం వేస్తుంటే — మిమ్మల్ని చూడకుండా ఆకుల్ని మేకలాగా నములలేను. కొంతమంది డ్రెస్ చేసుకున్నాక, కొంతమంది నడుస్తుంటే, కొంతమంది మాట్లాడుతుంటే కొంతమంది తాంబూలం వేస్తుంటే వాళ్లను చూట్టంలో ఉన్న తృప్తి అప్పుడు యింకేం చేసినా రాదు" అన్నాడు. అన్నపూర్ణ ఏమీ మాట్లాడలేదు. కవిగాళ్లు ఈ రకం పిచ్చాళ్లేనని నే ననుకున్నాను. ఫాన్ స్విచాఫ్ చేసి, కొంచెం కునుకడానికని లేచాం. ఎంత వట్టివేళ్ల తడికలైనా, మద్రాసుకూడా బెజవాడలాగా పేలుస్తోంది. రాజగోపాలాచారి ఎసెంబ్లీలో రూపాయల్ని మద్రాసులోని నీళ్లలాగా వాడాలి అని అన్నారట. ఈ ఎగ్మూరులోనే యిట్లా వుంది. టౌన్‌లోవాళ్లు ఎలా ఉంటారో ... ఆనందం పత్రికల్ని తిరగేస్తున్నాడు. అన్నపూర్ణ సోమర్ సెట్ మాఘం ఆల్ టుగెదర్ చదువుతోంది. ఎండ కాలుస్తోంది — దీపకరాగంవలె.

మైకం వొదిలేప్పటికి మెల్లిగా రేడియో పాడుతోంది "ఆడబ్రతుకే మధురం!" అంటూ. కళ్లు నలుముకుని, లేచి, ఆవులించి వొళ్లు విరుచుకుని చూశాను. కొబ్బరికాయతురుమూ, మామిడిపళ్ల ముక్కలూ అటుకేసి పోతున్నై. స్నానాలగదిలోకి వెళ్లి, మొహం కడుక్కొని, స్పోట్స్ పెట్టుకొని నేనూ రేడియోదగ్గరకు వెళ్లాను. ఆనందం లేడు. అన్నపూర్ణ వొక్కత్తె వుంది.

"రండి! కూర్చోండి!"—కూర్చున్నాను.

"ఖులాసాగా నిద్రపట్టిందా?"

తల ఊపించాను.

అన్నపూర్ణ ఎక్కువ మాట్లాడదాయె. ఎప్పుడైనా మాట్లాడినా మాటలను కొసీనంగా వాడుకుంటుందాయె. ముందట్లో మేం కలిసినప్పుడు కొంచెం మాట్లాడినా, తెచ్చిపెట్టుకున్నట్టున్నా బావుండేది. అదీ నాలుగురోజులూ. పక్కన కూర్చోటం, వొళ్లు తగలటం, జరిగిపోయేసేం ... ఆ వొళ్లు తగలటమైనా అపురూపం ఐతేసే. ఎప్పుడూ, మామూలుగా ఐతే ఏం పోయిా? ఖర్మం — మాయిద్దరి మధ్యా అంతే. మరి ఈ ఆనందం — ఏమో అంతే అయివుంటాడు. అడిగితే డబ్బు ఇస్తుంది. నాలుగుసార్లు పుచ్చుకున్నాక మళ్లీ అడగటానికి నా మొహం చెల్లదు. అయినా, అడిగాను. యిచ్చింది. ఈ ఆనందం డబ్బు యిక్కడ యిస్తాడు తీసుకొంటాడూ. వీడికి ఎలా వొస్తుందో, రేడియోలో ఏమన్నా పాడుతాడు గావును. రేడియోను ఎంత చౌకగా మాట్లాడాడు? నాయర్ మంచినీళ్లూ, ఇన్ని పూరీలూ, ఇంత బంగాళాదుంపకూరా తెచ్చి, అక్కడ పెట్టాడు. కాఫీ చెయ్యడానికి కాబోలు లోపలకు వెళ్లాడు. అప్రస్తుతమైనా "ఆనందం గారేరీ!" అన్నాను.

"నిద్దరోతున్నాడు కావును"

చెప్పులు టకటకలాడినై. ఆనందం బజారునుంచి వొచ్చాడు కూలివాడితో, తట్టతో. తట్టలో మామిడిపళ్లు, రసాలు, సపోటాలు, మల్లెపూలు. సరాసరి ఆ బుట్ట లోపలికి తీసుకెళ్లి అక్కడ పెట్టివొచ్చాడు. రేడియో ఆపేసి కూచున్నాడు. గాలివేస్తోంది, ఇంకొంచెం జోరుగా. తలెత్తాను. ఫాన్ గిరగిరా తిరుగుతోంది. గడియారం అయిదుగంటలు కొట్టింది.

"రాత్రి నెల్లూరు వెళ్లాలి!"

అన్నపూర్ణ మొహంఎత్తింది. ఆనందం జేబులో వెతికాడు. షైరు! అన్నపూర్ణ చదివింది. టిఫిన్ పుచ్చుకుంటున్నాం. మామూలుమాటలు, స్నేహసూచకాలు ఏవో మాట్లాడుతూ. ఈకవిగాళ్లు పిచ్చిలో లేకపోతే బాగానే ఉంటారు.

"రేపు ఎక్స్‌ప్రెస్‌లో పోగూడదూ?"—అన్నపూర్ణ.

"ఈ ఎండల్లోనా? వచ్చావేం."

"నాయర్!"

"ఎందుకు, నాయర్‌తో చెప్పాను మెయిలు కొట్తానని" అన్నాడు ఆనందం 'పూర్ణతో.

నాయర్ వొచ్చాడు.

"జలం కొంచునా!"—పిల్చాంగదా అని పని చెప్పినట్టుంది. "నీళ్లున్నాయిగా" అని అనబోయాను. నాలిక చివరిదాకా వొచ్చినా, ఎందుకో అనలేదు.

కాఫీతాగాక, ఆనందం సిగరెట్లు తీశాక వాళ్లిద్దరూ గదికేసి వెళ్లారు. జడవేసుకోటానికి విప్పుకున్న జుట్టును గుప్పిట్లో పట్టుకుని అన్నపూర్ణ వెళ్లింది; ఆనందం పొగలతో. నాలుగు నిమిషాలల్లో బయటికి వొచ్చారు. కొత్త ప్లాన్ కేసి వెళ్తొస్తానని బయటకు వొచ్చాను. బయటికి వొచ్చాక అనిపించింది—ఆఁ! బయలుదేరకపోతేనేం......అని. వొస్తేనేం లే......

సాయంత్రందాకా తిరిగాను. జనబాధ మద్రాసులో. పనిలేకుండా బయటికి పోతే రూపాయికి పావుగంటవిలువైనా ఉండదు. చిన్న జీతాలు తెస్తూ సంసారాలు ఈదేవాళ్లు ఎలా ఉంటారో ఈ ఊళ్లో! యింటిముఖం పట్టాను. ఎగ్మూర్ హైరోడ్ చివర బస్ దిగి, ముందుకు వంకర్లు తిరిగి, స్పర్‌టాంక్ కాలనీలోకి వొచ్చి ఫ్లేటుకి వొచ్చాను. నాయర్ వాకిట్లో కూచున్నాడు.

"ఉన్నారా?"

తల ఊపాడు. లోపలికి వెళ్లి, కాళ్లూ చేతులూ కడుక్కుని మేడమీదికి పోయాను. వొక్క మంచం మీద, ఎదురుబదురుగా అన్నపూర్ణా ఆనందం పడుకుని ఉన్నారు మెల్లిగా మాట్లాడుకుంటూ. అన్నపూర్ణ తల్లో పూలు. ఆనందం లుంగీధారి. వాళ్లు నన్ను చూల్లేదు. యింకా మాట్లాడుతున్నారు. సెల్లూలు ప్రమాణమూ కాదు, నీలాటిరేవుకబుర్లూ కాదు. మధ్యమధ్య పేరాండేల్లో, బెర్ట్రాండ్ రసెల్, ఫ్రాయిడ్, హెరాల్డ్ జె. లాస్కీ అంటున్నాడు ఆనందం. అన్నపూర్ణ యిప్పుడే ఓడ దిగినట్లు డబ్లిన్ జీవితం అంటూ మాట్లాడుతోంది. "యూలిసిస్ కొనాలి!" అని ఆనందం. కాస్సేపు మాటల్లేవు.

"అచ్ఛా. నేను ఎల్లుండి వొస్తాను."

"డబ్బు చాలుతుందా?"

"చాలొచ్చు."

"పోనీ, యింకో పది తీసుకో" అంటూ అన్నపూర్ణ లేచింది.

వీడికి అడక్కుండానే యిస్తుందే. వీ డేమన్నా అంటుకున్నాడా? నేను నెమ్మదిగా నడుస్తున్నట్టు నటించి లోపలికి పోయాను. ఇద్దరూ "హల్లో!" అన్నారు. కూచున్నాను. ఆనందంపర్సు తీసి అందులో పదిరూపాయిలకాగితం కుక్కింది ఆమె. ఆనందం పడుకునే సిగరెట్లు ఊదుతున్నాడు.

"నాయర్!"

నాయర్ వొచ్చి కనపడి వొంటింటో కెళ్లాడు. ఆనందం లేచి భోజనాని కెళ్లాడు. యీఆనంద శని రెణ్ణాళ్లు కనబడ దనే హాయి అప్పుడే ఒళ్లంతా పాకుతోంది. అన్నపూర్ణ బట్టలు మార్చుకుని, తలపెట్టుకొని వొచ్చింది.

"ఏమండీ! ఏమన్నా కబుర్లు చెప్పరూ!"

చిరునవ్వు నవ్వాను. "ఏమున్నాయండి?"

అన్నానే గాని, ఆమె కంఠం వొణుకే అనుమానిస్తున్నాను. అయినవీ కానివీ తెగ వాగాలని వుంది. పోనీ, తాను తెగమాట్లాడకూడదా అనీ వుంది. కాని, మాట్లాడదు. ఇంకా నయం, కబుర్లు చెప్పండని అడిగింది. ఆమెజబ్బుమీద టీకాలు తెచ్చిన అందం చూస్తున్నాను. ఆమె తెల్లనిచీర మల్లెపూవు వలె వుంది. ఛరాల్న లోపలికి పోయి ఆనందంసిగరెట్లు తెచ్చి, తాను ముట్టించి, పొగతో వుక్కిరిబిక్కిరి ఐ పంతానికి తాగుతోంది. ఆనందం వొచ్చాడు. చిన్న నవ్వునవ్వి, సామాను సర్దుకుంటానని వెళ్లిపోయాడు.

మొగుడితో కాపరంచేసేనాటినుంచీ అన్నపూర్ణను ఎరుగున్నాను. తన ఇష్ట ప్రకారమే నడిచేది. కాని, వోవిధమైన చొరవా, అణుకువాకూడా వుండేవి. అతను పోవడం, ఆస్తి అంతా ఈమెది కావటం, చదువుతూన్న ఇంటరు మానేసినా మద్రాసు వొదలక ఇక్కడే వుండటమూ గుర్తుకు వొచ్చై. అప్పుడు అతణ్ణి సిగరెట్లు తాగవొద్దని నిర్బంధించేదనీ వాడుక. ఈమె యిప్పుడిలా తాగుతుందేం—ఏమిటో. యిందాకా ఆనందాన్ని సిగరెట్లు మానమనలా. ఈతత్వంమనుషులు ఎప్పుడేం చేస్తారో ఏమో చెప్పడం కష్టం.

తనూ వెంటనే వెళ్లింది. నాయర్ రిక్షాను పిలిచాడు. హోల్డాలూ, సూట్ కేసూ రిక్షాలోవేసి, నాయర్‌ను స్టేషనుకు రెమ్మని, ముగ్గురం బస్సెక్కాము. బస్సు

ఎగ్మూరు స్టేషన్ దాటి స్కూలఫ్ ఆర్ట్స్ క్రాస్ చేసే దాకా గమ్మత్తుగా ఉన్నారు ఇద్దరూ. తరువాత మాటలు, నవ్వులు! రైలుస్టేషనులో కూడా, నాగవల్లి నాటి సంరంభంలాగా ఏవేవో మాట్లాడుతూనే ఉన్నాం. రైలు కదిలింది. నిట్టూర్చి అన్నపూర్ణతో పాటు మేము యింటికి చేరాం.

ఇంటికి వొచ్చాకగానీ నాలో వేడి పుట్టలేదు. అన్నపూర్ణను పెళ్లిచేసుకోవాలి! వేడి నిమిషంలో తహతహగా మారింది. నాలో వైధవకర్మం, దేనికన్నా తహతహ పుట్టాలేగాని, పుట్టిందా అంటే మరీకోతిలా తయారౌతుంది నామనస్సు. నిగ్రహించకపోతే ఏం అవాకులూ చెవాకులూ పేలి, ఏం చెయ్యరాని పనులు చేస్తానో......

భోజనాలు చేశాం. పల్చనిచారు, సాంద్రమైన పాలతో. మేడమీద పక్కలు వేసుకున్నాం. ఆకాశానా, యింట్లో, మాలో మృతమౌనం! సప్తమహర్షులు పక్కన, సిరియస్ నాలోలాగా నిమిష నిమిషం రంగులు మారుస్తోంది. మూరాన కుజుడు ములుగోరింట పువ్వులాగా.

అన్నపూర్ణను కదిపితే ... ఆమె కదిలించక ముందు, మనం కదిలించి, అధిగమించి, ఉన్న యోగోడుగూడా చెడి, తలుపులుమూయబడితే ... ఆలోచన వొచ్చిందేకాని, మనసూ, శరీరం ముందుకు వురుకుతున్నై. నేనే కావాలని కళ్లాలుపట్టి ఆపాను.

సంసారం, తాపత్రయం, ఇబ్బందులూ, మధ్య మధ్య తటస్థించే ఎండమావులూ అన్నీ నాబుర్రను వేడెక్కించై. రాత్రి ౧౧ దాటాక నిద్రపట్టింది. తెల్లారి మామూలుగానే గడిచింది. ఆమె ప్రతికదలికనూ, వేళ్లల్లో కళ్లల్లోగూడా జాగ్రత్తగా చూస్తున్నాను. ఎన్నడూ లేనిది యీవాళ కూరలు తరిగింది. ఓ హెన్రీ కథలు చదివింది. పక్కయింటికి వెళ్లి కాస్సేపు వుండి వొచ్చింది. మధ్యాహ్నం సొమ్మసిలి నిద్రపోయింది. నేను పక్కన ఉన్నట్టే లేదు, లేనట్టే లేదు. ఆనందం ఈమెను మొత్తాన కదిలించి ఉంటాడు. ఏవేవో కలలు కాంచిఉంటారు. పదిగంటల ఆప్రాంతాలకు మావూరి వాడొకడు కనబడితే వాడితో తిరిగి, అక్కణ్ణించీ కొంతమందిని కలుసుకుని, అక్కడా అక్కడా గడిపి, మర్నాడు పదింటికి ఎగ్మూరు చేరాను. రైలుప్రయాణపు దెబ్బ తిని, నిద్రలేక ఆపసోపాలుపడుతూ ఆనందం ఈజీచైర్లోవున్నాడు. ఎదురుగుండా బల్ల మీద యూలిసిస్. పరిచయమందహాసం చేశాను.

అతనూ మామూలు బజారు నవ్వు నవ్వి, స్నానానికని లేచాడు. విశేషాలు ఏమీలేని మధ్యాహ్నం బండబరువుగా గడుస్తోంది.

నాకు మెలకువ వొచ్చేప్పటికి పక్కగదిలోంచి మాటలు వినబడుతున్నై. అలాగే పడుకుని, చెవిని కాన్సంట్రేట్ చేశాను. అన్నపూర్ణ అంటోంది—

"నన్ను గురించినీవు ఏమనుకుంటున్నావు అనేంత కింటికి ఎందుకు వొచ్చావు? ఎవరు నిన్ను గురించి ఏమనుకుంటే నీకేం—నాకైనా అంతే. ప్రపంచం ఏమనుకుంటోందీ, ఏంచేస్తోందీ అని వాపోయేవాడికి ఆత్మవిశ్వాసం ఎంతుంటుందో నీకు తెలీదా? ఇవాళ, ఇన్నాళ్లకు వొచ్చి, నన్ను గురించి ఏమనుకుంటున్నావు అని అడుగుతావుగదా, నీకీవేదన ఎందుకొచ్చింది?"

"అదే నేనూ పడేబాధ! నేను నీకు మెడను గుదిబండ అయ్యానని నేను అనుకుంటున్నాను."

"రెణ్ణాళ్లు, పోనీ - కొన్నాళ్లు తరిచి చూడు. నీకే తెలుస్తుందిగా! ఎవడో నిన్ను ఏదో అనివుంటాడు, దాన్ని యీ చెవిలోదాన్ని ఆ చెవిని పోనీక!"

"చెప్పవ్!"

తల్లిని అడిగే పిల్లవాడిలాగా ఆనందం అడుగుతున్నాడు. మురిపించి, తాయిలం పెట్టి, కుర్రాణ్ణి జోకొట్టి చెరువుకుపోయే తల్లిలాగా అన్నపూర్ణ యింకో ప్రసంగంలోకి జారింది.

"నిజం! నన్ను నువ్వెందుకు ఆదరించావు! నేను యీ నాకోర్కెలతో ఇబ్బందులతో కాలి, మాడి, అలా ధూళైపోకుండా, ఎందుకు నన్ను కట్టేశావు? కట్టేసుకున్నావు?"

అన్నపూర్ణ కనిబొమ్మలు ఎత్తి వోక్షణంచూసి ఉంటుంది. మరి మాటల్లేవు.

నేను వాళ్లు వొస్తారు కాబోలనని అల్లాగే కళ్లు మూసుకుని పడుకుని ఉన్నాను. రాలేదు. శిలలాంటి మౌనంలో గడుపుతున్నట్టున్నారు. యీ ఋషులు మౌనంగా వుంటారుగానీ, ఎలావుంటారో ... రాళ్లలాగా, చెట్లలాగా. వాళ్లు అలాగే ఉండిఉంటారు. అన్నట్టు ఈఆనందంకూడా, మౌనం క్రియేటివ్ ఎనర్జీ అంటాడు. చావనీ యీరంధిసంధిలో.

కునుకు. కలలు, పోలీసులు అరెస్టుచేస్తామని వొస్తారు. మైనంబొమ్మలవలె మాట్లాడరు. ఎవడో చావటం, అతన్ని చంపారని పోలీసులు గొడవ, రభస, చిత్తక్షోభ. గుండె దడదడలాడుతూండగా లేచాను.

సాయంత్రం పడ్డది. ఆనందం మేడమీద లుంగీపట్టుకుని, క్రాపింగు మొగంమీద మూగగా వొక్కటేమా ఆలోచిస్తున్నాడు. అన్నపూర్ణ మామూలుగా, బొమ్మవలె శాంతంగా రేడియో వింటోంది. నేనే — కొంత చొరవతీసుకుని సినిమాకని ప్రేపు పెట్టాను. నెమ్మదిగా అందరూ దిగారు. వెస్టెండ్‌లో మాఘం' దిలెటర్ చూసివొచ్చాం, సుద్దివెలుతుర్లో. అన్నపూర్ణా, ఆనందం యిద్దరూ మనప్రపంచంలో లేరు.

రాత్రి గదిలో మళ్ళీ చేరాం. అన్నపూర్ణ గంధం గిన్నె తీసింది. ఆనందం గంధంగిన్నె చూసికూడా స్తబ్ధులాగా కదలకుండా ఉన్నాడు. గంధంలో పన్నీరు కలిపి టేబుల్‌మీద పెట్టింది ఆమె. ఎవరం కదలలేదు. పూసుకోరేమర్రా అంది.

"ఎవరికివారు పూసుకుంటారా?" అన్నాను. కోతి మనస్సు గొలుసులు తెంపుకుంది. ఎంతమాట అనేశాను?

ఆనందం లేచి, యింతగంధం తీసి, నా మెడఅంతా పూసి, నాలాల్చీకికూడా పూశాడు. అన్నపూర్ణ నవ్వలేదు సరిగదా, కోప్పగలేదుసరిగదా, ఏమీ అనలేదు. చూస్తూఊరుకుంది. తాను పూసుకోనూలేదు, ఏమీ లేదు. మళ్ళీ నిట్టూర్చి, పోయి సోఫాలో కూలపడ్డాడు. వీడికేమున్నా నామీద జెలసీ? అల్లా, పగపట్టిన పాములా ముడుచుకుపోతాడేం, లేక వీడు ఏదన్నా యిబ్బందితో, జబ్బుతో మూలుగుతున్నాడా?

అన్నపూర్ణ గంధంగిన్నె నాకు తెచ్చి యిచ్చి, నేను చేతులకు పూసుకున్నాక, యింతగంధం పేరంటాలుకు పూసినట్లు అతని మెడకు పూసింది. తీక్షంగా చూసి ఆనందం, చిధానవ్వు, వాడిలినపూవులాగా నవ్వాడు. బజారుస్త్రీలకు నవ్వను రమ్మంటే మాత్రం, బలవంతాన వొచ్చిన ఆనవ్వు మన్ని పట్టిస్తుందా? అతన్ని రంజింపచేయడానికో, మరిదేనికో ఆమె మాట్లాడింది తనంత తాను. చీకట్లో వొంటరి మనిషి నడుస్తూ తనలో తాను బిగ్గరగా పాడుకున్నట్టు.

వెళ్ళి రేడియో వేశాడు ఆనందం. మళ్ళీ ఆపి వచ్చాడు. మేడమీదకు వెళ్ళి పడుకున్నాడు.

"ఆనందం ఏదో బాధపడుతున్నట్టున్నాడు" అన్నాను. ఆమె తల ఊపించి, మంచంమీద కూలబడ్డది. నే నామెను బలాత్కరించినా అప్పుడు ఏమీ జరిగిఉండదు. కాని, నిగ్రహం నాటికి నారుపాళ్ళా రాజ్యమేలింది.

కోరంటికం అత్తారింటికిపోయే కోడలులాగు మేడమెట్లెక్కింది అన్నపూర్ణ. అన్నవలె నేనూ.

ఆకాశంచల్లదనం, నక్షత్రాల చెమక్, సిరియస్ కనపడలేదు. కుజుడు ఇంకా పైకిపోయాడు. నాకు సరిగా ప్రస్తరించటం రాదుకాని, మూర్ఛనలు పట్టలేనుగాని మేఘమల్లార రాగం పాడతగ్గ అదను అది.

నిద్దరపట్టడం మెలుకువరావడ మేమిటో, వాళ్ళు కనపడకపోవడ మేమిటో, నాకేమీ తోచలేదు. సందెల్లో రాయిపడ్డట్టయింది. ఏమిటో భయంభయంగా వుంది. కొంపతీసి వీళ్ళిద్దరూ గది బిగించుకుని పడుకోలేదుకదా! మెల్లిగా మెట్లమీదికి వొచ్చాను. మళ్ళీ మాట్లాడుకుంటున్నారు. అన్నపూర్ణ నెమ్మదిగా, కాపీనంగా, ఆచి ఆచి మాట్లాడుతోంది. "నీవు కనపడినరోజున, రాదన్ పరిచయమైన నాడు నీలోని ప్రతిభ, నీలోని సిన్సియారిటీ నాకు నచ్చింది. కాని, నీ ఊహలు, నీ ప్రయత్నాలు, అన్నీ డబ్బులేక అలా ఎండిపోతున్నాయనిపించింది. నువ్వెన్నన్నా చెప్పు, ఈ మనఆశయాలు, అభిరుచులు ఎంత ఉన్నతాలైనా సరే—చేతిలో డబ్బులేకపోతే మనం ఏమీ సాధించలేం. గవర్నమెంటు, దేశం అందరూ కలిసి ఆరాటపడితే తప్ప ఈలోగా మనం ఏమీ కాపుకోలేం. చేతిలో పుష్కలంగా పైసా ఉన్నా అడ్డంకులు ఎలాగూ తప్పవు. కాని, యీదారి, ఈ ఆలోచనలు, యీ పరిస్థితులు వేరు. ఇది నాకు ఇంటర్ చదువుకునే దినాల్లోనే తెలుసు. నీవు నిస్సహాయంగా, పాజిషన్ లేక బజారులోపడి తిరిగే కవులలో ఒకడివై తిరగటం నేను సహించలేకపోయాను. డబ్బువుంటేనే గాని సరిగా పలకరించనైనాలేని యీదేశం, యీ సంఘం నీలాంటివాణ్ణి ఎలా నలగగొట్టుతుందో నాకు తెలుసు. నిన్నుగురించి ఆలోచించినప్పుడే నేను నీమీద జాలిగా వాలాను. ఆతరువాత నీమీద యిష్టం, నీమీద ప్రేమ అన్నీ జాలితోనే వొచ్చై. నాకు తెలుసు నువ్వు ఏనాడైనా గొప్పవాడవౌతావనీ, యీ కవిత్వం అంతా రాచకీయంలో కలిసి, దేశానికి పంచదార కలిపిన పాలు యిస్తావనీ. నేను యివాళ సంపూర్ణంగా ప్రేమించేది, గౌరవించేది, లాలించేది నిన్నే. కాని ఈ ప్రేమకు, యీ గౌరవానికి జాలీ, సింపతీ మూలాధారం. దాన్ని మర్చిపోతే, నాకు నేను ద్రోహం చేస్తాను. ఎలా వొచ్చిందో క్లియర్‌గా తెలుసుకోటం మంచిది. నిజం ఘోరం విషం అనే ఆస్కార్ వైల్డ్‌ను చదవక కాదు నువ్వు అడిగింది. నేను అప్పుడు చెప్పే మూడ్‌లో లేను." ఆనందం ఊపిరి విడవడం ఆపేశాడు.

నేను కొత్తలోకంలో కళ్లు తెరిచి మళ్లీ పక్క మీదకు చేరాను. తల అంతా గిరగిరా తిరుగుతోంది. పావుగంటకు మేడమెట్లు చప్పుడయినై. కళ్లుమూసుకున్నట్లు, నిద్రపోతున్నట్లు నటించాను. ఎవరిపక్కల మీద వాళ్లు దొర్లారు.

కో పొద్దువేళ చూస్తే ఆనందం పక్కమీద లేడు. అన్నపూర్ణ నిద్రపోతోంది, ఏడ్చి ఏడ్చి అలిసిన పిల్లవలె.

పొద్దెక్కాకే మాకు మెలకువ వొచ్చింది. కిందకు పోయి, మొహం కడుక్కొని, కాఫీతాగే ఎత్తులో ఉన్నాం. వీధిలో గోల. తలుపులు తట్టుతున్నారు. వెళ్లి కనుక్కున్నాను. ఆనందం ఆత్మహత్య చేసుకున్నాట్ట, కోడిపద్దు ఆస్పత్రి ప్రక్కన బెంచి మీద. ఇది చెప్పటానికని నేను లోపలకు వెళ్లలేక పోయినాను. నాగుండెలు ఆగినై. నేను కొయ్యబారి పోయాను. అన్నపూర్ణ వొచ్చింది. అంతా విన్నది. స్తబ్దంలోనే నడిచి లోపలికి వెళ్లింది. గదిలో టేబుల్ మీద అతని కడపటి ఉత్తరం.

"అ—

నీ ప్రేమ ఎంత మధురమైందో, నీజాలి అంత బాధాకరం. నీ 'మధుజ్వాల'లో నేను అమృతమూర్తిని కాలేకపోయాను. మంటలో ఆత్మహత్య! నాకై కన్నీళ్లు రాల్చకు. జీవితమే ఒక పీడ కల. పునర్జన్మలో నాకు విశ్వాసం లేదు. పోతున్నాను. నేను నీకు ఏమైనా గాయం కలిగించితే క్షమించు—

నీ

ఆనందం."

ఉత్తరం చేతపట్టుకుని, అన్నపూర్ణ, నేను వెళ్లాం. ఆరోజు అంతా యిబ్బందులు, వేదన, కోలాహలం, అంతర్దాహం, దావానలం అనుభవించాము.

రెండు మూడు రోజులైనాక, బెజవాడ వెళ్లొస్తానని, వెళ్లి, వుత్తరం రాశాను చాలా వినయంగానే, నన్ను పెళ్లి చేసుకోమంటూ. వారం తిరిగింది. జవాబు రాలేదు. కాలు కాలిన పిల్లిలా వుంది నాస్థితి. పెనం మీద అట్టులాగా వేగిపోతున్నాను. ఆ ఆనందంలాగా గడిపితే నేనూ అల్లాగే వేగిపోతాను.

మద్రాసు వెళ్లితే ... ఎంత చెప్పినా, మనిషి ఎదురుగుండా వున్న విశేషం వేరు. సరీగ్గా ప్రయాణానికి మాత్రం అప్పుచేసి, మద్రాసు చేరాను. అదే స్టేషను, అవేరోడ్లు, అదే యిల్లు, విశేషం, బోసిపోయి, శాపురమంటున్నై.

యింట్లోకి వెళ్లాను.

"రండి!"—అన్నపూర్ణ.

వెళ్లాను. మామూలుగానే మధ్యాహ్నం గడిచింది. మధ్యాహ్నం టిఫిన్ దగ్గర నావుత్తరం ప్రమేయం తెచ్చాను. ఆమె పోణికింది. పన్నని పొడుమైన వేళ్లు వొణుకుతున్నై. పద్మని మొహం వివర్ణమైంది. ఎందుకడిగానా అనిపించింది నేనే పొరబాటుపడుతున్నానేమో — ఆనందం గుర్తుకు వొచ్చి, ఆమె బాధపడుతూందేమో! ఏమైనా ఆనందం గుర్తుకొస్తే — యీ ప్రసంగం తేవటమే తప్పు.

ఆగి, పెద్దగా నిట్టూర్చింది.

"నేను చాలా దయనీయమైన దశలో ఉన్నాను. నా ఆస్తి, నాప్రతిభ అంతా పరిపిన అందలేక అడివిని కాసిన వెన్నెలలా తయారైనై. నేను నిజంగా గొప్పవాణ్ణి. మీరు నాకు అండగా దొరికితే, ఆశ్రయమిస్తే, మమత్వం చూపిస్తే— చూపోక్కండి." అంటున్నాను.


"నాయర్!"

నాయర్ వొచ్చాడు. డ్రింకులు తెమ్మంటుండా ...

ఆమె తమాయించి, "కాస్సేపు మొహం చూపించకండి. ఎక్కడికన్నా వెళ్లిరండి" అంది.

నా నవనాడులూ కుంగినై. బల్లెంతో వెన్నులో పోటు. ఊపిరి తెచ్చుకుని "I love you" అన్నాను.

"ఈ ఇడియట్‌ను బయటికి పంపించు" అని వెళ్లిపోయింది. నాయర్ ఉరుముతూ నాకేసి చూస్తూ మిగిలాడు. ఫేన్ పైన తిరుగుతున్నా, ముచ్చెమటలు పోసినై.



మా విద్యార్థిదశ - నాటి కవిత్వం

(గత సంచిక తరువాయి)

— శ్రీ శతావధాని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి —

కాళిదాసుగారి "స రాజ్యం గురుణా దత్తం" వగైరా కవిత్వం యెందుకూ పనికిరానిదనీన్నీ, వేంకటాధ్వరి లక్ష్మీసహస్రంలోని

"ప్రాతరంబుజవిడంబిలోచనాం
మాతరం త్రిజగతా ముపాస్మహే,
శీతరమ్యకరుణావలోకనై
ర్యా తరంగయతి మంగళాని నః"

అనేదే సర్వోత్కృష్టకవిత్వమనీన్నీ అనుకున్న కాలం చాలా వుంది. 'ప్రాతరం, మాతరం, శీతరం, యాతరం' అనే పదాలు మనస్సును యిట్టే ఆకర్షించేవి. లాక్షణికులు యమకకవిత్వాన్ని అధమకవిత్వంకింద జమకట్టడం చూచి నే నెంతో నొచ్చుకొనేవాణ్ణి కూడాను. ధాతురత్నాకరకవిత్వంలో చాలాభాగం యమకంతోనే నింపాలనే వూహ వుండేది గాని ధాతుపాఠక్రమంగా కవిత్వాన్ని నడిపించే నియమశృంఖల మూలాన్ని అప్రయత్నం యేకొంచెమో తప్ప కొనసాగింది కాదు. ఒకొక్కొక్కచోట ఆధాతుపాఠక్రమం కూడా మా వుద్యమానికి అనుకూలించేది. అట్టిసందర్భంలో యెంతో సంతోషంగా వుండేది మాకు. వొకటి చూపుతాను :

"నరాః కింనరాః పన్నగా యక్షసంఘా
స్సురా స్సిద్ధసంఘా స్తదానీ మతీవ,
అణంతో ధణంతో రణంతో వణంతో
మణంతః కణంతో జయం రామచంద్రే"

అయినా ఇకారాంత ధాతువులకన్నిటికీ అర్థం తోకపోతే—'పలికిరి' అనేదే. అటు కర్తృపదాలుండడం చేత అటు క్రియాపదాలూ సమన్వయించుకోవడానికి వీలిచ్చింది.

నూతనదంపతులకు శాకుంతలాదినాటకకవిత్వమే రుచిస్తుందో, భగవద్గీతాకవిత్వమే రుచిస్తుందో తెలిసినవారికి విద్యార్థిదశలో, లేదా కొత్తగా కవిత్వం చెప్పేరోజుల్లో శబ్దాడంబరమే రుచిస్తుందో, అర్థగాంభీర్యమే రుచిస్తుందో బోధపడుతుంది. కాళిదాసు "ద్వైపాయనప్రభృతి శాపాయుధ త్రిదివసోపాన ధూళిచరణా" అనే శ్లోకాలుకూడా చెప్పివున్నాఁడని తెలిసివుండడంచేతఁగాని, రఘువంశాదులుమాత్రమే రచించడంమట్టుకే అయితే అతఁడు కవి కాఁడనే నేననుకోవలసివచ్చేది. యీవిభ్రాంతినిబట్టే ధాతురత్నాకరంలో యెంతో ప్రయత్నించి యీలాటిరచన సాఁగించవలసివచ్చింది.

"రాఘవ! దుష్టతరాఘవనాగ్నే!
పామరపాల! నృపామరపాల!
దేవ! రమాప! ముదే వర మాప
న్నాశక! పేట ఘనాశకవాటమ్"

వచ్చినమాట మళ్లా వస్తూ వుండనే సంతోషమే కాని యితరలోపాలమీఁదకి ఆరంభదశలోనే కాదు, మధ్యకాలంలోకూడా బుద్ధి ప్రసరించదనే నేననుకుంటాను (కొందరికి యావజ్జీవమున్నూ బుద్ధి యమకాదులమీఁదే మసలడమున్నూ వుంటుంది). ఉదాహరించిన శ్లోకంలో నాలుగోచరణంలో 'పేట' ధాతువు క్రమప్రాప్తమవడంచేత ప్రయోగించకతప్పదు. దాన్ని యమకభంగం లేకుండా యిమిడ్చేటప్పటికి మాపెద్దలు దిగి వచ్చారు. అయినా శ్లోకాలు అహల్యారాముణ్ణి స్తుతించే ఘట్టంలోవి. మరికొన్ని వున్నాయి. అన్నీ యీమాదిరిగానే వుంటాయి.

"దాశరథే శరథే! సుగుణానాం
చారుజయే రుజయేరిత మేతత్,
మానస మద్య సముద్యమినమ్యే
సారఘరయే ర మయే నటతీశ!"

అయినా శ్లోకాలకు అర్థం చెప్పడానికి కొన్ని వంకరమార్గాలున్నూ, వ్యాకరణసూత్రాలున్నూ ఆధారంగా వుంటేనే కాని కాపరం తుద నెగ్గదు. రసారసవిచారానికేం గాని విద్యార్థిదశలో యీకుస్తీలో బాగా కృషి చేసివుంటే పరిణామదశలో యెన్నోవిధాల వుపకరిస్తుంది (కామిగాక మోక్షకామి గాఁడు. చూ). అంతేనేకాని యిది యీస్వరూపంతోనే వుపకరించడం సర్వకల్ల. యీవిషయం యింకా విడమర్చి వ్యాఖ్యానిస్తాను. సంగీతం వుందనుకోండి. దాన్ని అభ్యసించేటప్పుడు అకారసాధన మంటూ చేస్తారు. అలా చేయడం దోషమంటే? మంచి నడిశీతాకాలంలో తెల్లవారుజామున చల్లటి నీళ్లకుండని కౌఁగలించుకొని చేస్తారు. యింకా యీలాటివే యేవో వుపాయాంతరాలు వుంటాయి ప్రతీవిద్య అభ్యసించడానికిన్నీ. సభలో గానం ప్రదర్శించే పాటకుఁడు తనవిద్యార్థిదశనాఁటి వర్క్రంతా చూపెట్టడానికి మొదలెడితే యెవరేనా సంతోషిస్తారా?

"అనంతశాస్త్రం బహు వేదితవ్యం
యత్సారభూతం తదుపాసితవ్యమ్."

అన్న అభియుక్తోక్తికి వుదాహరణంగా ప్రవర్తించాలన్నమాట. యుద్ధానికి వెళ్లిన యోద్ధ తన చిన్నప్పుడు ధనురాచార్యులు చేయించిన బస్కీలూ, తీయించిన గుంజీలూ మొదలుపెట్టినట్టు కవిత్వంలో పరిణామస్థితికి వచ్చిన కవి తనబాల్యాద్యవస్థలలో పోయిన పోకడలు, యమకచిత్రాదులు చాలావఱకు వదులుకోకపోతే హాస్యాస్పదుఁడవుతాఁడు. యేఅభ్యాసాంతాలలోనో చూపుకుంటే చూపుకోవచ్చును. అదేనా యెందుకంటారు? నాకు చతుర్విధకవిత్వరచనలున్నూ తెలుసునుమండీ అని లోకానికి నచ్చఁజెప్పడానికి మాత్రమే. అంతేకాని ఆకవిత్వంవల్ల రసజ్ఞలోకానికి కలిగే ఆనందం లేశమూ వుండదు (ప్రబంధరాజ వెంకటేశ్వరవిలాసం యెందరు చదువుతారో పరిశీలించండి). విశేషమైన అర్థపుసొగసు లేకపోయినా చక్కని పదాలకూర్పుతో వున్న రచనకూడా హృదయాన్ని ఆకర్షిస్తుంది :

"వయం వకుళమంజరీ గళదరీణమాధ్వీఝరీ
ధురీణసుధరీతిభిః భణితిభిః ప్రమోదామహే."

యిందులో వరసగా అయిదు రీకారాలు గల సమాసం యెంతో సుచ్చటగా పడింది. పైపైకేగాని అర్థంలో యేమంత సొగసు లేదు; లేకపోనూ లేదు. అంత లోఁతులోకి యెవరోగాని పోరు. వినేటప్పటి కల్లా సంతోషం కలుగుతూ వుందా లేదా అనేదే విచార్యం. అశ్లోకం చాపలే పూర్వార్ధంకూడా వుదాహరిస్తాను- తారతమ్యం పరిశీలించండి.

"ఘటః పట ఇతి స్ఫుటం పటు రటంతి నై
యాయికాః,
పఠంతి చ హఠాత్తరాం ఖఫఛఠేతి పాతంజలాః"

లోఁగడ వుదాహరించినదానికీ, దీనికీ వున్న భేదాన్ని సహృదయులు తెలుసుకుంటారు. లోఁగడ వుదాహరించిన రీకారపంచకసమాసంలో వున్న 'ఝరీ' శబ్దం తప్పని అపవదించేదగ్గఱికి వచ్చిన యీ కాలంలో వుండే కవుల స్థితి శోచ్య మనక తప్పదు (ఝరీశబ్దం తప్పనుకొని శంకించడంకన్న ప్రమాదం లేదని యెన్నో సుప్రయోగాలు చూపివుండడంచేత యిక్కడ స్పృశించి విడిచాను. అమరవ్యాఖ్యానం చూచినా యీవిషయం తెలుస్తుంది). అక్కడక్కడ యీలాటి సమాసప్రౌఢ రసోచితంగా వుండడం కవికి వుండే పాండిత్యాన్ని తెలుసుకోవడానికి వుపకరిస్తుంది.

"బహురత్నద్యుతి మేచకోదర దరీ
భాగమ్ములం బొల్చు ని
మ్మిహికాహార్యమునం జరింతు వెపుడుం
ప్రేమ న్నభోవాహినీ
లహరీశీతలగంధవాహ పరిఖే
లన్మంజరీసౌరభ
గ్రహణేందిందిర తుందిలంబులివి మ
త్కాంతారసంతానముల్"

లోఁగడ వుదాహరించిన రీకారపంచకసమాసానికీ మించిపోతూ వుంది యీ ఆంధ్రకవితాపితామహుఁడుగారి సమాసగ్రథననైపుణ్యం. ౧౫ పర్వాలు భారతం తెనిఁగించిన సోమయాజులుగారికిఁగాని, అసలు ఆంధ్రకవిత్వానికే త్రోవ చూపిన నన్నయ్యగారికిఁగాని లేని పితామహబిరుదు కృష్ణరాయలవంటి విద్వన్మహాకవి వూరికేనేనా యిచ్చింది? యిస్తే యిస్తాఁడుగాక, తన్ను ఆశ్రయించిన కవిగదా అని! రాయలు ఆస్థానంలో వుండే దిగ్గజాలు నోరుమూసుకొని వూరుకొనేవారేనా? ఆదిగ్గజాలు రాజుకు భయపడేవారే అయితే యెన్నో కథలు అబద్ధం కావలసి వస్తాయి. సింగభూపాలుణ్ణిగూర్చి—

"సర్వజ్ఞ నామధేయము
శర్వునికే రావుసింగజనపాలునికే
యుర్విం జెల్లెడి నితరుని
సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే."

అని వొకకవి పద్యం చెప్పితే దీనిలో "రావుసింగజనపాలునికీ + ఏయుర్విం జెల్లెడికి" అని అర్థాంతరం తీసిం దెవరు? కవులేకదా! ఆరోజులలో ఆసింగభూపాలుఁడు యేంచేయాలంటే చేయలేఁడు? ఆకవి తీసిన అర్థాంతరంలో వచ్చిన అవమానం అంతా యింతానా? దానికి భూపాలుఁడు బుఱ్ఱకాయ తీయించినా తీయిస్తాఁడనుకోవాలి (ఆయీ అపార్థం భూపాలుఁ డున్న సభలో తీసివుండఁడు, యేచాటునో జరిగివుంటుం దనే వాదం రావచ్చును. దాన్నిగూర్చి మఱో కప్పుడు చూచుకుందాం). అయితే ఆఅపార్థం తీసిన కవిమాత్రం బుఱ్ఱకాయ పోతుందని భయపడేవాఁడై వుంటాఁడా? పోతేపోయింది, బుఱ్ఱకాయ మఱోటి వస్తుం (వాసాంసి జీర్ణాని యథా విహాయ) దనేరకంలో వాఁడై వుంటాఁడు. యిది విషయాంతరం.

పెద్దన్నగారి కిచ్చిన బిరుదాన్నిగూర్చి కాగడా పత్రికతాలూకు సంచికలో యేదో కొంతచర్చ చదివినట్టు జ్ఞాపకంవచ్చి ఆ యీ రెండుమాటలూ వ్రాశాను. తెలుఁగులో ప్రబంధకవిత్వానికి మార్గదర్శకత్వం పెద్దన్నగారియందు వుడడంచేతనే రాయలవారు "ఆంధ్రకవితా పితామహుఁడ యెవ్వ రీడు పేర్కొన నీకుఁ" అనవలసివచ్చింది. అట్లా అనడం న్యాయంగా వుండడంచేతనే దిగ్గజాలు సమ్మతింపవలసి వచ్చిందన్నది పరమార్థం.

ధారాశుద్ధికూడా సహృదయాకర్షకం కావడం వుంది అని వ్రాస్తూ మరికొంతదూరం వచ్చాం. మళ్లా వెనక్కి మళ్లాలి. అభ్యాసావస్థలో అభినవకాళిదాసుగారి భాగవతచంపులో వుండే —

"మురాంతక పురాంతక...ద కూరసమ
యాశయే మనసి శంకరాహ్లాదిని."

లోనైన శ్లోకాలు చూచి ఆమాదిరిని కొంత కవిత్వం నడిచింది. కొంచెం వుదాహరిస్తాను :

౧. "లటిమ్నతి మహో వహార్పతిసుతే జలజేక్షణో
రమాపతి రుమాపతిప్రముఖనిర్జరారాధితే."

౨. "కాంతయా గుణసందీప్తా
కాంతేయా కాంతయా తయా"

౩. "విశ్వామిత్రవచ శ్శ్రుత్వా
విశ్వమిత్ర స్సరాఘవః"

యీవిధంగా వచ్చినమాట మళ్లా వచ్చేటట్టు చెప్పడమే గొప్పనుకొని కవిత్వం చెప్పడం కొంత కాలం జరిగిందన్నమాట. ఆయీమాదిరికవిత్వ మంతా సంస్కృతంలోనే గతించింది. మొట్టమొదటి బందరు శతావధానంనాటికి యింకా యీచేదస్త మయితే వదలలేదు గాని అప్పుట్లో రామన్న పేటకంపెనీవారు శుకరంభాసంవాదాన్ని శ్లోకరూపకంగా తేలిక గా వుండేట్టు రచించి పెట్టు మన్నారు (అప్పటికి పూర్వకవికృతమైనది వొకటి శుకరంభాసంవాదం వుండఁగానే కోరా రన్నమాట). వారికోరికను పట్టే అనకోండి, లేదా అప్పటికే కొంత కస దిగిన స్థితికి కవిత్వం వచ్చివుండడంచేతే అనుకోండి అది సంస్కృతమే ఐనా తెలుఁగుమాదిరినే (సర్వే సర్వత్ర కాదు) యేమాత్రం భాషాజ్ఞానం వున్నా తాత్పర్యం అయే శైలిలో నడిచింది. నాటకానికి వచ్చేవాళ్లు విశేషించి పామరులే వుంటారు. పండితులు అసలే వుండరనే చెప్పవలసివస్తుంది. అందుచేత ఆబాలగోపాలమూ తెలిసే శైలిలో వుండాలని నాటకులు కోరారు.

"తద్బాల్యం ఖలు యత్ర వాఽపి పఠితం
శృంగారకావ్యాదికం
తద్వైవ యౌవన మార్జితం యువతిభి
స్సఖ్యం పున ర్యత్ర వా,
వృద్ధత్వం తు తదేవ యత్ర తు మనో
ముక్తౌ నిమక్తం భవే
త్కాపి దోా న భవే న్మనే! నతు కథం
ముక్త్యాఽభిషిక్తో భవేత్?"

సంస్కృతంలో యింతకంటే తేలికకవిత్వం వుండ దంటే వొప్పని సహృదయు లుండ రనే నేను విశ్వసిస్తాను. యిది రంభ చెప్పే మాట. శుకుఁడు చెప్పే మాట సిద్ధాంతకోటిగా వుంటుంది. కవికి అంతర్భావం చెప్పవలసివస్తే సిద్ధాంతవాక్యంలోనే చెప్పాలి.

"బాల్యం తిష్ఠతు యత్ర మాధవకథా
భక్త్యైవ పునః పఠ్యతే
తారుణ్యం చ తదేవ యత్ర తు మహాఽఽ
సక్తి ర్హరౌ వర్తతే,
వృద్ధత్వం చ తదేవ యత్ర తు మనో
ముక్తౌ నిమక్తం భవేత్
యత్రైతాని న సంతి శుద్ధమనసా
తత్కేన సమామ్నన్యతే?"

ఆయీ కవితారచన బ్రహ్మచారిదశలోనే. విద్యార్థిత్వంకూడా వదలలేదు గాని గురుసాన్నిధ్యంలో వుంటేతప్ప యితరత్రకు వెడితే పండితులలో పద్దు వుండేది. ఆయీపద్దు కాకినాడలో అవధానంచేసినప్పటి నుంచీ ప్రారంభ మయింది. అవధానాలలో యెవరేది అడిగితే అదే చెప్పేవాళ్లంగాని వయస్సు యౌవనారంభంలో వుండడంచేత శృంగారకవిత్వానికి యెక్కువగా పరుగెత్తేది. దాన్నిబట్టే వీథినాటకం వొకటి సంస్కృతంలో రచించఁబడింది. అది చాలా పచ్చిగా వుంటుంది. ధారాలోపం లేదు.

"పశ్యతో మమ మనో హర త్యహో!
పశ్యతో హరమనోహరాంగనా,
పశ్యతా మపకృతం విరించినా
పశ్యతాంను గణికా మకారిణా."

"వేశ్యాఽవశ్యాయభానుప్రతిభటలపనా
లాస్య మాతన్వతే ఽగ్రే"

యీశైలిలో వుంటుంది దానిరచన. శ్రీనాథుని వీథీనాటకపద్యాలు వరవడిగాఁ పెట్టుకొని దాన్ని మొదలు పెట్టాము. ప్రతాపరుద్రీయంలో వీథీరూపకానికి "యత్ర భాణవ దంగానాం క్లుప్తి ర్వృత్తిస్తు కైశికీ" అనిమాత్రం లక్షణం వ్రాసి "ఉదాహరణంతు మాధవ వీథ్యాదికం ద్రష్టవ్యం" అని వ్రాసి వూరుకున్నాఁడు. ఆమాధవవీథిగాని, మఱొకటిగాని యెక్కడా వీథీరూపకాలు అప్పటికే పఠనపాఠాల్లో కనపడడంలేదు. అందుచేత మేం రచించింది (లక్ష్యజ్ఞానం లేని రచన కావడంచేత) అంత మంచిస్థితిలో లేదని తరవాతి తరవాత మాకే తెలియవచ్చింది. దీన్ని అచ్చువేసుకొని మాకు యేవో కొన్ని ప్రతులు మీకు తోఁచినన్ని యివ్వవలసిందని వ్రాస్తే, అది వచ్చాకే అనుకుంటాను, మా పుస్తకాన్ని మాకు వాపసుచేశారు. కొన్ని శ్లోకాలు బాగానే వున్నా చాలా భాగం మిక్కిలి పచ్చి శృంగారంగానే వుండడంచేత యిటీవల యెన్నిమాట్లో సంస్కరించికూడా అచ్చువేయడానికి సాహసించనే లేదు. ఆరోజులకు కొంచెం పిమ్మట రచించిన కాళీసహస్రంలో—

"వక్త్రం చంద్రసమం కుచౌ గిరిసమౌ
  నేత్రే తు మిత్రేఽబ్జయో
ర్వాలా నీలమణిప్రభా ధపటలీ
  సంపల్లవాః పల్లవాః,
ఇత్యాలాపకలాపకం యువతిషు
  శ్రద్ధాలుబుద్ధ్యర్థిరం
వీథీనాటక మేక మంబ రచితం
  పాపాయ నీపాయనే!"

ఆశ్లోకం అపరాధస్తబకంలో వున్నది దీనికి సంబంధించిందే. బాగుండని గ్రంథం ప్రచురించడం కంటే మానేయడం చాలా మంచిదంటూ పండితరాయలు యేదో సందర్భంలో "నోచే ద్దుష్కృత మాత్మనా కృతమివ స్వాంతా ద్బహి ర్మా కృథాః" అని వుపదేశించి వున్నాఁడు. సంస్కృతరచలో కాళీసహస్రం తుట్టతుదిది. దాన్ని వేంకటాధ్వరి విరచితమైన లక్ష్మీసహస్రాన్ని వరవడిగాఁ పెట్టుకొని ప్రారంభించాం. సుమారు వందలదాఁకా అయినాక దానిమీఁద శ్రద్ధ తగ్గింది. దానిరచన మఱీ మాలోకంగా వుంటుంది. ప్రతిశబ్దంలోనూ అక్షరాలు విడఁదీసి యేదో క్లిష్టార్థాన్ని కల్పన చేయాలనే వుద్దేశమే. మచ్చుకు కొంచెం చూపుతాను:

"పద్మం న యోగ్యవస్తు
స్యాదే వాఽతో ల్పమిత్యవస్థాయామ్,
ఇత్యేవ మద్రిజాతే !
కంఠరవేణాంబ! వక్తి నేత్రం తే"

దీని ముఖ్యతాత్పర్యం వ్రాస్తాను. "ఓతల్లీ! నీ కన్నులకు పద్మాన్ని వుపమానం చెపుదామంటే అలా చెప్పడానికి ఆవస్తువు తగిన పదార్థం కాదని నీనేత్రమే కంఠోక్తిగా మాకు చెపుతూవుంది." అని పైకి దానికి కనపడే అర్థం. కంఠోక్తిగా చెప్పడ మేమిటి అని శంక కలుగుతుంది గాని ఆశంక మాద్వారా రహస్యం తెలుసుకుంటేనే కాని (యెవరికో తప్ప) తీరదు. ఆ రహస్యస్వరూపాన్ని వివరిస్తూన్నాను. 'నేత్రం' అనే పదాన్ని విరిస్తే 'న+ఈత్రం' అని విఱుగుతుంది. ఈ = అంటే; లక్ష్మీదేవి; ఆమెను త్రం అంటే కాపాడేది (గృహ మనడంచేత వన్నమాట). మొత్తం 'ఈత్ర' పదానికి పద్మం పిండితార్థం. అట్టిపద్మం న = అంటే కాదు. యెందుకు కాదు అని ఉత్థితాకాంక్ష కలిగితే ఉపమించడానికి తగ్గది కాదు అని తేలింది. యీలాగే భమిడిపత్తికాడలు విడఁదీసినట్లు విడఁదీసికొని వ్యాకరణసూత్రాలమాదిరిని సమన్వయించుకోవలసిన శ్లోకాలే ఆకాళీసహస్రంలో చాలావఱకు వుంటాయి. కొన్ని లోకపరిపాటిగా వుండేవిన్నీ వుంటాయి.

"అచలాధిపోఽయమితి కృత్తివాససే
భువనేఽచలేన భవతీ మదాపయన్,
తమపి స్వయం కృతవతీ మహేశ్వరం
సుకృతాఽతిరేక మపి లోపయంతి కే."

"దోషా స్సహస్రమపి సంతు గుణా న సంతు
మృత్యుంజయే న తదిదంతు విచారణీయమ్,
ఇత్థం విలోచ్య హిమజేఽప్యుత మిచ్ఛసి త్వం,
స్త్రీణాం ప్రధాన మఖిలేష్వపి కుంకుమం హి."

"అగ్నిశిఖాజన్మత్వా
దగ్నిశిఖాఽలంకృతా తవ ప్రీతిః,
అథవా స్వజన్మభవనే
నహి కాసాం ప్రీతి రంబ మహిళానామ్."

యీలాంటి శ్లోకాలు యత్కించిత్ శ్లేష వున్నప్పటికీ సులువుగా తాత్పర్యం అయేవి చాలావున్నాయి గాని కొన్ని బొత్తిగా పాషాణపాకంలో వుండడమే కాకుండా యేదో అగమ్యగోచరప్రాంతగా నడిచినవిన్నీ వున్నాయి. యిటీవల దీన్ని అచ్చొత్తించేటప్పుడు చాలాభాగం శ్లోకాలు త్యజించడానికి అదే కారణం.

చెప్పొచ్చే దేమిటంటే? కవిత్వమనేది లోకం కోసమే అనేది సిద్ధాంతవాక్యమే అయితే దురన్వయంగా రచించడంకన్న అనాలోచితప్పని వుండదనిద్యోవే. మొట్టమొదటిరోజుల్లో మనకవిత్వం మనకేగాని (రంగూను వుత్తరాలలాగు) యితరులకు తెలియకుండా వుండాలి అనే వూహ వుండేది గాని అది కొలఁదికాలం లోనే అంతరించి తేలికశైలికవిత్వరచనకే అలవాటు పడ్డాం. యేదేనా తికమకశైలి మాకవిత్వంలో వుండే యెడల అది సంస్కృతంలోనే కాని తెలుఁగులో వుండదు. తెలుఁగు "గొల్లలకూ గొడ్లకాపరులకూ కూడా" తెలిస్తే తెలుస్తుందేమో కాని సంస్కృతం మాది మాకేగాని (కొన్ని యిప్పుడు మాకుకూడా పుస్తకాపేక్షే) యితరులకు అన్వయించడం సంశయాస్పదమే.

"క్లీబపుంసోస్తు దేవోఽ
స్త్వేకో మత కర్న తత్ర బహు చిత్రమ్,
స్త్రీపుంసయోరపి తథా
లలితే! యద్దృశ్యతే మహ చ్చిత్రమ్"

యీలాంటి శ్లోకాలు కొన్ని వున్నాయి. మాకూ, మాశిష్యులకూ తప్ప యివి కొఱుకఁడవు. యిట్టికవిత్వం యెందుకు చెప్పవలసి వచ్చిందంటే—ఇట్టివి పూర్వులు చెప్పింది కొంత చదివివుండడంచేత అనేది మొదటి జవాబు. రెండో జవాబో? బాగా ఆలోచిస్తే పరిపక్వాంతఃకరణ కలక్కపోవడంచేతనే అని యిప్పుడు విస్పష్టంగా చెప్పవలసి వుంటుంది. ఆరోజుల్లోనే అయితే యిచ్చే జవాబు యీలావుండదు. దాన్ని సమర్థించేదిగా వుంటుంది. యెంతకాలం కవి వొకరిని వరవడిగా పెట్టుకొని రచన సాగిస్తాఁడో అంతకాలం వాఁడి స్వాతంత్ర్యం రచనలో ప్రతిఫలించడం సంభవించదు. మనకవిత్వంలో ఆ అలంకారం వుండాలి యీఅలంకారం వుండాలి అని మనస్సులో పెట్టుకొని రచించిన రచనకూడా హృదయంగమంగా వుండదు. నన్నడిగితే చెప్తా గదా — అసలు కవికి భాషాజ్ఞానమే అవసరంగాని అలంకారజ్ఞానంతో అవసరం లేదనే నేను చెపుతాను. వాఁడు నిజమైన కవే అయివుంటే వాఁడు నోరువిప్పేటప్పటికి, లేదా కలం పట్టేటప్పటికల్లా అక్కడక్కడ అవసరమైన అలంకారాలు (శ్లో. లీలావతీనాం సహజా విలాసాః) వాటంతట అవే వచ్చి యిముడుకుంటాయి. వొకటి మాత్రం వుంది. అలంకారశాస్త్రపరిజ్ఞానం వున్న కవి అయితే యెవరేనా అడిగితే ఫలానాచోట ఫలానా, ఫలానాచోట ఫలానా అని సవిమర్శంగా అలంకారాలు వ్యాఖ్యానించఁగలుగుతాఁడు. ఆపాండిత్యం లేనివాఁడైతే ఆ భారం వ్యాఖ్యాతలమీఁద వుండవలసి వస్తుంది. అలంకారజ్ఞానం లేకపోవడం కవికి లోటు కాదా అంటే, వినండి. కవికి యేజ్ఞానం లేకపోయినా లోటే. "కుటుంబద్గతినుంచి దేవతార్చనదాఁకా" వాఁడి వుద్యోగం. అందుచేతే "అహో భారో గురుః కవేః" అన్నారు అభియుక్తులు. వాఁడికి పనికిరాని శబ్దమూ లేదు, అర్థమూ లేదు, పదార్థమూ లేదు, నీతీ లేదు, ఆఖరికి బూతుకూడా (పదనీతులు పదిబూతులు. చూ) లేదనే చెప్పాలి కాని అలంకారశాస్త్రం బట్టీ పట్టక పోయినంతమాత్రంచేత వాఁడికవిత్వంలో అలంకారాలు పడవనే సంశయం నిరాధార మని తెల్పడానికే నేనింతగా ప్రస్తావించింది.

విషయం విషయాంతరంలోకి దూఁకింది. మా విద్యార్థిదశ యావత్తూ యించుమించు సంస్కృతకవిత్వంతోటే జరిగింది గాని అవధానాలలో యెవరేనా అడిగితే తెలుఁగుకూడా చెప్పేవాళ్లం. తెలుఁగు చెప్పడం చేతనైనా తెలుఁగుకవు లనిపించుకోవడానికిమాత్రం మాకు లేశమూ యిష్టం వుండేది కాదు. శ్రవణానందం విద్యార్థిదశానంతరం కొద్దిరోజుల్లోనే మొదలు

పెట్టిందే. ఐతే శ్రవణానందకవిత్వం అంత తెలుఁగుమయంగా వుండడం యేలా సంభవిస్తుంది? శ్రవణానందరచనకుపూర్వం మేము తెలుఁగులో రచించిన కవిత్వమల్లా రసికానందము (ఇది కాళిదాసాదులశ్లోకాలకు తెలిఁగింపు)న్నూ, శుకరంభాసంవాదపద్యాలున్నూ. రెండోది సంస్కృతంకూడా మాకేకదా! యివి రెండూ కలిపినా యేభై అరవై పద్యాలకు మించవు. అవధానాలలోవికూడా తెలుఁగుపద్యాలు కలుపుకున్నప్పటికీ మహా వుంటే సుమారు మూఁడువందలకు మించవు. అంతమాత్రానికే ధార యింత సాఫుగా వుంటుందా? యెంతసాఫు!

శా. "ఎందు న్నర్క్రము లెత్తి మాటికిఁ దుటా
యించుక్ గనల్ బల్ మిటా
రించుక్ జగ్గళపైచెలంగు వలపూ
రించు న్నగించుక్ బ్రశం
సించు న్నిక్కిం మనోవికారమును సూ
చించుక్ మరుల్ పెంచు న
మ్మించుంబోఁడిస్వభావమో? అతని న
మ్మించం బ్రయత్నించుటో?"

దీనిక్కారణం మా ముత్తాతగారు స్వదస్తూరీతో వ్రాసి ప్రసాదించిన తాళపత్రగ్రంథాలు (మూఁడు వందలు పూర్వకవుల తెలుఁగువన్నమాట) నేను అర్థం తెలిసినా తెలియకపోయినా లేటుచుగా తిరిగేస్తూ వుండడమే అని నేను వూహిస్తాను. యింకోటి వ్రాయవలసిన సమాధానం నిజమయిందే వుంది గాని అది నేను వ్రాస్తే ఆత్మస్తుతికిందకి వస్తుందని భయపడ్డాను. ఆయీకారణం చేత పరమగురుసాన్నిధ్యానికి (కడియెద్దగ్రామానికి) చేరేటప్పటికే నాకు తెలుఁగులో ధారాళంగా అల్లే అలవాటు యేర్పడింది గాని అది కవిత్వం కానేకాదనిన్నీ, యేవో యమకాలూ గమకాలూ వున్నదే కవిత్వమనిన్నీ మనస్సులో వొకవిపరీతాభిప్రాయం వుండేది. అంతే కాదు. సంస్కృతంలో కవి అనిపించుకోవడమే గౌరవావహంకాని తెలుఁగులో కవి అనిపించుకోవడం గౌరవావహంకాదని కూడా వుండేది. అన్నమాటప్రతీదీ నిల్పుకోవడానికి తగిన పాండిత్యం వుంటేనే తప్ప కవిత్వం చెప్పకూడదనిన్నీ వుండేది. యీవూహ నేను పుట్టుకతో తెచ్చుకున్నదే గాని యిటీవల సంపాదించుకున్నదిగాదు. దాతృత్వానికి పరశురాముణ్ణి వుపమానంగా చెప్పి అది తి.శా. ఆక్షేపిస్తే దానికోసం మూఁడునాలుగేళ్లు గ్రంథాలు వెదికి సాధించేదాఁకా నిద్దరపోలేదు. యిది నా ప్రకృతి. అస్థలం "భార్గవుం డీడనఁబరఁగు భార్గవునకుఁ గ్రోధాపవాదంబు గూడదేని." దీనికోపమని అప్రామాణికవాదం చేయడం నా కెంత మాత్రమూ యిష్టం లేదు. యేదేనా భ్రాంతిపడి ప్రయోగించడం జరిగితే అది మళ్లా యేనాలుగేళ్లకో, అయిదేళ్లకో నాఅంతట నాకే స్ఫురించడమే కాని యితరులు చెప్పితే తెలుసుకున్నట్టు యిప్పటికి యెఱుఁగను. యిఁక ముందు చెప్పలేను. కొన్ని ప్రమాదాలు—

౧. శ్లో. "రుద్రాణి ధ్రదాణి తథా దిశేర్క్ర
క్ద్రాజమద్రాక్షం
౨. ఏనా మనూనాకృతిభాసమానాం
౩. మరుద్భూపాలుఁడు
౪. మృతాయితుఁడు"

యీలాటి వేవో పరిమితంగా వుంటాయి. యివి మార్గాంతరంచేత సాధింపఁబడ్డాయి. సాధింపఁబడని ప్రమాదాలు యెక్కడేనా యతో, ప్రాసో తప్పితే తప్పిందని మొట్టమొదటే వొప్పుకోవడమే కాని వాదానికి దిగడంగాని, అచ్చుపొరఁబాటని యెవళ్లమీఁదకో తోసివేయడంగాని నాపని కాదు. నేనల్లా బూకరించి అబద్ధ మాడిందల్లా వొకటే వుంది. అది రామక శబ్దానికి సంబంధించినది. రఘువంశం చదువుకునే రోజుల్లోది. తాళ్లరేవు కేశవపురంలో దేవాలయమండపంలో ఆవూరి విద్యార్థులకూ, నాకూ వాదం పడింది. ఆవిద్యార్థులు 'రామకం' అంటే అర్థం చెప్పవలసిందన్నారు. నాకేం తెలుసునా యేమేనానా! కాని మహా తెలిసినవాఁడిలాగు నటించి "యిదేనా బ్రహ్మాండం అ...వాయువు" అన్నాను. కాదన్నారు ఆవలివాళ్లు. అవునని నేనన్నాను. తుదకి నిఘంటువు చెప్పమన్నారు. "రామకం సుడమారుతం" అని చదివాను. వాళ్లు యిది యేనిఘంటువులో వుందన్నారు. హలాయుధంలో వుందని బదులు చెప్పి బుకాయించాను. అమరమైతే చూచి లేదనడానికి అవకాశం

వుండేవి వాళ్లకు. హాలాయుధనిఘంటు యెక్కడ దొరుకుతుంది? ఆనిఘంటు అప్పటికే కాదు, యిప్పటికీ అచ్చుపడలేదేమో? అంతతో ఆవాదం సమసిపోయింది. ఆవలివాళ్లకూ తగినంత జ్ఞానం లేదు, నాకూ లేదు కనక సరిపోయింది గాని అదే వుంటే నేను చదివిన శ్లోకంలో 'మారుతం' అన్నదాన్ని బట్టే యావత్తూ తప్పు బయటపడేది. మారుతశబ్దం పుంలింగంకదా, 'మారుతః' అనక 'మారుతం' అనడం యేలాగ? యితేకల యెన్నాళ్లకోగాని నాకీతప్పు రఘువంశం చదివేటప్పుడు గోచరిస్తుందా! (యీలాటి దేదనా వ్రాస్తే "నే నంతో ట్లింతోట్లి మదురుగో డెక్కించి పడఁదోశారు" అంటూ వెక్కిరించారు వొకరు. యేమక్కి వచ్చిన పాట్లివి. సంతోషించి వూరుకున్నాను) కవితాధారమాత్రం అప్పటికే వుం దనుకోవాలి. అది సహజం గనక అట్టిది కాదనడానికి అవకాశం లేదు. "చత్వార స్సహజా గుణాః" యిది తప్ప యెవరితోటీ అప్రమాణవాదం చిన్నప్పుడుకూడా నేను చేసినట్టు జ్ఞాపకం లేదు. మార్గాంతరం తొక్కి సాధించినవి లోఁగడ చూపే వున్నాను. నన్ను యితరులు తప్పు పడితే సమాధానం చెప్పడమే గాని వొకర్ని నేనై తప్పు పట్టడం యెఱుఁగను. యెంతటివాఁడేనా సరే, యెంత 'లోయరుక్లాసు' వాఁడిమీఁదకేనా సరే తనంతట తాను వెడితే యెక్కడో గోతులోఁ గూలడం తప్పదని నాకు మొదటినుంచీ భయం వుండేది. అదిన్నీ కాక, ఎవరోకవిత్వంలో తప్పులు చెప్పకుంటే తీరికూర్చుని ఆతప్పులన్నీ యేరి చూపడం భాష మన కెందుకనికూడా నాకు తోఁచేది. అయితే యీఅంశం యితరులకుమాత్రం తోఁచకేనా "కజ్జాకు కాలు దువ్వడా" లంటారేమో? తోఁచకేం, అందఱికీ తోఁచేదే గాని యీ అంశం వ్యక్తిగతద్వేషాన్ని పురస్కరించుకొని కొందఱు ఆలాటిమార్గంలో ప్రవర్తిస్తారు. అదేలా వుంటుం దంటే, యెంత రసాభాసుగా వుండాలో,అంత రసాభాసుగానూ వుంటుంది. ద్వేషానికి కారణం అపవాదకల్పనకు సహించక తిరగఁబడడం. దాన్ని సమర్థించుకోవడానికి మార్గం లేక యేలాగరా వీణ్ణి సాధించేది అని యోజించి యోజించి చివరికి యేతోవా కలిసిరాక, చూదాం అటునుంచి నఱుక్కురమ్మన్నాఁడని వొదకినుంచి వరసపెట్టి వాఁడి పుస్తకమంతా గీట్లు పెట్టి కనపడ్డ పెద్దమనిషికల్లా వినిపిస్తూవుంటే యేకొందఱో యిది సమంజసంగా లేదనడం, దానితో మఱింతకోపం హెచ్చి తిట్టడం, ఆ తిట్లు వినలేక ఆ పెద్దమనుష్యులు శివ శివా అని చెవులు మూసుకోవడం రసాభాసు. యీపంథా నాకు బొత్తిగా సరిపడదు. అందుచేత నే నెప్పుడూ ఆలాంటిపని పెట్టుకోలేదు. నామీఁదకి వస్తే మాత్రం యెవరినీ వుపేక్షించ లేదు. పండితరాయలంతవాఁడు తన్ను వెలేశారనే హేతువును పురస్కరించుకొని కోపాన్ని ఆఁపుకోలేక అప్పయ్యదీక్షితులవారి గ్రంథాలు తప్పుపట్టడం ప్రారంభించి గోతులోఁ గూలి అపహాస్యాస్పదుఁ డైనాఁడంటే యిఁక అస్మదాదుల లెక్కేమిటి, పత్రమేమిటి? అందులోనూ యేదోకోపం మీఁద ఆలాటిపని పెట్టుకుంటే వొప్పులన్నీ తప్పులుగా తోఁచి తుదకి కంఠం పట్టుకుంటాయికూడాను. యిది విషయాంతరం.

విద్యార్థిదశలో యేకొంచెమో తెలుక్కవిత్వం అవధానాలలో తప్పనిసరిచేత మేం చెప్పినా మాకు సంస్కృతకవుల మనిపించుకుందా మనే వుబలాటమే హెచ్చుగా వుండేది. వుంటేమాత్రం నాయిష్టమేనా? తుదకి తెలుఁగుకవులమే అయాము. తెలుఁగులోనే చాలా వ్రాశాము. "తెలుఁగదేల యన్న దేశంబు తెలుఁగేను తెలుఁగువల్లభుండ" అన్నట్టయింది. విద్యార్థిదశలో సంస్కృతమే చెపుతూ వుండేవాళ్లం. తోడివిద్యార్థులు దుశ్శంకలుచేస్తూవుండేవాళ్లు. వాళ్లకీ, మాకూ తఱుచుగా శిఖపట్లగోత్రందాఁకాకూడా వొకప్పుడు వస్తూ వుండేది. మామా తగాదాలు తీర్చలేక గురువుగారుకూడా శ్రమ పడవలసివచ్చేది. ఆశంకాసమాధానాల స్వరూపం కొంచెం చూపుతాను:

శ్లో "పశుపతిదయితాతృతీయపుత్రా
తిరుపతివేంకటశాస్త్రిణౌ కవీంద్రౌ"

అని ధాతురత్నాకరంలో వొకశ్లోకంలో వ్రాసుకున్నాం. పార్వతీదేవికి విఘ్నేశ్వరుఁడూ, కుమారస్వామీ యీయిద్దఱున్నూ కొడుకు లున్నారని అందఱూ యెఱిఁగిం దేనా? మేమిద్దఱమూ మూఁడవకొడుకులం

అని వ్రాసుకున్నాం. దాని తాత్పర్యం పుత్రు వంటి వాళ్ల మనికదా పరిణమిస్తుంది? యిక్కడ చేసే కుశ్శంక చూడండీ, యేలా వుంటుందోను. "అయ్యా! మీ రిద్దఱు కదా! యిద్దఱిలో వొకరు మూఁడోకొడుకై తే యిం కొకరు నాలుగోకొడుకు కావాలిగాని యిద్దఱూ మూఁడోకొడుకులే యేలా అవుతారు" అని శంక. పైకి యిది యుక్తంగా వున్నట్టు కనపడుతుంది గాని విచారిస్తే యింత చొప్పదంటుశంక యిదే గాని మఱోటి వుండదు, వుండనే వుండదు. సమాధానం వినండి. సాహిత్యపుత్రత్వానికై తే అలాటి చిక్కు తగులుతుందిగాని ఆరోపితపుత్రత్వానికి తగలదు. అభినవకాళిదాసు భాగవతచంపులో "త్రినయనదయితాయాః ప్రేమడింభ స్తృతీయః" అని ఇదివఱకే తృతీయపుత్రత్వాన్ని తనయందు ఆపాదించుకొని వున్నాఁడు. అతఁడు మాకంటే పూర్వుఁడే కదా! ఆపద్ధతిని మాలో వొకరికికూడా తృతీయపుత్రత్వం కుదరకపోవలసివస్తుంది. మనకి తెలియడం అభినవకాళిదాసుది మాత్రమే కాని యింకా మఱికొందఱు కూడా యీలాటివారు వుంటే వుంటారు. ఇది యీలా వుంచుదాం. దేవాలయంలోకి తండ్రీ కొడుకు లిద్దఱూ వెళ్లి ఓతండ్రీ, భగవంతుఁడా అని ప్రార్థించారను కుందాం. దేవుఁడు తండ్రికీ తండ్రి, కొడుక్కీ తండ్రి యేలా అవుతాఁడు, కొడుక్కి తాత కావద్దా అనడం యేలాటిదో యిదీ అలాటిదే అని సమాధానం. యిదే మాదిరి శంకాసమాధానాలతోనే విద్యార్థిదశలో కవిత్వపర్వమూ గడిచింది. మాదగ్గిఱ చదివేవిద్యార్థులంతే వాళ్లని "పశుపతిదయితాపాత్రు లోయి వీరు" అంటూ వెక్కిరించేవాళ్లు కొందఱు సతీర్థ్యులు. యీలా కిందా మీఁదా పడుతూ పరస్పరజయేచ్ఛలతో వర్తించడం పేరే స్పర్ధంటారు. "స్పర్ధయా వర్ధతే విద్యా" కనక దీనికి ప్రధానఫలితం విద్యాభివృద్ధి. దానికి యీస్పర్ధ వంటి దోహదం లేదు. కాని యిది కొంత శత్రుత్వాన్ని కలిగిస్తుంది. తి. శా. నాకంటె కొంత ముందుగా ప్రవేశించాఁడు గురుసాన్నిధ్యాన్ని. అతనికంటే యే మాత్రమో ముందుగా ప్రవేశించాఁడు సుబ్బయ్య శాస్త్రుల్లనే వొక విద్యార్థి. అతనికి తి.శా. కన్న గ్రంథం చాలా యెక్కువయింది కాని వాదోపవాదాలువస్తే యితనిదే పయిచేయిగా వుండేది. దానిమీఁద సుబ్బయ్య శాస్త్రుల్లకి తి. శా. అంటే అంతా యింతా కాదు, చంపేదామన్నంత అసూయ వుండేది. ఒకప్పుడు కలియఁబడి కొట్టేవాఁడు. తిరిపంగాఁడనడమే కాని అతని పేరు సరిగ్గా వుచ్చరించడానికి యెప్పుడూ ఆ సుబ్బయ్య శాస్త్రికి యిష్టం వుండేదే కాదు. వీ రిద్దఱూ పరమ శత్రువులుగానే వుండి విద్యాభ్యాసం చేసే రోజులలో నేను విద్యార్థిగా వెళ్లాను. తరువాత మాయిద్దఱికీ ప్రారంభమయింది రంధి. నేను అప్పటికే కవిని; అంతో యింతో పౌరాణికుణ్ణి. నేను కవిత్వం చెపితే తి. శా. ఆక్షేపించడం. ఆచాపతే లోఁగడ వుదాహరించినది. "భార్గవుం డీవఁ బరఁగు" అన్నచోట పూర్వపక్షం. పరశురాముఁడు రాజుల నందఱినీ వధించి యావద్భూమినీ బ్రాహ్మణులకు దాన మివ్వడంచేత ఆయన్ని శిబి, దధీచి మొదలైన మహాదాతలలో పరిగణించవచ్చునని నే ననుకున్నాను. అంతేనేకాని యెక్కడో చూచి వాడలేదు. అతఁడు భూదానం చేసిన మాట సత్యమే కాని కవు లెవ్వరూ వాడలేదు గనక కవిసమయసిద్ధం కాదని తి. శా. వాదం. గురువుగారిదాఁకా వెళ్లింది. వారికి శాస్త్రాలగోలే కాని, కవిత్వమన్నా సాహిత్యమన్నా బొత్తిగా నిస్పాకారం. అందుచేత యెటూ చెప్పక పూరుకొని రాజీచేయడానికి ప్రయత్నించేవారు. తుదకి వెతగ్గా వెతగ్గా మహాకవిప్రయోగమే దొరికింది. దొరికితేమాత్రం అంతతో ఆవాదం ఆఁగుతుందా? ఆలా ప్రయోగించిన కవికి తగినంత కవిసమయజ్ఞత్వం లేదంటూ మళ్లా పిడివాదం. యీలాగే కొట్టుమిట్లాడుతూ కాలక్షేపం జరిగేది. యిది కవిత్వవిషయంలో వాదోపవాదాల గోల.

యిఁక అప్పుడు చదువుకునే శాస్త్రవివాదాన్ని గూర్చి వ్రాస్తాను. అనాధ్యాయాలల్లో గురువులే శిష్యులకు కొంత పోట్లాట నేర్పుతారు. యీలా నేర్పడం యెందుకంటే? దీనివల్ల కాశీలో వీరికి కొంత జీవనాధారం వుంది. యాత్రకు వెళ్లిన రాజులు మొదలైన సంపన్నులు పండితసభ చేసి శక్త్యనుసారంగా సత్కరిస్తూవుంటారు. ఆసభలలో పూర్వపక్షంచేయడం

విద్యార్థులవంతుగాని సుప్రసిద్ధులైన పండితుల వంతు గాదు. యెందుచేతంటే? పూర్వపక్షం యెప్పుడూ పూర్వపక్షమే(ఉత్తరపక్షంచేత కొట్టుకుపోయేదే)కనక తుట్టతుదకి పూర్వపక్షంచేసిన వ్యక్తి వోడిపోయినట్టు పరిణమిస్తుంది. దానితో వొక్కొక్క దేశానికో, వొక్కొక్క లోకానికో సరిపడ్డ పండితులు ఆలాటి అవమానాన్ని భరింపలేక మంత్రశాస్త్రద్వారా వొకరినివొకరు చంపుకోవడం దగ్గిఱికికూడా రావడం క్వాచిత్కంగా సంభవిస్తూవుండడంచేత యే విద్యార్థిచేతో పూర్వపక్షం చేయించడం ఆచారమయింది. దానిమీఁద ఆ పెద్దపండితులుఅందుకుని సభ చేయించినవారికి వినోదంకలిగేటట్టు కొంతసేపు మాట్లాడడం ఆచారం. ఆలాటిసభలకు ఆహ్వానం రావడం కొంత వాగ్ధాటి వున్నవాళ్లకేఁ గాని సంభవించదు. దాన్ని గురువులు నేర్పడం కాశీలో ఆచారం. ఆ పండితులు యీదేశం వచ్చి శిష్యులను తయారు చేయడంలో ఆవిధానాన్నే అనుసరిస్తారు. ఆయీ శాస్త్రార్థాలు వగయిరా యిప్పటి నవనాగరికులు యీసడిస్తారుగాని వీరు ఫీజుకోసం కోర్టులలో వాదించే వాదాలు పూర్వరకం పండితులు ఆక్షేపిస్తే జవాబు మాత్రం చెప్పలేరు. "పరధనమ్ము హరించెడి త్రోవ లిన్నియున్" అన్నాఁడు దేవీభాగవతకర్త. అవి యేవంటే, యివి:

ఉ. "దేవతలన్ యజింత్రు పర
  దేశములన్ జరియింత్రు దాతలై
కోవిదకోటికిన్ ముదము
  గొల్పుదు రుత్తము, లల్పలోభులో
జీవుల హింస సేయుదురు
  చేయుదు రెంతయుఁ జౌర్యముం దగన్
భావనఁజేయఁగాఁ బరధ
  నంబు హరించెడి త్రోవ లిన్నియున్."

వొకరివృత్తి వేఱొకరికి ఆక్షేపణీయంగా కనపడడమే కాని బాగా ఆలోచిస్తే అన్నీ ఉదరపోషణకే అవలంబించడం. కాశీపండితులకీ, యితర పండితులకీ వొక భేదం వుంది పరిగ్రహించే విషయంలో. యేదానమైనాసరే (కుక్క దానంబట్టి కుటుంబాన్ని రక్షించుకో మన్నాఁడు) నిరాఘాటంగా పడతారని వినడం. మనదేశప్పండితులు కన్యా, భూ, సరస్వతీ దానములు మాఁకూ తప్ప తదితరదానాలు సుతరామూ స్పృశింపనివారుకూడా వున్నట్టు కొన్ని యితిహాసాలున్నాయి. పోతరాజుగారు యీభావాన్నే బాగా బలపఱిచారు. "మర్యాదన్ జెందు కరంబు క్రిందుగుట మీఁదై నాకరంబుంట మేల్గాదే" అన్నారు. ఆయీ వేదవేదాంగవిద్యాభ్యాసం వుద్యోగాలకు పనికి వచ్చే దెప్పుడూ కాదు గనక వీళ్లజీవనం భవిష్యత్తులో భిక్షాటనంద్వారాగానే జరగవలసి వుంటుందని కాఁబోలును తమతమ విద్యార్థులకు గణపతి నవరాత్రపూజోత్సవవ్యాజంమీఁద యాచనకూడా అలవాటు చేసేవారు. యెంతసేపూ నిరాడంబరంగా వుండడమే వారికి యిష్టం. వొక్కవిద్యలోతప్ప వారికి పట్టుదల లేనేలేదు. అట్టి మహనీయుల శుశ్రూషా కాలంలో పుట్టుకతోనే వెంటాడించిన కవిత్వాన్ని పూర్వోక్తరీతిని వృద్ధిపఱుచుకున్నాం. నేను యీ వ్యాసంలో వ్రాసిన సోద (ప్రసక్తానుప్రసక్తాలుకాక) యీవఱకు ఒకశార్దూలశ్లోకం కొంతలో యిమిడ్చాఁడు వొక ప్రాచీనమహాకవి:

శ్లో. "బీజం యస్య పురార్జితం సుచరితం
  ప్రజ్ఞా నవీనాంకురః
కాండః పండితమండలీపరిచయః
  కావ్యం నవః పల్లవః,
సూక్తిః పుష్పపరంపరా పరిణతి
  స్సోఽయం కవిత్వద్రుమః"

దీనిలో వుదాహరించిన సామగ్రీసంపాదనానికి మేము చిన్నప్పటినుంచీ పడ్డ పాట్లు వుదాహరించాను. దీన్ని ఆత్మశ్లాఘకి వ్రాసినట్టు భావించేవారున్నా వుంటారు. దీన్ని అట్టివారికోసం నేను వ్రాయలేదు. వొకవిద్యార్థి — మిన్నపూరు ప్రాంతంలో రామకృష్ణామిషన్ పాఠశాలలో చదివేవాఁడు, మన ఆంధ్రదేశీయుఁడు—మన ఆంధ్రదేశంలో మీచిన్నతనంలో విద్యాభ్యాసపద్ధతి యేలావుండేదో పత్రికాద్వారాగా ప్రచురించవలసిందని కోరివున్నాఁడు. అతనిమాట త్రోసివేయఁదగ్గది కాదని, 'వెనుకటి పండితులు' అనే వ్యాసంలో ప్రసక్తి కల్పించి కొంత వ్రాశాను. అది

కృష్ణాపత్రికలో ప్రకటితమయింది. మఱికొన్ని విశేషాలు యీమినమీఁద ప్రకటించినట్టయింది. యిఁక దీన్ని ముగిస్తున్నాను. సంస్కృతంలో తప్ప తికమకకవిత్వం మేము తెలుఁగులో రచించనేలేదు. పండిత కవులౌదురా, కారా అనే సందేహం తీర్చడానికని విజయనగరం మహారాజావారిమీఁద చెప్పినపద్యాలలో కొన్ని తికమకధోరణిలో నడిచినవున్నాయి. కొంచెం వుదాహరిస్తాను:

౧. తే. అర్థవత్తని-అర్థవతూన్నక్రమందు నీయశముకొంత
గాఢముగఁ జెప్పెఁ బాణిని కువలయేశ!

౨. శ్లో. తత్కిం చంద్రాతపోయం –
శాస్త్రార్థం కుర్వతే – తార్కికాః.

౩. శ్లో. అస్వాస్థ్యమానవహాయః –
ఆనందభూమిపతి శేవహి రాజమాలిః.

౪. క. మాపసమానీపాగమ, గాపసమా! –
పరిపరితుష్టిఁ జెంద నానందనృపా!

ఆమహారాజు యీకవిత్వంకంటేకూడా తేలిక శైలిలో వున్న

సీ. "విక్రమార్కునితోడ వెంచేయకుండునే
భోజభూపాలుండు పుట్టఁడేని"

మొదలైన పద్యాలకే యెక్కువగా సంతోషించినట్టు తోఁచింది మాకు. కవిత్వమన్నప్పుడు చట్టన భావం యెదటివాళ్లకి (యేమాత్రం సంస్కారమేనా వుంటేనే) అవగాహన మయేమాదిరిగా వుంటేనే తప్ప ఆలా వుండక కొన్ని నిర్జీవసాధనాలూ (నిఘంట్లు), కొన్ని సజీవసాధనాలూ (పండితులు) పనిచేస్తేనేకాని అవగాహన కాని స్థితిలో వుంటే "మూఁగ చెవిటివారి ముచ్చట" అని మొల్ల చెప్పిన తరగతిలోకే చేరుతుంది. పాండిత్యం చూపుకోవాలంటేకూడా ఆ సులభమార్గంలోనే చూపుకోవచ్చు. పాండిత్యంతోవ పాండిత్యానిదే, కవిత్వంతోవ కవిత్వానిదే. పాండిత్యం అభ్యాససాధ్యం.

శ్లో. "ముగ్ధేనాఽపి నితాంతఘర్షణవశా
ద్విద్యా పునశ్ఛాందసీ
సంపాద్యైవ.........
శాస్త్రంచాఽపి తథైవ కింతు కవితా"

కవిత్వం అట్టిది కాదు. ద్రాక్షాపాక కదళీపాకాలే దేశభాషాకవిత్వానికి పరిగ్రహణయోగ్యాలు. తక్కినవి క్వాచిత్కంగా మాత్రమే గ్రహించ తగ్గవి. తెలుఁగులో అడుసుపెట్టేనాఁటికే దానంతట అదే మా కీలాటిబాఁటు పడింది. దీనివల్లనే మేము లోకాను గ్రహానికి పాత్రుల మైనాము. కంకణబంధం చెప్పి పెద్ద పెద్ద అగ్రహారాలు సంపాదించినవారు వున్నారు. ఆ అగ్రహారాలు శాశ్వతంగా జరుగుతూ వున్నాయి. ఆబంధం యెవరికీ రాదు. వస్తే అర్థం రాదు. అర్థంసాధిస్తే తాత్పర్యం కాదు. దీన్నిబట్టి కవిత్వం సులభంగానే వుండాలో, కఠినంగానేవుండాలో పరిశీలించుకోవచ్చు. నన్నయ్యగారి "నిండుమనంబు" పద్యమే అనండి, తిక్కన్నగారి "చిచ్చుఱకన్ను మూసికొని" పద్యమే అనండి, యెఱ్ఱన్నగారి "నీమగఁ డంత యెక్కడె?" పద్యమేఅనండి, యెందఱికో వాచోవిధేయంగా వస్తాయి కదా! కంకణాదిబంధాలో? ఆలా వస్తాయా? ఆపద్ధతిని "లోకుల రసనలె యాకులుగా నుండునట్టివి" యేకవిత్వాలవుతాయి? అయీ భావం నేను నూతనంగా కల్పించింది కాదు, ప్రాచీనకవులలో పరిపక్వమనస్కులంతా యీ అభిప్రాయాన్నే వెలువరించారు. "అంతర్గూఢా నర్థాన్ ... న రసః ప్రీత్యై రసజ్ఞానామ్" అన్నాఁడు ఆచార్యగోవర్ధనుఁడు. అక్కడక్కడ ఆయీ సంగతులు వుదాహరించినవే. మళ్లా చర్విత చర్వణ మెందుకు? అప్పకవి "నిలుకడ వలయు" అన్నాఁడు కనక కవిత్వానికి దీర్ఘాలోచన అవసర మని కొంద ఱంటారు. కొందఱిఅనుభూతి అట్టిదే కావచ్చునుగాని నా అనుభూతి అట్టిది కాదు. అసలు వర్ణ్యం మనస్సుకు నచ్చిందయితే ఆశువులో రచించినా బాగానే వుంటుందనిన్నీ, నచ్చనిదైతే యెంత వ్యవధి పుచ్చుకున్నా రసవత్తరంగా వుండదనిన్నీ నేననుకుంటాను. దీనికి కొన్ని వుదాహరణాలు చూపుతాను.

కీ. శే. గద్వాలరాజాగారు అవధానంలో కోరిన పద్యం యిది:

సీ. "పురుషాయితే మొనర్చు పూఁబోఁడికటిమీఁద
నాట్యంబు సల్పు పుణ్యమ్ము కాలికో?
తే-గీ. వేణి కాంతలవెన్నంటి వ్రేలుచుండె
లేకయుండిన నిధువనలీల కుపచ
రించునంగమ్ము లెదుటనే సంచు నించ
దాని కట్టుండ నేయుపద్రవము వచ్చె"

తీరికగా సావకాశంగా కూర్చుని రచిస్తే మాత్రం యింతకన్న బాగుంటుందా పద్యం? దీనిమీఁద మళ్లా రాజాగారు శంకిస్తే చెప్పినపద్యంకూడా వుదాహరిస్తాను:

మ. "ఎదుటన్ వర్తిలువట్టియంగముల కెం
దేని న్నఖాదిక్షతా
పద పల్లాఘలును గల్గుసంగతిని దాఁ
బ్రత్యక్షముం జూచి సె
మ్మదిలో భీతిలి చాటుచో టనుచు సం
భావించి వెన్నంటుచుం
బోదలం బోలును వేణి, లేకునికిఁ దా
ముం దుండ కట్టుండునే?"

యింకా అవధానాలలోనుంచి యీలాటివి కొన్ని చూపవచ్చును. భారతాది గ్రంథరచయితలందఱూ ఆశుకవితావిశారదులే. కాని మెల్లిగా ఆలోచించి వొక్కొక్కవాక్యంవంతున రచించినవారు కారనే అనుభవజ్ఞులు అంగీకరిస్తారు. వొక్కొక్కప్పుడు కోపం మీఁదకూడా కవిత్వం బాగా నడుస్తుంది. యీపద్యం ఆబాపతే:

సీ. "నిన్నుఁ గాల్చినఁ గాని నీబుద్ధి మానదే!
ఛీ! యేమనందునే! చీకుముల్ల!"

యిది వేమవరాగ్రహార శతావధానంలోది. పృచ్ఛకుఁడు అడిగేటప్పటికల్లా వూడిపడ్డదే యీచరణం. పృచ్ఛకుఁడు శ్రోతకోటిలోనివాఁడు. చీకుముల్లు స్వల్ప వస్తువుగదా! దీనిమీఁద సీసపద్యం చెప్పఁగలుగుతారా అని పృచ్ఛకునివుద్దేశం. అప్పుడు వుండే శ్రోతకోటికి తెగిలేటట్టు పద్యం యెత్తుగడ. పేరుకు చీకుముల్లు గాని పద్యంలో ప్రతిపాద్యం వేఱుగదా! యిఁక మేటరుకు లోటేమిటి? సమృద్ధిగా దొరికింది. తుదకు పృచ్ఛకుని వుద్దేశం తాఱుమాఱై మాకు మేటరు సమకూర్చిపెట్టినట్టయింది. శ్రోతకోటే కానక్కఱలేదు, అవధానాలలో మిత్రకోటికూడా చాలా తిప్పలు పెడతారు. వాట్లనన్నిటినీ నేర్పుగా, శాంతంగా సమర్థించుకొనే శక్తి (ధారణాశక్తివల్ల అవి సమర్థించఁబడవు) వేఱే వుండాలి. ప్రతిపాద్యం మనస్సుకు నచ్చిందయితే ఆశువులో చెప్పినా పద్యం బాగానే వుంటుందన్నది వక్తవ్యాంశం. యీ అంశమందు మాకు బాగా నమ్మకం వుండఁబట్టే ఒకసభలో పట్టుపటాంగం వచ్చి యీవిధంగా ప్రతిజ్ఞ చేయడానికి సందేహించ లేదు. దాన్ని వుదాహరిస్తాను:

చ. "ఇతరకవుల్ ప్రయాసపడి
యెంచి రచించిన నాటి కన్న పె
ద్దతనము గాంచి సత్కవులఁ
దన్పునొ, మే మవధానసంగత
స్థితిఁ గని ఆశుగా రచనఁ
జేసినపద్యములందుఁ జూచినన్
శతమున కన్ని పద్యములు
జక్కఁగ నందు నసంశయమ్ముగన్."

మామట్టుకు ఆశువులో సాధ్యంకాదని తోఁచిందల్లా చిత్రబంధకవిత్వాలు మాత్రమే. యీ సంగతి కూడా ఆరోజుల్లో వివరించేవున్నాము:

"ఉ, త్తానశయానుఁబొమ్మన న
ధర్మము గా బరు వెత్తినట్లు బం
ధానఁ గవిత్వ మల్లు మన
ధానమునం దన మర్త్యకోటి సె
వ్వానికి శక్యమౌను గల
వాణికి వాణికేఁ గాక..."

ఏదో ప్రాప్తావుంటే పెరుఁగుతూనేవుంటుంది. మేము మొట్టమొదట తెలుఁగులో కవిత్వాన్ని మొదలు పెట్టి పిమ్మట తెలుఁగుకవుల మనిపించుకోవడానికి యిష్టం లేక సంస్కృతంలోకైతే దిగాము గాని తుట్టతుదకు తెలుఁగుకవులుగానే లోకానికి పరిచితులమైనా మన్నది యీవ్యాససారాంశం. తెలుక్కు

సమగ్రమైన వ్యాకరణం లేకపోవడంచేత కేవలం దానితో కాపరం ఉండ నెగ్గదని తలంచి భారతాది మహాకవుల ప్రయోగాలు ప్రత్యక్షరశోధగా చదివి తదనుగుణంగా రచన సాగింపుకున్నాం. మాకు భారతాదులు చూడవలసిన ప్రసక్తి రచనకోసం ఆవశ్యకం కాలేదు. రచన అవి చూడకపోయినప్పుడెంతో చూచినప్పుడున్నా అంతే. శ్రీనివాసవిలాస రచన పర్యంతమూ సాగిన రచన శ్రవణానందాదికం నాటికి పట్టుదలగా భారతాదికం లక్ష్యాలకోసం పరిశీలించలేదు. శ్రీనివాసవిలాసం వినికిచేసేటప్పుడు ప్రతిపదమందూ (తెలిసీ తెలియని) శంకలు చేసే పండితుల మూలాన అట్టి అవసరం కలిగింది. యితరకవులని అసలే వొప్పమనిన్నీ, భారతమాత్రం యిస్తే వొప్పుతామనిన్నీ, దానిలో నేనా నన్నయ్యగారిని వొప్పినంతే ప్రమాణంగా తిక్కన్న ఎఱ్ఱన్నగార్లని లేదనిన్నీ ఆ సంస్థానపండితులు ఒక కొత్త పంథాలోకి దిగి చాలా తిప్పలు పెట్టారు. అప్పుడు భారతలక్ష్యాల ద్వారా వారివాదం ఖండించి రాజాగారికి సంతుష్టి కలిగించవలసివచ్చింది. వారిధర్మమా అని మాట్లాడేటప్పటికల్లా ప్రయోగం (నాటికి తొంభై తొమ్మదులకు భారతమే) యిచ్చే త్రోవ అది మొదలు యేర్పడింది. మేము 'శ్రీగురుభ్యో నమః' అని చదవకపోయినా ఆ సంస్థానపండితులు మాకు యీవిషయంలో గురువులే అయినారు. తెలుఁక్కి లక్ష్యజ్ఞానమే విశేషించి కావలసింది. యెందుకంటారు? సమర్థనానికి. రచనకో? అక్కఱలేదు. జిజ్ఞాసువులు యీమాట బాగా జ్ఞప్తిలో వుంచుకోవాలి.

సాత్రాజితీయము

= శ్రీ ద్వివేది సూరి =

నారదుడు తెచ్చియిచ్చిన పారిజాత - కుసుమ మెవ్వతెకో గాని యొసగి తంచు
ఇంత కోపింప బనియేమి? ఇపుడు నీకు - వలయునో నిచ్చెదను ప్రాణనాయకంబు.

తన్నితి వొక్కపాదమున దానికి నే దిగులొందబోన్మరే
మన్న త్వదీయ పాదతలమందున గాయము తాకునంచు నే
నెన్ని పదేపదే పరితపింతు సఖీ! పొలయుల్కనేటి యీ
తన్నున శాంతి బొందగలదా! మననెయ్యము కోరకించెడిన్.

ఆ పారిజాతకుసుమపు - గోపము నాతోడ జెప్పికొనరాదె చెలీ!
గోపాలిక నీ కెక్కడ - దాపురమాయెను రహఃకథాశ్రుతిపొంకిన్.

ఇత డొక తప్పుచేసిన సహింపవలెన్; నవరింపనోపు నీ
వితరునివోలె జూచి పదియేనో పదారో చివాట్లనో మరే

వితములనో ఘటింప బిరుపీకు ఘటిల్లదె? ప్రాజ్ఞురాలవై
పరిజితవై, విశాలమతివై, సఖివై, ఇటు లుంట చెల్లునే?

నీ నీ నేర్పిన ప్రేమయుద్ధము లదండిగ గూర్చి నా బుద్ధిలో
నానాస్థానము లాక్రమించినవి నానా ప్రేమలన్ జీల్చి ఆ
యీనెయ్యమ్ముల జీవముల్ పెరికితో మా సింహపీఠమ్ములం
దే నిత్యమ్మయి నిల్చిపో, మఱపు రానేరావు, సామ్రాజ్ఞీ!

నిజము గుర్తించుచో నీకు నెమ్మి గూర్చ - భర్త నే గాను, పోని, నా ప్రాణములను
నీ హృదంతరపేటిక సాహసమున - దాచిపెట్టుము నాథుడా తథ్య మిదావు!

మన నెయ్యమ్మును పాలలో గలిపి కమ్మంగా సమానమ్ముగా
చిననాడే తెగత్రాగగా కడుపులో జీర్ణించి రక్తమ్ము న
య్యెను, నెమ్ముల్ గదలించి గట్టిగ ప్రతిష్ఠింపంబడెన్, చర్మమం
దు, నరాలందు నిగారముల్ మెఱయుచుండన్ దీయగా శక్యమే?

ఒకనాడు నీపాప పకపక నను జూచి నగ నదె నాకు నానందవీచి
నీతార వన్నె వెన్నెలశయ్యపై నుంచి పొంగించె నద్ది కహ్లారకలన
ప్రతిలేని వడలు నామతి దొంగిలించె నా కదియె సాయుజ్యపుణ్యప్రదాయి
తులలేని పైటవస్తువుల తెమ్మెరలు నాహ్వానింప నందుకొన్నాను తృప్తి
రదనపంక్తిని జలజల రాలినట్టి - పలుకుముత్యాల దెగదిని కులికినాను
ఇంత జీవము పోసిన యిట్టి నీదు - కులుకు మఱువంగ నంత మూర్ఖుడను కాను.

శూరుడు పరాఙ్ముఖుండై - ధీరత గోల్పోయి, వివశ దీధితిపాలై
యేరీతి దయూరానో - నీరీతి యెడంద తలచి నే నెఱుగంగన్.

పామరత్వము గా దది ప్రేమచర్య - దెలిపితివి ఒక్కతాపున తెలిసికొంటి
మనదు దాంపత్య మెన్నాళ్లు చనిన గాని - యిట పరస్పరమైత్రి గుర్తింప లేమె?
స్నేహబీజాలు మనల నాశించి బ్రదుకు - ఇంత గుర్తింప లేకుంటి వేల సత్య!



సీరియల్ నాటకము

రాజరాజు

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

పధ్నాలుగో రంగం

పడమటి ప్రాకారానికి చేరివున్న పూలతోట. ఉదయం, అయిదారు గడియల పొద్దెక్కింది.

పగటిపువ్వు లన్నీ చక్కగా వికసించి వున్నాయి.

దక్షిణదిక్కునుంచి సంపంగి పువ్వుల పరిమళం రివ్వున దూసుకువస్తోంది.

పక్కనే వున్న బొండుమల్లె పొదలమీద, చక్కని పాటలు పాడుతూ, కొదమతుమ్మెదలు చక్కగా నృత్యం చేస్తున్నాయి.

ప్రకృతి అంతా ప్రసన్నగంభీరంగా వుంది.

సారంగధరుడు, దిగుడుబావి పిట్టగోడమీద కూచునీ, సుబుద్ధి, పక్కగా, గోడ కానుకుని నుంచునీ వున్నారు.

నాలుగైదు గజాలలో వున్న పొగడచెట్టుకింద నుంచి రెండు మూడు పావురాలు, వుండుండి వచ్చి సారంగధరుడి దగ్గిరగా గోడమీద వాలుతూ, అతను ఆదరించకపోగా చెట్టుకింది కెగిరిపోతూ ఆటమటించిపోతున్నాయి.

వారిద్దరూ చింతాక్రాంతు లయి వున్నారు.

***

సారంగధరుడు— మరి నామాట? నాకేనా మరో నాలుగు కాలాలు బతికి వుండకపోతే నాగతి యేమికానూ?

సుబుద్ధి — అంతా అయోమయంగా వుంది. ఏమీ కనపడదు, ఏమీ తోచదు.

సారంగధరుడు—వ్యాసులవారి రచన, యెన్నిమాట్లు చదివినా యేదో లోటున్నట్టే తోస్తూ వుంటుంది. తృప్తి కావడం లేదు. నన్నయభట్టారకుల వారి రచన, చదివినకొద్దీ నూత్న రుచులు పుడుతున్నాయి. హృదయాని కాహ్లాదమున్నూ కలుగుతోంది. అటు సంస్కృతమర్యాదలూ, యిటు తెలుగుజాతీయాలూ మిళితం కావడంవల్ల వారి భావ గంభీరమై ఆ యితిహాసానికి మెలిచినట్టు సరిపోయింది. అలాంటి భావంలో గ్రంథం అంతా కాకపోయినా— అధమం ప్రారంభమై కొంత నడిచివున్న అరణ్యపర్వమయినా పూర్తికాకపోతే యెలాగా?

సుబుద్ధి—ఒక్క అరణ్యపర్వమే అన్నమాటేమిటీ, భారతం యావత్తూ వొక్కవూపున పూర్తి చెయ్యాలన్నంత ఆవేగం వుంది వారికి. అవున్నాదానికీ ఆవేగం తోడు కాగా, మహారాజులుంగారిమీద అలిగి తాము భారతరచన కట్టిపెట్టేసిన శపథం కూడా స్మరించుకోలేని స్థితిలో వున్నారు వారు. నిన్న

మధ్యాహ్నం నే నక్కడ వుండగా "ఈపాటికి యుద్ధ పంచకం ముగిసివుండక పోయేదా?" అని చీదమయ్య గారి నడిగి, అంతలో నారాయణభట్టుగారు రాగా "ఇంత జాప్యం అయితే యెలాగోయ్? సంపుటం విప్పా, గంటం పుచ్చుకో" అంటూ నాలుగుమాట్లు తొందర పెట్టారు వారిని.

సారంగధరుడు—వారు చేసిన తప స్సెంతటి దో, వారిని ముసురుకున్న జాడ్యం యెటువంటిదో గమనించారా తమరు ?

సుబుద్ధి—అంతటి తపశ్శాలి కనకనే, వారింకా ఆస్థితిలో నైనా వుండగలిగారు. ఉన్మత్తు లైన సాధారణుల నందర్నీ మనం చూడ్డం లేదూ ప్రభూ? "శారద రాత్రులు—శారదరాత్రు" లని మననం చేసుకుంటూ తరవాయి అందుకోడానికి వా రుద్యుక్తు లవుతూ వుండడం చూడగా, అలాంటిస్థితిలో కూడా కవితాశక్తి వారి కెంత వాచోవిధేయంగా వుండినదో, ఆ క్షుద్ర వ్యాధి దా న్నెంత తిరస్కరిస్తూ వుండిందో కళ్లకి కట్టి నట్టు కనపడింది నాకు.

సారంగధరుడు—(దుఃఖం సమాళించుకుంటూ వూరుకుంటాడు)

సుబుద్ధి—ఈ స్థితిలోకూడా ముందు వారే తమ సన్నిధికి రావా లనడం కంటే, మహారాజులం గారే వొక్కమాటు వారి సన్నిధికి వేంచెయ్యకూడ దూ ప్రభూ ? ఇంతట్లోనే—(అర్ధోక్తి)

సారంగధరుడు—(ప్రకృతిస్థుడై, ఏమన్నారూ?

సుబుద్ధి—ఈస్థితిలో కూడా ముందు వారే తమ సన్నిధికి రావా లనడంకంటే మహారాజులంగారే — (అర్ధోక్తి)

సారంగధరుడు—అది మంచి మాటే. కాని ఎవరికీ ? సంపాదితకుంగా మనం ధర్మనిర్ణయం చేస్తే యిక్కడ చెల్లుతుందా ?

సుబుద్ధి—ఇందులో వుండుకున్న విప్రతిపత్తి యేమిటి మహాప్రభూ ?

సారంగధరుడు— అంతేనా. విప్రతిపత్తి కాని దేమిటో సెలవివ్వండి. ఏమంటే ? వారు మహారాజులు; వీరు మహాకవులు. సామాన్యధర్మాలకు ఉభయులూ అతీతులే. వారి పట్టుదలకి వారికీ కారణా లున్నాయి; వీరి పట్టుదలకి వీరికీ హేతువు లున్నాయి. ఎవరు తీసిపోతారూ ? ఇది యోచించు కోకుండా మనం పేరాసలకు పోవడం మంచిదా ?

సుబుద్ధి—(చకితు డయి వూరుకుంటాడు)

సారంగధరుడు—ఏం, నామాట తమకి విపరీతంగా కనపడుతోందా ? బాబయ్యగారు కొంత సందిచ్చారు, తమరు మరిచారా ? అయినా గురుదేవులు వినకపోయారే ? తమ పట్టుదల—(అర్ధోక్తి)

సుబుద్ధి—అదీ యెరుగుదును. మా నాయనగా రెంతదూరం మనవి చెయ్యాలో అంతదూరమూ మనవీ చేశారు. ఈవిఘ్నం తమకున్నా అనర్థకారే అని— (అర్ధోక్తి)

సారంగధరుడు— అవనే అయింది కాదూ ?

సుబుద్ధి— అవునవును. పావులూరి మల్లన్న గారు ఈమాటే సెలవిచ్చారు. రెండు చేతులూ పట్టుకుని వారు భట్టారకులవారిని బతిమాలారు. చివరికి "దోషం మీమీదే వుండిపోతుం" దని ముదలకించారు కూడాను. కాని భట్టారకులవారు వినిపించుకోలేదు.

సారంగధరుడు — ఎప్పటి కయినా మనం భట్టారకులవారికే నచ్చచెప్పవలసివుంది. మరోక వుపాయం లేనేలేదు. గురుదేవులు బయలుదేరారని తెలిస్తే బాబయ్యగారు గవనుదగ్గిరికే ప్రత్యుత్థానం చేసి, పాదాభివందనం చేసి, గుచ్చికౌగిలించుకుంటారు. మనం సత్యం గుర్తించుకోవాలి. కుపితులై గురుదేవులు వెళ్లిపోయినప్పణ్ణుంచీ బాబయ్యగారు ఉత్సాహ దూరులై కనపడుతున్నారు. అది అలా సంభవించి నందుకు వారు చాలా మథనపడిపోతున్నా రనే నేను భావిస్తున్నాను.

సుబుద్ధి—కానే వచ్చు ప్రభూ! తాము కోరిన మహాగ్రంథం — అందులోనూ జగత్ప్రసిద్ధ మైన తమ

వంశ చరిత్ర పూర్తి కాకపోతే వారు మాత్రం విచారించ కుండా యెలా వుండగలరూ ?

సారంగధరుడు—కనక, యీపూట వా రెలా వున్నారో ఒకమాటు చిత్తగించి దయచెయ్యండి. భోజనానంతరం మనం మళ్లీ ఒకమాటు ప్రయత్నించి చూతాం.

సుబుద్ధి—చిత్తం చిత్తం, తమరు— (అర్ధోక్తి)

సారంగధరుడు—ఒక్క క్షణం యీ తోటలో తిరిగి బుల్లి బాబయ్యగారి దర్శనానికి వెడతాను. వెళ్లిన పని తొరగా అయితే తమ రక్కడికే దయచెయ్య వచ్చు. (గోడ దిగుతాడు)

సుబుద్ధి—చిత్తం. (రెండడుగులు వేసి) కోనప్ప శాస్త్రులవారిని కూడా తీసుకునే వెడతాను.

సారంగధరుడు—బాగుంది. అలా చెయ్యండి.

[సుబుద్ధి వెళ్లిపోతాడు.]

సారంగధరుడు— బాబయ్యగారు కృతకృత్యులే. కనకనే వారు కొంతవర కయినా పట్టు సడలించు కున్నారు. భట్టారకులవారి కలాంటిది సంభవించ లేదే? ఆపట్టుదలకీ, శపథానికీ యీదారుణవ్యాధికూడా తోడు కావా ? ప్రయోజనం వుంటుందా? బాబయ్య గారే సందర్శించినా వారి కిక స్వాస్థ్యం కలుగుతుం దా?...దీనికంతకీ విప్రకృష్టకారణం జక్కులదేవి రాజపుత్రికా, సుబుద్ధి అయ్యవారా ?.........ఎవ రయినా ఒకటే.

[సారంగధరుడు ముందుకి బయలుదేరతాడు. రెండు మలుపులు తిరిగాటప్పటికి చిలక కనపడు తుంది. స్నానం చేసి, కేశపాశం జారుముడివేసు కుని, పట్టుచీరకట్టుకునివుండి, పువ్వులు కోస్తూ వుంటుంది చిలక. ఒకర్నొకరు చూసుకుని యిద్దరూ చకితు లవుతారు. చిలక, వెంటనే దిటవు తెచ్చుకుని, పూలసజ్జ కిందవుంచి, సారంగధరుడికేసి తిరిగి, వంగి, రెండుచేతుల తోనూ నేలఅంటి కళ్లకద్దుకుని, చేతులు కట్టుకుని నుంచుంటుంది.]

సారంగధరుడు—(సందేహిస్తూనే) ఎ-వ-రు ?

చిలక—నేను జక్కులదేవి పరిచారికను. నా పేరు చిలక మహాప్రభూ !

సారంగధరుడు—(మళ్లీ చకితు డవుతాడు)

చిలక—మాఅమ్మగారి పూజకోసం పువ్వులు కోతామని వచ్చాను మహాప్రభూ !

సారంగధరుడు— అయితే నుంచుంటావేం ? ఇప్పటికే— (సూర్యుడికేసి చూస్తూ) చాలా పొద్దెక్కిందే ?

చిలక—దీనికి పొద్దెక్కడం అంటూ యేమిటి మహాప్రభూ ? మా అమ్మ బ్రాహ్మముహూర్తంలోనే పూజలో కూచుంటారు. నేను పువ్వులు కొయ్య డాని కివాళ యిది మూడోమాటు.

సారంగధరుడు— ఇంకా యెన్నిమాట్లు పట్టుకు వెళ్లాలి ?

చిలక—ఈపాటికి కావలసినన్ని తామర పువ్వులు వచ్చివుంటాయి. ఈపువ్వులు, ఇక అక్కర్లేదు మహాప్రభూ !

సారంగధరుడు—తామరపువ్వులున్నూ కావా లా ?

చిలక—కావాలి మహాప్రభూ! పొద్దుపొడిచింది మొదలు తామరపువ్వులతో కూడా పూజించాలి. మళ్లీ నాలుగ్ఘళ్ల పొద్దుండగానే పూజాప్రారంభం. అప్పుడు సూర్యాస్తమయం అయింది మొదలు కలువ పువ్వులతో కూడా పూజించాలి మహాప్రభూ !

సారంగధరుడు—రాత్రికూడా పూజ చేస్తారా వారు ?

చిలక— చిత్తం మహాప్రభూ ! జామున్నర రాత్రి అయినాకా మా అమ్మ భోజనం. ఉదయం జామున్నర దాటాకా.

సారంగధరుడు—ఇదేదో పెద్ద దీక్షగా కన పడుతోంది ?

చిలక—అవును మహాప్రభూ, పెద్ద దీక్షే. పెద్ద కోరికతోనే దీనికి పూనుకున్నారు మాఅమ్మ.

సారంగధరుడు—ఎప్పట్నుంచీ యీకఠోరదీక్ష ?

చిలక—దీక్షాస్వీకారం అక్కడా, వ్రతారంభం యిక్కడానూ. అంటే, వచ్చిన ఉత్తర క్షణమే అఖండగౌతమీపావనోదకం తెప్పించుకుని స్నానం చేసి వ్రతారంభం చేశారు మా అమ్మ.

సారంగధరుడు—(మళ్లీ చకితు డవుతాడు)

చిలక—(సాభిప్రాయంగా చూస్తుంది)

సారంగధరుడు— వారి కింత కఠోరవ్రతం వుపదేశించి నడిపిస్తున్న గురువు—(అర్ధోక్తి)

చిలక—గురువేమిటి మహాప్రభూ? ఇదంతా మా అమ్మే సొంతంగా నిర్ణయించుకున్నారు. పూజ కూడా సొంతంగానే చేసుకుంటారు. కాక పోయినా, సాయంత్రం పూజాప్రయత్నాలు ప్రారంభ మైనది మొదలు, ఉదయం పూజ ముగించుకుని, భోజనం చేసి, విశ్రమించి లేచీదాకా మా అమ్మని పురుషు లెవరూ — చంటిపిల్లలు కూడా చూడగూడదు గదా, యిక గురువుగారు దగ్గర వుండ డాని కెలాగ మహాప్రభూ?

సారంగధరుడు—(ఉలిక్కి పడతాడు.)

చిలక— (సగర్వంగా చూస్తూ మందహాసం చేస్తుంది.)

సారంగధరుడు — ఎంతెంత దీక్షాపరు లైనా వున్నారు జగత్తులో.

చిలక—రాత్రి, దేవికి నివేదించిన క్షీరాన్నం వొక్కటే మా అమ్మకి ఆహారం. పైటకొంగు పరుచు కుని కటికి నేలమీదనే పడక.

సారంగధరుడు—శివశివా!

చిలక — ఈదీక్ష ఆరుమాసాలు సాగించు కోవాలి మహాప్రభూ!

సారంగధరుడు—(చకితుడై) ఆరు మాసాలా ?

చిలక—అవును మహాప్రభూ! "షాణ్మాసిక స్థండిల సావిత్రీ గౌరీ వ్రతం" అని దీని పేరు.

సారంగధరుడు—పార్వతీఅమ్మవారి తపశ్చర్య స్ఫురణకు వస్తోంది నాకు.

చిలక— శశాంక శేఖరులను స్వాధీనపరచుకో గలిగిన పార్వతీ అమ్మవారు, మాఅమ్మకోరిక తప్ప కుండా సిద్ధింపచేస్తా రనే మానమ్మకం మహాప్రభూ!

సారంగధరుడు—(సాలోచనగా కిందికి చూ స్తాడు)

చిలక—(బోధపడ్డది అన్నట్టు తల పంకిస్తుంది)

సారంగధరుడు—(పరధ్యానంగా) చాలా గొప్ప దీక్ష. మునికన్యలకున్నూ అసాధ్య మైన దీక్ష.

చిలక—చిత్తం మహాప్రభూ!

సారంగధరుడు—నీనివల్ల చతుశ్శక్యపుల దేవతలే తరిస్తారు. చాలా సంతోషం. మరి వెళ్లు. వారికి పుష్పాలు అందించు.

చిలక—(చూస్తూ నుంచుంటుంది)

సారంగధరుడు—ఏమీ, నుంచుంటావేం ?

చిలక— లేదు మహాప్రభూ లేదు, సెల విప్పించండి.

[యథాప్రకారంగా మళ్లీ నమస్కరించి, పూల సజ్జ అందుకుని, వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ చిలక వెళ్లిపోతుంది]

సారంగధరుడు—(జ్ఞాపకం చేసుకుంటూ) తెర లోపలి మనిషిని చూసినట్టు— స్వప్నంలో విన్నట్టు— అదేమి వ్రతమూ, అదేమి దీక్షా? రాత్రికిరాత్రి అంతా కాక—ఉభయ సంధ్యల్లోనూ కాక— పగలు కూడా చాలాభాగం, పురుషు లెవరూ— పురుషశిశువులున్నూ వారిని చూడగూడదుట. ఇక మిట్టమధ్యాహ్నం మాత్రమే చూడవచ్చునా? ఆ సమయానికివ్వీ నియమ నిషేధా లుంటాయా? ఆరుమాసాలా యీ దీక్ష ? ఈ కఠోరదీక్షలో భర్త కూడా పురుషుడే కిందే—(నవ్వు కుని) భర్తకూడా చూడకూడదా? క్షీరాన్నం వొక్కటే రాత్రికి ధారకం. ఆపైని స్థండిలశయనం. ఇం కెక్కడి భర్త?.........కాని, నిండు యౌవనమే! కొత్తపెళ్లి

కూతుళ్లే! ఇదంతా యేమిటి? చళుక్య సామ్రాజ్యాధీశ్వరి తపస్సు చేసి కాని పొందలేని ప్రాప్యమున్నా మరొకటుందా? ఈవ్రతం నాయనగా రెలా అంగీకరించారూ? మహారుద్రయ్యగారి చాతుర్యం కొరగాక పోయిందా? వారిని చేపట్టిన్నీ నిరుత్సాహులుగానే కనపడుతున్నారే నాయనగారు, దాని కిదా కారణం? ......(విసుగుతో) నా కెందుకీ గొడవ? నా యాతనకు అంతం లేదు కదా? కాకపోయినా నా దీక్ష మాత్రం తప్పకూడదా? యౌవనవ్యగ్ర అయివుండీన్నీ వొకానొక అబల యింత కఠోర దీక్ష పాలించుకుంటున్నదే, నే నెంత దీక్ష పాలించుకోవాలీ?...(నాలు గడుగులు ముందుకివేసి, నాలుగు దిక్కులూ కలయ చూస్తూ) ఈపూలతోట— యీ మిసమిసలు — యీ కుసుమ సౌరభాలు--యీ భ్రమరఝంకారాలు—యీ నవయౌవనం—యీ చిత్తక్షోభ—... నే నెక్కడికి పోతున్నానూ? ఏమయిపోతున్నానూ? (సందెలు పిసుక్కుంటూ)ఇది ధర్మ వికాసమా, దావానలజ్వాలా విజృంభణమా?... పాపికొండల సంఘటన యేమి? నాటి ఆశలూ, ప్రతీక్షలూ యేమయిపోయినవి? నేటి యీవిలయూని కవధి యేమిటి? (నిదానించి) ఛీ! అప్పుడా నిగ్రహం యేమిటి, ఇప్పుడీ మహోద్వేగం యేమిటి? (తూలిపడుతూ వెళ్లి, పక్కగా వున్న తిన్నెమీద కూచుని, జలదరించుకుంటూ) శ్శివోహం...శ్శివోహం... శ్శివోహమ్మ్... (కళ్లు మూసుకుంటాడు.)

పదిహేనో రంగం

చిత్రాంగి నగరు.

సాయంత్రం ఏడెనిమిది గడియల పొద్దువేళ.

పూలతోటలోకి చూస్తూ, ఉత్తరపు వసారాలో, కిటికీ దగ్గిర నుంచుని వుంది చిలక.

సెమిలివన్నె పావురంతో ఆడుకుంటూ, గోడకి ఆనుకుని ఉత్తరముఖంగా తివాసీమీద కూచుని వుంది చిత్రాంగి.

***

చిత్రాంగి—(గునుస్తూ పావురంతో) ... నీకు బొజ్జనిండింది, వొక్క క్షణ మయినా యిక యింటి పట్టున వుండవు. మళ్లీ దీపాలు పెట్టాకే యింటికి రావడం. రాజమహేంద్రపురం నీళ్లు నీకు బాగా వొంటబట్టాయి. నాపూనే అక్కర్లేక పోతోంది నీకు. మీ అమ్మని చూస్తూ, యెప్పుడేనా నన్ను విడిచి యెక్కడి కయినా వెడుతుందా?

చిలక—(వెనక్కి చూస్తూ) దానికి వయస్సు మళ్లిపోయింది కదా, యెక్కడికి వెడుతుంది తల్లీ?

చిత్రాంగి—(పావురంతో) మరి నాకు? నేనూ నీలాగే నవయౌవనంలో వున్నాను కదా, నన్ను విడిచి వెళుతూ వుంటావా నువ్వు? నేనక్కర్లేమా నీకూ? మొన్న మొన్నటి దాకా వొక్క క్షణ మయినా నన్ను విడిచి వుండేదానవా? నిన్నెవరు మార్చేశారూ యిలాగ?

చిలక—(మళ్లీ వెనక్కి చూస్తూ) ఎవరో దీన్నే మార్చేశా రన్న మాటేమిటి? ఇదే మార్చేసిందేమో ఆ 'యెవరిన్నీ'?

చిత్రాంగి—(మళ్లీ పావురంతో) అవునా? అలా చేశావా? నువ్వంతదానవు కావనా? నీకు కొత్తమాపు లబ్బాయి. నీ నడకే మారిపోయింది.

చిలక—(మళ్లీ వెనక్కి చూస్తూ) ఆ కూజితం యెంత సాకూతంగా వుంటోందో చూడ్డం లేదూ తల్లీ?

చిత్రాంగి—(మళ్లీ పావురంతో) అవునవును. నీకూజితంలో యేదో కొత్తమాధుర్యం పుట్టి నన్ను ముగ్ధురాలిని చేసేస్తోంది. అది నాకు నేర్పవూ?

చిలక—(మళ్లీ వెనక్కి చూస్తూ) మీకు నేర్ప డానికే అది బాగా సాధన చేసుకుంటోంది, తొందర పడకండి తల్లీ!

చిత్రాంగి—(మళ్లీ పావురంతో) నిన్న కాక మొన్న పుట్టావు, యిరవై యేళ్లు నిండిన నాకు గురువు గారి వవుతావు. అవునా? (ముద్దు పెట్టుకుని నునుస్తూ) అవునా? (దాని కళ్లల్లోకి ఒక్కమాటు గంభీరంగా

చూసి రొమ్ముకి అదుముకుని) ఎటుచూసినా నువ్వే నయం. వారి నగరికి వెడుతున్నావుట. వారి లాలన భాగ్యం అనుభవిస్తున్నావుట. వారి పావురంతో జత కట్టుకున్నావుట. ఏం? కట్టుకున్నావా?

చిలక— (చేతులు చాపుకుని చిత్రాంగి కేసి వస్తూ ఆత్రంగా) అమ్మా, అమ్మా, సారంగధరుల వారు, సారంగధరులవారు—(అర్ధోక్తి)

చిత్రాంగి—(పావురం విడిచిపెట్టేసి) ఏమిటే? (గభీమని లేచి) దయచేస్తున్నారా?

చిలక—(కిటికీ కేసి చెయ్యి చూపిస్తూ) తోట లో—తొరగా—తొరగా—(పొదివి పట్టుకుని చిత్రాంగిని కిటికీ దగ్గిరికి తీసుకు వెడుతుంది.)

చిత్రాంగి — (పొంగిపోతూ కిటికీలోనుంచి చూసి, మళ్లీ అంతలో కుంగిపోయి తటాలున వెనక్కి మళ్లుతూ) శివశివా! ఏల్నాటి శని విడిచిపెట్టలేదు కదే! (గోడమీదికి వాలిపోతుంది.)

చిలక—(చిత్రాంగిని పట్టుకుని లాలనగా) అది పోనీండి తల్లీ! మాజేళ్లకి మళ్లీ యివాళ దర్శనం. వొక్క మాటు కళ్లనిండా చూసుకోండి మా అమ్మా!

[ఇద్దరూ వెళ్లి కిటికీదగ్గిర వరాసగా పంచుంటారు. చిలక మందహాసం చేస్తూ చిత్రాంగికేసీ, కిటికీకేసీ విడిచి విడిచి చూస్తూవుంటుంది. చిత్రాంగి ముఖం వికసిస్తుంది.]

చిలక—ఆ వడక చూడండి తల్లీ, మనస్సు చెదిరిపోవడం లేదూ?

చిత్రాంగి—(అవునన్నట్టు చిలకకేసి మురుస్తూ చూసి, మళ్లీ కిటికీలోకి చూస్తుంది.)

చిలక—ఆ చెట్టు చాటయినట్టుంది, యిలా రండి తల్లీ, యిక్కడికి బాగా కనపడుతున్నారు.

[ఇద్దరూ వొకరిస్థానంలో వొకరు పంచుంటారు.]

చిత్రాంగి— ఆ ధనుర్బాణా లేమిటే? అ వెందుకే?

చిలక—నేను చెప్పాలా అమ్మా? ప్రేమోన్మాదంతో కుమిలిపోతూవున్న వొకానొక త్రిభువన సుందరికి మళ్లీ సాక్షాత్కరించేటప్పుడు మన్మథుడు తన శర శరాసనాలు విడిచివస్తాడా?

చిత్రాంగి—(మమపెగ్గుతో చిలకబుగ్గమీద యిట్టే అని మళ్లీ కిటికీలోనికి చూస్తుంది.)

చిలక — పూవుటీరం అడ్డం వచ్చినట్టుంది, యిలా రండి అమ్మా!

[మళ్లీ యిద్దరూ మారతారు]

చిత్రాంగి —(చిలకతో) ఇలా చూస్తున్నారు. కదూ?

చిలక—అవును తల్లీ! (కిటికీలోకి చూస్తూ మెల్లిగా చప్పట్లు కొడుతుంది)

చిత్రాంగి—(చిలక చేతులు పట్టుకుని) శని. శనిగా డున్నాడు, వింటాడే. పాము చెవులు సుమా.

చిలక—ఇంకా చూస్తూనే వున్నారు. ఎందుకో ముఖం వికసించినట్టుంది, అలా చూడండి తల్లీ!

చిత్రాంగి—(చూసి) గొజ్జంగిపువ్వు కోసమే ఆ చూడ్డం, మనకోసం అనుకున్నావా? అదిగో, అది తుంచి చేతికిచ్చి భావగ్రహం తీసుకుపోతోంది.

చిలక — అవునవును. (ఆత్రంగా) కాదు కాదు—(అర్ధోక్తి)

చిత్రాంగి—కాదు కాదు, నిజమే. మళ్లీ ఆగారు. మళ్లీ చూస్తున్నారు.

చిలక—(ఆతుర్దాతో) అయ్యవారు కూడా చూస్తున్నారు. (కిటికీకి తా నొక వేపుకి తప్పుకుంటూ, చిత్రాంగిని రెండోవేపు తోస్తూ) తప్పుకోండి తప్పుకోండి.

[ఇద్దరూ వొక్క క్షణం దూరంగా వున్నాక, చిలక తొంగిచూస్తుంది.]

చిలక—మళ్లీ బయలుదేరారు, రండి.

[ఇద్దరూ కిటికీలోకి చూస్తారు.]

చిత్రాంగి—ఆ నడకలో యెంత భేదం వుందో చూడూ. ఆమూర్తిమంతంలో కూడా యెంత వార వుందో చూడూ. మదగజమూ, గుంటనక్కా—(అర్ధోక్తి)

చిలక—సరిగా అంతే తల్లీ! ఉండుండి మదగజానికి హఠాత్తుగా కోపం వస్తుంది. అప్పుడు గుంటనక్క తొక్క కాలికింది కేనా చాలదు.

చిత్రాంగి—ఎప్పటి మాటా?

చిలక—అది తేలికే మన కీ ఆందోళన. కాని (చిత్రాంగి గడ్డం పుణుకుతూ) మీ కోరిక నెరవేరుతుంది తల్లీ! బెంగ వద్దు వా కూనా!

చిత్రాంగి—(చిలక రెండు చేతులూ పట్టుకుని) నేను చేసుకున్న పాపం కాకపోతే, ధామాగ్రహం బిడ్డల తండ్రి అయి కులకడం యేమిటి, గ్రహరాజు బ్రహ్మచారిగా వుండిపోవడం యేమిటి?

చిలక—(చూస్తూ వూరుకుంటుంది)

చిత్రాంగి—నామీదే ప్రీతి పుట్టలే దనుకోనా, ఆడ దంటేనే వారి కింకా అర్థం కాలే దనుకోనా? పోనీ, అది సిగ్గంటావా, నిర్లిప్తత అంటావా?

చిలక—నిర్లిప్తులు కావడానికి వారేం శ్రీశుకులా తల్లీ? వెంగరాజుకి సిగ్గంటే మాత్రం యేమిటి?

చిత్రాంగి—మ రిదంతా యేమిటే?

చిలక—నిగ్రహమూ, గాంభీర్యమూ వారికి సహజా లయివుంటాయి. ఆపైని తండ్రిగారి దౌర్జన్యం—(అర్ధోక్తి)

చిత్రాంగి—తండ్రి. (పక్కకి చూస్తూ కోపంగా) తండ్రిట! యముడు.

[తెరలో]

"చిలకా!"

చిలక—(సమ్మంకేసి చూస్తూ) ఆ, రావచ్చు.

[వగర్చుకుంటూ రుక్కు వస్తుంది.]

చిత్రాంగి—(ఆదుర్దాగా) ఆవగ ర్పేమిటే? ఏం జరిగిందే?

చిలక—(రుక్కుతో) పరుగుపరుగున వచ్చావా? ఏదేనా విడ్డూరం—(అర్ధోక్తి)

రుక్కు—విడ్డూర మే...కాకేం?...

చిత్రాంగి—ఆపత్తా?

రుక్కు—ఆపత్తు కాదమ్మా...సంపత్తే...

చిలక—అయితే ముందు ముక్తాయిం చెయ్యి, తరవాత సావకాశంగా చెప్పచ్చు.

రుక్కు—మహారాజు... పోల్నాడు... మండలేశ్వరుల... కామార్త గారికీ... సారంగ... ధరుల వారికీ... వేటలో... సంధానం...(అర్ధోక్తి)

చిత్రాంగి—(నిర్విణ్ణ అయి చిలకకేసి చూస్తూ) ఆ!

చిలక—(రుక్కుతో) సరే, సంధానం చేయించారు. తరవాతా?

రుక్కు—ఆయిద్దరూ...పంది వేటలో...... తారసిల్లి... కలియబడి వుమ్మడిగా... పందిని పొడిచి ...చివరికి...చెల్లాయీ...అంటే—(అర్ధోక్తి)

చిత్రాంగి—(గుండెలమీద చెయ్యివేసుకుని చిలకతో) అమ్మయ్య!

రుక్కు—అన్నయ్యగారూ......అంటూ...(అర్ధోక్తి)

చిత్రాంగి—బతికాం. ఇక చాలు. (రుక్కు భుజాలు తట్టుతూ) వెళ్లి కాస్సేపు తమాయించుకో పాపం.

[రుక్కు వెళ్లిపోతుంది.]

చిలక—ఇది గొప్ప శుభసూచన.

చిత్రాంగి—ఒక విధంగా శుభసూచనే. అయితే, మరి పర్యవసానం?

చిలక—(చిత్రాంగి గడ్డం పట్టుకుని బతిమాలుతూ) తొందరపడకండి తల్లీ! నేను కనక బతికివుంటే యీ గడువులోపల మీ యిద్దర్నీ కలిపితీరతాను మా అమ్మా!

[తెరలో]

"చిలకా"

చిలక—(సమ్మంతించి చూస్తూ) ఆ, రావచ్చు.

[రుక్కు కొంచెం పగర్వతో మళ్లీ వస్తుంది.]

రుక్కు—(వస్తూనే) మహారాణీ... పరిచారిక ...గౌరి వచ్చి...వేచి వుంది.

చిత్రాంగి—(ఆశ్చర్యంతో) గౌరా? (చిలకతో) ఎందుకో?

చిలక—(రుక్కుతో) ఒక్కర్తేనా?

రుక్కు—మరో నలుగుర్ని...వెంట పెట్టుకుని ...ఏవో కానుకలు—(అర్థోక్తి)

చిత్రాంగి—(చిలకతో) కానుకలా?

చిలక—మీరు కూచోండి తల్లీ! (చిత్రాంగిని తీసుకువెళ్లి తివాసీమీద కూచో పెడుతూ రుక్కుతో) తీసుకురావే.

[చిత్రాంగి బాలీసుకి చేరబడి కూచుంటుంది. రుక్కు గౌరినీ, మరో నలుగురు పరిచారికలనూ తీసుకువస్తుంది. వచ్చినవాళ్లందరూ పసుపు కుంకుమలూ, పువ్వు ఫలాలూ, నూతన వస్త్రాలూ నిండివున్న పళ్లేలు చిత్రాంగి సమీపంగా వుంచి చేతులతో నేల అంటి కళ్ల కద్దుకుని నుంచుని వుంటారు.]

గౌరి—(చేతులు కట్టుకుని చిత్రాంగితో) ఒక గొప్ప పనివాడు తన నేర్పంతా చూపిస్తూ ఆరు పట్టు చీరలు నేసి తెచ్చి మహారాణీకి సమర్పించుకున్నాడు. (అంజలిబంధంతో పళ్లెంలో వున్న చీరలు చూపిస్తూ) వాటిలో ఇది మేలిరకం. శుభాశీస్సులతో సంవత్సరాది కానుకగా తమకు పంపించారమ్మా మా అమ్మగారు.

చిలక—మహాప్రసాదం.

చిత్రాంగి—మహాప్రసాదంగా శిరసావహించానని వారితో మనవి చెయ్యి. (ఆచీరల్లో వొకటి అందుకుని) కళ్లకద్దుకుని ధరించుకుంటానని విన్నవించు. మరిన్ని యిప్పుడే దర్శనానికి వచ్చి పాదసేవ చేసుకుంటానని నివేదించు.

గౌరి—(అంజలిబంధంతో) చిత్తం అమ్మా!

[గౌరీ, తక్కినవాళ్లూ మళ్లీ యథాపూర్వంగా నమస్కారాలు చేస్తారు. ఇంతలో రుక్కు, పళ్లెంలో తాంబూలాలు తెస్తుంది. చిలక, అవి, వొక్కొక్కరికే యిస్తుంది]

గౌరి—(కృతజ్ఞతతో) సెలవిప్పించండి అమ్మా!

చిత్రాంగి—మంచిది.

[వెనక్కి వెనక్కి తగ్గుతూ గౌరీ,తక్కినవాళ్లూ వెళ్లిపోతారు.]

చిలక—(రుక్కుతో) దర్శనానికి వస్తానని అలివేలుమంగనీ, భ్రమరక్కనీ పంపి మహారాణీకి వర్తమానించు.

రుక్కు—సరే. (వెళ్లిపోతుంది)

చిత్రాంగి—(చిలకతో) మహారాణీ వుద్దేశం రేమిటంటావే? మన సంగతి గుర్తించివుంటారా వారు?

చిలక—అలా అనుకోడానికి వీలు లేదు తల్లీ! ఎవరినీ ద్వేషించకపోవడమూ, భర్తగారిని త్రికరణాయా అనుసరించడమూ వారి ప్రవృత్తి. జక్కుల దీవిలో వున్నప్పుడే వారిని గురించి మనం యెన్ని కథలు వినలేదూ?

చిత్రాంగి—(మూసిమూసి నవ్వుతో) నేను పాపాత్మురాలిని.

చిలక—(కూచుని చిత్రాంగి జబ్బలు పట్టుకుని లాలిస్తూ) అలా అనుకోవద్దు తల్లీ!

చిత్రాంగి—(రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని దుఃఖిస్తూ) ఎప్పటికయినా ఆమహాయిల్లాలికి కోడల్ని కాగలనో లేదో?

చిలక—(చిత్రాంగి చేతులు తప్పించి తన పైటచెంగుతో ఆమె కళ్లు తుడుస్తూ) దుఃఖించవద్దు. మీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది. మహారాణీ మిమ్మల్ని కన్నకూతురుకంటేనూ యెక్కువగా చూసుకుంటారు, నామాట నమ్మండి.

చిత్రాంగి — నీమాట నమ్ముతునే నేను బతికి వున్నాను. 'అత్తయ్యగారూ' అని నోరారా పిలుస్తూ వారి పాదాలెప్పుడు సేవించుకుంటానో? (తానుకూడా కళ్లు తుడుచుకుంటుంది.)

చిలక — ఈ వసంతంలోనే మీ కా అదృష్టం పడుతుంది. తప్పకుండా పడుతుంది. ధైర్యంగా వుండండమ్మా!

చిత్రాంగి — (లేస్తుంది)

చిలక — చీర ధరించండి, మహారాణీ ఆశీర్వచనాలు కూడా పొంది వద్దాము.

చిత్రాంగి—మరి పోల్నాటి రాజపుత్రిక కథ వినవద్దూ?

చిలక — వింటురుగాని, విందురుగాని. పూజవేళ కావస్తోంది, మనం మహారాణీ నగరికి తొరగా వెళ్లాలి. ఆకథ స్నానం చేస్తూ వినవచ్చు సావకాశంగా.

చిత్రాంగి — అయితే (చీరలకేసి చూసి) వాటిలో నీకు నచ్చినది పట్టుకురా!

[చిత్రాంగి ముందు వెడుతుంది. ఒకచీర పట్టుకుని, చిలక తరవాత వెడుతుంది]

పదహారో రంగం

రాజరాజు నగరు.

జామున్నర పొద్దువేళ.

రాజరాజు చాలీసుకి ఆనుకునీ, మహారుద్రయ్య, ఎదట, మండెమీదా కూచుని వున్నారు.

***

రాజరాజు — ఏర్పాట్లేమీ ముందే తగ్గించవద్దు మీరు. ఈ రొడమొగాలూ పెడమొగాలూ మధ్యకంటే, మహారణ్యాలలో, క్రూరమృగాల మధ్య వుండడమే వుల్లాసంగా వుంటుంది నాకు.

మహారుద్రయ్య — నామనవి రేమిటంటే— (అర్థోక్తి)

రాజరాజు — జక్కులదీని రాణీగారు తొరగా రమ్మన్నమాటే కాదూ మీరు చెప్పలేదేదీ?

మహారుద్రయ్య — అవును మహాప్రభూ!

రాజరాజు — వచ్చి ప్రయోజనం? ఆవిడగారు, మొగం కనపడీ కనపడకుండా తలుపు చాటున నుంచోడమూ, అదేనా యే నాలుగు దినాలకోగాని అనుగ్రహించకపోవడమూ, ఏమడిగినా అధరం కదిలీ కదలకుండా నోట గొణుక్కోవడమూ, దాది అందుకుని చిలవలూ పలవలూ పెంచి ఆసంగతి నాకు చెప్పడమూ—ఇదే కామా సౌడభ్యం?

మహారుద్రయ్య — అందుకు, వ్రతనియమాలుల్లంఘించలేకపోవడమే — (అర్థోక్తి)

రాజరాజు — మాట్లాడితే వ్రతం. ఏమంటే యేం చెడిపోతుందో అని మనకి భయమే. పోనీ, అలాగే కాగట్టండీ. ఇక మనం వూళ్లో వుంటే వొరిగిందేమిటి, అడివిలో వుంటే లేకపోయిందేమిటి?

మహారుద్రయ్య — మన పక్షంగా చూస్తే అంతే కావచ్చు; కాని వారి పక్షంగా చూస్తే — (అర్థోక్తి)

రాజరాజు—అబ్బా, మీధోరణే మీదండీ. పోనీ, వారం దినాలలో, కాదు నాలుగైదు దినాలలో తిరిగి వస్తాం, సరా?

మహారుద్రయ్య — చిత్తం చిత్తం, నాకు సంతుష్టి అయింది. అలాగే యేర్పాట్లు చేయిస్తాను.

రాజరాజు — చిట్టిని రప్పించండి.

మహారుద్రయ్య — చిత్తం. (ద్వారపాలిక కేసి చూస్తూ) చిట్టీ.

రాజరాజు—మల్లప్ప కట్టుదిట్టంగా వుండగలడు కాదూ?

[చిట్టి వస్తుంది.]

మహారుద్రయ్య—ఘాలాకు స్తేనా వాడు తిరస్కరించేస్తాడు మహాప్రభూ!

రాజరాజు—చిట్టీ!

చిట్టి—సెల విప్పించండి మహాప్రభూ!

రాజరాజు—జక్కులదేవి రాణీగారి విషయమై నువ్వు అతిజాగ్రత్తగా వుండాలి. వారి సేవలో యేపాటి లోటు వచ్చినా మాట దక్కదు.

చిట్టి—జాగ్రత్తగా వుంటాను మహాప్రభూ!

రాజరాజు—అంచెన్రా కొలాగా వుండనే వుంటాయి కనక మధ్యాహ్నంనుంచి కూడా తామరపువ్వులూ, కలవపువ్వులూ వస్తూ వుంటాయి. అలా అని యిక్కడి యేర్పాట్లు తగ్గించడానికి వీలులేదు సుమా.

చిట్టి—చిత్తం చిత్తం.

రాజరాజు—పెద్ద రాణీగారి విషయమై కూడా అంతే శ్రద్ధగానే వుండాలి. జ్ఞాపకం......?

చిట్టి—ఉంది మహాప్రభూ! వారినీ సేవించుకుంటూ వుంటాను.

రాజరాజు—కిన్నెరసానీ, శేషశాయీ, రంగనాయకా ప్రయాణా లయి వచ్చారా?

చిట్టి—వచ్చి సిద్ధంగా వున్నారు మహాప్రభూ!

ద్వారపాలిక—(రాజుతో) మహామంత్రిగారు-(అర్ధోక్తి)

రాజరాజు—రప్పించు. (చిట్టితో) దర్శనానికి వస్తున్నా మని మహారాణికి వర్తమానించు.

చిట్టి—చిత్తం చిత్తం.

[చిట్టి వెళ్లిపోతుంది.]

మహారుద్రయ్య—మనం యెప్పుడు తిరిగి వస్తామో అది చిట్టిపీరన్న గారికి—(అర్ధోక్తి)

రాజరాజు—ఎందుకూ చెప్పడం? మరొకరికి మాత్రం యెందుకు చెప్పాలి?

మహారుద్రయ్య—అదీ నా వుద్దేశం. చిత్తం చిత్తం.

[చిట్టిపీరన్న వస్తాడు.]

రాజరాజు—(చిట్టిపీరన్నతో) నిన్న మనం అనుకున్న వన్నీ అలా చేయించారా?

చిట్టిపీరన్న—అవన్నీ పరిష్కారం అయిపోయాయి మహాప్రభూ!

ద్వారపాలిక—తమ్ముడుగారూ, అబ్బాయిగారూ—(అర్ధోక్తి)

రాజరాజు—తోడితే.

చిట్టిపీరన్న—వేములవాడ భీమకవిగారు వచ్చి వున్నారు మహాప్రభూ!

రాజరాజు—సంగ తేమిటో తెలిసిందా?

చిట్టిపీరన్న—ఇంకా యీ ప్రాంతాలనే సంచారం సాగించుకుంటున్నారు వారు. భట్టారకులవారి వ్యాధి దినదినమూ ముదిరిపోతూ వుండడం విని, మళ్లీ వొకమాటు వారిని చూతా మనీ, ఏలినవారి దర్శనం కూడా—(అర్ధోక్తి)

రాజరాజు — చాలా సంతోషం. వారికి ఆస్థానమర్యాద లన్నీ సరిగా జరిపిస్తూవుండండి మీరు. నేను తిరిగి రాగానే దర్శనం చేసుకుంటాను.

చిట్టిపీరన్న — చిత్తం.

[విజయాదిత్యుడూ, సారంగధరుడూ వస్తారు. రాజు, వారి నిద్దరినీ తనకి దగ్గరగా కూచో పెట్టుకుంటాడు.]

రాజరాజు — (చిట్టిపీరన్నతో) నేను వచ్చే లోపున తొందర లేమయినా వస్తే తమ్ముడు సవరిస్తాడూ (విజయాదిత్యుడి కేసి చూస్తాడు).

విజయాదిత్యుడు — చిత్తం.

చిట్టిపీరన్న — (విజయాదిత్యుడికేసి చూస్తూ) చిత్తం.

రాజరాజు — (సారంగధరుడితో) నాయనా! భట్టారకులవారిని మరిచిపోకు సుమా!

సారంగధరుడు — చిత్తం బాబయ్యా!

రాజరాజు — చూడూ, వేములవాడ భీమకవిగారు వచ్చివున్నారుట, సేవించుకుంటూ వుండూ.

సారంగధరుడు — చిత్తం, సేవించుకుంటాను బాబయ్యా!

రాజరాజు — (విజయాదిత్యుడితో) అబ్బాయీ, నువ్వూ వెంటనే వొకమాటు వెళ్లి వారి దర్శనం చేసుకు రండి.

విజయాదిత్యుడు—చిత్తం.

రాజరాజు—(చిట్టివీరన్నతో) ఇంకేమిటి?

చిట్టివీరన్న—భీమవరంలో తటాకనిర్మాణమూ, ద్రాక్షారామసప్తగోదావరిలో కల్యాణమంటపనిర్మాణమూ పూర్తి అయినట్టు వార్తలు వచ్చాయి మహాప్రభూ! పావులూరి మల్లన్నగారు వెళ్లి పరిశీలన చేసేటట్టు ఏర్పాటు చేశాను.

రాజరాజు—ప్రతిష్ఠ కేర్పాట్లున్నూ సాగించండి.

[చిట్టి వస్తుంది.]

చిట్టివీరన్న—చిత్తం చిత్తం. పున్నమి వెళ్లిన పంచమినాడు మంచి ముహూర్తం వుందంటున్నారు సిద్ధాంతులు.

రాజరాజు—(మహారుద్రయ్య కేసి చూస్తూ) పున్నమి వెళ్లిన పంచమి—?

మహారుద్రయ్య—వ్యవధి చాలు మహాప్రభూ!

రాజరాజు—(చిట్టివీరన్న కేసి చూస్తాడు)

చిట్టివీరన్న—చిత్తం, ఆముహూర్తమే స్థిరపరిపిస్తాను.

చిట్టి—వేం చెయ్యవచ్చు మహాప్రభూ!

[రాజు సారంగధరుడి కేసీ, విజయాదిత్యుడి కేసీ, చిట్టివీరన్న కేసీ వరాసగా చూస్తాడు. లేచి నమ్రులై "సెలవు" అని చెప్పి, వారు వెళ్లిపోతారు.]

మహారుద్రయ్య—నేను సర్వమూ సిద్ధం చేయిస్తా కింద వుంటాను మహాప్రభూ!

రాజరాజు—మంచిది.

[రాజు లేస్తాడు. మహారుద్రయ్య వెళ్లిపోతాడు.]

రాజరాజు—(చిట్టితో) అన్నపూర్ణ వెళ్లిన పని—(అర్థోక్తి)

చిట్టి—అయింది మహాప్రభూ!

రాజరాజు—సరే పద.

[అందరూ వెళ్లిపోతారు.]

[కాపీ రైటు]






విరక్తి

లోకో భిన్నరుచిః

= శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు =



'లోకో భిన్నరుచిః' అనేది అంతా ఒప్పుకునే సంగతే. పైకి చిన్న వాక్యమే కాని, ఇందులో లోకం, భిన్నం, రుచి అనే మూడు మాటలున్నాయి. వీటిలోకల్లా భిన్నం అనే పదం ఒకటే సులువు. ఏమంటే, జనం అంతా యథావకాశంగా భిన్నం అవుతూండడం, యథాశక్తిగా భిన్నం చేస్తూండడం పరిపాటి. లోకం అనేది ఊహాతీతం. "లోకమంటే ఏమిటి, గంజిగుంట అనుకున్నారా?" అంటాడు గిరీశం. అయినా, ఆ మాటకి ఎంత పెద్ద అర్థం ఉన్నా, అది మిక్కిలి సంకుచితంగా పుచ్చుకుంటేగాని బుర్ర ఆడదు. "ఏకాంశేన స్థితో జగత్." అదేనా ఎన్నికోట్ల అంశాల మొత్తంలోనో! రుచి గురించిన ఆలోచనకి పద్నాలుగు లోకాలూ అంటూ తలబద్దలు చేసుకుని అతలాకుతలం కాలేంగదా! అగోచరాల్ని మొదటే మినహాయించాలి. ఆ గోచరించే వాటిల్లో అదృశ్యాల్ని తగ్గించెయ్యాలి. ఆ కనపడే వాటిల్లో అగమ్యాల్ని వదులుకోవాలి. అనగా నక్షత్రలోకాల్ని దూరవీక్షణంమాత్రం చెయ్యాలిగాని గత్యంతరం లేదు. ఇక గ్రహాలోకాల్ని గురించికూడా, రుచివిషయంలో, ఆలోచన కట్టేసుకోవాలి కాని, శుక్ర, అంగారక, చంద్రగ్రహాలలోకి మానవులు త్వరలోనే విహరించేటట్టు కనపడుతుంది. చంద్రుడిలోకి రేడియం సాయంవల్ల రెండురోజుల్లో వెడతానన్నాడు ఒకాయన. బ్రిటన్‌లో జెస్నెవిష్ విసిరింది ఒక వెండి స్తంభం చంద్రుడిలోకి గిరవాటెయ్యడానికీ, గిరవాటేసిన వారం నాటికి అది అందులో పడడానికీ ఏర్పాట్లు చేశారనీన్నీ, యుద్ధంమూలాన్ని ఆగిపోయారనీన్నీ తెలుస్తుంది. అలాగ్గా చంద్ర శుక్ర అంగారకుల్లోకి పాశ్చాత్యులూ, పాతాళవాసులూ వలసనిమిత్తం వెళ్లి వర్తక సామ్రాజ్యాలు స్థాపించగల సూచనలున్నా, మన పని మామూలుకి లోబడి ఉండదు గనక వాటినికూడా ప్రస్తుత ఆలోచనకి వదిలేద్దాం. ఇక భూలోకం. ఇందులో, స్థావరాలు వదిలేసి, జంగమాలలో భూజలవాయువుల్లో ఉండే క్రిమి పక్షి వృక్ష పశులోకాలు వదిలేసి (వాటికి రుచులు లేవని కాదు, అవి ఫలానా అని చెప్పగోలేవు గనక!) మనుష్యలోకాన్ని మాత్రం విచారించాలి. వీళ్లు, పోనీ, రెండు వందలకోట్లు అందాం. వీళ్లల్లో పశుప్రాయుల్నీ, అతిబాలవృద్ధుల్నీ, అతీతుల్నీ, అపస్మారకుల్నీ, పిచ్చివాళ్లనీ గీకెట్టి, తక్కినవాళ్లనే రుచినిమిత్తం లెక్కకట్టుకోవాలి పోనీ, అంతా ప్రమాణజనులే అని ఒప్పుకుందాం. ఇక తక్కినమాట 'రుచి.' ఒకానొక వస్తువు

గాని, విషయంగాని ఒక ప్రమాణ మనుష్యుడియొక్క నాలికవంటి గ్రహణేంద్రియంమీద పడినప్పుడు, ఆ మానవుడు ఆ వస్తువునిగాని, విషయాన్నిగాని ఏ కొంతో హరాయించుగోడంవల్ల వాడియొక్క చైతన్యంలో వచ్చే పరివర్తనమే రుచి. కాబట్టి రుచి అనేది కలగడానికి వచ్చిపడే వస్తువు రసవద్వస్తువూ, రసదాయకవస్తువూ కావాలి, నాలికకి తడీ వుండాలి. నాలికమీద పెట్టుగున్న వస్తువుకి నాలికతడిలో కరిగే గుణం ఉంటేగాని రుచి అనేదే జనించదు. చెక్క ముక్క, ఇనప ముక్క, గాజు, రాయి — వీట్ల విషయంలో రుచికనిపెట్టడం మామూలునాలికవల్ల కాదు. అల్లాగే, ఆకలిమీద ఉన్నవాడికి రుచికనిపెట్టడానికి సావకాశమే లేకపోబట్టి వాడికి అంతా రుచే. ప్రాణాధార వస్తువులలో రుచులు ఎన్నడం మామూలుగా ఉండదు. కాని పరిస్థితి మారినప్పుడు, "అబ్బ! ఈ వేసంకాలంలో మంచినీళ్లకున్న రుచి మరిదేనికీ లేదు" అనడం వినిపిస్తూంటుంది. మాధుకరం ఎత్తుగున్నవాళ్లు అన్నంయొక్క రుచి వర్ణించగా వింటాం. దారిద్ర్యంలో వస్తువుల్ని వదులుకోడమే కాకుండా "రుచులు దోసంబంచుః బోనాడ" వలిసిన అవస్థ వస్తుంది. ఏదేనా వస్తువుయొక్క నిరంతర స్వీకరణం వల్ల రుచి తెలియదు. అయితే, ఒక సాధారణ మానవుడు ఒక వస్తువు తన నాలికమీద వేసుగున్నప్పుడు, ఫలిత రుచులు ఎన్నెన్ని విధాలుగా ఉండవచ్చును అంటే 'చాలా' అని ఊరుకోడమే కాకుండా కొద్దిగా లెఖకూడా కట్టచ్చు. అందులో ఆ భోక్తయొక్క, ఆ వండినవాడియొక్క, ఆ వడ్డించినవాడియొక్క స్వభావ సంప్రదాయ వయోవస్థా సమయ సందర్భాలూ, తరవాత వస్తువుయొక్క వ్యష్టి సమష్టి భావాలేకాక, మత్స్యమాంసఫలధాన్యశాక మూలాది భేదాలలో ఘనద్రవధూమాది ఉష్ణశీతల మిశ్రణాలు మొదలైనవీ వీలైనంతవరకు గమనించి ప్రస్తరించితే ఫలితరుచుల సంఖ్య కోటాన కోట్లమీద ఉండవచ్చునని బోధపడుతుంది. అందువల్ల ఒకే మనిషికి ఒకే వస్తువు పరిస్థితులబట్టి లక్షవేర్వేరురుచులు ఇవ్వడానికి వీల్లున్నప్పుడు, లోకం భిన్నరుచులు కలిగి ఉండేది అని చెప్పడంలో ప్రమాదం లేదు, ఆశ్చర్యం లేదు.

[పైలెఖ్ఖ యావత్తూ కడితే కొంచెం విసుగుగా ఉంటుంది. కట్టకుండా వదిలేస్తే 'ఏముటో' అని చప్పరించ బుద్ధేస్తుంది. అందుకని ఆశీర్షికల్లో వాలు గైదు మచ్చు చూస్తే ఈ క్రిందిమోస్తరుగా ఉంటాయి: భోక్తయొక్క నిత్యావస్థ— ఒంటరా, సంఘజీవా - బంధుసమేతుడా, అహితావృతుడా - శ్రమజీవా, లంచగొండా - దరిద్రుడా, ధనికుడా - ఉత్సాహయుతుడా, నిరుత్సాహపూరితుడా - నిర్బంధితుడా, స్వతంత్రుడా - లజ్జాన్వితుడా, మదాంధుడా - భయస్థుడా, సర్వాధికారా - కోపిష్టివాడా, శాంతుడా - తొందరవాడా, నిబ్బరస్థుడా అనేదాన్నిబట్టి రుచి వుంటుంది. అలాగే పదార్థస్థితి ఆలోచించినప్పుడు—ఘనమైతే కఠిన, మృదుల, స్థూల, చూర్ణ, భస్మ, స్ఫటిక, రేణు, రజ మొదలైన రూపాలూ, ద్రవమైతే జల, తైల, రస, మధు, పానక మొదలైన భేదాలూ వగైరాలనిబట్టి రుచి వుంటుంది. వస్తువు సంక్రమించిన రీతి గమనిస్తే, అది పిత్రార్జితమా స్వార్జితమా, పాతు దొరికిందా సవ్యంగా వచ్చిందా, కష్టార్జితమా బలవంతంగా లాక్కొచ్చిందా, చోరీబాపతా దత్తమా, యాచితమా విక్రీతమా, బహుళాకృతమా అనేదాన్నిబట్టి రుచి ఉంటుంది. అదీ కాక వస్తువు పచిత-అపచిత, పక్వ-అపక్వ, ఉష్ణ-శీతల, తప్త-ఆర్ద్ర, పూర్వ - ప్రస్తుత, మిత - అమిత, ప్రత్యేక-సాకల్య, వాయుహత-వాయురహిత, అవస్థల్నిబట్టి రుచి ఉంటుంది. చివరికి, అన్నదాత ఉద్దేశం హృదయపూర్వకమా, వ్యాజపూర్వకమా, ఇతరలాభం ఉద్దేశించా, పితృప్రీత్యర్థమా, మిత్రప్రీత్యర్థమా, అధికారిక ప్రీత్యర్థమా, యశోవాంఛతోనా, ప్రాణపోషణ నిమిత్తమా, ప్రతిఫలం ఆశించా, పాపపరిహారం చేసుగోవచ్చుననా—అనేదాన్ని బట్టికూడా రుచి వుంటుంది. ఈ శీర్షికలక్రింద ప్రమేయాలు ఎక్కువగా ఆలోచించి రకాల సంఖ్య వేసినకొద్దీ ఫలిత రుచుల సంఖ్య గుణకలితంగా పెరిగిపోతుంది.]

ఇన్నిన్ని షరతులమీద ఆధారపడి ఉండడం వల్ల ఏవ్యక్తియొక్క రుచి ఆవ్యక్తిది. ఇద్దరు వ్యక్తుల రుచులు ఏలేశమో భేదించి ఉండడం సహజం. అచ్చం

గా ఒకటే అయేటట్టు ఏకీభవించడం మిక్కిలి అపరూపంగా ఉండే ఆశ్చర్యం! "మాదుమూర్తులా ఒకే పోలిక మొహాలు గలవాళ్లు ఇద్దరు దొరకవచ్చు గాని, ఒకేరుచి గలవాళ్లు దొరకరు." ఒకరి రుచి ఉన్నరీతిగా ఎందుకని ఉంటుందో చెప్పడం కష్టం, అడగడం వ్యర్థం. దండనవల్ల ఆకస్మికంగా అన్యరుచి కలిగించడంగాని, ఉన్నరుచి లేకుండా చెయ్యడం గాని అసంభవం. అల్లా అని ఆగిపోవలిసిందేనా? జిహ్వ వంటిదానియొక్క రుచిసంపదకి ప్రమాణం అంటూ ఏదేనా ఉంటుందా అనేది ప్రశ్న. అంటే, నీతిమాటేమిటి? దానికి ఓ ప్రమాణం అంటూ లేదూ? ఎవరి నీతి వారిదే అయితే సంఘం నడుస్తుందా? ఒక వీథిలో ఒకాయన దెబ్బలాట ప్రారంభించి, ఏమిటని అడిగితే "నాయిష్టం" అన్నాడు. ఇంకోఆయన "నీయిష్టం నీ యింటిదగ్గర, పోవోయ్!" అన్నాడు. అప్పుడు మొదటాయన, "నాయింటిదగ్గిర నాయిష్టం నాకు తెలుసు గనక దెబ్బలాడతాను, నాయిష్టం. ఇది వీథి గనక పబ్లిగ్గా దెబ్బలాడుతాను, నాయిష్టం!" అని యింకా దెబ్బలు తిన్నాడు. ఏమయితేం గనక, ఎక్కడపడితే అక్కడ ఎవడియిష్టం వాడిదేనా, ప్రతీవాడియిష్టం ఒప్పేనా? ఒక అఖండమైన సంతర్పణ జరుగుతూండగా, పోపుల ఘుమాయింపు వీథివీథీ వ్యాపించగా, బారులు తీర్చి కూచుని జనం ఆరగిస్తుండగా, ఒకవ్యక్తి "ఏముంది ఇందులో! ఈభోజనం నాకు రుచించలేదు. నాయిష్టం, నా రాజ్యం. నేను మనస్సాక్షిగానే చెబుతున్నాను. ఏడిసినట్టుంది. నాకు అల్లా అనిపిస్తోంది. నాకు అల్లా అనిపించకూడదు అని ఏమన్నా రూల్సా?" అంటాడనుకోండి. అతగాడి త్రికరణశుద్ధి రుజువు చెయ్యడం అసాధ్యమే కాని, వాడి రుచిప్రమాణం చాలా హెచ్చుతగ్గుగా ఉందని మాత్రం అనచ్చు. వాడు సుస్తీమనిషిగాని, కాయిలా మనిషిగాని, దీర్ఘరోగి గాని, అసూయాపరుడుగాని, దాంభికుడుగాని, అన్యాపేక్షగలవాగాని, అప్పుడే మెక్కి వచ్చినవాడు గాని, తిండికి వేళపాళలు లేనివాడు గాని, ఆపదార్థాలు జీవితంలో తెలియనివాడుగాని, స్థితప్రజ్ఞుడుగాని అయిఉండాలి. నాకు రుచించని ఒక వస్తువు ఇతరులకి రుచించి తీరాలని పట్టుపట్టడం మూర్ఖత్వం. ఇతరులకి కూడా ఎందుకు రుచించకూడదు అని అనుకోడం దురాశ. ఇతరులకి కూడా రుచించదు గదా అనుకోవడం బుద్ధి తక్కువ. ఏమంటే, అది ఇతరుల్లో కొందరికి మిక్కిలి రుచికరమైనదే అయిఉండవచ్చు; లేదా సకలజనులూ కూడా అసహ్యించుకునేదై ఉండవచ్చు. మొదటిసందర్భంలో ఆ వస్తువుమీద నేను ద్వేషం పెంచుకోరాదు. ఎన్నెన్నిమాట్లో రొట్టెలువేస్తూ, ఎంతో రుచికరం అని మెచ్చుకొంటూ, ఇతరులు ఒకవస్తువుని ఆరగించేటప్పుడు, పక్కనే నేను శైటాయించి, అది నాకు రుచించకపోయినకారణంవల్ల, తింటూన్నవాళ్ల సమక్షంలో, నాకు పాక్కుందిగదా అనిచెప్పేసి నేను డోకోక్కడం ప్రారంభించడం ధర్మంలా కనబడదు. తినా తినక, తినానియ్యక కంగాళీ చెయ్యడం మానవేతరమైన లక్షణం. కాని, అంతమంది తినేస్తూన్నది మేడిపండు గదా అనే సంగతి వాళ్లల్లో ఏఒకడికీ తెలియక, నా ఒక్కడికి మాత్రమే తెలిసిఉండడం సంభవిస్తే, అనేక ప్రాణరక్షణకోసం నేను అడ్డుపడవలసినమాటే! అంత అహంభావత్వానికి అవసరం నాకు ఉందని తోస్తే అల్లా చెయ్యనూవచ్చు! ఏమైతేం, అదృష్టవశం చేత ప్రాణాపాయకరం అయిన వస్తువులు రుచికరం కాకపోడమే కాక, దుర్వాసనతో కూడా కూడిఉండడంవల్ల, ప్రతీ మానవుడూ తను తినేవస్తువుల్లో ఏదో రుచి ప్రమాణం పెట్టుకునే వ్యవహరించడానికి వీల్లున్నాయి, వ్యవహరిస్తూ ఉంటాడు. వాసన అంటే జ్ఞాపకం వచ్చింది. రుచులన్నీ కూడా వాసనమీదే ఆధారపడి ఉన్నాయని ఒక వాదం ఉంది. నమ్మవచ్చు. ఎవరికేనా నమ్మకం లేకపోతే, మిక్కిలి రుచికరం అని తమరు నమ్మే వస్తువులు తమరు తినేటప్పుడు కాస్సేపు తమరు ముక్కు మూసుకుంటే పైవాదం బోధపడుతుంది. ఎవరికేనా నూతనపదార్థం తినడానికి ఇచ్చినప్పుడు వాడు ముందు వాసన చూసి తరవాతే నోట్లో వేసుకోడం అందుకనే! మొత్తంమీద, భౌతిక రుచులు గల వాళ్లల్లో, వంకాయకూర ఫస్టూ, దప్పళం సెకండూ, పులావ్ నెంబర్ వన్ అంటూ వేర్వేరుగా మెచ్చుకున్నా వాళ్లందర్నీ ఒక తరహాలోనూ, కుళ్లు అన్నం

ఫట్టూ, బూజా ఊరగాయ పెట్టూ, ఉచ్ఛిష్టం పెంబర్ వన్ అనేవాళ్లందర్నీ మరోతరహాలోనూ కట్టితీరాలి.

ఇక్కడ విడానించి రెండుసంగతులు గమనించాలి. లోకం అంటే (రుచినిమిత్తం) మనుష్యులే అన్నాం. మనిషికి శరీరమే కాకుండా మనస్సూ, ఆత్మా కూడా ఉండాలి, జిహ్వ కాకుండా ముక్కూ, కళ్లూ, చెవులూకూడా ఉంటాయి. ముక్కు పొడుం పీల్చడానికి మాత్రమే అనిన్నీ, కళ్లు ఎందుకంటే మూసేసుకుని భోంచెయ్యడానికనిన్నీ, చెవులు ఎందుకంటే భోజనానికి లెమ్మంటున్నారేమో అనే సంగతి వినడానికనిన్నీ అని సమర్థించి పారెయ్యడం మానవం కాదు. ఉల్లిపాయ, ఇంగువ, సంపగి, పనస వంటి వాట్ల విడిసుగంధాలు బ్రహ్మాండంమీద కనిపెట్టేవాళ్లు చాలామంది ఉన్నారు. రాత్రిముక్కులు కలిగి ఏబాధా లేనివాళ్లున్నారు. బస్తీవాసనకి మరిగినవాళ్లు కొందరు గ్రహించగల సువాసనలు ద్వివచనంలోకూడా ఉండేటట్టు తోచదు. కాని ఘ్రాణేంద్రియానికి సంబంధించిన అభిరుచులు గలవాళ్లు జపానులో విస్తారంగా ఉన్నారనిన్నీ, సుగంధమిశ్రణాలు చెయ్యడం జపానులో ఒక గొప్ప నాసికాకళ అనిన్నీ తెలుస్తుంది. జపానీయులలో కొందరు గంధరుచిలో ఆరితేరినవాళ్లు రెండు మూడు వందల మిశ్రణసుగంధాలు పోల్చగలరట— గానరుచి గలవాళ్లు రెండు మూడు వందల రాగాలు పోల్చుకున్నట్టు. అలాగే నేత్రాలవల్ల వర్ణరూప చిత్ర శిల్పనిర్మాణాల సంగతి గ్రహించే రుచి మానవుడికి ఉండాలి. చిన్నప్పుడు రంగుబొమ్మలంటే శిశువుకి వుండే ఆసక్తే దానికి ప్రాతిపదిక. బొమ్మరిల్లు కట్టి ఆడినప్పటినించీ శిల్పం అంటే మానవుడికి రుచి. మెత్తని గూడు కట్టుకోగల పక్షులకే ఆ ప్రజ్ఞ సహజంగా ఉంది. మానవుడు ప్రకృతిలో దృశ్యాలూ, మానవకల్పిత చిత్రాలూ చూసి ఆనందించగల రుచి పెంచుకోవాలి. అది రంగులతో సంబంధించిన కళగనక దాన్నిగురించి మాటలు ఎన్ని చెప్పీ లాభం లేదు. జీవకళ లేని బొమ్మల్నీ, సంకరజాతి చిత్రాల్నీ, పచ్చి బోడి కుళ్లురకం పటాల్నీ, పెంట కొండల్నీ, మురుసుప్రవాహాల్నీ చూడడంలో ఎవడికేనా అభిరుచి ఉంటే అది కేవలం నాసిరకం అభిరుచి అని చెప్పడం తప్పు కాదు.

ఇక్కడ ఒక ఉపవిషయం! ధర్మ అర్థ కామ మోక్షాలు అనే పురుషార్థాలయందు అభిరుచి ఉండడం న్యాయంకదా అని పెద్దలంటారు, పిన్నలు వింటారు, 'పోదురూ' అంటారు. (ధర్మం అనేమాటకి సంస్కృతంలో ఉండే అర్థం తెలుగులో దీర్ఘార్థం కాదు. ధర్మం అంటే శాస్త్రాచార విహితమైనదాన్ని బట్టి మానవుడు ప్రపంచం సాగడం నిమిత్తం చెయ్యవలసిన పని, ఆపనియొక్క నిర్ణయవాక్యం అని సంస్కృతంలో. దానం అని తెలుగులో. తెలుగులోకి దిగిన సంస్కృతపు మాటల గురించిన నిఘంటువుల్లోకూడా తెలుగులో ఆ మాటలకుండే రూఢ్యర్థాలు ఇచ్చి ఉండకపోవడం అధర్మం). ప్రస్తుత కాలంలో చాలామందికి అర్థకామాల్లో మాత్రం అభిరుచి ఉన్నట్టు తెలిసిపోతోంది. అవి రెండూ భౌతికమే. అవిగాక నాగరికతయొక్క మహాత్మ్యంవల్ల ఆకస్మిక గౌరవాభిరుచి, అధికారాభిరుచి, ఘోషణాభిరుచి, ప్రచారాభిరుచి, సౌకర్యాభిరుచి, సద్యఃఫలితాభిరుచి. ఆశ్రయత్వాభిరుచి, పరభృతిత్వాభిరుచి, సగౌరవ తస్కరణాభిరుచి, సవినయదంభాభిరుచి, మరియింకా ఇటువంటివి ఎన్నెన్నో పుట్టించుకుని, బలవంతంగా లాక్కుని తెచ్చిపెట్టుకుని, పెంచుకుని, పోషించుకుని అవన్నీ కాంతాకనకాలనిమిత్తమే అని జనబాహుళ్యానికి బోధపడకుండా సక్కవినయాలూ, సమయానుకూలనటనలూ చేస్తూ, కేవలమోక్షార్థులై ధర్మాచరణకి ఉద్యుక్తులైనట్టు కనిపించే మానవులు తక్కువగా ఉన్నారని భయపడవలసిన అవసరం లేదు. దేవుడు పడ్డ బుద్ధిపొరపాట్లలో తమకి మానవజన్మ ఇవ్వడం అగమం ఒకటి అని దేవుడి సముఖంలోనే ఋజువు చెయ్యదల్చుకుంటూ, అని ఇటువంటి బుద్ధిమంతులే చెబుతారు మరి!

శ్రవణేంద్రియానికి సంబంధించిన శబ్దాలలోనే ఉండే శాస్త్రాలయందు అభిరుచి ప్రశంసనీయం. ఆ అభిరుచి కలగడానికి బుద్ధి, శ్రద్ధ, అభ్యాసం అడ్డుగనక అది అందరికీ అలవడదు. కాని, హృదయం ఉంటే

పరిపోయే గాన కవిత్వాలనుగురించిన అభిరుచి సర్వజనసాధ్యం. అభిరుచి అంటే ప్రజ్ఞ కాదు. ఒక విషయంలో ప్రజ్ఞ అందరికీ లేకపోవచ్చుగాని, అభిరుచి అందరికీ ఉండవచ్చు. గానంలో జంత్రగాత్రాలు, కర్ణాట, గవాయి, హిందూస్థానీలు, శాస్త్రకట్టు, గాలిపాట, డ్రామాస్టయిలులు, శ్రుతి లయ రాగ తాన కీర్తనలు విరివిగా పెంచి గమనిస్తే అభిరుచులు వేనవేలని తేలగలదు. వాటిలో వీణాదివాద్యాలు చెయ్యబడ్డప్పుడూ, భజనతత్వ కీర్తనలవంటివి సార్థకంగా గానం చెయ్యబడేటప్పుడూ వినాలనే అభిరుచి ఉత్కృష్టం, దివ్యం! కాని, పశుశృంగారపు వర్ణనలతో ఉండే పచ్చి జావళీలు వినాలనేది భౌతిక అభిరుచి.

ఇక కవిత్వంగురించిన అభిరుచులూ మిక్కుటమే. తటస్థ - నీతిబోధక, శ్రోత్రియ - సాంసారిక, శాశ్వత - తాత్కాలిక, స్వీయ - పర, సనాతన - అధునిక, గ్రాంథిక - వ్యావహారిక, ముద్రిత - లిఖిత (స్వ-పర), జనప్రియ - అపరూప, సచిత్ర - చిత్రరహిత, గ్రంథస్థ - పత్రస్థితుల్లో స్వ - పర భాషలలో ఉండే పద్యగద్యాభిరుచులు. పద్యవిషయంలో పురాణ ప్రబంధ శతక దండక చంపూ కావ్య గేయ చాటు ఆశు మొదలైన రకాలలో ఛందోభేదాలతో ఉండే నాద పద అర్థ భావ అలంకార సందర్భాలగురించిన రుచులు. గద్య విషయంలో మననకథన వర్ణన భాషణ రూపాలలో లేఖ వ్యాస చరిత్ర నవల విమర్శ మొదలైన భేదాలలో ఉండగల రుచులు. ఆపైని, కర్త, గ్రంథం, గ్రంథభాగం మొదలైనవాటినిగురించి చదివేవాడు విద్యార్థి, పఠకుడు, పారాయణ చేసేవాడు, కాలక్షేపం చెయ్యదల్చినవాడు గాగలవాటిని పురస్కరించుకుని రుచులు ఎక్కువగా ఉండగలవని చెప్పచ్చు. ఇటువంటి రుచులన్నీ సమంజసములే, సదభిరుచులే, గొప్పవే. అన్ని రచనలమీదా అందరికీ అభిరుచి ఉండదు, ఉండడం సహజంకాదు. ఇద్దరి అభిరుచులు వేర్వేరు అయినప్పుడు ఆశ్చర్యపడకూడదు, ఒకర్ని ఒకరు లేలికగా చూసుగోనక్కర్లేదు సరిగదా, ఏకీభవించినప్పుడు చాలా అద్భుతపడి ఆనందించుకోవచ్చు. కాని, హృదయంమీదగాని, బుర్రలోగాని వేసుగోకుండానే రుచి లేదనో ఉందనో చెప్పేవాడూ, పిండితే పిండి పిండి అయినా తడికక్కని పాషాణ రచనని చప్పరించకుండానే మింగేసి మహా రుచిగా ఉందనేవాడూ, గతించినవాడి కవిత్వం గనక రుచివంతం అనేవాడూ, వీలునుబట్టి తన, తన కుటుంబ, తన శాఖ, తన వర్ణ, తనజాతి, తన భాష, తన దేశరచనకాబట్టి "రుచిగానే ఉందిస్మీ" అనేవాడూ, వేడివేడిరచన ప్రతీదీ రుచివంతం అనేవాడూ (అసలు అప్పట్లో రుచే తెలియదు నిజానికి!), తన శత్రువురుచి కనుక్కుని దానికి భిన్నంగా ఉండేదే తన రుచి అనేవాడూ — వీళ్లంతా సుస్తీగా ఉండే రుచులు గలవాళ్లే. అల్లాంటి దగాలో పడిపోయినవాళ్లని కాలం తిన్నపరుస్తుంది. వాళ్లు నిమ్మళంగా అన్యులు కనిపెట్టకుండా అభిరుచి మార్చుగోవలసొస్తుంది, మార్చుగుంటారు. అందుకని ఏ గొడవా లేకుండా, కాలంచేత మన్నింపబడ్డ తెలుగుమహాకవుల రచనలంటే అభిరుచి కలిగించుగోడం సాధారణ తెలుగు మానవుడి ధర్మం. ఆ రీతిగా మానసిక ఆనందం గలిగించే ఉత్కృష్ట అభిరుచులు లేని మానవజన్మ వ్యర్థం, ఊసూరుమనే రకం, దివాలా సరుకు! ఇదికాక, జీవుడూ, జీవితరహస్యమూ గురించిన అభిరుచికూడా ఆత్మానందం ఇచ్చేది గనక మానవజీవితానికి ముఖ్యాతిముఖ్యం. వీటి అన్నింటిలోనూ కూడా, అవతల రచయిత ప్రసాదించేది రసవద్వస్తువు కావలసిన అవసరం ఎల్లాగైతే ఉందో, అల్లానే నాలిక తడిగలది అయినట్టుగా, హృదయం తడిగలదై ఉండాలి. అప్పుడుగాని రుచీ ఉండదు రచీ ఉండదు. ఇతర సుగుణాలలాగే సదభిరుచులు పెట్టిపుట్టాలి. అవి సన్మార్గంలో అభివృద్ధి చేసుగోనూవచ్చు. ధనం, కాలం స్వల్పంగా అందునిమిత్తం త్యాగంచేసి దీక్షగా అభ్యసించడం చాలు. ఏ కొంచెమో ఏదో త్యాగంచేసి సంపాదించుకుంటేగాని ఏదీ రుచించదు. అభిలాషతో, ఆసక్తితో ఆ ఆవరణలో ఉండి, ఆ గాలే పీలుస్తూ త్రికరణశుద్ధితో ప్రయత్నించి తన భాషలో అన్ని వేల రకాలలో ఏ బాపతో ఒక బాపతు కవిత్వం అంటే అభిరుచి ప్రతివాడూ పెంచుగోవచ్చును. అటువంటి

ప్రతీవాడికీ కేవల భౌతికరుచులే కాక, మానసిక ఆత్మిక అభిరుచులు ఉంటాయి గనకనే, పూర్వమహాగ్రంథాల్లో చిన్న చిన్న ఘట్టాల చివరా, ఉపాఖ్యానాల చివరా "ఈ కథ, ఈ ఉపాఖ్యానం, ఈ సంవాదం ఎవడేనా శ్రద్ధతో విన్నా, తనకోసం చదువుకున్నా, ఇతరుల కోసం పఠించినా, వ్రాసుకున్నా, వ్రాసిపెట్టినా మోక్షం ఉంటుంది" అనే మోస్తరుగా చెప్పి ఉంటుంది. ఆ ముక్కలు మానవుడికి ఉండగల మహోత్తమ అభిరుచిని మెచ్చుకునేవిగనక, శిలాక్షరాలు. ఇంకా ఏమంటే, ఆ మనిషికి కేవల పాశవం కానటువంటి ఉత్కృష్ట అభిరుచి కలుగుతుంది గనక! ఏమిటీ ఆ అభిరుచిఫలం? సచ్ఛీలమే. అది పురుషార్థం కావచ్చు గదా! ఒక మహామహుడు చెప్పిన సందేశం ఇది:

"అభిరుచి బండ, మోటు, సున్నితం అవడాన్ని బట్టి జీవితం అసారం, పాశవం, దివ్యం అవుతుంది. ఒక సామ్రాజ్యానికి మొద్దుస్వరూపపు రాజుగా పుట్టేకంటె దరిద్రుడైనా సదభిరుచులు కలవాడుగా పుట్టడం వెయ్యివేలు. దేవప్రసాదమైన ఈ అభిరుచి వరం లేనిదే, ఎంత అదృష్టవంతుడటకానీ, సౌఖ్యం ఎక్కడ?"

గనోరియాకు ఆధుని చికిత్స



నేటి సుప్రసిద్ధ దివ్యౌషధము

ఇంగ్లీషు మరియు యితర నాటువైద్యములకు మీ చర్మము నివారణవ్యాధి కాక పుచ్చుకొన్న యింజెక్షనులు నిష్ప్రయోజనమై యుండినయెడల మేము తయారుచేసిన నేటి "గోనో కిల్లర్"ను వాడిచూడుడు. ఈ సుప్రసిద్ధమందు అన్నివిధముల చర్మబాధలను శీఘ్రకాలములో తొలగించి మీకు సౌఖ్యమునిచ్చును. యిది, **స్త్రీ పురుషులయొక్క**, మూత్రజాడ్యములకును చీముతోగూడిన వివిధ రకముల **గనేరియా-మేహరోగము**, తెలుపుపోవుట, వాపు, వీర్యముపోవుట, పొక్కులు యీ మొదలయినవి దీనివలన నివారణయగును. వేలకొలది జనులు మా మందును వాడి సౌఖ్యము పొందినారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులు యానందించినారు. కాలము పోగొట్టక మీరు యీమందును ఒకసారి వుపయోగించి యానందము పొందండి. 50 మాత్రల బుడ్డి యొకటికి రూ. 8/-మాత్రమే. వి. పి. పి. ప్రత్యేకము అణాలు 8.

Sole manufacturer:—**Dr. D N. JASANI,**
(Dpt. B. H. M) Vithalbhai Patel Road Bombay No. 4.

Madras Agent
APPAH & CO.,
China Bazaar,



కేశకలాపము

ఆ తలకట్టుపైననే మీ ముఖ సౌందర్యము యొక్క వృద్ధి క్షయములు ఆధారపడియున్నవి. ఆ సొగసు క్షీణింపకుండ కేశవర్ధినిచే వృద్ధిచేసికొనుడు.

మంచి తలకట్టులేక హీనముగా నుండుటకంటె విచారకరమైనది మరియొకటి లేదు. నష్టపడకుండ కురులను గట్టిపరచుటలో కేశవర్ధినికన్న వేరొకటి లేదు.

అందరు సుందరులు కాకపోవచ్చును కాని సుందరవేణీధరము నందరు పొందవచ్చును.

మీరు కేశములు బాగుగా యుండినవాటిని అటులనే గట్టిపరచుకొనుడు. కేశములు తక్కువగా యుండిన కేశవర్ధినిని వాడి వాటిని వృద్ధిపరచుకొనుడు. కేశవర్ధిని కేశవృద్ధికే కాక కేశములకు అందమునిచ్చును.

కేశవర్ధిని

నేడే వాడుడు.

కేశవర్ధిని	అణాలు. 12/-
కేశవర్ధిని షాంపూ	,, 12/-
కేశవర్ధిని క్రీం	రు. 1/-

ప్యాకింగు పోస్టేజి అధికము.

వర్తకులందరివద్ద దొరకును లేక

సౌత్ యిండియా కెమికల్సు,

మైలాపూరు, — — మదరాసు.

= విమాన = యుద్ధము

= శ్రీపింగళి వెంకటరామయ్య =

విమానయుద్ధములో శత్రుస్థానములమీద బాంబులు వేయుట, శత్రువుల బాంబరులను స్వదేశమునకు రానీకుండ పోట్లాడుట ముఖ్యమైన విషయములు. బాంబరువిమానముల ముఖ్యకర్తవ్యము శత్రుస్థానములలోనికి చొచ్చుకుపోయి ముఖ్యమగు స్థలములమీద బాంబులు వేయుటయే. బాంబరులలో విమానచోదకుడు, బాంబులు వేయువాడు కాక తుపాకులను ప్రేల్చుటకు ఇద్దరుగాని, అంతకంటె ఎక్కువగాని సైనికు లుందురు. బాంబరువిమానములను ప్రతిఘటించుటకు వచ్చు శత్రువుల పోట్లాటవిమానములను కాల్చుటకు మాత్రము బాంబరువిమానమునందు వెనకభాగమునం దొక తుపాకిని, ప్రక్కలను ముందునుకూడ మరికొన్నిటిని అమర్చుదురు. ఈ తుపాకులను అన్నివైపులకును త్రిప్పుటకు కొంతవరకు వీలుగా నుండును. వీని సహాయముచేత ఏదిక్కునుండి వచ్చు విమానమునైనను కాల్చుదురు. బాంబరు విమానములో వెనుక తుపాకివద్ద నున్న సైనికునిపని మిక్కిలి కష్టమైనది. స్థలము మిక్కిలి ఇరుకుగానుండును. ఆగది అద్దముతో కట్టబడియుండుటచే శత్రువుల తుపాకులకు తొందరగా గురియగును. విమానచోదకులకంటె మూడురెట్లెక్కువగా తుపాకిసైనికులు చనిపోవుటకవకాశము గలదు. బాంబరు శత్రువుల తుపాకులకు గురియై క్రింద పడినప్పుడు తుపాకిసైనికుడు తన గతియందే చిక్కుకొని తుత్తునియలై నలిగిపోవలసినదే. ఎక్కువ దూరపు ప్రయాణములైనచో మిక్కిలి ప్రమాదము కలదు. దారియందు శత్రువిమానము లెదురైనచో వానిమీద తుపాకులను ప్రేల్చకూడదు. వీలైనంతవరకు తప్పించుకొనిపోవుటకు ప్రయత్నించ

వలెను. తుపాకులను దారియందే ప్రేల్చినచో, గమ్యస్థానము చేరుసరికి తుపాకులకు మందును, తోటాలును అయిపోయి బాంబులువేయు సమయమందు, శత్రువుల పోట్లాటవిమానములనుండి స్వరక్షణ చేసికొనుటకు వీలుండదు. పైగాతిరిగివచ్చునప్పుడు శత్రువుల తరుముడువిమానముల బారినుండి తప్పించుకొనుటకు తుపాకులు ప్రేల్చవలసివచ్చును. అందుచే బాంబరు విమానములలోని తుపాకులను వీలైనంతవరకు ప్రేల్చుట ఆపుచేయుదురు. ఇట్లే డైవుబాంబరులు, టార్పెడో విమానములు, గస్తీవిమానములయందుగూడ తుపాకులను ప్రేల్చుట వీలైనంతవరకు తగ్గింతురు.

కాని, పోట్లాటవిమానములలో మాత్రము వీలైనప్పుడెల్ల తుపాకులను ప్రేల్చి శత్రువిమానములను ధ్వంసముచేయుటకు ప్రయత్నింతురు. పోట్లాటవిమానమందు విమానచోదకునికి ప్రక్కలందు ముందుకుతిన్నగా అమర్చియున్న తుపాకిని ప్రేల్చువాడు తుపాకిసైనికులకు నాయకుడుగా నుండును. అతని ఆజ్ఞ ననుసరించి చోదకుడు విమానమును నడుపుచుండును. నేటి యుద్ధమునందు విమానముల పోట్లాట పెద్దశాస్త్రముగా నున్నది. పరుగెత్తుచున్న విమానమునుండి వేగముగా పోవు మరియొక విమానమును గురిచూచుట మిక్కిలి కష్టము. అందుకు గాలినిరోధకశక్తి, గుండ్లు జారుట మొదలగు విషయము లెన్నియో పరిగణించవలయును. ఇదిగాక తుపాకినుండి పోవు గుండు సుళ్లుతిరుగుచు పోవును. ఈసుళ్లుతిరుగుట విమానవేగము ననుసరించియుండును. అందుచే గురిచూచునప్పుడు ఈ విషయమునుకూడ గమనించవలసియుండును. ఇన్ని విషయములను గమనించినను గురి పోవును. అందుచే గుండ్లుఅమర్చిన బెల్టునందు ప్రతిఅయిదు గుండ్లతరవాత నుండు గుండు పోవునప్పుడు దానిమార్గము గుర్తించుటకు వీలుగా నుండునట్లు చేయుదురు. ఈ గుండునకు భాస్వరపు మిశ్రపదార్థము అతికింపబడియుండును. అందుచే ఇది పగలు గాలిలో పోవునప్పుడు దీని మార్గమంతటను తెల్లని బూడిదరంగుగల పొగ ఏర్పడును; రాత్రియైనచో నీలపు ఎరుపురంగు అగ్నిరవ్వ లేర్పడును. వీనిచే గుండుయొక్క మార్గము బాగుగా కనపడి గురిని సరిచేసికొనుచుండుటకు వీలుగా నుండును.

ఒకే సైనికుడున్న పోట్లాటవిమానముయొక్కయు, ఎక్కువ సైనికులున్న పోట్లాటవిమానముయొక్కయు పోట్లాటపద్ధతులు వేరుగా నుండును. విమానమును నడుపుటయందు నిపుణుడైన చోదకుడు తుపాకులనుకూడ గురిచూడజాలడు. అందుచే తుపాకులు శత్రువిమానము వైపు గురియగునట్లుగా తన విమానమును నడుపును. మీటనొక్కినతోడనే తుపాకులన్నియు శత్రువిమానముమీదకు కేంద్రీకరించి ప్రేలును. ఎక్కువ సైనికులున్నప్పుడు తుపాకులనే త్రిప్పి గురిచూచెదరు. కడచిన యుద్ధములో కుక్కపోట్లాట లెక్కువగా జరిగెడివి. అనగా ఒక విమానమువెంట మరియొకటి గుండ్రముగా వలయాకారములో తరుముట. ఇందువల్ల ఒకదానిమీద మరియొకటి తుపాకులను ప్రేల్చుటకు వీలుండదు. కాని నేటియుద్ధములో ఎక్కువవేగము కలిగిన విమానముల కీయుద్ధము సాధ్యముకాదు. ఎక్కువవేగముతో గుండ్రముగా తిరిగినచో భ్రమణోత్సారకశక్తివల్ల (Centrifugal force) విమానచోదకుని రక్తమంతయు తలలోనికి చొచ్చుకుపోయి అపస్మారము కల్గును. ఈ పోట్లాటలయందు విమానములు సూర్యునిమాటుననుండుట కెక్కువగా ప్రయత్నించును. అందుచే శత్రువైమానికుడు తనవైపు చూచుట కష్టమగును. సూర్యుడు కండ్లలో పొడుచును. ఒక శత్రువిమానమును మూడు విమానము లెదుర్కొన్నప్పుడు రెండు ప్రక్కలనుండి ఎదుర్కొనును; మూడవది పైనుండియు, అడుగునుండియు ఎదుర్కొనుచు నిప్పులవర్షము కురిపించును. ఈపోట్లాటలయందు విమానములు చిత్రచిత్రములుగా ఎదుర్కొనుచుండును.

శత్రుదేశముమీద బాంబులు వేయుటకుగాని, యుద్ధము చేయుటకుగాని విమానములు ఇరువదిరైదొక దండుగా చేరి పోవును. ఆదండునకు నాయకుడు తన విమానమునందుండి దండులోని తదితర విమానములకు నిస్తంత్రీ యంత్రముద్వారా యుద్ధముచేయుటకు సలహాల నిచ్చుచుండును. ఈ సలహాలను గ్రహించుచు దండులోని విమానములన్నియు నడచుకొనును. నాయకుని ఈ సలహాలను శత్రువిమానములు కూడ తెలిసికొనవచ్చును. అందుచే ప్రస్తుత యుద్ధమునందు బ్రిటిషు విమానములలో నాయకులు రంగుదీపములను చూపి సంజ్ఞలచే విమానపుదండును నడుపుచున్నారు. ఈ దీపమునకు రంగురంగుల అద్దము లుండును. వీనిని మార్చుచు నాయకుడు తనవిమానపు కిటికీలోనుండి చూపుచుండును. దండులోని తదితరవిమాన చోదకులు ఈ సంజ్ఞలను గమనించుచు యుద్ధము చేయుదురు.

పోట్లాటవిమానములలో తుపాకులు

పోట్లాటవిమానములలో ఒక్కొక్కచోట ఒక్కొక్కటిమాత్రమేకాక ఒక్కొక్క పీఠమునకు నాలుగైదు వరకు తుపాకు లమర్చబడును. ఇవి ఒక దానివెంబడి మరియొకటి ప్రేలుచు నిప్పులవర్షమును కురిపించును. ఈ తుపాకిపీఠములు చిన్న గోపురముల వలె నుండును. వీనియందు గాడులలో తుపాకు లమర్చుదురు. వీనిని పైకి ఎత్తుటకును, క్రిందికి దింపుటకును చేతిమీట లుండును. పీఠమును ప్రక్కలకు త్రిప్పుటకు ప్రక్కనమర్చిన మిక్కిలి ఒత్తిడిగాలి కలిగిన సిలిండరుల నమర్చుదురు. మీటనొక్కిన తక్షణమే ఈఒత్తిడిగాలి సహాయమువల్ల పీఠము ఇరుపైపులకును మిక్కిలి వేగముగా తిరిగిపోవును. క్రింద కాళ్లవద్ద అమర్చిన మీటను కాలితో నొక్కినచో తుపాకులు ప్రేలిపోవును. ఈ పీఠములలో .౩౧౨ కాలిబరుమిషను తుపాకులను నాలిగింటిని అమర్చుదురు. ఈ తుపాకి ఒక్కొక్కటి నిముషమునకు ౧౨౧౦ గుండ్లు ప్రేల్చగలిగియుండును. ఈ నాల్గుతుపాకులతోను, వానిని ప్రేల్చు సాధనసామగ్రులతోను, మందుతోను గూడిన పీఠము ౧౩౦౦ పౌనుల వరకు బరువుండును. విమానమునందు ఎక్కువ తుపాకులుండి, మంచి మందుసామగ్రి యున్నచో నిప్పులవర్షము నెక్కువగా కురిపించగలదు. అట్టి విమానమునకు అగ్నిశక్తి (Fire affect) ఎక్కువగా నున్న దందురు. విమానములందు తుపాకిసైనికుడు పొట్టిగా నుండి గుండెనిబ్బరము ఎక్కువ ఉన్నవాడుగా నుండవలెను. సూక్ష్మమగు దూరదృష్టి, బుద్ధికుశలత, మంచి శాస్త్రజ్ఞానము కలవాడుగా నుండవలెను.

బాంబులు వేయుట

పోట్లాటవిమానమునకువలె బాంబరునకు కాలమును, వేగమును ఎక్కువ అమూల్యమైనవికావు. బాంబరులు గంటలకొలది ఆకాశమునం దుండవలసి వచ్చును. బాంబులు వేయవలసిన స్థానమును చేరుటకు వందలకొలది మైళ్లు చీకటిలో ప్రయాణము చేయవలసివచ్చును. నిర్ణీతస్థలము చేరినతరువాత సరిగా నిర్ణీతభవనములమీద బాంబులు వేయవలెను. బాంబరు నడుపు చోదకునికి బయలుదేరుటకు ముందుగా ఎచ్చటికి పోవలసినదియు, ఏ మార్గమున పోవలసినదియు, వాతావరణ పరిస్థితులనుగూర్చియు వివరములు తెలుపబడును. గాలివీచు దిక్కు, గాలియొక్క శక్తియు ముఖ్యములు. విమానము గాలియొక్క శక్తి ననుసరించి సరియగు మార్గము ననుగమించవలెను. శత్రుస్థానము చేరినతరువాత బాంబరు విమానవిధ్వంసక ఫిరంగులను, శత్రువుల పోట్లాటవిమానములను తప్పించుకొనుటకు వంకరటింకరమార్గముల ననుసరించి పోయి మిక్కిలి జాగ్రతగా బాంబులువేసి భద్రముగా వెనుకకురావలెను.

ఆల్టిట్యూడు బాంబింగు
(ఎత్తునుండి బాంబులువేయుట)

౨౦౦౦౦ అడుగులకంటె పై ఎత్తులనుండి బాంబులను సరిగా నిర్ణీతస్థలములమీద వేయుట మిక్కిలి కష్టము. విమానమును సరిగాభవనముమీద నిలబెట్టవలెను. ఇది మిక్కిలి కష్టము. విమానము నడుచుచుండగా వేసినచో బాంబు ముందునకు కొట్టుకొనిపోవును. అందుచే బాంబును వేయుటయందు విమానవేగమును పరిగణించవలెను. ఎత్తు మారినకొలది పైనుండి పడు బాంబునకు గాలియొక్క త్రోపుడుశక్తికూడ మారుచుండును. కావున విమానవేగము, గాలిత్రోపుడుశక్తి, ఎత్తుల ననుసరించి బాంబును వేయవలెను. ఇవన్నియు లెక్కలుకట్టుటకు బాంబులు వేయువాడు గణితశాస్త్రమునందు ప్రవీణుడై అనుభవము కలవాడుగా నుండవలెను. బాంబులను రెక్కల అడుగునుంచి విద్యుచ్ఛక్తిమీటలను నొక్కుటచే క్రిందకు పడునట్లు చేయుదురు. నేటి యుద్ధమునందలి బాంబుల బరువు ౫౦ పౌనులనుండి ౪౦౦౦ పౌనులవరకు నుండును. పెద్ద బాంబరు విమానము ౨౦౦౦ కిలో బాంబులను కొని పోగల్గును. కిలోబాంబు అనగా కిలోగ్రాముబరువు కలిగినది. నేడు విషవాయువులచే నింపిన బాంబులను, మంటలు కలుగజేయు చిచ్చుబాంబులను ఉపయోగించుచున్నారు. ఫిన్లాండు యుద్ధములో రష్యనులు మొలటొవురొట్టెబాంబులను వేసిరి. ఇది ౬త్త అడుగుల ఎత్తుకలిగిన బాంబు. దీనియందు ౭౦ చిచ్చుబాంబు లుండును. ఇది పడునప్పుడు గిరగిర తిరుగుటవల్ల తలుపు లూడి చిచ్చుబాంబులు నలుదిక్కులకు వెదజల్లును. బాంబులు క్రిందకు పడుకొలది వేగము హెచ్చును. మందుగనులను సముద్రమునందు వేయుటకును, టార్పెడోలను వేయుటకును ప్రత్యేకమగు బాంబరువిమానముల నుపయోగింతురు. శత్రువుల సైనికస్థానములను తెలిసికొనుటకు బాంబరువిమానములలో ఛాయాచిత్రగ్రాహిణుల నుంతురు

ఇవి వాటంతటవియే క్రిందనున్న భూమిని ఛాయాచిత్రములు తీసివైచును. వీనినన్నిటిని వరుసగా నుంచి శత్రుస్థానములను గుర్తింతురు.

డైవు బాంబింగు

డైవుబాంబింగుపద్ధతి నేడు జరుగుచున్న యూరపుయుద్ధములో నుపయోగించుచున్న క్రొత్త పద్ధతి. విమానాశ్రయములను, కోటలను, బారుఫిరంగులమర్చిన తావులను, కాల్బలములున్న స్థలములను, యంత్రాగారములను, పెద్దభవనములను నాశనముచేయుటకు జర్మనీవారీపద్ధతినే ఉపయోగించుచున్నారు. డైవు విమానములను జర్మనీలో స్టూకా యందురు. ఈ డైవు బాంబరుల సహాయముననే పోలెండు, నార్వే, ఫ్రాంసు దేశములలో జర్మనీ తీవ్రముగు నాశనమును కలుగజేసినది. డైవుబాంబరులను ఆకాశపుగ్రద్దలని చెప్పవచ్చును. నేలమీద నడచువారి చేతిలో తినుబండారము లున్నచో ఆకాశములో ఎగురుచున్న గ్రద్ద రంయిమని క్రిందకు వచ్చి ఎట్లు తన్నుకొనిపోవునో సరిగా అట్లే డైవుబాంబరులు క్రిందకువచ్చి బాంబులువేసి ఎగిరిపోవును. అందుచేత వీనిని విమానధ్వంసకఫిరంగులుకూడ ప్రేల్చుట కష్టము. డైవుబాంబింగున నుపయోగించునవి జంకరులు. ఈ బాంబరునకు ముఖ్యముగా ప్రత్యేకమైనవి దీని రెక్కలు(Wing flaps), రెక్కలకుండు రేకులు(Foils), ప్రక్కలకు త్రిప్పు పాయ(Deflecting fork). రెక్కలకు చివరభాగము మరబందులచే బిగించిన నాలుగు ముక్కలచే చేయబడును. వీనిని క్రిందకు వంచుటచేత గాలినిరోధకశక్తిని ఎక్కువ చేయవచ్చును. అందుచే ఎత్తునుండి క్రిందకు బాంబులువేయుటకు విమానము దూకునప్పుడు వానిసహాయముచేత వేగమును ౪౩౦ మైళ్లనుండి ౨౫౦ మైళ్లవరకు తగ్గించవచ్చును. అందుచే ఈరెక్కల చివరనున్న మడతముక్కలు బ్రేకులుగా నుపయోగించును. రెక్కలకు ముందుభాగమునం దమర్చిన రేకుల సహాయముచేత సరిగా ఎంతఎత్తునకు దిగవలెనన్న అంతఎత్తునకు దిగవచ్చును. అందుచేత బాంబింగునకు గురి సరిగా నుండునట్లు చేసికొనవచ్చును. పాయ ౧౧౦౦-౨౫౦ పౌనుల బాంబును సరిగా విడిచిపెట్టగలదు. హాంబర్గర్, హైంకెల్ అను విమానములనుకూడ డైవుబాంబింగున నుపయోగింతురు. సుమారు ౧౦౦ అడుగుల ఎత్తువరకును దిగి బాంబులను వేయగలుగుటచేత, ఎక్కువదూరమునకుకొట్టు విమానవిధ్వంసక ఫిరంగులు జంకరులను ప్రేల్చజాలవు. క్రిందకు దిగునప్పుడు, పైకి పోవునప్పుడుమాత్రమే ప్రేల్చగలవు. అందుచేతనే డైవుబాంబరులకే ఈ యుద్ధమున ఎక్కువ ప్రాముఖ్యము కలిగినది. విమానము క్రిందకు దూకునప్పుడు బాంబును వేయుటచేత బాంబు పడునట్టి వేగముకూడ ఎక్కువగును. ఆకాశమునుండి బాంబువేయుటకంటె గురిచూచి మీదకు దూకి బాంబును వేయుట సులభము.

విజ్ఞానలోకములోని కొన్ని వింతలు

అతి శీఘ్రకాలంలో ముగిసిన పనిని దేన్నైనా వర్ణించేందుకు 'త్రుటికాలంలో', 'మెఱుపు మెఱిసినంత సేపట్లో' అని అంటారు సాధారణంగా. ఆ మెఱుపు మెఱవడంకూడా మన కళ్లతో చూడగలం. కాని ఆధునికశాస్త్రజ్ఞులు ఒక సెకనులో ౧౦ లక్షల భాగములో ఉద్భవించి, మాయమయ్యే మెఱుపుకాంతను సృష్టించారు. ఈ మెఱుపుముందు ఆకాశంలో మనం వీక్షించే మెఱుపుతీగ విద్యుద్దీపంముందు కాగడాలాగు వెలవెలబోతుంది. కన్ను మూసి తెరిచే వ్యవధిలో ౧౦ లక్షలసార్లు మెఱుపు మెఱిపించే యంత్రాన్ని సృష్టించిన మానవుడి చాతుర్యం, నిజంగా, ఎంత ప్రశంసాపాత్రమో యోచించండి. ఈ కృత్రిమతటిల్లతను ౩౫,౦౦౦ వోల్టుల విద్యుచ్ఛక్తిని పాదరసపు ఆవిరితో నిండిన గొట్టము గుండా అత్యధికమైన పీడన శక్తికింద ప్రసరింపజేయుటవల్ల ఉద్భవింప జేశారు. తుపాకిగుండ్లు మొదలైన, అతివేగంగా ప్రయాణించే వస్తువుల ఛాయాచిత్రాలు తీసేందుకు ఈమెఱుపును ఉపయోగిస్తారు.

★

ఒకానొక యంత్రశాలలో సుమారు నాలుగు రైల్వే ఇంజనులంత బరువు గల ఒక పెద్దయంత్రము నిర్మింపబడ్డది. దీనికి రెండు పెద్ద దవడ లుంటాయి. ఈదవడల మధ్య ఎంత మందపాటి ఉక్కురేకు లైనా

సరే పెట్టినట్లయితే మనం అప్పడాలు నమలినంత సులభంగా వాటిని నమలివేస్తుంది. కేవలు పెట్టే సందర్భంలో ఆపరేటరు చెయ్యి పొరపాటున దాని పళ్ల క్రిందికి వెళ్లినట్లయితే యంత్రపు పైదవడ అలాగే గాలిలో నిలిచిపోతుంది. చేతులు బైటికి తీసుకోగానే మళ్లీ యథాప్రకారం నమలుడు ప్రారంభిస్తుంది. యంత్రాంతర్భాగాన ఒక గాజు కన్నులాంటిది ఉంటుంది. దానిపైన రేడియంపూత వేస్తారు. ఆపరేటరు చెయ్యి అపాయమైన స్థలంలో ఉంటే యీ కన్నులోని ఫోటో ఎలెక్ట్రిక్ సెల్లులోనుంచి ఒక కిరణం ప్రసారిత మౌతుంది. ఈకిరణ ప్రసారంవల్ల పైదవడ అల్లే నిలిచిపోతుంది. ఆపరేటరు చేతులు అపాయమైన ప్రదేశంలో నుంచి ఇవతలకు వచ్చేవరకూ మళ్లీ ఆ యంత్రం సాగదు. ఇదేమాదిరి గాజుకళ్లను అనేకస్థలాల్లో, అనేక ప్రమాణాల్లో, అనేక ప్రయోజనాలకు అద్భుతంగా వాడుతున్నారు. వీథిలో మామూలుగా నీటికుళాయి వుంటుంది. ఎవరైనా నీళ్లు త్రాగుటకు వంగగానే అతని శరీరం ఈకంటిలోనుండి ప్రసరించే కిరణానికి అడ్డం రాగా, వెంటనే నీళ్లు ధారగా పడటం ఆరంభమౌతుంది. నీళ్లు త్రాగి మళ్లీ లేవగానే ధార కట్టుబడిపోతుంది. ఇదేమాదిరి కండ్లు కొన్ని మోటారుషెడ్ల తలుపులకు తగిలించి వుంటాయి. పెద్దవెలుతురు గల హెడ్‌లైట్లు వేసుకొని మోటారు రాగానే ఆవెలుగు తలుపులో ఇమిడియున్న గాజుకంటిమీద పడి తలుపులు తటాలున తెరచుకుంటాయి. మోటారు లోపల ప్రవేశించవచ్చు. ఇదంతా నిజంగా ఇంద్రజాలంలాగు కనిపిస్తుంది. కాని అంతా శాస్త్రజ్ఞులసృష్టి.

★

ఇటువంటి ఐంద్రజాలికనేత్రాలే పెద్దపెద్ద బ్యాంకుభవనాలనూ, ధనవంతుల సౌధాలనూ రెప్పపాటనేది లేకుండా అహోరాత్రాలూ కాపాడుతుంటాయి. అట్టిస్థలాల్లోకి దొంగ ప్రవేశించగానే ఒక గంట మోగుతుంది. వెంటనే ఒక దీపం వెలుగుతుంది. ఒక కెమెరా దొంగయొక్క ఫోటోను గ్రహించేస్తుంది. ఇవన్నీ గాక 'టియర్ గ్యాస్' అను ఒకవిధమైన ఆవిరి దొంగ చుట్టూతా ఆవరించుకుంటుంది. దొంగ కదలలేక మెదలలేక పోలీసులు వచ్చేవరకూ అలాగే నిలబడిపోతాడు. ఎంతమంది ఘూర్ఖా 'వాచ్‌మన్'లైనా ఇంత నిక్కచ్చిగా దొంగను పట్టియివ్వలేరు.

ఇట్టికండ్లే 'లిఫ్టుల'ను పనిచేయించుటకూ, అగ్నిప్రమాదాల్లో హెచ్చరికగావించేందుకూ, ఒక భవనంలో రోజుకు ఎంతమంది ప్రవేశిస్తున్నారు, ఒక వంతెనపై నుండి గంటకు ఎన్ని మోటార్లు పరుగెత్తుతున్నవి మొదలైన లెక్కలు తయారుచేసేందుకూ, ఇంకా అనేక రీతులుగా ఉపయోగింపబడుతున్నాయి.

★

చూడగా చూడగా ఈశాస్త్రజ్ఞుల నిర్మాణాలు మహాఅద్భుతంగా గోచరిస్తాయి. వారు ఎంతటి మహాస్థూలమైన పరికరాలను సృష్టించారో ఆ చేతుల్తోనే అంతటి అతిసూక్ష్మమైన వాటినికూడా సృష్టించారు. ౮౦ లక్షల వోల్టుల శక్తిగల పిడుగును కృత్రిమంగా సృష్టించారు. మరొకవంక ఒక అంగుళములో ౫౦౦ కోట్ల భాగము వ్యాసముగా గల సూక్ష్మాతిసూక్ష్మమైన కణములను కూడ నిర్మించారు.

అయిదులక్షలమంది మనుష్యులు చేసే పనిని ఒకేవిసువున చేయగల పెద్ద 'డైనమో'ను కనిపెట్టారు. ఒక Horse Power (ఒక గుఱ్ఱపుశక్తి అని వాడతారు)లో ౩౩ లక్షల భాగము శక్తిగల అతిసూక్ష్మమైన 'డైనమో'నుకూడా సృష్టించినారు. దీని సహాయంతో మానవుని నాడిలో గల విద్యుచ్ఛక్తినికూడా కొలుచుటకు వీలగును.

★

౧౯౪౦-వ సం.లో అమెరికాసంయుక్తరాష్ట్రములకు చెందిన కాలిఫోర్నియాలోని పాలోమర్ కొండపైన ప్రపంచమంతటికీ పెద్దదైన దూరదర్శని యంత్రం నెలకొల్పబడింది. ఆ యంత్రపు అద్దము ౨౦౦ అంగుళముల వ్యాసము గలది. దానిని ౫౦౦ టన్నుల బరువు గల ఉక్కుచట్టముపై నిలబెట్టారు. దానికి ఉపయోగించిన అద్దము కొన్నిసంవత్సరాలపాటు అరగతీస్తేగాని తయారు కాలేదు. ఆయంత్రము అంతబరువు కలదైనప్పటికీ అతిసున్నితమైనది. చిన్న గడియారంలో ఉండే మరలకంటె అతిసున్నితమైవుండి మనిషి వ్రేలితో వ్రూదినంతమాత్రాన కదులుతుంది. దాని సహాయంతో చంద్రబింబం మనకు ౨౫ మైళ్ళదూరమున నున్నట్లు కనపడుతుంది. ఖగోళంలో ఇంతవరకూ మానవునితో దాగుడుమూత లాడుతున్న నక్షత్రాలెన్నో దాని మూలంగా బయటపడగలవు.

★

ఇదేకాక మరెన్నో మహత్తరవస్తువులను శాస్త్రవేత్తలు సృష్టించారు. అంతవరకూ ఎందుకు? కేవలం

సజీవమైన మనుష్యునివలెనే ఏపని పడితే ఆపని చెయ్యగల 'రోబట్' అనే 'యంత్రపు మానవుని' సృష్టించారు. ఈ 'రోబట్' మన ఇంజనీర్లవలె యంత్రాలను 'స్టార్ట్' చేయుట, నిలిపివేయుట, పరిశీలించుట మున్నగు పనులు చేస్తుంది; కార్మికుల పని అజమాయిషీ చేస్తూ వాళ్లేమైనా పొరబాట్లు చేస్తే సరిదిద్దుతుంది; ఇళ్లూ వాకిళ్లూ కాపలా కాస్తుంది; పోలీసువారివలె బండ్ల రాకపోకలను 'కంట్రోల్' చేస్తుంది. అదీ, ఇదీ అని ఏమిటి, మీరూ నేనూ చెయ్యగలవేకాక చెయ్యలేని పనులు కూడా ఈ 'రోబట్' మనిషి చులాగ్గా చేస్తాడు.

★

౧౯౩౯-వ సం.లో న్యూయార్కులో జరిగిన ప్రపంచవస్తు ప్రదర్శనములో ఒక బెల్జియం దేశస్థుడు తయారుచేసిన అద్భుతమైన గడియారము ప్రదర్శింపబడ్డది. దానికి ౯౩ ముఖాలు. అన్ని ముఖాలలోనూ మామూలు టైమే కాదు చూపించేది, సూర్యగమనము, వివిధగ్రహముల గమనము, భూమియొక్క వేగము, సూర్యుడు ఏ రాశిలో వున్నది మొదలైన అనేక విషయాలు ఆ ముఖాలలో తెలియబరుస్తుంది.

పైన చెప్పినవిగాక మన దైనందిన జీవితంలో ఉపయోగపడే చిన్నచిన్న పరికరాల నెన్నో సృష్టించారు. ఇదిగో ఒక చిన్న జాబితా ఇస్తున్నాను. సైకిళ్లకు హైడ్రాలిక్ బ్రేకులు, ఎలుకలపై బాణాలువేసి చంపే ఎలుకలబోను, పళ్లసందుల్లో ఇరుక్కున్న ఆహారకణాలను బైటికి పీల్చివేసే పళ్లతోముకుంచె, ఎవరైనా దొంగిలిస్తే దొంగకు 'ఎలెక్ట్రిక్ షాకు' వల్ల నొప్పి కలిగించి, కన్నీళ్ల ఆవిరిని వానిపై ప్రయోగించి, ఒక పెద్ద హెచ్చరికనాదం మొదలైన హంగామా అంతా చేసే ఒక డబ్బులసంచీ, విమానపుముక్కులో ఇమిడిస్తే త్రోవపొడుగునా ఉన్న దృశ్యాలను ఫోటో తీసే ఛాయాచిత్రగ్రహణ యంత్రము, చేతులతో పట్టుకో అక్కర్లేకుండా దానంతట అది నెత్తిమీద నిలిచే గొడుగు, తనంతట తనే వేన్నీళ్లను ఉద్భవింప జేసుకునే మంగలి కుంచె, మోటారు డ్రైవరెవరైనా అధికవేగంతో పోతుంటే సమీపంలో ఉన్న పోలీసుకు హెచ్చరిక చేసే సైరను యంత్రము, సువాసనగల నిప్పుపుల్లలు మొదలైన చిత్రాలు ఎన్నెన్నో దినదినం కనిపెడుతూ వున్నారు. [పు. వెం. సు.]



గోల్డెన్

ఆమ్లా హెయిర్ ఆయిల్

గోల్డెన్ ఆమ్లలో చేర్చబడినదినుసు లన్నియు ప్రకృతినుండియే స్వీకరింపబడినవి. ఈ నూనెరంగుకూడ ఇందు చేర్చబడిన వనమూలికలనుండియే లభించుచున్నది. ఈ నూనె తలపైచర్మమును పరిశుభ్రపరచి, వెండ్రుకల కుదురుకు బలమొసంగును. శిరోజములు దట్టముగా పెరిగి, నల్లగా నుండును. స్నానమునకు, అలంకారమునకు.

BENGAL CHEMICAL

CALCUTTA : : BOMBAY.

మదరాసు ఏజంట్లు:— యస్. దేశాయిగౌండరు అండ్ కంపెనీ, 4/, బందరు వీధి.

అమృతకణములు

శ్రీ సన్నిధానము
సూర్యనారాయణశాస్త్రి

విరినిం ద్రుంపఁగఁ జూచుమాత్రమునఁ గావ్రించెం గరం బెఱ్ఱనై;
అరుణత్వంబు వహించెఁ బాదములు ప్రాయం గోర లాక్షారసం;
బురియించెన్ మెయిపూఁత యన్ గెలఁపు; నమ్మో! చెప్ప నేముండె; దు
ర్భరమైయున్నది వైఁపఁగా నగురుధూపంబే నధీరాక్షికిన్.

పిఱుఁదుల్ పెద్దెఁ దనుత్వమున్; నడుము ప్రాపించెం దగన్ దానినిన్;
జరణద్వంద్వము పాసెఁ జంచలగతుల్; సాధించెఁ గన్దోయి; యు
త్తటి వక్షంబు కుచద్వితీయమును వక్త్రం బద్వితీయంబునై
పరగన్; జవ్వన మిట్లు మార్చె గుణముల్ తద్గాత్రమం దింతిరో!

అంచల గర్వభంగ మగు నాసతియానవిలాసముం గనన్
గాంచును మౌనవృత్తినిఁ బికంబులు ముచ్చట లాలపించినన్
గాంచిన మేని మార్దవముఁ గన్పడు జాజియు రాతియట్ల; వీ
క్షించిన నంగశోభ సిరి సిగ్గిలి తాల్పద కావిపుట్టమున్?

కలుగవు నాకు మేల్నగలు గాత్రమునం; గనరాదు వన్నె వ
ల్వల పసయున్, హుళక్కి నడలన్ హొయలున్, మెఁగమందు గంధ స
వ్వులఁ దిమురుం గనంబడ; నవున్; మఱిగుండయినం బరాయి చె
ల్వలఁ గనఁ జీపెకొంటెఁ దని పల్కు జగంబు సహింపకో సఖీ!

"అతివరో! నీవె నాకుఁ బ్రియురాలవుసు"మ్మని యన్నమాట సూ
నృతము; ప్రియోపభుక్తరమణీయము చేలముఁ దాల్చి యేగుదెం
చితి విటు నాగృహంబునకుఁ జెల్వఁడ! కామిజనంబుమండనం
బతిసఫలం బగుం గద! యథార్థముగా నిజకాంత గాంచినన్.

వినఁగానైతిఁ దదీయ చాటురచనల్; వీక్షింపఁగానైతిఁ ద
చ్చిన హారంబుఁ; బ్రియానులాపములు భాషింపంగ నైతిం; బదం
బునఁ గైవ్రాలి ప్రియుండు వెంటనె చనెన్ మూఢాత్మనై యేలొకో!
చనునప్డాఁపి కరంబులన్ వడి మెడన్ సంధింపనైతిం గటా!

"కరములు నాఁపెనో యెవతె కాని; యదల్చెనొ నాదు దూతి? యే
గురుతరకారణంబొ! యిటకుం బ్రియుఁ డిప్పటికేని రాఁడ" యి
క్కరణిఁ దలంచి వ్రాల్చి ముఖకంజముఁ బాణితలంబునందు న
త్తరుణి రుజించు, నూర్చుఁ, బువుదండలు దొలకుఁ ద్రోయుఁ జింపుచున్.

సంస్కృతాలంకారగ్రంథములం దుదాహృతములైన చాటుశ్లోకములు అమృత తరంగములు. ఈ తెలుగుపద్యము లాతరంగములయొక్క కణములు చూఁడీ!

ప్రియుఁడు పతంబుఁ దమ్మనుపరించినఁ దప్పులు పట్టుచుండ్రు; నె
మ్మెయినిఁ ద్యజింత్రు గాని ప్రియుమీఁద నిసుమ్మరు నిందుచూడ్కి; నె
మ్మెయినిఁ; బొవ త్త్ర పో! నిజసవిహాహితమందు నిషేధ; మీాజగ
త్త్రయిని విలక్షణప్రకృతిఁ దాల్చిన వామలు వాకుఁ గూర్చుతన్.

కడునిట్టూర్పులు వుచ్చు; జేలఁ బొరలున్; గాంచున్ భవనార్గ మె
ప్పుడు; బిట్టేడ్చుఁ; గృశీభవించిన కరంబుల్ వేయున టిట్టులన్;
బడయంగాఁ గలనైన నీ కలయికన్ వాంఛించు నిద్రింపఁగా;
నిడఁ దర్ధానినిఁగూడఁ బాడువిధి రెూయీ! యెంతనిర్భాగ్యరో!

పిదపన్ నిద్రిలి మంచి మేలుకని యుద్వేల స్మరక్రీడలం
దుదితాయాసముచేత స్వాపసుఖమం దున్నట్టి ప్రాణేశులం
బ్రిదులంజేయక బిగ్గకౌఁగిళుల గ్రంథిన్, స్వీయ గాత్రంబులం
గదలంజేయక యుండ్రు జవ్వను లహఃకాలంబు కావచ్చినన్.

స్తిమితత నొందెఁ జింతలకుఁ జిత్తము; చెక్కిలి కేల వ్రాలె; నా
స్యము కళ దప్పె నౌవ సమ్యగాంకునిరీతిఁగఁ; బుండువాతె శ్వా
సములకు మోవి; చల్లఁబడఁజాలదు తాపము శీతలోపచా
రముల; కెవండు దీనిదశఁ బ్రార్థితదుర్లభుఁడై సహించెడున్?

చనుదున్ సుందరి! పాంథుఁడా! చనుము! నీపొంతంబునన్ శోకముం
గనఁగాఁ జోకము; శోక మెందులకు? కిఁకిం గన్నీరు రాత్రేల? నే
చనపై తంచునె? తొందరేల ననుఁ బుచ్చన్ నీకు? నీతోడఁ జో
వనె వాంఛించుచు నిట్లు వేగపడు నాప్రాణంబు లత్యంతమున్.

నెడుంజగరాయ తామ్రపట్టిక

= శ్రీ నేలటూరి వెంకటరమణయ్య =

ఈ తామ్రశాసనము సింగరాయకొండ వాస్తవ్యులగు శ్రీమాన్ యోగి శేవభట్టర్ వీరరాఘవాచార్యులగారివల్ల లభ్యపడినది. శాసనము తమకు దొరకిన విధమును ఆచార్యులవారిట్లు తెల్పుచున్నారు:

"౧౯౩౬ సంవత్సరములో సింగరాయకొండలో నేను ఇల్లుకట్టునప్పుడు గోడకాలువ త్రవ్వుచుండగా మూడుజానల లోతున రెండు మట్టి మూకుళ్లలో భద్రపఱచబడిన ఈశాసనము దొరకినది. ఆస్థలము కొండక్రింది ప్రదేశము. బజారుకు షుమారు ఆరుఅడుగుల యెత్తుండును. ఈస్థలమును శ్రీమాన్ అకలంకం రంగభాష్యం అయ్యంగారు తమతండ్రి సపిండీకరణకాలమున నాకు దానముగా నొసగిరి. రంగభాష్యంఅయ్యంగారి తండ్రిగారు దానిని కొను కాలములో పాడుపడియేయుండెను. పూర్వము చక్రవర్తుల వారను దాక్షిణాత్య (కంచి) శ్రీవైష్ణవులచ్చట కాపురముండిరట. అంతకుపూర్వము సంగతి తెలియదు.

'గాలియాత' గ్రంథకర్త,

శేవభట్టర్ వీరరాఘవాచార్యులు."

భూగర్భమునం దెన్నియేండ్లనుండియో మఱుగుపడియుండిన యీరాగిరేకుల శాసనము ఆచార్యులవారి మూలమున నేటికిట్లు బయల్పడినది.

ఈశాసనమునందు ౭ ౩/౪ అంగుళముల నిడివియు, ౨ ౩/౪ అంగుళముల వెడల్పును గల రేకులు ఐదు కలవు. ఈరేకుల దాపలికవల మూలలు కత్తిరించినట్లుగుండ్రముగాఁ దీర్చియున్నవి. ప్రతిరేకునకు నెడమకొనయందు, రేకునకు మధ్యభాగమున అంచునకు ౩/౪ అంగుళములదూరమున ౩/౪ అంగుళముల మధ్యపరిమాణము గల బెజ్జమును, ఆబెజ్జమునుండి దూర్చి, యతికించఁబడిన ౯/౮ అంగుళము ఘనమును, ౨ ౩/౪ అంగుళముల వడివికోలఁతయుఁ గల కడియమును గలవు. రేకులతూకము ౫౫ తులములు. కడియము ౫౨ ౩/౪ తులములు. సామాన్యముగ రాగిశాసనములను గ్రుచ్చెడి కడియముయొక్క అతుకుపైఁ దాపటముచేసియుండు రాజలాంఛనముద్ర యిందు కానరాదు. కడియము అతికించినది యతికించినట్లే యున్నను ముద్ర లేకపోవుటయు, అది యుండవలసిన స్థలమున చిలుము చిక్కటముగట్టియుండుటయుఁ జూడ నది యూడ్చుటనో నష్టమైపోయినట్లు తోఁచుచున్నది.

లిపి

ఇందలి ఐదురేకులయందును మొదటిరేకుయొక్క ప్రథమపార్శ్వమున వ్రాఁతలేదు; మొదటిరేకుయొక్క ద్వితీయపార్శ్వమునను, దక్కినరేకుల కిరుపార్శ్వములను పార్శ్వమునకు నాలుగేసి పంక్తుల (మొత్తము ౩౬ పంక్తుల) అక్షరములు చెక్కఁబడియున్నవి. చిరకాలము భూస్థాపితమై యుండిన కారణమున నచ్చటచ్చట చిలుమువల్ల నొకటిరెండక్షరములు మాసిపోయియున్నను శాసనమంతయు చక్కని స్థితియందుండుటచేత చదువుట కష్టమును లేకపోయినది. అక్షరము లన్నియు చక్కఁగఁ జెక్కఁబడి తిన్ననిరూపుఁ గలిగియున్నవి. మొదటినాలుగురేకుల యొక్క ద్వితీయపార్శ్వమున రేకుల సంఖ్యను దెల్పెడి యంకెలు గలవు. ఐదవరేకుపై నట్టి సంఖ్య కానరాదు. అంకెలయం దొక విశేషము గాన్పించుచున్నది. మొదటిరేకుపై ౧-టియు, దానిక్రింద శ్రీకారమును చెక్కఁబడియున్నవి. ౧-టవ యంకె యొక్క రూప మిప్పటి యంకెయొక్కరూపమువలెనే యున్నను రెండవ మూఁడవసంఖ్యలను దెల్పుటకుఁ బ్రత్యేకచిహ్నముల నుపయోగింపక రెండవదానిచోట నొకటవయంకెను రెండుపర్యాయము లొకదానిక్రింద నొకటిగను, నిట్లే మూఁడునకు బదులు ఒకటవయంకె

పైవిధముననే మూఁడుపర్యాయములును వ్రాయఁబడి యుండుటయు, నాలుగవరేకుపై నాలుగవయంకెను దెల్పు ప్రత్యేకచిహ్నము గానవచ్చుటచేతను శాసనము లిఖింపఁబడిన కాలమున ౨,౩ అంకెలను దెల్పుటకుఁ బ్రత్యేకచిహ్నములు లేకయుండెనని తోఁచుచున్నది.

ఇందలి యక్షరములు ఉరువపల్లిశాసనములోని వానివలె నున్నవి. ఉరువపల్లిశాసనాక్షరములయంత చక్కఁదనమిందలి యక్షరములకు లేకున్నను పోడిమి చెడక రూపసౌష్ఠవమును గలిగి పొంకముగ నున్నవి. ఉరువపల్లిశాసనాక్షరములకు గుహాక్షరములని ఫ్లీటుగారు నామకరణముఁజేసియున్నారు. వీనినే జొవో దూబ్రేగారు నిక్కమైన పెట్టెతలకట్టక్షరము లనిరి. పెట్టెతలకట్టుల స్వరూపమును దూబ్రేగా రీవిధమున వర్ణించియున్నారు:

"'పెట్టెతల నక్షరములను ద్వివిధములుగ విభజించుచున్నాను. అక్షరములతలపై సమభుజచతురస్ర మేర్పడునట్లు నాలుగు చిన్నగీట్లను జెక్కి, వాని మధ్య ప్రదేశమును జెక్కక యట్లే నిల్పిన నది సహజమైన పెట్టెతలయక్షర మనఁబడును.' (ఫ్లీటు: 'సప్తశాసనములు' పుట ౧౯).

"టక్కుపెట్టెతలయక్షరము లక్షిష్టతరములు. అక్షరములతలపై లేఖకుఁడు సమభుజచతురస్ర మేర్పడునట్లు గండెరించిన నది టక్కుపెట్టెతల యగును."[1]

ఉరువపల్లిశాసనములోనివి సహజమైన పెట్టెతలయక్షరము లని దూబ్రేగారు సిద్ధాంతీకరించి యున్నారు. ప్రస్తుతము పరిష్కృతమగుచుండు పెదుగ్గరాయ తామ్రపట్టికయందును నురువపల్లిశాసనమువంటి యక్షరములు గానవచ్చుచుండుటచే నవియు నిక్కపుఁ బెట్టెతల యక్షరము లని చెప్పవలసి యున్నది.

లేఖకుఁడు ఈశాసనమును జాగ్రతతోఁ జెక్కిన ను అచ్చటచ్చట ప్రమాదములు గానవచ్చుచున్నవి. రెండవరేకు కడపటి "వినయస్యానేక" యను పంక్తిని మూఁడవరేకులోని తొలిబంతిగా మరల చెక్కియున్నాఁడు. ఐదవరేకు ప్రథమ పార్శ్వమున మొదటి గీటులో 'సమ్ప్రిదత్తః' యనుటకు బదులు 'సప్ప్రిదత్తః' యనియు, నట్లే యారేకుయొక్క ద్వితీయపార్శ్వమున కడపటిపంక్తియందు 'తాంబ్రపట్టికా' యనుటకు 'తాంబ్రపట్టికా' యనియు వ్రాసియున్నాఁడు. మఱియు మూఁడవరేకుయొక్క మొదటి ప్రక్కలోని మూఁడవ పంక్తియందు 'విజయయశః' యనుటకు మారు 'విజయయగః' అనియు, నైదవరేకు రెండవప్రక్క మొదటిబంతిలో 'పాపశ్కారిర' యనుటకు 'పాపగ్కారిర' యనియు వ్రాసియున్నాఁడు. ఇచ్చట 'శ' యొక్క పొట్టలోని యడ్డగీటును వ్రాయక మఱచుట వలన నది 'గ' యైపోయెను. మఱియు నీశాసనములో 'శ' 'థ' 'వ' లకు పెక్కుస్థలములయందు భేదము గాన్పించకున్నది. సందర్భమునుబట్టి యక్షరములను గుర్తించవలసి యున్నది. 'స' 'య' లన్నియు నొక్క తీరున నుండలేదు. అనుస్వారము వ్రాయువిధము భిన్నముగఁ గన్పడుచున్నది. సాధారణముగఁ బ్రాచీన శాసనములలోఁ జెక్కింటియం దనుస్వారము వచ్చు తావుల నుత్తరాక్షరములతలపైఁ జెక్కు నిడు నాచారము గానవచ్చుచున్నది. ఇందు కొన్నిస్థలములలో (చూ: ౫. వెం. ప్ర. ౨ గీటు, సింహవర్మణ) నీసంప్రదాయానుసార మనుస్వార ముత్తరాక్షరమగు 'హ' తలపై వ్రాయఁబడియున్నను, మఱికొన్నిచోట్ల (చూ: ౩. వెం. ప్ర. ౧ గీటు, సంరక్షిన) అనుస్వార సూచకమగు చుక్క పూర్వాక్షరమగు 'స' మీఁదఁ గానవచ్చుచున్నది. 'ణ' వత్తు రెండువిధముల వ్రాయఁబడి యున్నది. కొన్నితావుల 'ణ' కారమునే మరల వది సంయుక్తమై వచ్చు హల్లుక్రిఁద వ్రాయుటవల్లఁ దెల్పఁబడినను(చూ: ౪ రే.౧ప్ర. ౩గీ. 'కణ్ణస్వామి'),ఇతరత్ర అన్యవిధముగ సూచింపఁబడియున్నది. ఇట్టి స్థలములయందు 'ణ'వత్తు ఇప్పటి 'న'వత్తును బోలి యున్నను 'న'వత్తుయొక్క పొట్టయందైమూలగఁ గుడినుంచి రెండవపైపునకు వ్రాయఁబడిన మాత్ర రేఖతోఁ గూడియున్నది (చూ: ౪ రే. ౧ ప్ర. ౩ గీ. 'కణ్ణస్వామి', ౫రే. ౨ ప్ర. ౩ గీ. 'కృష్ణపక్షే'). ఇట్లే

---

1. Ancient History of the Deccan, P. 97.

'మ్' సైతము రెండుతెఱఁగుల వ్రాయఁబడియున్నది. సామాన్యముగఁ బంక్తికిదిగువ చిన్న 'మ'కారము వ్రాసిన 'మ్' అగును; కాని ౨ రే. ౨ ప్ర. ౯-వ పంక్తిలోని 'దద్యామ్' అనుచోట నీవ్యంజన మిప్పటి యర్ధానుస్వారమువలె వ్రాయఁబడి యున్నది.

గుణింతము

హల్లులతోఁ గూడివచ్చు అచ్చులలో 'ఇ' 'ఈ'లకు పెక్కు ప్రాచీనశాసనములవలెఁగాక వానిని సులభముగ గుర్తించుటకై వ్రాఁతయం దించుక భేదము జూపఁబడియున్నది. ఇప్పటివలె నక్షరములపై గుడినివ్రాసిన 'ఇ'కారమును, ఆగుడిలో గిరికఁజుట్టిన 'ఈ'కారమును నగును. రేఫము వెనుక వచ్చు హల్లు ప్రాచీనశాసనములందుఁబోలె ద్విత్వమును బొందును. ఇప్పుడు మనము సామాన్యముగా అనుస్వారము వ్రాయుచోట్ల దానికి బదులు 'మ'కారము ఉత్తరవర్ణముతో సంయుక్తముగ వచ్చును.

శాసనభాష

ఈశాసనములోని భాష సంపూర్ణముగ సంస్కృతము. అంతయును వచనమే. సామాన్యముగ శాసనాంతమునఁ గనపడు ఫలశ్రుతిశ్లోకములుగూడ నిందుఁ గానరావు. తత్కారణమున నిది యసమగ్రమేమో యను శంక కలుగవచ్చును. కాని శాసనాంతమున 'తాంబ్రపట్టికా' యను కడపటిమాటకు వెనుక రెండంగుళముల స్థలము ఖాళిగ విడిచియుండుటచేత నిది సమగ్రమనియే తోఁచుచున్నది.

శాసనగ్రంథము

విజయపలక్కడ స్థానమునుండి స్కన్దవర్మమహారాజప్రపౌత్రుఁడును, వీరవర్మమహారాజ పౌత్రుఁడును, స్కన్దవర్మమహారాజ పుత్రుఁడును, బప్పభట్టారక మహారాజ పాదానుధ్యాతుఁడును, పరమభాగవతుఁడును, భారద్వాజుఁడును, పల్లవులయొక్క యువమహారాజును నైన విష్ణుగోపవర్మయొక్క వచనముచేత శ్రీసింహవర్మమహారాజుయొక్క పండ్రెండవ(ద్వాదశమే) రాజ్యవర్షమున జ్యేష్ఠమాసకృష్ణపక్షత్రయోదశినాఁడు ముండరాష్ట్రములోని నెడుఙ్గరాయగ్రామము కారణికగ్రామముగఁజేయఁబడి కారణిక నడిప్పి, లేక నడిపి భోజదొడ్డిస్వామి కణ్ణస్వామి నందిస్వామి లనువారికి సర్వబాధాపరిహారముగ దత్తము సేయఁబడెను. ఈగ్రామము మూఁడుభాగములుగ విభజింపఁబడి యందు రెండు పాళ్లు నడిపిభోజకునికిని, మిగిలిన యొకభాగమును మూఁడు పాళ్లు చేసి వానియందు రెంటిని కణ్ణస్వామికిని, మిగిలినదానిని నందిస్వామికిని సర్వబాధాపరిహారముగను, నాయుక్తక నైయోగిక రాజవల్లభ సఞ్చరన్తి పరిహారముగను దానము సేయఁబడెను.

ఈ శాసనమునఁ జేర్కొనఁబడిన పల్లవయువమహారాజ విష్ణుగోపవర్మది మఱియొక శాసనము కలదు. దీనికి ఉరువపల్లి శాసన మని చరిత్రకారులు నామకరణముఁజేసియున్నారు. ఈ తామ్రశాసన మెచ్చట దొరకెనో, యిప్పుడది యెచ్చట నున్నదో తెలియదు. సర్ వాల్టర్ ఎల్లియటుగారి ప్రాచీన గ్రంథసంచయమం దడఁగియున్న దీని ప్రతిబింబమును సంగ్రహించి ఫ్లీటుగారు ఇండియన్ ఆంటిక్వరి ౫-వ సంపుటము (పుటలు ౫౦ - ౫౩)లోఁ జక్కఁగఁ బరిష్కరించి ప్రకటించియున్నారు. మొత్తముమీఁద ఉరువపల్లి శాసనపుఁ బ్రశస్తియు, నిందలి ప్రశస్తియు నొక్కతీరువే యున్నను రెంటికి నచ్చటచ్చట స్వల్ప భేదములు గాన్పించుచున్నవి; కాని యవి యంతగ పరిగణింపవలసినవి కావు. ఈప్రశస్తులయం దెన్నఁబడిన పల్లవరాజ బిరుదావళియం దుక్తమైన యంశములలోఁ గొన్నిటిని గూర్చియించుకంత వ్రాయవలసియున్నది.

౧. శాసనదాతయగు యువమహారాజ విష్ణుగోపుని తండ్రియగు స్కన్దవర్మమహారాజు "లోకపాలానాం పంచమస్య లోకపాలస్య" యని కీర్తింపఁబడియున్నాఁడు. ఈవాక్యము సామాన్యముగ ప్రాచీన పల్లవరాజుల సంస్కృతదానశాసనములయందుఁ గానవచ్చుచున్నది. ఇందువల్లఁ దెలియవచ్చు విశేషచారిత్రాంశ మేదియు లేదు. కాని శాసనకాలమునాఁటి మతసంప్రదాయమును గొంత తెల్పుచున్నది. లోకపాలుర గూర్చి ఫ్లీటుగారిట్లు వ్రాసియున్నారు: "లోకపా

రన దిగధిదేవతలు- తూర్పునకు ఇంద్రుఁడు, దక్షిణమునకు యముఁడు, పశ్చిమమునకు వరుణుఁడు, ఉత్తరమునకుఁ గుబేరుఁడు. సామాన్యముగఁ బైఁ బేర్కొనిన నలుగురితో నాగ్నేయమున కగ్నిని, నైరృత్యమునకు నిరృతి (లేక సూర్యు)ని, వాయవ్యమునకు వాయుదేవుని, ఈశాన్యమున కీశాను (లేక సోము) ని (నధిదేవతలుగఁ జేసి) లోకపాలు రెనమండ్రని చెప్పుదురు." ఇది వాస్తవమే యైనను విష్ణుగోపమహారాజు కాలమున లోకపాలురు నలుగురనియే యప్పటివారి నమ్మకమైనట్లు తోఁచుచున్నది. కాళిదాసుని కాలమందును దిక్పాలురు నలువురే యని

"ఇయం మహేంద్రప్రభృతీ నధిశ్రియ
శ్చతుర్దిగీశా నవమత్య మానినీ,
అరూపహార్యం మదనస్య నిగ్రహాత్
పినాకపాణిం పతి మాప్తు మిచ్ఛతి"

అను కుమారసంభవ (౫-౫౩)శ్లోకమువల్ల వెల్లడి యగుచున్నది.

౨. విష్ణుగోపమహారాజు 'కలియుగదోషావసన్నధర్మోద్ధరణ నిత్యసన్నద్ధుఁ' డనియు, 'ధర్మవిజిగీషు'వనియు స్తోత్రము చేయఁబడియున్నాఁడు. ఈ స్తోత్రపాఠములు అన్ని సంస్కృతపల్లవరాజశాసనములందును గానరావు. రెండవ కుమారవిష్ణువు చెందలూరు తామ్రశాసనమునందును,[2] మొదటి నందివర్మయొక్క ఉదయేందిరము శాసనమునను,[3] యువమహారాజవిష్ణుగోపుని శాసనములందును, నితని పుత్రుఁడగు సింహవర్మ శాసనములందును గానవచ్చుచున్నవి. బిరుదులు వంశపారంపర్యముగ వచ్చు నాచారము వాడుకయందుండుటచేతను, వీరి ప్రశస్తు లించుమించుగ నొక్కతీరునఁ గానవచ్చుటచేతను వీరందఱును నేకకుటుంబమునకుఁ జెందినవారై యుందు రనునూహ పొడముచున్నది. రెండవ కుమారవిష్ణువుయొక్క చెందలూరు శాసనమున నీబిరుదులు ప్రథమమునఁ గాన్పించుటచేత మొదట వీనిని బడసినవాఁ డారాజే యైయుండునని తోఁచుచున్నది.

మఱి కలియుగదోషావసన్నమై నశించిపోవుచుండ నీ మహారాజులు చెడనీక ఉద్ధరించిన ధర్మమెద్ది? ఈ విషయము తెలుసుకొనుటకు పూర్వ మీరాజు లవలంబించిన మత మెద్దియో కనుఁగొనుట యవసరము. వీరి శాసనములన్నియు "జితం భగవతా" యని యారంభముగుచుండుటచేతను, వీరందఱును "భగవత్పాదానుధ్యాతు"లమని చెప్పుకొనుటనుబట్టియు వీరు భాగవతసంప్రదాయానుసారు లగుట తెల్లము. శివభాగవతులు కొందఱుండినట్లు కొన్ని నేపాళదేశశాసనములవల్లఁ దెలియుచుండుటచే వీరొకవేళ శైవులైయుండినను నుండవచ్చును. వైష్ణవులైనను, శైవులైనను హిందువులే. కావున వీ రుద్ధరించిన ధర్మము హిందూధర్మమనుట నిస్సంశయము. ఇఁక నీ ధర్మమును నాశనము సేయుచున్న కలియుగదోష మెద్దియో కనుఁగొనవలసియున్నది. ప్రాచీనకాలమునందు, అనఁగా క్రీస్తుశకాదిమశతాబ్దములయందు దక్షిణదేశమునందు, ముఖ్యముగా పైఁ బేర్కొనఁబడిన రాజు లేలిన రాష్ట్రమున, బౌద్ధజైనమతములు ప్రబలి జనసామాన్యముయొక్క యాదరణమునకుఁ బాత్రములై యుండెనని పెక్కు నిదర్శనముల వలనఁ దెలియవచ్చుచున్నది. శంకరాచార్యాది హిందూమత సంస్కర్త లందఱును స్వమతస్థాపనకుఁ బూర్వము బౌద్ధజైనమతములను దమ గ్రంథములయందుఁ దెగనాడియున్నారు. కావున కలియుగదోషము బౌద్ధజైనధర్మముల రూపము నంది హిందూధర్మమును బాధింపఁదొడఁగెను. దీని యుపద్రవమువలన రూపుమాసిపోనున్న హిందూధర్మమునే ఈ మహారాజు లుద్ధరించినది. తత్కారణముననే తాము ధర్మమహారాజులమని సగర్వముగఁ జెప్పుకొనిరి. 'ధర్మవిజిగీషు' యను వాక్య మాకాలమున మతఘర్షణ ముండెనని సూచించుచున్నది.

వంశావళి

ఈ శాసనోక్తదానము నొసఁగిన రాజు పల్లవ వంశజుఁడు, స్కందవర్మనుమనుమఁడు, వీరవర్మ

2. ఎపి. ఇండి. VIII, పు. ౨౩౩ మొదలు.
3 ఎపి. ఇండి. III, పు. ౧౪౨ మొ.

మనుమఁడు, స్కందవర్మపుత్రుఁడు. ఉరువపల్లి దాన
శాసనము నిచ్చినవాఁడును నీతఁడే. ఇందలి వంశవృక్ష
మిది:

స్కందవర్మ
|
వీరవర్మ
|
స్కందవర్మ
|
యు. మ. విష్ణుగోపవర్మ

వీరుగాక మహారాజు సింహవర్మ యొక్కఁడిందుఁ బేర్కొనఁబడియున్నాఁడు. ఈ సింహవర్మ యెవ్వఁడు, ఇందుఁ జెప్పఁబడిన పల్లవవంశమునకుఁ గంచినేలిన పల్లవరాజులతోఁ గల సంబంధ మెట్టిది అను విషయములను నిర్ధారణఁజేసి చెప్పుటకుఁ దగు నాధార మీ శాసనమునఁ గాని, యురువపల్లి శాసనమునఁ గాని కానరాదు. ఒక్క విషయమునుమాత్రము నిశ్చయించి చెప్పవచ్చును. శాసనదాతయగు విష్ణుగోపవర్మ యువమహారాజగుటచేతను, దానశాసనము సింహవర్మమహారాజుయొక్క ద్వాదశరాజ్యవర్షమున నిచ్చియుండుటచేతను, దాన మొసఁగినకాలమున సింహవర్మ పల్లవరాజ్యముపైఁ బ్రభుత్వమునెఱపుచుండె ననియు, నతనిక్రింద విష్ణుగోపవర్మ యువమహారాజపదము వహించి రాజ్యమునం దొకకొంత భాగమున కధిపతియై పరిపాలన మొనర్చుచుండె ననియు దృఢముగఁ జెప్పవచ్చును. మఱియు రాజునకు యువరాజుతోడి సన్నిహితబాంధవ్యము గలిగియుండుట సామాన్యమగుటచే నట్టి బాంధవ్య మీ సింహవర్మవిష్ణుగోపవర్మలకుఁగూడఁ గలిగియుండవచ్చు ననియు నూహసేయవచ్చు. కాని యా బాంధవ్యస్వరూపమును నిర్ధారించుటకుఁ దగిన యాధారములు గానరావు. తగిన యాధారములు లేకున్నను పరిశోధకపండితులు పెక్కుటూహలను గావించియున్నారు.

ఉరువపల్లి శాసనమును బరిష్కరించు సందర్భమున ఫ్లీటుగా రిట్లు వ్రాసియున్నారు: "ఇందు విష్ణుగోపవర్మ యువమహారా జని చెప్పఁబడియుండుటచేత (దీనియొక్క) కడపటి రెండుపంక్తులయందు రాజ్యపాలన మొనర్చుచుండినట్లు పేర్కొనఁబడిన సింహవర్మ ప్రాయశః అతని యన్నయైయుండవచ్చును."[4] ఈ యభిప్రాయానుసారము ఉరువపల్లి శాసనమునను, ప్రస్తుతము పరిష్కరింపఁబడుచున్న నెడుఙ్గరాయశాసనమునను వర్ణింపఁబడిన పల్లవవంశవృక్ష మిట్లు రూపొందు చున్నది:

స్కందవర్మ
|
వీరవర్మ
|
స్కందవర్మ
|
సింహవర్మ — యు. మ. విష్ణుగోపవర్మ

ఫ్లీటుగారి యభిప్రాయమును పెక్కుమంది పరిశోధకపండితు లంగీకరించినను కొందఱి కది నచ్చదాయెను. వీరియందు ముఖ్యులు హూల్ట్జ్ష గారు. ఫ్లీటుగారి సిద్ధాంతమును నిరసించుటకు వీరు చూపిన కారణ మిది. ఉరువపల్లి శాసనమువల్ల సింహవర్మవిష్ణుగోపవర్మలకుఁ గల బాంధవ్య మిట్టిదని తెలియదు. అన్యాధారములవల్ల విష్ణుగోపవర్మను సింహవర్మయను సోదరుఁ డుండెనని తలఁచుటకు వీలుపడదు. మఱియిందు పేర్కొనఁబడిన సింహవర్మ యెవ్వఁడని సుమారము చింతించ నవసరములేదు. అతఁడు పీకిర మంగళూరుశాసనముల దాతయు, యువమహారాజ విష్ణుగోపవర్మ యొక్క పుత్రుఁడును నైన సింహవర్మయే. ఈసింహవర్మ సింహాసన మధిష్ఠించక పూర్వమే ఇతని తండ్రియగు విష్ణుగోపవర్మ తానింకను యౌవరాజ్యపదము ననుభవించుచుండఁగనే మృతినందెనని తలఁచవలసిన యక్కర లేదు. సింహవర్మరాజ్యకాలమున నాతఁడు సజీవుఁడుగనే యుండవచ్చును. విష్ణుగోపవర్మ తన తండ్రియగు రెండవ స్కందవర్మయనంతరము రాజ్యకాంక్ష లేకపోవుటచేతనో, లేక యనివార్యమైన యాటంకములచేతనో పట్టాభిషిక్తుఁడు కాకపోఁగా నతని పుత్రుఁడైన సింహవర్మ స్వయము పితామహుఁడైన

4. Indian Antiquary, V. P 50.

స్కందవర్మ యనంతరము సింహాసనము నధిష్ఠించియుండవచ్చును. కావున ఉరువపల్లి శాసనమునఁ బేర్కొనఁబడిన సింహవర్మ విష్ణుగోపవర్మయొక్క పుత్రుఁడేకాని సోదరుఁడు కాఁడు.5

హూల్ట్జ్ష గారివలె రావుబహదూరు సి.ఆర్. కృష్ణమాచార్యులవారును ఉరువపల్లి శాసనమునఁ బేర్కొనఁబడిన సింహవర్మ యువమహారాజ విష్ణుగోపవర్మయొక్క పుత్రుఁడే యని యభిప్రాయపడుచున్నను, హూల్ట్జ్ష గారి వాదమును సంపూర్ణముగ నంగీకరించక భిన్నసిద్ధాంతము నొకదానిఁ బ్రతిపాదించియున్నారు. యువరాజు, లేక యువమహారాజను బిరుదులతోఁగూడ బేర్కొనఁబడినంతమాత్రమున నే విష్ణుగోపవర్మ సింహాసనము నధిష్ఠించలేదని చెప్పుట తగదు. ఈబిరుదు దాతఁడు రాజ్యాభిషిక్తుఁడాయెననుటకు విరోధము కాఁజాలదు. పూర్వచాళుక్యరాజగు మంగి సర్వసామాన్యముగ శాసనము లన్నిటియందును మంగి యువరాజని పేర్కొనఁబడినను మూర్ధాభిషిక్తుఁడై సింహాసనము నధిష్ఠించి పెక్కేండ్లు రాజ్యపాలన మొనర్చినట్లు తెలియవచ్చుచున్నది. మంగి యువరాజువలె యువమహారాజ విష్ణుగోపవర్మయును సింహాసనముపైఁ గూర్చుని రాజ్యపరిపాలన మొనర్చియుండవచ్చును. యువమహారాజవిష్ణుగోపవర్మచే మొదట నీయఁబడిన యురువపల్లి శాసనమే కారణముచేతనో అతని కుమారుఁడగు సింహవర్మచేఁ దన పదునొకండవ రాజ్యవర్షమునఁ బ్రకటింపఁబడెను.

ఇందువల్ల పైఁబేర్కొనిన పరిశోధక పండిత మహాశయు లొండొరుల సిద్ధాంతముల నంగీకరింపక భిన్నాభిప్రాయముల వెలిబుచ్చుచున్నారని తేల్లమగుచున్నది. లభ్యమైన యాధారములవల్ల వ్యక్తములైన యంశములనన్నిటిని సమాలోకనముచేసి చూడఁగా ఫ్లీటుగారి సిద్ధాంతమే సర్వవిధముల నంగీకార్యమని తోఁచుచున్నది. రాజు యొక్క కొడుకుగాని, కొడుకు లేనిచోఁ దమ్ముఁడుగాని యౌవరాజ్యపట్టాభిషిక్తుఁడగుట సర్వసామాన్యము గావునను, ఉరువపల్లి శాసనమువలన విష్ణుగోపవర్మయొక్క తండ్రి పేరు స్కందవర్మ యని యుండుటచేతను, రాజ్యమేలు ప్రభువు పేరు సింహవర్మ యనియుండుటవల్లను ఫ్లీటుగారీ సింహవర్మ విష్ణుగోపుని యొక్క సోదరుఁడని చెప్పిరి. ఈయభిప్రాయము సరి కాదని త్రోసిపుచ్చిన హూల్ట్జ్ష గారి సిద్ధాంత మెంత సమంజసమో కనుగొందము. కుమారుఁడు రాజై రాజ్యము సల్పుచుండఁగా నతనిక్రింద తండ్రి యువరాజుగ రాష్ట్రములో నొక భాగమున నధికారియైయుండుట నెప్పుడును గానము. విష్ణుగోపవర్మకు రాజ్యకాంక్ష లేకపోవుటచేతనో, కాకుండిన యతని రాజ్యాభిషేకము ప్రతికూల సందర్భములవలన జరుగకపోవుటచేతనో యాతఁడు రాజు కాకపోయెనని తెలుపుట కాధారము లెవ్వి? ఇవియు నూహలేకదా! ఫ్లీటుగారి యూహకంటె నిది సమంజసతరమని నాకుఁ దోఁచదు. మఱియు రావుబహదూరు కృష్ణమాచార్యులవారు చెప్పినట్లు విష్ణుగోపవర్మ రాజ్యానంతరము, మొదట నాతనిచే నీయఁబడిన దానము, తరువాత పదునొకండు సంవత్సరముల కాతని పుత్రుఁడగు సింహవర్మచేఁ బ్రకటింపఁబడె ననుటయు నొప్పఁదగిన మాట కాదు. ఉరువపల్లి శాసనమునందును, నెదుఙ్గరాయ శాసనమునందును "విష్ణుగోపస్య వచనేన ముండరాష్ట్రే ... గ్రామేయకాః వక్తవ్యాః" అని యుండుటచేత నీదానముల నొసఁగిన కాలమున విష్ణుగోపవర్మ సజీవుఁడై యౌవరాజ్యాధిపత్య మొనర్చుచునేయుండెనని స్పష్టమగుచున్నది; కావున శ్రీ కృష్ణమాచార్యులవారు ప్రతిపాదించిన సిద్ధాంతముగూడ 'సింహవర్మ సమస్య'కుఁ దృప్తికరమగు జవాబు నీయఁజాలకున్నది. కృష్ణమాచార్యులవారీసందర్భమున గమనించక విడచిన యంశము లొకకొన్నిటి నిచ్చటఁ బేర్కొనవలసిన యవసరము కొంత కలదు. కొంచెమించుమించు ఈకాలమునకు సంబంధించిన పాశ్చాత్య గంగరాజుల శాసనములవల్లఁ బల్లవరాజ చరిత్రను గూర్చిన యంశములు కొన్ని తెలియవచ్చుచున్నవి. ఈ శాసనములయందు ముఖ్యమైనవి—(1) పడితియం తామ్రశాసనము,6 (2) చీకట్టూరు తామ్రశాసనము,7

5. ఎపి. ఇండి. సం ౮. పుట ౧౫౯ మొ.

6. MAR 1932 P 184

7. Ibid 1924 P 79

(3) పెనుగొండరాగిశాసన (4) నల్లాలతామ్ర శాసనము.9 ఈ శాసనమున వర్ణింపఁబడిన గంగ రాజుల వంశ మిది:

కోవర్మ

మాధవర్మ

ఆయ్య, లేక ఆర్య, లేక హరివర్మ — కృష్ణవర్మ

కృష్ణవర్మ — సింహవర్మ

హరివర్మ — (రెండవ) మాధవవర్మ లేక సింహవర్మ; విష్ణుగోపవర్మ

విష్ణుగోపవర్మ — అవినీత

అవినీత — దుర్వినీత

పైవంశవృక్షములో హరివర్మపుత్రులగు సింహవర్మ యను నామాంతరముల రెండవ మాధవవర్మయు, విష్ణుగోపవర్మయు, హరివర్మయనుజుఁడగు కృష్ణవర్మ యొక్క కుమారుఁడు సింహవర్మయు నొక్కతరము వారు. ఇందువల్ల పాశ్చాత్యగంగవంశమునందు నాల్గవ తరము రాజులలో నిద్దరు సింహవర్మలును, నొక్క విష్ణుగోపవర్మయు నున్నట్లు విశదమగుచున్నది. మఱియు నీ సింహవర్మ విష్ణుగోపవర్మనామములు దక్షిణదేశమును పాలించి రాజులలో పల్లవులయందే సామాన్యముగఁ గానవచ్చుచున్నవి. అందును ముఖ్యముగ విష్ణుగోప నామము పల్లవవంశమునఁదప్ప మఱియెచ్చటను గానరాదని చెప్పవచ్చును. అగునేని పాశ్చాత్య గంగవంశమున నీపేర్లు గానవచ్చుటకుఁ గారణ మేమి? రెండవ మాధవవర్మకు సింహవర్మ యను నామము కోరి యుడిన మారు పేరని తోఁచుచున్నది. పెనుకొండతామ్ర శాసనము దీనికిఁగల వాస్తవకారణమును దెల్పుచున్నది. "శ్రీ పల్లవకులేంద్రేణ సింహవర్మమహారాజేన యథార్థమభిషిక్తస్య గంగరాజస్య అయ్యవర్మణః పుత్రేణ...పల్లవానాం శ్రీస్కందవర్మ మహారాజేన యథార్థ మభిషిక్తేన గంగానాం మాధవమహాధిరాజేన సింహవర్మణా బ్రాహ్మణాయ...ప్రదత్తాః."11 రెండవ మాధవవర్మకు సింహవర్మయను నామాంతరము గలుగుటకు కారణ మిందువల్ల స్పష్టమగుచున్నది. ఇతని తండ్రియగు అయ్య లేక, హరివర్మ పల్లవరాజగు సింహవర్మకు అనుచరుఁడైన సామంతరాజు. ఒక రాజు యొక్క అధికారమునకు లొంగి కప్పముకట్టు సామంత రాజులు తమ రాజభక్తినిగాని, పారతంత్ర్యమునుగాని తెల్పుటకై తమ్మేలిన ప్రభువుల పేర్లను తమబిడ్డల కిడుట యాచారము. ఈ యాచారమును జక్కన విక్రమార్క చరిత్రలో (ర-౬౦) సాహసాంకునికడకు వచ్చిన శక మహీపతి దూతయొక్క వాక్యము విదితము సేయు చున్నది.

"ప్రియతనూజుల పేర్లు పెట్టి పెంపొందిరి
మాళవనేపాళ మగధపతులు"

ఈ యాచారము ననుసరించియే గంగరాజగు హరివర్మ తన యేలికయైన సింహవర్మ పేరు దన జ్యేష్ఠ కుమారున కిడెను. ద్వితీయపుత్రునకు విష్ణుగోపుఁడని నామకరణము చేసినదికూడ నీకారణముచేతనే యని యూహింపెదను. గంగరాజు తనపుత్రులలో జ్యేష్ఠునికి సింహవర్మయనియుఁ, గనిష్ఠునికి విష్ణుగోపవర్మయనియు పేరుపెట్టుకొనుటను జూచి పల్లవరాజైన సింహవర్మకుఁ గూడ విష్ణుగోపుఁ డను తమ్ముఁడొకఁ డుండియుండవలయు నను నూహ పొడమచున్నది.

ఈసందర్భమున పరామర్శింపఁదగిన విషయ మొక్కటి కలదు. పెనుగొండతామ్రశాసనమువలన సింహవర్మ స్కందవర్మ లను రెండుతరముల పల్లవ రాజులు రాజ్యము సేయుచుండినట్లు తెలియుచున్నది. ఈపేరుగల రాజులు పల్లవవంశమునా రీకాలమున నెవ్వరేనియుఁ గలరేమో విచారింపవలసి యున్నది. మొదటి నందివర్మనాఁటి యుదయేందిరశాసనమున కంచి

8. EP. Ind. XIV P 331
9. MAR 1924 P 59
10. EP. Ind. XIV, P 237
11. Ep. Ind. XI, P 334.

యందు రాజ్యమొనర్చిన పల్లవరాజకుటుంబ మొకటి వర్ణింపఁబడియున్నది. 12 అందలి వంశమిది:

స్కందవర్మ
|
సింహవర్మ
|
స్కందవర్మ
|
నందివర్మ

ఈ శాసనములోని ప్రశస్తిని ఉరువపల్లి పెదుగ్గరాయాది శాసనములతోఁ బోల్చిచూచిన వీని ప్రశస్తులన్నియు నొక్కతీరునవే యున్నవనియు, నొక్కవంశస్థులగు రాజులకే చెందినవనియుఁ దెల్లము కాఁగలదు. ఉదయేందిర శాసనములోని సింహవర్మ యొక్క తండ్రిపేరు స్కందవర్మ; ఉరువపల్లి పెదుగ్గరాయశాసనములలోని విష్ణుగోపవర్మ తండ్రిపేరును స్కందవర్మయే. మఱియు విష్ణుగోపవర్మ యౌవరాజ్యము సల్పుచుండఁగా నొక సింహవర్మ రాజ్యముసల్పుచున్నట్లీశాసనములు తెలుపుచున్నవి. కావున నీ సింహవర్మయు, నుదయేందిర శాసనములోని స్కందవర్మ పుత్రుఁడగు సింహవర్మయు నొక్కఁడే; భిన్నపురుషులుగారు. పైఁజెప్పిన యంశముల నన్నిటిని పర్యాలోచించి చూడఁగా ఫ్లీటుగారి సిద్ధాంతమే సమంజసమైనదని నాబుద్ధికిఁ దోఁచుచున్నది.

శాసన కాలము

అక్షరముల సవ్వడిని జూడఁగా ఉరువపల్లి శాసనముతోఁబాటు పెదుగ్గరాయశాసనమును క్రీ. శ. ౫-వ శతాబ్దమునాఁటిదని స్థూలముగఁ జెప్పవచ్చును. పెనుగొండశాసనమునువిమర్శించుచు ఫ్లీటుగారు సింహవర్మ క్రీ. శ. ౪౩౬ మొదలుకొని ౪౬౦ వఱకును రాజ్యముచేసినట్లు చెప్పియున్నారు.13 'లోకవిభాగ' మను జైనగ్రంథమున నాగ్రంథముయొక్క రచన శకాబ్దము ౩౮౦-వ సంవత్సరమునకు సరియైన కాంచీపురాధీశ్వరుఁడగు సింహవర్మయొక్క ౨౨-వ రాజ్యవర్షమున ముగిసినట్లు వ్రాయఁబడియున్నది. దీనిఁబట్టి చూడ సింహవర్మయొక్క రాజ్యాభిషేకము శకాబ్దము (౩౮౦-౨౨=) ౩౫౮-వ సం.న. అనఁగా క్రీ. శ. ౪౩౬-వ సం.న నడిచినట్లు తేలుచున్నది. పెదుగ్గరాయశాసనము సింహవర్మయొక్క పండ్రెండవ రాజ్యవర్షమున నీయఁబడెనగావున దానికాలము క్రీ.శ. ౪౪౮-వ సంవత్సరమని చెప్పవలసి యున్నది.

పెదుగ్గరాయగ్రామమును దానముగొన్న ప్రతిగ్రహీతలు ముగ్గురు. వీరెవ్వరన, (౧)శారణిక వడిపిభోజ దొడ్డిస్వామి, (౨)కణ్ణస్వామి, (౩)నందిస్వామి. తామ్రశాసనములలో సర్వసామాన్యముగఁ బ్రతిగ్రహీతల శాఖాగోత్రసూత్రములను వర్ణించుటయాచారము. ఇందట్లుగాక గోత్రసూత్రాదుల ప్రశంస లేక కేవలము ప్రతిగ్రహీతల పేరులు మాత్రము గానవచ్చుచున్నవి. కణ్ణస్వామినందిస్వాములనుగూర్చి యేమియుఁ దెలియకున్నను దొడ్డిస్వామియొక్క స్థితి సంగ్రహముగ 'శారణిక', 'వడిపిభోజ' శబ్దములవలన వ్యక్తమగుచున్నది. ఈ రెండు మాటలును రాజ్యతంత్రమున దొడ్డిస్వామియొక్క పదవిని సూచించుచున్నవి. ఇంక 'శారణిక' పదము 'శరణ' శబ్దమునుండి పుట్టినది. శరణ మనఁగా రక్షణము. శారణికుఁ డన రక్షణము నొసఁగువాఁడు. ఈశారణికుఁడు ఎవరి బారినుండి యెవ్వరిని రక్షించుచుండెనో కనుగొనుటకుఁ దగిన సాధనము లింకను లభ్యపడలేదు. విష్ణుగోపవర్మ పెదుగ్గరాయగ్రామమును శారణికగ్రామముగఁజేసి దొడ్డిస్వామ్యాదుల కిచ్చుటవలన శారణిక గ్రామాధిపతి శారణికుఁడనియు, నట్టి గ్రామములు రాజశాసనములవల్ల నేర్పడుచుండిన వనియు నూహసేయవచ్చును. ఈశారణికగ్రామమునకును, నరవశాసనములయందుఁ జేర్పఁబడు 'అజ్ఞీనాన్ పుగలిడము'నకును భేదము లేదనియు, శారణికగ్రామమే అజ్ఞీనాన్ పుగలిడమనియుఁ బ్రస్తావవశమున రావుబహాదూరు సి. ఆర్. కృష్ణమాచార్యులవారు చెప్పియున్నారు. వీరి మాట సరియైన దనియు, శారణిక శబ్దార్థమందువల్ల చక్కఁగా తెలియవచ్చుచున్న దనియుఁ దలఁచెదను. అజ్ఞీనాన్ పుగలిడ మనఁగా నార్తుల కభయ

12. EP. Ind. III, P 142
13. J. A. R. S. July 1915

స్థానమని యర్థము. ౧౯౨౬-౨౭-వ సంవత్సరపు దక్షిణ ఇండియా శాసనశాఖవారి కార్యక్రమ నివేదికయందు అఞ్జైనాణ్ పుగలిడ మిట్లు వివరింపఁబడియున్నది: "తిరువాంకూరిసంస్థానములోని కొన్ని శాసనములవలన నా దేశపు రాజులు యుద్ధము సేయు కొన్ని తెగలవారు నివసించుటకై కొంతభూమిని ఖేటాయించి యందు నివసించువారలు రాజున కచ్చవలసిన పన్నులను వజాయిచ్చి, మఱికొన్ని కట్టడల నేర్పఱచి యట్టిస్థలముల (అఞ్జైనాణ్ పుగలిడము (అనఁగా నార్తులకు ఆశ్రయస్థానము) లని పేరిడిరి. ఈవిషయముగఁ దన ప్రజలకు సాయమొనర్చుటచే వీర రామరామవర్మ 'అఞ్జైనాణ్ పుగలిడ'మను బిరుదును వడసెను (T. A. S. IV. P. 98). ఉదయమార్తాండ వర్మ యను నింకొక రాజు కొల్లం ౭౦౧-వ సంవత్సరమున కన్యాకుమారి ప్రాంతమునఁ జేపలఁబట్టువారు నివసించుటకై 'ముట్టో' మను నిట్టి గ్రామము నొకదాని నిర్మించి, రావడి ప్రజ్ఞస్వత్వములనుండి వారిని విముక్తులఁ గావించెను." 14 ఇట్లే క్రీ. శ. ౧౩౩౭-వ సం.న వైక్రమకొండ శంబువరాయఁడు ఇప్పటి యుత్తర ఆర్కాడుజిల్లాలోని మిన్నల్ గ్రామమును అఞ్జైనాణ్ పుగలిడగ్రామముగఁ జేసి యచ్చట నివసించు కైకోలవారును, గాణలవారును రాజున కచ్చవలసిన పన్నులను దగ్గించెను.15 ఈ శాసనముల మూలమున 'అఞ్జైనాణ్ పుగలిడ స్వభావము కొంత యెఱుకపడుచున్నది. ప్రస్తుతశాసనమునను "అష్టాదశజాతిభిః పరిహారై రుపేతః" అనియు, "సర్వనైయోగికాః రాజవల్లభాః సంచరన్త్శ్చ తద్గ్రామం తత్రైవ పరిహారైః పరిహరన్తు పరిహారయన్తుచ" అనియు నుండుటచేత నిదియు, నఞ్జైనాణ్ పుగలిడమును నొక్కటియే యను మాట దృఢమగుచున్నది.

ఇఁక నభిజనకుఁ డన నేమో కనుఁగొనవలసి యున్నది. భోజకుఁడను మాట ప్రాచీన శాసనముల యందు పెక్కింటియందుఁ గానవచ్చుచున్నది. హిరహడగల్లి శాసనమునందు 'గామ గామ భోజకే' యని యుండుటవల్ల ప్రతి గ్రామమునకును నొక్క భోజకుఁ డుండె నని తెలియుచున్నది. మఱియు సామాన్యముగ నిది యొక గ్రామనామముతోఁ గూడియే వచ్చుచుండుటచేత నేగ్రామముతోఁ జేరి భోజకశబ్దము వచ్చునో ఆగ్రామమున కాతఁ డధికారి యని చరిత్రకారు లభిప్రాయపడుచున్నారు. ఈ యభిప్రాయము ననుసరించి దొడ్డిస్వామి నడిప్పి, లేక నడిపి యను గ్రామమున కధికారి యని చెప్పవలసియున్నది.

మఱియు నీశాసనమున నాయుక్తకులు, నైయోగికులు, రాజవల్లభులు, సంచరంతకులు నను నాలుగు తెగల రాజకీయోద్యోగులు పేర్కొనఁబడియున్నారు. కౌటిలీయార్థశాస్త్రమున ఆయుక్తపురుషు లను నొకతరగతి రాజసేవకులు వర్ణింపఁబడియున్నారు. వారే ప్రస్తుత శాసనమునందలి ఆయుక్తకులు కావచ్చును. రాజ్యతంత్రమునం దేకార్యము వారు సేయుచుండిరో నిర్ధారించి చెప్పుటకు వీలులేదు. నైయోగికు లన రాజకార్యమున నియోగింపఁబడినవారు. కౌటిలీయమున నియోగినైయోగిక ప్రస్తావన పెక్కుతావులయందుఁ గాన్పించుచున్నది. "సర్వనైయోగికాః" అను ప్రస్తుతశాసనములోని మాటవల్ల నా కాలమున నీనైయోగికులు పెక్కుతెగలవా రుండి రని తెలియుచున్నది. మధ్యయుగమునాఁటి యాంధ్రకర్ణాట శాసనములయందును, వాఙ్మయములందును నియోగులు డెబ్బదిరెండు తెగలవారుగ విభజింపఁబడియున్నారు. కౌటిల్యుని కాలమునుండియు నిట్టి విభజన కలదేమో నిశ్చయించి చెప్పుటకు సాధ్యముకాదు. రాజవల్లభులనఁగా రాజునకు ప్రియులని యర్థము. వీరును ఆయుక్తకులఁబోలి రాజకీయోద్యోగులే రైనను వీరినిగురించి విశేషమేమియు తెలియదు. సంచరంతకులను గూర్చి పరిశోధకులయం దభిప్రాయభేదము గానవచ్చుచున్నది. ప్రస్తుత శాసనమునందువలె ఉరువపల్లి శాసనమునందును 'సంచరంత'లనియే యున్నను, హిరహడగల్లి శాసనమున 'సంచరంతకు'లని యున్నది.16 ఫ్లీటుగారీమాటకు ప్రయాణీకులని యర్థము చెప్పి

14. M.E. 1926-27 Part ii Para 54,
15. M.E. 1933-34 Part II, Para 22
16. E. I. I. pp 2-10.

యున్నారు.[17] బుహ్లరుగారు వేసులవారని యర్థము నిశ్చయించినారు.[18] కాని వీరు నిశ్చయించిన యర్థము సరిగాదని తోఁచుచున్నది. పీకీర, మంగళూరు శాసనములయందు [19] సంచరంతేల స్థానమున శాసనసంచారణులు చేర్కొనఁబడియున్నారు. సంచరంతేలును, శాసనసంచారణులును నొక్కరేయని నే ననుకొనుచున్నాను. పీకీరశాసనమును ప్రకటించుచు హూల్ట్జ్ గారును, మంగళూరు శాసనమును ప్రకటించుచు ఫ్లీటు గారును నీమాటకు రాజాజ్ఞావాహకులని యర్థమును నిర్వచించియున్నారు. ఇదియే దీనికి సరియైన యర్థము. ఈ సందర్భమున రాజశాసనములనుగూర్చి కౌటిలీయార్థశాస్త్రమునఁ జెప్పఁబడిన విషయమును జ్ఞప్తియం దుంచుకొనవలసియున్నది.

'రాజాజ్ఞకే శాసనమని పేరు'. 'ప్రజ్ఞాపనము, ఆజ్ఞ, పరిదానము, పరిహారము, నిసృష్టి, ప్రావృత్తికము, ప్రతిలేఖనము, సర్వత్రగము అనియుఁగూడ శాసన విషయములు'. 'జాతివిశేషములయెడను, నగర గ్రామ దేశములయెడను రాజానుగ్రహమును సూచించునది పరిహారలేఖ.'[20] ప్రస్తుతము పరిష్కృతముగుచున్న నెడుంగరాయతామ్రపట్టిక పరిహారలేఖ యనఁబడును. "అష్టాదశజాతిభిః పరిహారైరుపేతః" అనియు, సర్వాయుక్తకా......తక్షైవ పరిహారైః పరిహారస్తు పరిహారయన్తుచ" యనియు శాసించుచుండుటచేత నిది నెడుంగరాయగ్రామమునెడ రాజానుగ్రహమును సూచించుచున్నది. కావున సంచరంతేలనరాజాజ్ఞావాహకులనుట యొప్పును.

స్థలనిర్దేశము

ఈ శాసనోక్త ప్రదేశములు నాలుగు: ౧. ముండరాష్ట్రము, ౨. పలక్కడ, ౩. నడిపి, కేక వడిప్పి, ౪. నెడుంగరాయగ్రామము.

౧. ముండరాష్ట్రము పెక్కు పల్లవదానశాసనములయందుఁ జేర్కొనఁబడియున్నది. ఇది పల్లవరాజ్య విభాగములలో నొకదాని పేరు. ఇదివఱకీ రాష్ట్రమును గుర్తించుటకు పలువురు ప్రయత్నము సల్పిరి. కీ. శే. రావుబహదూరు వి. వెంకయ్యగారు ముండరాష్ట్రము ఇప్పటి నెల్లూరుజిల్లాలో నిమిడియుండెనని స్థూలముగ సూచించిరి. రావుబహదూరు సి. ఆర్. కృష్ణమాచార్యులవారీ ముండరాష్ట్ర మర్వాచీనకాలపు నెల్లూరుజిల్లాశాసనములయందుఁ గానవచ్చెడి ముండనాడేయనియు (మా: నెల్లూరు శి. ౧౯, ౩౧, ౬౧, ౮౧, ౮౨, ౧౨౧), నీనాటిలోని కేఁకువరాైవదిగాఁ జెప్పఁబడిన గ్రామము లిది యిప్పటి కోవూరు నెల్లూరుతాలూకాలకును, కందుకూరుతాలూకాలోని దక్షిణభాగమునకును సరిపోవునట్లు సూచించుచున్నవనియుఁ జెల్పియున్నారు.[21] శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రాచీనముండరాష్ట్రము, లేక ముండనాడు పైఁజెప్పిన కోవూరుతాలూకాకును, పశ్చిమమున కోవూరుపరిహద్దులలో నుండు ఆత్మకూరుతాలూకాలోఁ గొంతభాగమునకును సరిపోవునని నిశ్చయించియున్నారు.[22] శ్రీముట్లూరు వెంకటరామయ్యగారీ ముండరాష్ట్రము నెల్లూరుజిల్లాలో పెన్నా సువర్ణముఖుల మధ్యప్రదేశమని నిశ్చయించిరి.[23] ఇట్లు ముండరాష్ట్రమునుగూర్చి పరిశోధకుల యభిప్రాయములు భిన్నములుగఁ గాన్పించుచున్నవి. ఇతవఱకు లభ్యమైన సాక్ష్యమును విమర్శించి చూడ రాష్ట్రము యొక్క సరిహద్దులను చక్కఁగ నిర్ణయించుటకు వీలులేకపోయినను, నది యిప్పటి నెల్లూరుమండలాంతర్గతమగు కోవూరుతాలూకాకును, నెల్లూరు తాలూకాలోని కొంతభాగమునకును సరిపోవునని [illegible] యించవచ్చును.

17. Indian Antiquary. V. P 53.

18. Ep Ind I. P 9.

19. Ep. Ind. VIII P 143, Indian Antiquary V. P 154

20. కౌటిలీయార్థశాస్త్రము (ఆంధ్రీకృతము) పుటలు ౮౨-౪.

21. Ep. Ind. XXIV P 30 n 5.

22. Journal of the Madras University 1940. Pp 142-43

23. Journal of Oriental Research XII Pp 363-4